



# ప్రజా విముక్తి

## విషయ సూచిక


1. కారల్ మార్క్స్ జీవితం
2 జూలై 28
3. భారత వ్యవసాయ విధానాలు
4. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా
5. జడలు విప్పిన ఫాసిజం
6. ఉపరితల గనులకు వ్యతిరేకంగా
7. సిద్ధాంత వ్యాసం
8. రష్యా స్త్రీలు
9 నాలుగు దశాబ్దాల
10. అటవీ భూముల నుండి
11. అరుణాంజలి
12. కరోనా
13. డాక్టర్ సలహా
14. పోరాట వార్తలు



**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక**

**సంపుటి:1** **సంచిక:2** **మే-ఆగస్టు, 2020**


# మానవ సమాజ పరిణామ చరిత్రను శాస్త్రీయంగా ఆవిష్కరించిన విప్లవకారుడు కారల్ మార్క్స్ జీవితం చిరస్మరణీయం


కార్మికవర్గ సిద్ధాంత కర్త కమ్యూనిస్టు ప్రణాళిక రూపకర్త.

తత్వశాస్త్రం, అర్థశాస్త్రం సృష్టికర్త.

మానవాళి విముక్తి మార్గదర్శకుడు.

మానవ సమాజ పరిణామ క్రమ చలన సూత్రాలను శాస్త్రీంగా ఆవిష్కరించిన మహా మేధావి, మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ 202వ జయంతి పురస్కరించుకొన్న సందర్భంగా ఎర్రజెండాలో ప్రచురించిన వ్యాసాన్ని ప్రజావిముక్తి పాఠకుల కొరకు ప్రచురిస్తున్నాము.

కారల్ మార్క్స్ 1818 మే 5వ తేదిన జర్మనీ దేశపు రైన్‌లాండ్ ప్రాంతంలోని ట్రయర్ నగరంలో జన్మించాడు. 1883 మార్చి 14న మరణించాడు. మార్క్స్ జీవించిన కాలం చిన్నదే. గత కాలాన్నీ, వర్తమానాన్ని లోతుగా విశ్లేశిస్తూ చేసిన అధ్యయనంతో భవిష్యత్‌కు నూతన బాటలు వేయగలిగాడు. మార్క్స్ రూపొందించిన సిద్ధాంతాలు, నిర్మించిన పార్టీ, ఉద్యమ కార్యాచరణ మార్క్సిజంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి వెలుగొందుతుంది.



మార్క్స్ జీవితం విజ్ఞానదాయకం. స్కూలు జీవితంలోనే తెలివిగల విద్యార్థి. ప్రాచీన సాహిత్యం, జర్మనీ భాష, చరిత్ర పాఠాలలో ప్రతిభతో పాటు గణితంలో అమోఘ ప్రజ్ఞను చూపాడు. ఒక వ్యాసంలో "ప్రజలందరి మేలుకోరి పని చేస్తూ ఆ క్రమంలో అభివృద్ధి చెందిన వారినే చరిత్ర మహానుభావులుగా గుర్తిస్తుంది" అని వృత్తి ఎంపికలో తన భావాల్ని రాసి మెరిపించాడు. ఈ మాటలకు నూరు శాతం కట్టుబడిన మహానుభావుడు మార్క్స్. 1839లో "డెమక్రటిస్ - ఎపిక్యూరస్ ప్రకృతి తత్వాల మధ్య వ్యత్యాసం" అన్న అంశంపై తన డాక్టరేట్ పరిశోధన ప్రారంభించాడు. వారి భౌతికవాద దృక్పథంను లోతుగా అర్థం చేసుకుని విశ్లేషించాడు. తన థీసిస్‌ను అభివృద్ధి నిరోధక సిద్ధాంత వేత్తలు తిష్ట

వేసియున్న బెర్లిన్ యూనివర్సిటీకి సమర్పించడం అప్రతిష్టగా భావించి జేనా యూనివర్సిటీకి సమర్పించాడు. ఎంత అధ్యయనం వుందో అంత మేధాశక్తి, నిశిత దృష్టి ఉందని ప్రశంసలందుకున్నాడు. 24 సంవత్సరాల వయస్సుకే (1841 కే) సునిశితమైన తాత్విక చిత్తశుద్ధి, పదునైన వాక్చాతుర్యంతో మధ్య యుగాల మత రాజకీయాలకు చివరి దెబ్బ కొడతాడనీ, రూసో, వాల్టేర్, హాల్బక్, లెసింగ్, హైనా, హెగెల్ వీరందరూ డాక్టర్ మార్క్స్‌లో వున్నారని మిత్రులు యువ హెగేలియన్లు నమ్మారు.

హెగెల్ తాత్విక ప్రభావంలో యువ హెగెలియన్‌గా వున్న మార్క్స్‌ను ఫ్యూయర్‌భా రాసిన 'క్రైస్తవ మత సారాశం' బాగా ఆకర్షించింది. హెగెల్ తత్వశాస్త్రంలోని కొన్ని అంశాలను విమర్శనాత్మకంగా మెరుగుపరిచిన ఫ్యూయర్‌భా ప్రపంచ అంతస్సారాన్ని మతం, హెగెల్ భావవాదం గ్రహించలేదని ఖచ్చితంగా తేల్చి చెప్పాడు. 'మనిషి ఉనికికి మూలం ప్రకృతి మాత్రమే' అన్న భౌతికవాదాన్ని విశ్వసించడంతో పాటు దేవుణ్ని, మతాన్ని మనిషే సృష్టించాడన్న ఫ్యూయర్‌భా తర్కంలోని నిజాన్ని గుర్తించిన మార్క్స్, మనిషిని సామాజిక జీవిగా చూడకుండా ప్రాణం వున్న పదార్థంగానే చూసే పరిమితి కారణంగా ఫ్యూయర్‌భా సమాజాన్ని, చరిత్రను విస్మరించాడని అర్థం చేసుకున్నాడు. ఈ రకమైన విమర్శనాత్మక దృష్టి, సమగ్ర అవగాహన మార్క్స్‌లో పరిపక్వం కావడానికి రాజకీయ కార్యకలాపాలు దోహదం చేసాయి. ప్రసిద్ధ సోషలిస్టు సిద్ధాంత వేత్తల చార్లెస్ ఫోరియర్, సైంట్ సైమన్, రాబర్ట్ ఓవెన్‌ల రచనలు చదివాడు. వారంతా పెట్టుబడిదారి సమాజంలోని దురన్యాయాలనూ, దౌర్భాగ్య లక్షణాలనూ, కుళ్ళును విమర్శించి ఎండగట్టి దోపిడి పీడనలు లేని సుహృద్భావ మానవ సమాజ స్థాపనకు కలలు కన్నారు. వారి సిద్ధాంతాలకు శాస్త్రీయ ప్రాతిపాదిక లేదనీ, వారు కార్మిక శక్తినీ, వర్గపోరాట అవసరాన్ని గుర్తించకుండా, పాలకులు, యజమానులు దయాదాక్షిణ్యాలను ప్రదర్శించాలని కోరుకున్నారని వారు చెప్పే మార్గాలు పరిష్కారానికి పనికి రావని మార్క్స్ గుర్తించాడు.



కారల్ మార్క్స్, జెన్నీ మార్క్స్

బ్రస్సెల్స్ తిరిగి వచ్చి మార్క్స్, ఏంగెల్స్ ఇద్దరూ కృషి చేసి 'జర్మన్ ఐడియాలజీ' అనే సిద్ధాంత చర్చా గ్రంథాన్ని రచించారు. తొలిసారిగా గతితార్కిక చారిత్రక భౌతికవాదానికి సమగ్రమైన, క్రమబద్ధమైన మూలసూత్రాలు రూపొందించారు. హెగెల్ గతితర్కాన్నీ, ఫ్యూయర్‌భా భౌతాకవాదాన్ని అభివృద్ధి చేసి గతితార్కిక భౌతికవాదాన్ని రూపొందించిన సామాజిక చరిత్రకు అన్వయించి చారిత్రకంగా శాస్త్రీయ సిద్ధాంతాన్ని రూపొందించారు. మార్క్స్ సిద్ధాంతాన్ని - విప్లవ కార్యాచరణను మేళవించి 'ప్రపంచాన్ని మార్చాల'న్నాడు. ఈ గొప్ప విషయమే మార్క్స్ ప్రత్యేకతగా చరిత్ర పొడవునా తన జ్ఞానంగా నిలుపుకుంది.

యూరప్ దేశాల పరిస్థితి గురించి బాగా తెలిసిన మార్క్స్, ఏంగెల్స్‌లు దాని వర్గ స్వభావాన్ని పూర్తిగా గ్రహించారు. '1847లో లీగ్ ఆఫ్ జస్టీస్' ఆహ్వానం మేరకు అందులో చేరారు. దాని పునర్వ్యవస్తీకరణకూ, కార్మికవర్గ పార్టీ స్థాపనకు ఎంతో కృషి చేశారు. సరికొత్త దృక్పథానికీ, విజ్ఞానానికి అనుగుణంగా కేంద్రీకృత ప్రజాస్వామిక నిర్మాణ సూత్రాలను రూపొందించారు. దానిని కమ్యూనిస్టు లీగ్‌గా ప్రతిపాదించడంతో పాటు "ప్రపంచ కార్మికులారా, ఏకంకండి" అనే అంతర్జాతీయ స్వభావంతో కూడిన నినాదాన్నిచ్చారు. 1847 జూన్‌లో లండన్‌లో కమ్యూనిస్టు లీగ్ ప్రథమ మహాసభ జరిగింది. కానీ మార్క్స్ తిండికి కూడా లేని ఆర్థిక ఇబ్బందుల వలన హాజరు కాలేదు. అయితే పేరు, నినాదం ఆమోదం పొంది ఒక కార్మికవర్గ పార్టీ ఏర్పాటుకు పునాదులు పడ్డాయి. అదే సంవత్సరం నవంబర్ 29న ప్రారంభమైన అంతర్జాతీయ మహాసభ ఎనిమిది రాత్రులు జరిగింది. పగలు శ్రమ చేసి రాత్రి సభలకొచ్చారు ప్రతినిధులు. నిబంధనావళి, సిద్ధాంత సూత్రాలు ఏకగ్రీవంగా ఆమోదించడంతో పాటు ఒక ప్రణాళికను రూపొందించమని మార్క్స్, ఏంగెల్స్‌లను మహాసభ కోరింది. 1848 ఫిబ్రవరిలో 23 పేజీల చిన్న సాదా పుస్తకం 'కమ్యూనిస్టు ప్రణాళిక' వెలువడింది. మానవ చరిత్రలో మున్నెన్నడూ, తర్వాత కూడా అంత మహత్తర ప్రభావం వేసిన పుస్తకం కానరాలేదు. కమ్యూనిజాన్ని అప్పటికే ఐరోపాలోని రాజ్యాలు ఒక శక్తిగా అంగీకరించాయి.

రాజకీయ అర్థశాస్త్ర అధ్యయనంలో బ్రిటీష్ మ్యూజియం లైబ్రరీ మార్క్స్‌కు ఒక యుద్ధ భూమిగా మారింది. పెట్టుబడిదారీ అర్థశాస్త్ర అధ్యయనం కొద్ది నెలల్లో పూర్తవుతుందనుకున్నాడు. ఎప్పటికప్పుడు కొత్త ప్రశ్నలు రావడంతో మళ్ళీ చదివి ఆదర్శప్రాయమైన అధ్యయనంతో, నేర్చుకొవాలన్న తపనతో వాటిని విమర్శనాత్మకంగా పరిశీలించి స్పష్టీకరించుకోవలసి వచ్చింది.

వలసవాద వ్యతిరేక పోరాటాలకు (ఇండియా, చైనా) మరియు ఐర్లాండ్ పోరాటానికి మద్దతుగా రాసిన వ్యాసాల్లో వలస దేశాల్లోని విముక్తి పోరాటాలన్నింటిని కార్మికవర్గం బలపరచాలన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

1857-58 ఆర్థిక సంక్షోభం అనంతరం అమెరికా, యూరప్ విప్లవాలు ఉవ్వెత్తున లేచాయి. మొత్తం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కంపించిపోయింది. వందల సంఖ్యలో సంస్థలు దివాళా తీసాయి. నిరుద్యోగం ప్రబలిపోయింది. బూర్జువా ఆర్థిక వేత్తల ప్రయత్నాలు ఏమి చేసినా ఫలించవని మార్క్స్ జోస్యం నిజమయింది. సంక్షోభాలకు ఈ వ్యవస్థే మూలమని స్పష్టం అయింది. 1861-65 అమెరికా అంతర్యుద్ధం, 1863-64 ఆస్ట్రియా పాలనకు వ్యతిరేకంగా పోలెండ్‌లో ప్రజావెల్లువ, రష్యాలో వచ్చిన తీవ్రమైన మార్పులు, ఇటలీ సంఘటనలు ఇలానే ఎన్నో పోరాటాలు ప్రపంచ పరిణామాలలో చోటు చేసుకున్నాయి.

ఇదే కాలంలో ముందుకొచ్చిన సంస్కరణవాదాన్ని (లాసెల్లియనిజం) ఓడించారు. పోలెండ్ ప్రజల సమస్యకు అంతర్జాతీయ దృక్పథంతో జర్మనీ కార్మికులు, ఇంగ్లీషు, ఫ్రెంచి కార్మికులు అందించిన సహకారం వెనుక మార్క్స్ చేసిన విశ్లేషణ, రాజకీయ ప్రచారం వున్నాయి. మార్క్స్ ప్రోత్సాహంతో ఐరోపా కార్మికవర్గ మహోద్యమం ఒక అంతర్జాతీయ కార్మిక సంస్థ స్థాపనకు అవసరమైన ప్రాతిపదిక సృష్టించింది. 1864 సెప్టెంబర్ 28న అంతర్జాతీయ సమీకరణకు బాటలు వేసిన మార్క్స్ అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.డబ్ల్యూ.ఎ) అవతరణను పరిపూర్తి చేయగలిగాడు. మొదటి ఇంటర్నేషనల్ నాయకుడుగా 1864-72ల మధ్య మార్క్స్ రాజకీయ కార్యాచరణ మకుటాయామానమైంది. అంతర్జాతీయ కార్మిక సంఘాధినేతగా, నిజమైన కార్మిక నాయకుడుగా, ప్రముఖ రాజకీయ వేత్తగా ఎన్నో విలువైన ప్రతిపాదనలు చేశాడు. వర్గ సౌహార్థత, కార్మికవర్గ అంతర్జాతీయతలకు ఐక్య కార్యాచరణ ఉత్తమ మార్గంగా అభివృద్ధి చేసి ఇంటర్నేషనల్ ప్రతిష్టను పెంచాడు.

నిరంతరం మార్క్స్, ఏంగెల్స్ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచేవి. మార్క్స్ మిత్రునికి ఉత్తరం రాయని వారం లేదు. ఒకోసారి రోజూ రాసే వాడు. వారు లేఖల్లో రాసుకున్నదంతా దాదాపు తర్వాత కాలంలో యథాతథంగా ప్రచురితమయింది. శాస్త్ర, రాజకీయ సమస్యల్నీ తత్వశాస్త్రం, అంతర్జాతీయ రాజకీయాలు, జీవశాస్త్రం, గణితం, చరిత్ర, రాజకీయ అర్థశాస్త్రం ఇలా అన్నింటినీ తమ రాతల్లో చర్చించేవారు. పరస్పరం అంగీకారం లేని వాటికి విలువలేనట్లే. ఏంగెల్స్ మిలిటరీ శాస్త్రం, భాష శాస్త్రం, జీవశాస్త్రంలలో లోతైన అధ్యయనం చేసినట్లు ఉత్తరాల ద్వారా తెలుస్తుంది. మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతంతోనే ఆగలేదు. సామాజిక మౌలిక వైరుధ్యాలను, వర్గ పోరాట ప్రాధాన్యతను, నూతన సామాజిక నియమాలను చెప్పిన 'క్యాపిటల్' ప్రపంచ కార్మిక వర్గానికి అత్యంత ప్రాధాన్యత గల గ్రంథం. ఇటువంటి గ్రంథం మరొకటి రాలేదని ఏంగెల్స్ రాసాడు.

1870 జూలై 19న ఫ్రాన్స్ రష్యాల మధ్య యుద్ధం మొదలైంది. జాతి దురాభిమానం, బూర్జువా జాతీయతా, సెంటిమెంట్లు రెండు దేశాల్లో పెచ్చరిల్లాయి. మార్క్స్ నాయకత్వంలో ఇంటర్నేషనల్ మాత్రం 'సైనిక తత్వాన్ని ప్రతిఘటించాలని' దేశ దేశాల కార్మికులకు సూత్రబద్ధమైన పిలుపునిచ్చింది. అనేకానేక పరిణామాలూ, ఆర్థిక-రాజకీయ సంక్షోభాల పర్యవసానంగా 1871 మార్చి 18న పారిస్ కార్మికులు అధికారాన్ని హస్తగతం చేసుకుని సిటీ హాలుపై అరుణపతాకాన్ని ఎగురవేశారు. సైనికులలో అత్యధికులు కార్మికులతో కలసిపోయారు. చరిత్రలో మొదటిసారి కార్మికవర్గం అధికారానికొచ్చింది. కమ్యూన్ అవిర్భావాన్ని అధికారికంగా ప్రకటించింది. వారి పట్టుదల, చొరవ, త్యాగనిరతి, పట్టువిడుపులను మార్క్స్ శ్లాఘించాడు. "ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం" రచనలో చారిత్రక పరిస్థితుల్ని వివరంగా చర్చించాడు. రష్యన్ పెటీ బూర్జువా విప్లవ ప్రవాసి బకూనిన్ అరాచకవాదంతో ఇంటర్నేషనల్‌ను చేజిక్కించుకునేందుకూ, శాస్త్రీయ కమ్యూనిజంతో తగాదాకు దిగాడు. అరాచకవాదుల, ఒంటెత్తువాదుల భావాలను తిప్పికొడుతూ మార్క్స్ పారిస్ కమ్యూన్ అనుభవాన్ని, ఇంటర్నేషల్ అనుభవాన్ని గుర్తు చేశాడు. సిద్ధాంతంతో పాటు పార్టీ వుంటేనే రాజ్యాధికారం గెలుచుకుని సోషలిస్టు పరివర్తన సాధించగలదని రుజువైన సత్యాన్ని శాస్త్రీయంగా వివరించాడు.

మార్క్స్ రచనల్లో 'కమ్యూనిస్టు ప్రణాళిక', 'క్యాపిటల్' తర్వాత 'గోథా కార్యక్రమ విమర్శ'కు అంతటి ప్రాధాన్యత వచ్చింది. "జర్మన్ వర్కర్స్ పార్టీ కార్యక్రమంపై స్థూల వ్యాఖ్యాలు" అన్నదే ఆ పుస్తకం. ప్రజాతంత్ర రిపబ్లిక్‌కు కార్మికవర్గ నియంతృత్వంకు ఎంత తేడా వుందో వివరించాడు. కార్మికవర్గ విప్లవం, కార్మికవర్గ నియంతృత్వం లేకుండా సోషలిజం రాదనీ, అటువంటి అద్భుతాలు జరగవనీ, ఆ భ్రమలు పనికి రావని చెపుతూ కార్మికవర్గం అలా ఆలోచించడం ప్రమాదకరం, వినాశనాన్ని కోరి తెచ్చుకోవడమేనని బలంగా చెప్పాడు. రెండు దశల అభివృద్ధిని చెప్పి మొదటి దశ అయిన సోషలిస్టు దశలో 'పనిని బట్టి ప్రతిఫలమివ్వడం' జరగాలని, రెండవ దశలో 'ప్రతి ఒక్కరికి శక్తిని బట్టి పని, అవసరాన్ని బట్టి ప్రతిఫలం వుంటుందని' సామాజికాభివృద్ధిని సూచించాడు.

మార్క్స్‌కు అన్ని కష్టాల్లోనూ తోడునీడగా నిలిచిన ప్రియాతి ప్రియమైన జెన్నీ 1881 డిసెంబర్ 2న మరణించడంతో మార్క్స్ కోలుకోలేని దెబ్బతిన్నాడు. అయినా విప్లవ కార్యక్రమ బాధ్యత మరికొంత కాలం ఆయనను దీక్షగా పని చేయించినా జెన్నీ లేని మార్క్స్‌లో వెలుగు కానరాలేదు. మార్క్స్ నూతన ప్రాపంచిక దృక్పథం శాస్త్రీయ కమ్యూనిస్టు సమాజాన్ని వాగ్దానం చేయడమేకాదు చరిత్రలో సాధ్యమన్న సత్యాన్ని మన ముందుకు తెచ్చింది. కార్మికవర్గ పార్టీ, కార్మికవర్గ నియంతృత్వం ఆవశ్యకతను పారిస్ కమ్యూన్ గుణపాఠంగా నొక్కి చెప్పిన మార్క్స్ చారిత్రక దృష్టి సునిశితమైనది. ప్రపంచ కార్మివర్గ నేతగా ఎదిగిన మార్క్స్ శత్రువు గుండెల్లో గుబులు పుట్టించాడు. మార్క్స్ ఎన్నోసార్లు బహిష్కరణలు, నిర్బంధాలనూ, ఆర్థిక ఇబ్బందులనూ, అనారోగ్య సమస్యలను ఎదుర్కొని మొక్కవోని దీక్షతో కృషి చేశాడు. మార్క్స్ రచనా వ్యాసంగం, గ్రంథ రచన, ఏంగెల్స్‌తో మైత్రి, వుద్యమాలలో చురుకైన మార్గదర్శిక పాత్ర చిరకాలం నిలిచి వుంటాయి. ఆకలి దారిద్ర్యాల మధ్యనే నిరంతరం కృషి చేస్తూ ప్రాపంచిక చిరకాల జ్ఞాపకంగా జ్ఞానాన్ని వెలిగించిన మార్క్స్ మహనీయుడు. భవిష్యత్ తరాల చరిత్రకు దిక్సూచి అని అంతర్జాతీయ సమాజం నివాళులర్పించింది. మానవ సమాజ శాస్త్రీయ పరిణామ చరిత్రకారుడు మార్క్స్. మార్క్స్ మరణానంతరం క్యాపిటల్ మిగిలిన భాగాల రచనలను ఏర్చి కూర్చి ఏంగెల్స్ ప్రచురించాడు. మార్క్స్ మిగిల్చిన కర్తవ్యాల పరిపూర్తికి అంకితమై కృషి చేశాడు. మార్క్స్ సంపూర్ణంగా వ్యక్తం కావడంలో వారిద్దరి అపూర్వ మైత్రి ఎంతో దోహదం చేసింది. చరిత్రలో అభివృద్ధి చెందిన లెనినిజం, మావోయిజం, రష్యా, చైనా విప్లవాలతో పాటు అనేక సామాజిక విప్లవాలు మార్క్సిజం కొనసాగింపే, మార్క్సిజం తాలూకు విస్తృత పరిణామమే.

ఇంతటి జ్ఞానాన్నీ, కార్యాచరణ మార్గాన్ని అందించిన మన మార్గదర్శి మార్క్స్‌ను మన జ్ఞానంలో వెలిగించుకుంటూ, సరైన కార్యవిధానం ద్వారా మనల్ని మనం సంస్కరించుకుందాం. అదే మార్క్స్‌కు సరైన నివాళి కాగలదు.

సందేశం

## 2020 జులై 28 నుండి ఆగస్టు 3 వరకు
## అమరుల సంస్మరణ వారొన్ని పాటించండి!

# అమరుల త్యాగం వృధా కాదు!
# ప్రజాయుద్ధాన్ని దేశవ్యాప్తంగా విస్తరించి-తీవ్రతరం చేయడం ద్వారా
# శత్రు వ్యూహాత్మక 'సమాధాన్' దాడిని ఓడిద్దాం!

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

జులై 28. దేశ, ప్రపంచ పీడిత ప్రజల విముక్తి కోసం తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన అమరులను సంస్మరించుకునే రోజు. భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, అంతిమంగా సోషలిజాన్నీ-కమ్యూనిజాన్నీ స్థాపించే లక్ష్యంతో, మార్క్సిజం-లెనినిజం- మావోయిజం వెలుగులో భారత విప్లవ మహా నాయకులు, మన పార్టీ సంస్థాపకులు, ఉపాధ్యాయులు, అమరులు కామ్రేడ్ చారుమజుందార్, కామ్రేడ్ కన్హాయ్ చటర్జీ రూపొందించిన దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గంలో ప్రయాణిస్తూ, పార్టీ వివిధ స్థాయిల నాయకత్వం నుంచి విప్లవ ప్రజల వరకు గడచిన సంవత్సర కాలంలో 105 మంది కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించారు. ఈ అమరుల స్మృతిలో 2020 జులై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని అమరుల త్యాగాల స్ఫూర్తితో, విప్లవోత్సాహంతో జరపాల్సిందిగా పార్టీ శ్రేణులకు, పీఎల్‌జీఏ బలగాలకు, విప్లవ ప్రజా నిర్మాణాలకు, కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులకు, సమస్త పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల ప్రజలకూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ పిలుపునిస్తోంది. ఈ సందర్భంగా అమరులయిన కామ్రేడ్స్‌కూ, విప్లవ ప్రజలకూ, ప్రపంచవ్యాప్తంగా విప్లవోద్యమాలలో, జాతి విముక్తి పోరాటాలలో అశువులు బాసిన అమరులందరికీ మా కేంద్రకమిటీ తలవంచి వినమ్రంగా జోహార్లు తెలుపుతున్నది. వారి ఆశయాలను తుదికంటా కొనసాగిస్తామని ప్రతిన బూనుతున్నది. బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పెద్దెత్తున ప్రజలను ఎక్కడికక్కడ కదిలించి పోరాడాల్సిందిగా, సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాల్సిందిగా పిలుపునిస్తోంది.



ఈ సంవత్సర కాలంలో విప్లవోద్యమంలో బిహార్-ఝార్ఖండ్ (బీజే)లో నలుగురు కామ్రేడ్స్, దండకారణ్యం (డీకే)లో 67 మంది, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతంలో 14 మంది, తెలంగాణలో ముగ్గురు, సీఆర్‌సీ కంపెనీ-2లో ఒకరు, మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసీ) ప్రాంతంలో 9 మంది, పశ్చిమకనుమలలో నలుగురు కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించారు. ఇందులో 29 మంది మహిళా కామ్రేడ్స్ ఉన్నారు. ఆయా కామ్రేడ్స్ నిర్వహించిన బాధ్యతల రీత్యా చూసినప్పుడు మన కేంద్రకమిటీ సభ్యులు, డీకే ఎస్‌జడ్‌సీ కార్యదర్శి కామ్రేడ్ రావుల శ్రీనివాస్ (రామన్న, నరేందర్) తీవ్రమైన అనారోగ్యంతో డిసెంబర్ 7న అకాల మృతి చెందారు. పశ్చిమకనుమల ఎస్‌జడ్‌సీ సభ్యులు కామ్రేడ్ మణివాసగం (అప్పు, సుందరేష్) అక్టోబర్ 28న అట్టపాడి బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరో ముగ్గురు కామ్రేడ్స్‌తో పాటు అమరులయ్యారు. పశ్చిమ బంగ్ రాష్ట్రకమిటీ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సుదీప్ చోంగ్‌దార్ ఫిబ్రవరి 8, 2019న కోల్‌కతా ప్రెసిడెన్సీ జైలులో సెరిబ్రల్ మలేరియాతో, ఫాసిస్టు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అకాల మృత్యువాతకు గురయ్యారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మే 2న ఆర్‌సీఎం కామ్రేడ్ సృజన జారవాయ-సీల్‌బట్టి ఎన్‌కౌంటర్‌లో సీ-60 కమాండోలతో వీరోచితంగా పోరాడుతూ అమరురాలైంది. నాయకత్వ స్థాయిలో వీరి అమరత్వం మన పార్టీకి చాలా తీవ్రమైన నష్టం. వీరితో పాటు నలుగురు డీవీసీ సభ్యులు - ఎంఎంసీలో కామ్రేడ్ మణిరాం (సుఖ్‌దేవ్, జీఆర్‌బీ), ఏఓబీలో కామ్రేడ్ రాకేష్ (మల్కన్‌గిరి), పశ్చిమ కనుమల్లో కామ్రేడ్ గణేష్, డీకేలో కామ్రేడ్ అశోక్ (రైను, ఆర్‌కేబీ), ఏసీ కార్యదర్శి కామ్రేడ్ మనోహర్ (పశ్చిమ కనుమలు), ఏసీ/పీపీసీ సభ్యులు 14 మంది కామ్రేడ్స్, పార్టీ/పీఎల్‌జీఏ సభ్యులు 38 మంది, జీపీసీ సభ్యులు/

ఆర్‌పీసీ అధ్యక్షులు, సభ్యులు ఆరుగురు, విప్లవ ప్రజాసంఘాల కామ్రేడ్స్ 8 మంది, ప్రజా మిలీషియా కమాండర్లు, సభ్యులు 12 మంది, 7 మంది విప్లవ ప్రజలు అమరులైనవారిలో ఉన్నారు. అమరులలో మరో 11 మంది కామ్రేడ్స్ వివరాలు అందవలసి ఉంది. ఘటన రీత్యా చూసినప్పుడు ఎన్‌కౌంటర్‌లలో 46 మంది, బూటకపు ఎన్‌కౌంటర్లలో 37 మంది, పీఎల్‌జీఏ నిర్వహించిన వీరోచిత దాడుల్లో ఐదుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు అనారోగ్యంతో ఏడుగురు కామ్రేడ్స్, దుర్ఘటనలలో 10 మంది తమ ప్రాణాలు కోల్పోయారు.

కామ్రేడ్ రావుల శ్రీనివాస్ 36 సంవత్సరాల సుదీర్ఘమైన విప్లవ జీవితంలో అంచలంచలుగా కేంద్రకమిటీ సభ్యుడిగా, దండకారణ్య స్పెషల్‌జోనల్ కమిటీ (ఎస్‌జడ్‌సీ) కార్యదర్శిగా, క్రాంతికారీ జనతన సర్కార్ సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా ఎదిగి పార్టీకి, దేశ విప్లవోద్యమానికి, ప్రత్యేకంగా దండకారణ్య విప్లవోద్యమానికి అత్యుత్తమ సేవలు అందించారు. ఆయన జీవితం దండకారణ్య ఉద్యమాభివృద్ధిలోని ప్రతి మలుపుతో పెనవేసుకుపోయింది. ఆయన విప్లవ ప్రజలలో, పార్టీ క్యాడర్లలో రామన్నగా, నరేందర్‌గా అపారమైన అభిమానాన్ని చూరగొన్న ప్రియతమ విప్లవ నాయకుడు, వర్గపోరాటంలో కాకలుతీరిన యోధుడు. మన పార్టీ రాజకీయ, సైనిక పంథాను, మన దేశ, ప్రత్యేకించి దండకారణ్య నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించి అమూల్యమైన అనుభవాలను అందించారు. దండకారణ్య ఉద్యమానికి ప్రతీకగా నిలిచారు. వర్గ శత్రువులకు సింహస్వప్నమయ్యారు. ఆయన మన సీసీ సభ్యుడిగా, పీఎల్‌జీఏ సేనానిగా, గడ్డుకాలంలో నిబ్బరంగా, నిర్భయంగా ఉద్యమాన్ని నడిపిన నేత.

కామ్రేడ్ సుదీప్ చోంగ్‌దార్ పశ్చిమ బెంగాల్‌లో దీర్ఘకాల ప్రజాయుద్ధ సేనానులలో ఒకరు. 2008లో ఆయన పశ్చిమ బంగ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సీపీఎం సోషల్ ఫాసిజానికి, తృణమూల్ కాంగ్రెస్ ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా నిలబడి జంగల్‌మహల్ ప్రాంతంలో వర్గ పోరాటాన్ని నిర్మించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. నందిగ్రామ్, లాల్‌గఢ్ వంటి ప్రజా విజృంభణలకు నాయకత్వం వహించిన ప్రముఖ కామ్రేడ్స్‌లో ఆయన ఒకరు. 2010లో అరెస్టయి జైలు జీవితం అనుభవిస్తూ అక్కడే తుదిశ్వాస విడిచారు. భారత కార్మికవర్గ ఉత్తమ పుత్రుడిని, ప్రజలే ప్రాణంగా భావించి, వారి సమస్యలను అర్థం చేసుకొని, వాస్తవిక స్థితిని వాస్తవికంగా విశ్లేషించడంలో దక్షత కలిగిన ఒక సాహసిక విప్లవ కమ్యూనిస్టు ఆర్గనైజర్‌ను మనం కోల్పోయాం.

పశ్చిమ కనుమల ఎస్‌జడ్‌సీ సభ్యులు కామ్రేడ్ మణివాసగం తమిళనాడుకు చెందినవారు. 1980ల చివరిలో స్కూల్ టీచర్ ఉద్యోగం వదిలి విప్లవోద్యమంలోకి వచ్చారు. అక్కడ అర్బన్ కమిటీ ఏర్పడినప్పటి నుంచి అందులో భాగమై పట్టణోద్యమానికి నాయకత్వం వహించారు. రెండుసార్లు జైలు జీవితం గడిపారు. జైలు నుండి విడుదలైన వెంటనే అజ్ఞాతవాసంలోకి వచ్చి పశ్చిమ కనుమల అటవీ ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణంలో పార్టీకి నాయకత్వం వహించారు. ఆ ప్రాంతంలో ప్రజాయుద్ధానికి పునాదులు వేసి అత్యంత విలువైన అనుభవాలను అందించారు. పార్టీ ఎడ్యుకేషన్ కోసం పలు అనువాదాలు చేసారు. సామ్రాజ్యవాదుల బడితొత్తులయిన ప్రతీఘాతుక బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు బీజేపీ కేంద్ర ప్రభుత్వం, తమిళనాడు ప్రతీఘాతుక పాలకవర్గాల నమ్మినబంటు ఏఐడీఎంకే ప్రభుత్వ ఎస్‌టీఎఫ్ బలగాలు, కేరళం సోషల్ ఫాసిస్టు సీపీఎం ప్రభుత్వ థండర్‌బోల్ట్ బలగాలు కలిసి ట్రైజంక్షన్ ప్రాంతంలో కామ్రేడ్ మణివాసగంతో పాటు నలుగురు కామ్రేడ్స్‌ను క్రూరంగా హత్య చేసారు.

కామ్రేడ్ సృజన గత 33 ఏండ్లుగా భారత నూతన ప్రజాతంత్ర విప్లవ విజయానికై గడ్చిరోలి జిల్లాలో ఏసీ నుంచి ఆర్‌సీ వరకు వివిధ స్థాయిలలో పార్టీలోనూ, గెరిల్లా ఫార్మేషన్లలోనూ బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చిన దండకారణ్యం తొలితరం విప్లవకారిణి. ఆమె మాస్‌వర్క్, మిలటరీవర్క్‌లో మంచి అనుభవాన్ని సంపాదించింది. పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. కేడర్ల, ప్రజల అపార విశ్వాసాన్ని చూరగొంది. ఉద్యమానికి కఠిన పరిస్థితులు ఎదురైన పలు సందర్భాలలో ఆమె దృఢంగా నిలబడి ప్రజలకు అంటిపెట్టుకుని అహర్నిశలు ఉద్యమాన్ని కాపాడుకోవడానికి కృషి చేసింది. కసన్‌సూర్ ప్రాంతంలో దాదాపు 22 సంవత్సరాలు పనిచేసి ఆ ప్రాంత ప్రజల తలలో నాల్క అయ్యింది. సమాజంలో పితృస్వామ్యాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించి ఉద్యమ బాటపట్టిన ఆమె మహిళల సమస్యలను మావోయిస్టు సిద్ధాంత కోణంలో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ భూస్వామ్య పితృస్వామ్యంపై గట్టి పోరాటం చేసింది. ఆమె తన సుదీర్ఘ విప్లవానుభవంలో దాదాపు 30 ఎన్‌కౌంటర్ ఘటనలలో ధైర్యంగా శతృవును ఎదుర్కొంది. అంతిమ ఘటనలో కూడా శతృవుతో ముఖాముఖి తలపడుతూ తనకు ప్రాణప్రదమైన కేడర్లను కాపాడుతూ వీరమరణం పొందింది.

భారత దోపిడీ పాలకవర్గాలు 2022 నాటికి దేశంలో విప్లవోద్యమాన్ని నిర్మూలించేందుకు వ్యూహాత్మక 'సమాధాన్' దాడిని ఈ సంవత్సర కాలంలో మరింత తీవ్రతరం చేసాయి. ఒక వైపు కార్పెట్ సెక్యూరిటీని, కమ్యూనికేషన్ వ్యవస్థను, ఇంటెలిజెన్స్–ఇన్‌ఫార్మర్–కోవర్టు నెట్‌వర్క్‌ను బలోపేతం–విస్తృతం చేయడం ద్వారా కౌంటర్‌గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ, మరోవైపు పలు రకాల అభివృద్ధినిరోధక సంస్కరణ కార్యక్రమాల ద్వారా, మానసిక యుద్ధం ద్వారా ప్రజలను నయానా–భయానా విప్లవోద్యమం నుంచి దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. మన పార్టీ ప్రజాపునాదిపై ఆధారపడుతూ, దానిని బలోపేతం చేసుకునేందుకు కృషి చేస్తూ వివిధ ఎత్తుగడల ఎదురుదాడి చర్యలు, క్యాంపెయిన్ల, ప్రజా పోరాటాల, ప్రజా ప్రతిఘటన ద్వారా 'సమాధాన్' దాడిని ధైర్యంగా ఎదుర్కొంది. పార్టీలో కొందరు పిరికిపందలు–స్వార్థపరులు మడమతిప్పి, దిగజారి, ద్రోహం చేసినప్పటికీ శత్రు దాడిని నిలువరిస్తూ మన పార్టీ ఉద్యమాన్ని కాపాడుకుంటూ దాన్ని నూతన ప్రాంతాలకు విస్తరింపజేసేందుకు కృషి చేసింది.

ఈ భీషణ ప్రజాయుద్ధంలో ఈ సంవత్సర కాలంలో మనకు జరిగిన నష్టాలు తీవ్రమైనవే. వీటిలో చాలా నష్టాలు

నివారించుకోగలిగేవే. మన పని విధానాలను, వాస్తవమైన పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయించుకోవాలన్నది, నిజమైన కమ్యూనిస్టులందరూ (మావోయిస్టులందరూ) దృఢంగా గుర్తుంచుకోవాల్సిన అత్యంత మౌలికమైన పని పద్ధతి. మనం చేసిన పొరపాట్లకు గల కారణాలను పరిశీలిస్తే, మనం నిర్దిష్టమైన కాలమూ, వివిధ ప్రాంతాలలోని వాస్తవ పరిస్థితి నుండి పక్కకు మళ్లి, మన విధానాలలో స్వీయ మానసికత్వానికి గురికావడం వల్లనే అవన్నీ తలెత్తుతున్నాయని మనకు విదితమౌతుంది.

సాయుధ పోరాటం/యుద్ధం అనేది మన పార్టీ పంథాలో అత్యంత ముఖ్యమైన అంశం. ఒక విప్లవ పార్టీ, గెరిల్లా యుద్ధంపై కేంద్రీకరించిన ఒక పంథా, వైరుధ్యాలను పరిష్కరించడంలో తన ఆయుధశక్తిని వినియోగించడం ఎంతో కీలకమైనవి. విప్లవం బలప్రయోగాన్ని కోరుతుంది. విప్లవం చేయడానికి దీర్ఘకాల ప్రజాయుద్ధమే మార్గం. ఈ అవగాహన ప్రతి సమస్యలో ఒక సరైన వైఖరిని చేపట్టేందుకు తోడ్పడుతుంది. అనివార్యమైన ఈ బాధ్యతను నెరవేర్చడం కోసం మన పార్టీ యుద్ధానికి అత్యంత ప్రతిభావంతమైన, అత్యంత సంఘటిత/సమైక్య స్వభావాన్ని చేకూర్చాలి. శత్రువు దేశంలో మన పార్టీకి వ్యతిరేకంగా, పీడిత జాతుల విముక్తి పోరాటాలకు వ్యతిరేకంగా, పీడిత సెక్షన్ల ఉద్యమాలకు వ్యతిరేకంగా, ప్రగతిశీల, ప్రజాస్వామ్య, దేశభక్త, లౌకిక ఉద్యమాలకు వ్యతిరేకంగా అత్యంత నిరంకుశంగా, పాశవికంగా దాడులను, విధ్వంసక యుద్ధాన్ని సాగిస్తున్నాడు. మన పార్టీ అపారమైన మూల్యాన్ని చెల్లిస్తూ ఈ ప్రతీఘాతుక విధ్వంసక యుద్ధాన్ని ప్రతిఘటిస్తున్నది. మన విప్లవ ప్రజాయుద్ధ వ్యూహం ద్వారా విప్లవ ప్రజా కమిటీలను ఏర్పరుస్తూ ప్రాంతాల వారీగా అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు దృఢసంకల్పంతో పోరాడుతోంది. అన్ని రకాల నిరాశా-నిస్పృహలను, దివాలాకోరు ప్రయత్నాలను, సైద్ధాంతిక లొంగుబాటును నిరంతరం ప్రతిఘటిస్తున్నది. మన విప్లవం వ్యూహాత్మక ఆత్మరక్షణ దశలో ఉన్నందున మన స్వీయాత్మక శక్తిని పెంపొందించుకోవటానికీ, శత్రుశక్తిని నాశనం చేయడానికి ఎంతో మూల్యాన్ని చెల్లిస్తూ శత్రువుపై ఎత్తుగడలపరమైన ఎదురుదాడులు సాగించే విధానాన్ని అమలు చేస్తోంది. ఇందుకోసం మన శక్తిని కాపాడుకుంటూ, పెంచుకుంటూ, విస్తరించే విధానాన్ని మనం ఖచ్చితంగా అమలు చేయాలి. గెరిల్లాయుద్ధంలో ఇది ప్రధానమైంది. అదే సమయంలో ఎత్తుగడల ఎదురుదాడుల ద్వారా శత్రువును క్రమక్రమంగా తుడిచిపెట్టే, ఆయుధాలు స్వాధీనం చేసుకునే విధానాన్ని అవలంబించాలి.

మన పార్టీని అన్ని కార్యకలాపాలలోను ఈ దీర్ఘకాలిక ప్రజాయుద్ధ విధానానికి అనుగుణంగా తీర్చిదిద్దడం అత్యవసరం. దానికి తోడ్పడేందుకు, దాన్ని పెంపొందించేందుకు అన్ని కార్యకలాపాలను కొనసాగించాలి/రూపొందించాలి. ప్రజాయుద్ధ విస్తరణ అంటే వివిధ వుద్యమాలు ఏ దశలో వున్నప్పటికీ నిస్సందేహంగా ఈ పునాదిపై ఆధారపడి అన్ని రంగాలలో అత్యంత సృజనాత్మకంగా, సంపద్వంతమైన మన పార్టీ విప్లవ పంథాను, రాజకీయాలను అమలు చేయడం, విశాల ప్రజారాశులను సమీకరించడం, నిర్మాణం చేయడం, దేశంలోని విశాల ప్రాంతాలకు ప్రజాయుద్ధాన్ని విస్తరింపజేయడం. ఇందుకోసం విశాల ప్రజారాశాలను సమీకరించడం ద్వారా, ప్రజాపునాదిని, స్వీయశక్తిని పెంపొందించుకుంటూ వ్యూహాత్మక దృష్టితో ప్రణాళికాబద్ధంగా గెరిల్లాయుద్ధాన్ని నిర్మించాలి/తీవ్రతరం చేయాలి. గెరిల్లాజోన్లలో గెరిల్లా యుద్ధంపై ఆధారపడి అన్ని ప్రజా నిర్మాణాలను నిర్మించుకోవాలి/బలోపేతం చేసుకోవాలి. ఈ జోన్లలో మన పార్టీ కమిటీల నాయకత్వంలో గెరిల్లాయుద్ధాన్ని సాగించడం ద్వారా పీడిత ప్రజారాశులను మేల్కొల్పడమే కాకుండా, వారిని సంఘటితం చేయడం, వివిధ ప్రజా పోరాటాలలోకి, ప్రజా ప్రతిఘటనలోకి దించడం సాధ్యమవుతుంది. కామ్రేడ్ మావో చెప్పినట్లు, "అది (యుద్ధం) మనలోని మురికిని, దుమ్మును దులుపుతుంది".

అవకాశవాదం, రివిజనిజం బాగా ముసురుకుంటున్న నేటి సామాజిక పరిస్థితిలో విప్లవ రాజకీయాలతో ప్రజలను రాజకీయంగా సమీకరించి సంఘటితపరచడం, గెరిల్లాయుద్ధాన్ని నిర్మించడం, తీవ్రతరం చేయడానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. మనకు సన్నిహితంగా వున్న ప్రజారాశులకు అర్థం చేయించడం ద్వారా లేదా దూరంగా ఉన్న ప్రజారాశుల వద్దకు ఈ అవగాహనను వ్యాపింపజేయడం ద్వారా, రాజకీయాధికారాన్ని సాధించే ఈ పర్‌స్పెక్టివ్‌ను అమలు చేయడం ద్వారా మాత్రమే మన పార్టీ ఈ లక్ష్యం వైపుగా వేగంగా పురోగమించగలదు.

అయితే ఇదంతా మన స్వీయకోరికలతో కాకుండా వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి. మావోయిస్టు గెరిల్లాయుద్ధ సూత్రాలను దేశంలోని వివిధ ప్రాంతాలలోని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి అమలు చేయాలి. మన తక్షణ, దీర్ఘకాల రాజకీయ, సైనిక, నిర్మాణ పథకాలు ఏవైనా స్వీయాత్మకంగా లేకుండా జాగ్రత్త వహించాలి. వివిధ రూపాల్లో సాగే నిరంతర శత్రుదాడుల మధ్యనే చొరవను, వెసులుబాటును చేజిక్కించుకునే విధంగా మన పథకాలు ఉండాలి. తద్వారా ప్రతీ ప్రాంతంలో, ప్రతీ రంగంలో వర్గపోరాటాన్ని పెంపొందించగలుగుతాం, గెరిల్లాజోన్లలో శత్రువుపై అతిచిన్న స్థాయిలోనే అయినా గెరిల్లాయుద్ధ చర్యలు నిర్వహిస్తూ క్రమక్రమంగా వాడిని దెబ్బతీయగలుగుతాం.

దేశంలో మోదీ-అమిత్‌షా ముఠా నాయకత్వంలో ఎన్‌డీఏ-2 మొదటి సంవత్సర పాలన మరింత నిరంకుశంగా మారిపోయింది. అది 'నయా భారత్', 'సబ్‌కా సాథ్-సబ్‌కా వికాస్-సబ్‌కా విశ్వాస్' అని మాయమాటలు చెబుతూ, పీడిత వర్గాలయిన కార్మిక, కర్షక, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలకు వ్యతిరేకంగా; పీడిత సెక్షన్లయిన దళితులకు, మహిళలకు, ఆదివాసులకు, మత మైనారిటీలకు వ్యతిరేకంగా; పీడిత జాతులయిన కశ్మీర్, ఈశాన్య జాతుల ప్రజలకు వ్యతిరేకంగా వివిధ నిరంకుశపూరిత, ప్రతీఘాతుక విధానాలను, చట్టాలను తీసుకొచ్చింది. అన్ని ప్రభుత్వ సంస్థలను హిందుత్వ ఫాసిస్టులు కబళించారు. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏలను రద్దు చేసారు. భారత సైన్యదళాలపై నిరంకుశ అధికారాలు గల చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్)ను నియమించారు. బాబ్రీమసీదు-రామజన్మభూమి కేసులో

సుప్రీంకోర్టు హిందుత్వ ఫాసిజానికి వంతపాడింది. తీన్ తలాఖ్ చట్టం, నిరంకుశ సీఏఏ చట్టాన్ని తెచ్చారు. ఎన్‌పీఆర్ ద్వారా ఎన్‌ఆర్‌సీకి ప్రాతిపదికను ఏర్పరచుకునే కుటిల ప్రయత్నాలు చేసారు. వీటన్నింటిని వినియోగించుకొని ప్రభుత్వ కిరాయి సాయుధ బలగాల ద్వారా, కాషాయి మూకల ద్వారా మన పార్టీపై, విప్లవోద్యమంపై, అన్ని పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల ప్రజలపై క్రూరమైన దాడిని తీవ్రతరం చేసారు. మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బంగ్, కశ్మీర్, అసోం వంటి చోట్ల దాడులు, హత్యాకాండలు ఇందుకు తాజా ఉదాహరణలు. ఈ సంవత్సర కాలంలో బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజం మరింత తీవ్రరూపం దాల్చింది. ప్రజాస్వామిక, లౌకిక, ప్రగతిశీల, దేశభక్త ఉద్యమాలపై ప్రభుత్వ దాడి తీవ్రమైంది.

2020-21 బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం సరళీకరణ విధానాలను మరింత వేగవంతం చేసి విదేశీ బహుళజాతి కార్పొరేట్ కంపెనీలకు, వారి దళారీలకు భారీ ప్రయోజనాలను చేకూర్చింది. రైతులకు 'కృషి సమ్మాన్ యోజన', పేద రైతులకు, చిన్న వ్యాపారులకు పెన్షన్ ప్యాకేజీలు కేవలం కంటితుడుపు చర్యలు మాత్రమే. ఫలితంగా ప్రపంచ సంక్షోభ ప్రభావం తీవ్రంగా పడడంతో ఆర్థిక వ్యవస్థలో తీవ్ర మాంద్యం ఏర్పడింది. పేదరికం, ఆకలిచావులు, నిరుద్యోగం, రైతుల-నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. మోదీ ప్రభుత్వం దీన్ని కప్పిపుచ్చుతూ దేశంలో ప్రస్తుతం పేదలు, పేదరికాన్ని నిర్మూలించాలని కోరుకునేవారు అనే రెండే వర్గాలు ఉన్నాయంటూ పచ్చి అబద్ధాలతో ప్రజలను భ్రమల్లో ముంచడానికి గోబెల్స్ మీడియా ద్వారా ఎడతెరిపి లేకుండా ప్రచారహోరు సాగిస్తోంది.

ప్రస్తుతం ప్రకృతి వ్యతిరేక, పర్యావరణ వ్యతిరేక, ప్రజావ్యతిరేక సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల ఫలితంగా ఆవిర్భవించిన నోవల్ కరోనా వైరస్ (కోవిడ్-19) మహమ్మారీ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్నది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే మూడు లక్షలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోగా, 30 లక్షలకు పైగా ప్రజలు రోగగ్రస్తులయ్యారు. మన దేశంలో మరణించినవారి సంఖ్య 5 వేలు దాటిపోయింది. ఈ పరిస్థితిని వినియోగించుకొని సామ్రాజ్యవాదులు, వారి దళారులు కోవిడ్-19 వ్యాధికి వైద్యం లేదంటూ మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై లాక్‌డౌన్ విధించారు. తమ సంక్షోభ భారాన్ని మోపి కోట్లాది మంది కార్మిక, కర్షక, మధ్యతరగతి ప్రజలను బికారులను చేసారు. ఇది 2008 నాటి కంటే అనేక రెట్లు తీవ్ర సంక్షోభానికి దారితీయడంతో ప్రపంచవ్యాప్తంగా పీడిత ప్రజలు మునుపెన్నడూలేని విధంగా చెప్పనలవికాని కష్టాలకు, కడగండ్లకు గురిచేస్తోంది.

ఇదే విధంగా కరోనా మహమ్మారి నుంచి ప్రజలను రక్షించే పేరుతో మన దేశంలో సామ్రాజ్యవాద నమ్మినబంటు అయిన మోదీ ప్రభుత్వం ప్రకటించిన స్పెషల్ ప్యాకేజీలు నిజానికి కార్మిక, కర్షక, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలను కాకుండా, బహుళజాతి కంపెనీల, వారి దళారీల ప్రయోజనాలను నెరవేర్చేవే. సంపన్నులకూ, బడా రుణగ్రహీతలకు భారీ రుణాలను, రాయితీలను కల్పిస్తాయి తప్ప వాటి వల్ల కార్మిక, కర్షక, మధ్యతరగతి ప్రజలకు ఒనగూడేదేమీ లేదు. ప్రజల నుంచి, ప్రజాస్వామికవాదుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో చివరికి అది బడ్జెట్ ప్రణాళికల కేటాయింపులను మార్చివేసి అంకెలగారడీ చేసి 20 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీని ప్రకటించింది. ఇందులో మెజారిటీగా విదేశీ ఎంఎన్‌సీలతో చేసుకున్న ఎంఓయులే ఉన్నాయనే వాస్తవాన్ని కప్పిపుచ్చింది. 'స్వావలంబ భారత్' (ఆత్మనిర్భర్ భారత్)ను సాధించడం, దీని ద్వారా 'మన కాళ్లపై మనం నిలబడడం', 'మన శక్తితో మనం నడవడం' అనే దాని ప్రచారం పచ్చి బూటకం. నిజానికి ఈ విధంగా మోదీ-అమిత్‌షా హిందూ ఫాసిస్టు ముఠా దేశద్రోహకర సామ్రాజ్యవాద అనుకూల 'ప్రపంచీకరణ విధానాలను' వేగంగా అమలు చేస్తూ దేశాన్ని సామ్రాజ్యవాద ఎంఎన్‌సీలకు, వాటి దళారీ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నది. ప్రస్తుత కరోనా సంక్షోభంలో సైతం ఘరానా దోపిడీ గజదొంగలందరికీ అనేక రెట్లు సూపర్ లాభాలు చేకూరుస్తున్నది. ఈ అభివృద్ధినిరోధక విధానాలన్నీ పేదలను మరింత ఇక్కట్ల పాలుజేస్తూ మరింత పేదలుగా మారుస్తున్నాయి, వారిని మృత్యువు ముఖంలోకి నెడుతున్నాయి. కరోనా వ్యాధికి బలవుతున్న వారి సంఖ్య వేగంగా పెరుగుతున్నప్పటికీ మోదీ ప్రభుత్వం కరోనాపై విజయం సాధించామని అబద్ధాలు వల్లిస్తున్నది. తన చేతిలో రాజ్య అధికారాన్నంతటినీ కేంద్రీకరిస్తున్నది. క్రూరమైన పోలీసు రాజ్యాన్ని అమలు చేస్తూ ప్రజా ఉద్యమాలను అణచివేస్తున్నది. సామాజిక కార్యకర్తలపై క్రూర చట్టాల కింద కుట్రకేసులు మోపి జైలు పాలు చేస్తున్నది.

ఈ విధంగా లాక్‌డౌన్‌తో తమ బతుకులు దుర్భరం కావడంతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో కార్మిక, కర్షక, మధ్యతరగతి పీడిత ప్రజలు తీవ్ర ఆగ్రహంతో మిలిటెంట్ పోరాటాలకు దిగుతున్నారు. లాక్‌డౌన్ విధించడం కరోనా మహమ్మారికి పరిష్కారం కాదనీ, బలవంతపు రెట్రించ్‌మెంట్లను ఆపాలనీ, తక్షణ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ స్థితిలో అమెరికాలో ఒక నల్ల జాతీయుడిని పోలీసులు లాకప్‌లో హత్య చేయడానికి వ్యతిరేకంగా ఆ దేశంలోని అన్ని పీడిత వర్గాల ప్రత్యేకించి నల్లజాతి ప్రజల మిలిటెంట్ ప్రదర్శనలు 40 మహా నగరాలకు కార్చిచ్చులా విస్తరించాయి. ఈ నిరసన ప్రదర్శనలను సామ్రాజ్యవాదులు, వారి దళారీ పాలకులు పోలీసు బలగాలతో, సైన్యంతో క్రూరంగా అణచివేస్తున్నారు. మన దేశంలో యావత్తు కార్మిక, కర్షక, మధ్యతరగతి పీడిత ప్రజానీకం ప్రపంచవ్యాప్తంగా రోజు రోజుకూ తీవ్రమవుతున్న కరోనా-లాక్‌డౌన్ వ్యతిరేక పోరాటాలలో భుజం-భుజం కలపాలి. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలను, కరోనాను నిరోధించడంలో మోదీ ప్రభుత్వ అసమర్థతను, నిర్లక్ష్యాన్ని, బాధ్యతారాహిత్యాన్ని బహిర్గతం చేయాలి. కరోనా మహమ్మారిని నిరోధించేందుకు తగిన చర్యలు చేపట్టాలని, కార్మిక, కర్షక, మధ్యతరగతి ప్రజలకు సరైన వైద్యసేవలను అందించాలని డిమాండ్ చేస్తూ లాక్‌డౌన్ కారణంగా ఆకలికి, నిరుద్యోగానికి గురైనవారిని, అకాల మృత్యువుకు గురైనవారి కుటుంబాలతో పాటు

కరోనా-లాక్‌డౌన్ పీడితులను అందరినీ ఎక్కడికక్కడ కదిలించి పోరాటాలు నిర్మించేందుకు మన పార్టీ కమిటీలు శ్రద్ధ వహించాలి.

సామ్రాజ్యవాద బహుళజాతి ద్రవ్య పెట్టుబడి '4వ పారిశ్రామిక విప్లవం' పేరుతో అత్యాధునిక టెక్నాలజీతో ప్రపంచ శ్రామిక, మధ్యతరగతి వర్గాల శ్రమదోపిడీతో పాటు, ప్రకృతిని కూడా కొల్లగొట్టడం ద్వారా తమ లాభాలను అనేక రెట్లు పెంచుకునే విధానాలను విచ్చలవిడిగా అవలంబిస్తున్నది. కార్మికవర్గ నాయకత్వంలో రైతాంగం, మధ్యతరగతి తదితర పీడిత ప్రజలు, జాతులు సమైక్యమై కరోనా వంటి ప్రాణాంతక వ్యాధులకు మూలమైన సామ్రాజ్యవాదాన్ని ఈ భూమండలంపై నిర్మూలించి సోషలిజాన్ని-కమ్యూనిజాన్ని స్థాపించడం ద్వారానే ఈ విధ్వంసకర సామ్రాజ్యవాద వ్యవస్థ నుంచి నిజమైన విముక్తి సాధించగలుగుతారు. అందులో భాగంగా భారత అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారా సాయుధంగా కూల్చి దాని స్థానంలో ప్రజల ప్రజాస్వామిక, గణతంత్ర, ఫెడరల్ వ్యవస్థను స్థాపించడం ద్వారా దేశ ప్రజలు నిజమైన విముక్తి సాధించగలుగుతారు, ఆ తర్వాత సోషలిజం-కమ్యూనిజంల వైపుగా పురోగమించగలుగుతారు.

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

మన దేశంలో సామ్రాజ్యవాదుల, వారి దళారీల దోపిడీ పీడనలకు ఆటంకంగా నిలుస్తున్న యావత్తు విప్లవ, జాతివిముక్తి, ప్రజాస్వామిక, లౌకిక, దేశభక్త శక్తులను 2022 నాటికి తుదముట్టించేందుకు, నంబర్ వన్ బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు మోదీ నాయకత్వంలో దళారీ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతీఘాతుక వ్యూహాత్మక 'సమాధాన్' దాడిని రోజు రోజుకూ తీవ్రతరం చేస్తున్నాయి. ఈ ప్రతీఘాతుక 'సమాధాన్' దాడిని ఓడించడం నేడు దేశ విప్లవ, ప్రజాస్వామిక శక్తుల, ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం. ఈ కర్తవ్య సాధన కోసం తమ ప్రాణాలు ధారపోసిన వేలాది అమరుల త్యాగాలు వృథా కావు. మనం ప్రతి అమరత్వపు ఘటనలోని అనుకూల అంశాలను పెంపొందిస్తూ బలోపేతం చేయాలి, ప్రతికూల అంశాలను తొలగించుకోవాలి. అమరులు నిలిపిన త్యాగ సంప్రదాయాలను ఎత్తిపట్టాలి. శత్రుదాడిని నిలువరించడంలో కామ్రేడ్ చూటే చెప్పినట్లుగా, 'అడ్వాన్స్ కావడంలో ముందుండాలి', 'రిట్రీట్ కావడంలో వెనకుండాలి'. అంటే సరైన సీ4, ఫైర్ అండ్ మూవ్‌మెంట్ మొదలైన నియమాలను సృజనాత్మకంగా అమలు చేస్తూ క్రియాశీల ప్రతిఘటన ద్వారా శత్రుదాడిని నిలువరించాలి. ఇందులో మన పార్టీ కమిటీలు, కమాండ్లు స్థానికతత్వానికీ, డిపార్ట్‌మెంటలిజానికి తావీయకుండా సమైక్యంగా నిలిచి, దృఢంగా పోరాడాలి. శత్రువు మనపై దాడి చేస్తే వాడికి మనం ఖచ్చితంగా నష్టం కలిగించాలి. ముఖ్యంగా ప్రజాయుద్ధంలో ప్రజల క్రియాశీల పాత్రను పెంపొందించాలి. దేశంలోని అన్ని ప్రాంతాలలో, అన్ని రంగాలలో మన పార్టీ పంథాను సృజనాత్మకంగా అమలు చేస్తూ మన అమరుల స్థానాలను భర్తీ చేసే విధంగా పార్టీ శ్రేణులను, ప్రజలను తయారు చేయాలి. ఇదంతా క్రియాశీల ఆత్మరక్షణా ఎత్తుగడలకు అనుగుణంగా ఉండాలి. అలాగే భద్రత గురించి ప్రజలను చైతన్యపరచాలి. గ్రామాలలో శత్రు శిబిరాన్ని, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను, అందులో జరుగుతున్న మార్పులను పసిగట్టి మన పార్టీకి తెలియజేసే, బహిర్గతపరిచే కర్తవ్యాన్ని వారు నిర్వహించేలా చేయాలి. తద్వారా శత్రు నెట్‌వర్క్‌ను నియంత్రిస్తూ, ముఖ్యమైన చీడపురుగులను ఏరివేస్తూ మన నష్టాలను తగ్గించుకోగలుగుతాం. క్రమక్రమంగా ప్రణాళికాబద్ధంగా దేశవ్యాప్తంగా పార్టీనీ, ప్రజాపునాదినీ, వర్గపోరాటాన్ని పెంపొందిస్తూ విస్తరిస్తూ స్వీయాత్మక శక్తిని పెంపొందించుకోవడం ద్వారా, గెరిల్లాయుద్ధాన్ని తీవ్రతరం చేయడం ద్వారా శత్రుశక్తిని తుడిచిపెడుతూ మన మహోన్నత అమరులు చూపిన మార్గంలో మన లక్ష్యం వైపుగా పురోగమిద్దాం! ఈ విధంగా ప్రజాయుద్ధాన్ని, క్రియాశీల గెరిల్లా యుద్ధాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడం, తీవ్రతరం చేయడం ద్వారా 'సమాధాన్' దాడిని ఓడిద్దాం!

అమరుల సంస్మరణ వారోత్సవాలను గ్రామ-గ్రామాన ప్రతి ఇంటింటికీ మన విప్లవ సందేశాన్ని అందించి జరిపేందుకు ప్రాధాన్యతనియ్యాలి. అమరుల కుటుంబాలకు సంతాప సందేశాలు, అమరుల ఫోటోలు, జీవిత చరిత్రలు, వారి స్మృతి చిహ్నాలు అందజేయాలి. వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాలి. కుటుంబ సభ్యులను గౌరవిస్తూ అమరుల సంస్మరణ సభలకు ఆహ్వానించి వారి సంవేదనలో భాగం పంచుకోవాలి. ఆ కుటుంబాల్లో శత్రువు పట్ల వున్న తీవ్ర ఆగ్రహాన్ని, కసిని అర్థం చేసుకుంటూ వారిలో అమరుల విప్లవ స్ఫూర్తిని నింపాలి. ప్రధాన రోడ్లపై, కూడళ్ల వద్ద, పట్టణాలలో పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు, పోర్టబుల్ స్థూపాలను నిర్మించడం ద్వారా పెద్దెత్తున ప్రచారం చేయాలి. ఆయా ప్రాంతాలు, జోన్లు/డివిజన్లు, ఏరియాలలో అమరుల జీవిత చరిత్రలను ఎత్తిపడుతూ బుక్‌లెట్లు, కథలు, కవితలు, పాటలు, నాటికలు ప్రచురించాలి, విప్లవ కళా బృందాలకు తర్ఫీదునిచ్చి ప్రజలలో ప్రత్యక్షంగా, డిజిటల్ రూపాలలో విస్తృతంగా ప్రదర్శించాలి/పంపిణీ చేయాలి. అమరుల విప్లవ స్ఫూర్తిని రగిలించి 'సమాధాన్' దాడిని ఓడించేందుకు ప్రజలను రాజకీయంగా సన్నద్ధం చేయడం ఈ వారోత్సవాలలో ఒక ముఖ్యమైన కర్తవ్యంగా చేపట్టాలి.

- ☆ **అమరులకు విప్లవ జోహార్లు!**
- ☆ **అమరుల ఆశయాలను కొనసాగిద్దాం!**
- ☆ **క్రియాశీల గెరిల్లాయుద్ధ ఎత్తుగడల ద్వారా నష్టాలను తగ్గించుకుందాం!**
- ☆ **శత్రు వ్యూహాత్మక 'సమాధాన్' దాడిని ఓడిద్దాం!**
- ☆ **బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని అన్ని రంగాలలోనూ ఎదుర్కొందాం!**
- ☆ **భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి!**
- ☆ **మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!**

# భారత వ్యవసాయ విధానాలు గతం-వర్తమానం

మన భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. రైతే దేశానికి వెన్నెముక. కానీ, ఏయేటికాయేడు దేశ పాలకవర్గాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయం రైతుకు భారంగా మారుతోంది. వ్యవసాయానికి బంధీ అయిన పేద, మధ్య తరగతి రైతుల సేద్యం యేటేటా కుంటుపడుతూ వదులుకునే స్థితికి చేరుతోంది. ఆశించిన ఫలసాయం కరువై ఆదాయాలు పూర్తిగా సన్నగిల్లి అప్పుల పాలవుతున్న వారి బతుకులు ఛిద్రమవుతూ అంతిమంగా కడతేరుతున్నాయి. గత రెండున్నర దశాబ్దాలకుపైగా మన దేశ పాలకవర్గాలు సరళీకృత ఆర్థిక విధానాలను అమలు చేస్తున్నాయి. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాలతో కూడిన దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం జీవనాడిలాంటిది. వ్యవసాయరంగం వికాస, క్షీణతలు మిగితా రంగాలను ఎంతగానో ప్రభావితం చేస్తాయి. యావత్తు దేశ ఆర్థిక వ్యవస్థకు మూలమైన ఆ విధానాల గురించి ముందు టూకీగానైనా తెలుసుకుంటే తప్ప అందులో భాగమై యేటేటా కునారిల్లుతున్న రైతుల వ్యవసాయానికి అసలు కారణాలు బోధపరుచుకోలేం.

### నూతన సరళీకృత ఆర్థిక విధానాలు:

నూతన సరళీకృత ఆర్థిక విధానాలంటే సారాంశంలో సామ్రాజ్యవాద యుగంలోని 'స్వేఛ్ఛా వ్యాపారమే'. ప్రస్తుత ప్రపంచీకరణకు పర్యాయవాచకంగా దానిని తమదైన పరిభాషలో అలా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విధానం ఎలాంటి సంఘటిత శక్తులను సహించదు. రాజ్యం కూడా అణచివేత యంత్రాంగంగా తప్ప మరెందులోనూ జోక్యం చేసుకోకూడదనే 'కనిష్ట శాసనం-గరిష్ట ప్రశాసనం'గా రాజ్యం బాధ్యతలపై హద్దులు విధిస్తోంది. ప్రపంచంలో దీనికి మొదటి ప్రయోగశాల లాటిన్ అమెరికాలోని చిలీ దేశం. 1973లో అక్కడ శాంతియుత పద్దతుల (బూర్జువా ప్రజాస్వామ్య ఎన్నికల) ద్వారా ఎన్నికైన కామ్రేడ్ అలెండీ వామపక్ష ప్రభుత్వాన్ని సైనిక తిరుగుబాటు జరిపి కూలదోసి ఆయనను హత్య చేసి అధికారాన్ని కైవశం చేసుకున్న నియంత పినోచెట్ ప్రభుత్వం నూతన సరళీకృత ఆర్థిక విధానాల అమలుకు పూనుకుంది. అందులో భాగంగా అక్కడి అన్ని విప్లవ ప్రజా సంఘాలనూ ప్రజా ఉద్యమాలనూ నిర్దాక్షిణ్యంగా ముందు అణచివేశాడు. నూతన సరళీకృత ఆర్థిక విధానాలు కోరుకునేదిదే! ద్రవ్య పెట్టుబడి నియంతృత్వమే రాజ్యమేలుతుంది. భారత పాలకులు దానినే పోటీలు పడుతూ 1991నుండి అంచెలంచెలుగా వ్యవసాయం సహ అన్ని రంగాలలో గ్లోబలీకరణను అమలుచేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దాక్షిణ్యంగా సంపన్న వర్గాలకు బలి చేస్తున్నారు.

మన దేశంలో ఉదారవాద ఆర్థిక విధానాలకు దాదాపు 11 సంవత్సరాలు 1995-2004 మధ్య ఆంధ్రప్రదేశ్ ఒక పెద్ద ప్రయోగశాలగా నిలిచింది. ఆ సమయంలో అక్కడి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరో పినోచెట్‌లా వ్యవహరించాడన్నది జగమెరిగిన సత్యం. సేద్యం లాభసాటి వ్యవహారం కాదన్నదే ఆ కాలంలో ఆ రైతు బిడ్డ నేర్చుకున్న ఊతపదం.

### భారత వ్యవసాయ రంగం:

135కోట్లకు పైబడిన దేశ జనాభా ఆహార భద్రతకు భరోసా ఇస్తున్న వ్యవసాయరంగంపై ఆధారపడి జనాభాలోని 55 శాతం ప్రజలు, 14.5కోట్ల కుటుంబాలు జీవిస్తున్నాయి. వాటిలో 12.5కోట్లు చిన్న, సన్నకారు రైతులేనని అధికారవర్గాలే ప్రకటిస్తున్నాయి. మన దేశంలో గ్రామీణ జనాభా 68%కి దిగింది. విభిన్న వాతావరణ పరిస్థితులకు మన దేశం నెలవు. ప్రపంచవ్యాప్తంగా 60రకాలైన నేలలుండగా, వాటిలో 46రకాలు భారత్‌లోనే ఉన్నాయి. దేశంలో అధికార మార్పిడి తర్వాతి రెండు దశాబ్దాల వరకూ ఆరవ వంతు భూమి బీడు భూమిగానే ఉండగా ప్రస్తుతం 30 కోట్ల ఎకరాలకు పైగా సాగులోకి తెచ్చి బీడు భూములు దాదాను లేకుండా చేశారు. దేశం మొత్తంలో 30 లక్షల ఎకరాల భూమి కోతకు గురైంది. మన దేశ రైతాంగం జూన్-సెప్టెంబర్‌ల మధ్య చేరుకునే వాయవ్య రుతుపవనాలతో ఖరీఫ్ పంటలను, అక్టోబర్-నవంబర్‌లలో వచ్చే రుతుపవనాలతో రబీ పంటలను పండిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు వెయ్యి లక్షల హెక్టార్ల భూమి (2019లో మాత్రం 975.16 లక్షలే సాగు చేశారు) సాగు చేస్తున్నారు. ఇందులో వరి సాగు ఇంచుమించు మూడవ వంతు ఉంటుంది. దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 280 లక్షల (28 కోట్లు) టన్నులకు పెరిగింది. అసమానాభివృద్ధి కలిగిన భారతదేశంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం విభిన్న పంటల ప్రత్యేకతలకు పేరెన్నికగన్నాయి. మరోవైపు అడవులు, కొండలలో నివసిస్తున్న మూలవాసులలో నేటికీ పోడు వ్యవసాయం ఇంకా మిగిలేఉంది.

మన దేశంలో 52 శాతం పంట భూములు పూర్తిగా వర్షాధారం. దండకారణ్యంలో 90శాతం పైగా ఆదివాసీ భూములు వర్షాధారమే! ఈ భూములలో ప్రధానంగా రైతాంగం తమ జీవిక కోసమే ఎదుగూ బొదుగూ లేని సాగు కొనసాగిస్తున్నారు. 25శాతం భూములు నదులపై నిర్మించిన ప్రాజెక్టుల నుంచి లభించే నీటి ఆధారంగా సాగవుతున్నాయి. మిగిలిన 23 శాతం భూములను భూగర్భ జలాలపై ఆధారపడి సాగు చేస్తున్నారు. ఈ భూములలో ప్రధానంగా వ్యాపార దృష్టితోనే పంటలు పండిస్తున్నారు. మనదేశంలో 70వేల టీఎంసీల నీరుంది. ప్రతీ ఎకరానికి నీరిచ్చే అవకాశం ఉంది. 40కోట్ల ఎకరాల భూమి వ్యవసాయానికి అనుకూలంగా ఉంది. అయినా 70ఏళ్లుగా నీటి కోసం రాష్ట్రాల మధ్య పంపకం తగాదాలను పరిష్కారం కాకుండా కేంద్రం, అన్ని రాజకీయపక్షాలు పబ్బం గడుపుకుంటున్నాయి. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లాంటివి ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చడానికే తప్ప చిత్తశుద్ధితో పరిష్కార మార్గాలన్వేషణ, అమలుకు కాదని చరిత్ర చాటుతోంది.

భారతదేశంలో దిగుబడి హెక్టారుకు 2.8టన్నులు (ఎకరాకు 11 క్వింటాళ్లు), చైనాలో 4.7టన్నులు కాగా అమెరికాలో 7.7టన్నులుగా లెక్కలు వెల్లడిస్తున్నారు. కానీ ఈ లెక్కలకు చిన్న, సన్నకారు రైతులే కాకుండా చాలావరకూ మధ్య తరగతి రైతాంగం కూడా చేరుకోలేదనే

చెప్పొచ్చు. ఈ దేశంలోని రైతుల్లో 58శాతం మంది నేటికీ ప్రతిదినం రాత్రిపూట పస్తులతో పడుకుంటున్నారని పలు తాజా అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఈ అధ్యయనాలకు అందని బడుగు జీవితాలు కోకొల్లలు. దండకారణ్యం సహా అనేక ఆదివాసీ ప్రాంతాలలో వ్యవసాయ దిగుబడి ఎకరానికి 3-6క్వింటాళ్లు దాటడం లేదని విప్లవకారులు చేపట్టిన సామాజిక అధ్యయనాలు తెలుపుతున్నాయి. ప్రపంచ కూరగాయల సాగులో 17శాతం, పండ్లలో14 శాతం ఉత్పత్తులు ఇక్కడే జరుగుతున్నాయి. ప్రపంచంలో మామిడిలో 40శాతం; అరటి, బొప్పాయిలలో 30శాతం ఇక్కడే లభిస్తాయి. కానీ పేదలకు మాత్రం అన్నీ కరువే!

మన దేశంలో వ్యవసాయ విప్లవాన్ని అడ్డుకోవడానికి, సంపన్నుల సంపదలు పెంచడానికి హరిత విప్లవాలు, శ్వేత విప్లవాలు, నీలి విప్లవాలు, పసిడి విప్లవాలు, గోల్ విప్లవాలు అనేకం జరిగాయి. భారత ప్రజల తలసరి ఆదాయం లక్ష రూపాయలకు చేరుకుంది, అయినప్పటికీ దేశంలో 25%ప్రజలు యేటా నాలుగువేల రూపాయలకు పైబడని ఆదాయంతో దరిద్ర రేఖ దిగువన జీవిస్తున్నారనీ ప్రభుత్వ గణాంకాలే తెలుపుతున్నాయి. కాబట్టి గణాంకాలకు, నిర్దిష్టతలకు అనేక విషయాలలో అనేక తేడాలుంటాయన్నది గమనంలో ఉండాలి. దేశ రైతాంగ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనం కావాలి. అనేక వర్గాలుగా చీలి ఉన్న సమాజాలలో అందులోనూ కులాలవారిగానూ అడ్డుగోడలు నిర్మితమై ఉన్న, వందలాది తెగలు అస్థిత్వంలో ఉన్న మన దేశ విషిష్ట పరిస్థితుల అధ్యయనం మరీ అనివార్యం.

## రైతు వ్యతిరేక ప్రభుత్వ విధానాలు-ఫలితాలు:

బ్రిటిష్‌వారు తమ అవసరాల కోసం మన దేశ వ్యవసాయ రంగంలో నీలి, గంజాయి, జనుపనార, ప్రత్తి, రబ్బరు, తేయాకు, పొగాకు మున్నగు వ్యాపార పంటలు పండించడం మొదలెట్టాక భారత రైతు జీవితం తొలిసారి 1930ల నాటి మహా మాంద్యం తాకిడికి గురై ప్రపంచ మార్కెట్ సంక్షోభంతో అస్తవ్యస్తం అయింది. బ్రిటిష్‌వారికి పూర్వం మన దేశంలో కూలీలు లేరని సర్ థామస్ మన్రో (జనాభా సిద్ధాంత మహానుభావుడు) 1848లో పేర్కొన్నాడు. కానీ 1894 తాత్కాలిక భూముల బందోబస్తు, 1908లోవారు ప్రవేశపెట్టిన భూ-యాజమాన్య పద్ధతులు, వ్యాపార పంటలు, పన్నుల విధానాలతో రైతులలో నుండి కూలీలను తయారు చేసుకోగలిగి కూలీల కొరత తీర్చుకొని తోటలకు, రైల్వే లైన్ల నిర్మాణానికి సమకూర్చుకున్నారు. భారత భూస్వామ్య వ్యవస్థను అర్ధ భూస్వామ్యంగా మార్చారు. బ్రిటిష్ వారి విధానాల ఫలితంగా భూమి సరుకుగా మారి రైతు నగదు రూపంలో పన్ను చెల్లించలేని దుస్థితిలో భారత రైతు ఆనాడు తన భార్య మెడలోని మంగళసూత్రాన్ని పన్ను చెల్లింపులకు సమర్పించుకోకతప్పలేదు. భారత రైతుల పన్ను వసూళ్లతో 1932-36మధ్య బ్రిటిష్ బొక్కసంలో అపారమైన బంగారు నిల్వలు (162%) పెరిగాయి. రెండవ ప్రపంచ యుద్ధానికి సంపద సమకూరింది.

మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 1950ల ప్రారంభంలో 55శాతం ఉండగా అది క్రమంగా తగ్గుతూ 1990లలో పాలకులు తలకెత్తుకున్న నూతన ఆర్థిక విధానాల ఫలితంగా 30%కి చేరింది. 21వ శతాబ్దంలో అది మరింత దిగజారుతూ ప్రస్తుతం 14%కి పడిపోయింది. వ్యవసాయం పూరకంగా ఉండే పారిశ్రామిక రంగం 16%కి పడిపోయింది. మరోవైపు సేవలరంగం 70%కి చేరువవుతుంది. ఈ అంకెలు వ్యవసాయ రంగాన్ని అర్థం చేసుకోవడానికి విహంగ వీక్షణంలా ఉంటాయి.

1947లో ఏర్పడిన 'గాట్' (జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్) 1995లో 164 దేశాలతో కూడిన 'ప్రపంచ వాణిజ్య సంస్థ'గా (డబ్లుటీఓ) మారడంతో పాటు కొత్తగా గాట్స్ ఏర్పడింది. 1991లో నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన పాటుగా మన దేశం గాట్స్‌లోనూ చేరడంతో దాని నిబంధనలకు అనుగుణంగా మన దేశ, విదేశీ విధానాలన్నీ సవరించి తీరాల్సి వచ్చింది. దానితో, ఉల్లిపాయల ఎగుమతులు; పప్పుధాన్యాలు, వంటనూనెల దిగుమతులు మినహా ఇతర ఏ వ్యవసాయోత్పత్తులలో ప్రభుత్వ జోక్యం లేకుండా పోయింది. గత వ్యాపార ఆంక్షలన్నీ ఎత్తివేయక తప్పలేదు. ప్రపంచ వాణిజ్య సంస్థ నిరంకుశ విధానాలకు మన వ్యవసాయ రంగం తీవ్రంగా ప్రభావితం అయ్యింది. పేటెంట్ హక్కులు రాజ్యమేలసాగాయి. ఆహార ధాన్యాలు పండించే చోట అధిక మార్కెట్ విలువతో పాటు ఎగుమతుల ప్రాధాన్యతను సంతరించుకున్న పంటలు పండించడం పెరిగింది. రైతు బతుకు ప్రపంచ మార్కెట్‌కు బంధీ అయిపోయింది.

మన దేశంలో 1950-51 నుండి 'యూఎస్‌ఎస్‌ఆర్' సోషలిస్టు అభివృద్ధిని పోలిన పంచవర్ష ప్రణాళికలను ప్రారంభించి ప్రణాళికాబద్ధ అభివృద్ధి పథకాలను చేపట్టారు. 1950 నుండి 1980 వరకూ (మధ్యలో మూడు వార్షిక ప్రణాళికలు సహా) పూర్తయిన ఎనిమిది పంచవర్ష ప్రణాళికల కాలంలో మన దేశ జీడీపీ యేటా 3.7% అభివృద్ధితో సాగింది. దీనిని కొందరు బూర్జువా ఆర్థికవేత్తలు హిందూ అభివృద్ధి రేటుగా ఎద్దేవా చేశారు.

కానీ, నిజానికి ఆ కాలంలోనే మన దేశంలో చేపట్టిన వ్యవసాయ సంస్కరణలలో భాగంగా పలు భారీ నీటి పారుదల, విద్యుత్ ప్రాజక్టులు, బహుళార్థ సాధక ప్రాజక్టులు 'హరిత విప్లవ' పూర్వ కాలంలోనే ఉనికిలోకి వచ్చాయి. వ్యవసాయోత్పత్తులలో స్వయం సమృద్ధిని సాధించడమే కాకుండా ప్రపంచంలో 10వ పారిశ్రామిక దేశంగా నమోదై ఉద్యోగాల వార్షిక పెరుగుదల రేటు 2%గా ఉండింది. చట్ట పరంగానే అయినప్పటికీ జమీందారీ వ్యవస్థ రద్దు, కౌలుదారీ చట్టాలు పురుడుపోసుకోవడం, రైతుల పంటలకు కనీస మద్దతు ధరలను (1966-67) సమకూర్చడం, అన్ని రాష్ట్రాలలో భూ పరిమితి చట్టాలు, ఆదివాసుల భూ-సంరక్షణ చట్టాలు (ఉదా. 1/70) వెలుగు చూడడం, వ్యవసాయ సాగు భూముల విస్తరణ, బ్యాంకుల జాతీయకరణ ఆ కాలంలోనే జరిగాయన్నది గుర్తు చేసుకోవాలి. అయితే, ఇవేవీ పీడిత రైతాంగంపై ప్రేమతో, వారిని ఉద్ధరించే లక్ష్యంతో చేసినవి మాత్రం కావు. అధికార మార్పిడి అనంతరం వ్యక్తమైన దేశ ప్రజల చైతన్యం,

దేశంలో పెంపొందుతున్న విప్లవోద్యమ పరిస్థితులతో పాటు ఆనాటి రష్యా, చైనాల విప్లవోద్యమాల విజయాల నేపథ్యంలోనే భారత పాలకులు చేయాల్సి వచ్చిందన్నది ముమ్మాటికి నిజం.

1960లో ఏడు రాష్ట్రాలలోని ఏడు జిల్లాలను ప్రభుత్వం ఎంపిక చేసి వ్యవసాయాభివృద్ధి పనులను చేపట్టింది. దానికి ఐఏడీపీ (ముమ్మర క్షేత్ర వికాస కార్యక్రమం)గా పేరు పెట్టారు. మరోవైపు మన దేశం 1960ల మధ్యలో వరుసగా ఎదుర్కొన్న క్షామ పరిస్థితుల నేపథ్యంలో ఐఏడీపీ కొనసాగింపుగా అమెరికాకు చెందిన నార్మన్ బోర్లాగ్ మరియు దేశ వ్యవసాయ 'నిపుణుడు' యం.ఎస్.స్వామినాథన్‌ల సలహాలపై సామ్రాజ్యవాద ఆధారిత హరిత విప్లవానికి పాలకులు హారతి పట్టారు. వ్యవసాయ సాగు భూముల విస్తరణ బదులు గతానికి భిన్నమైన ఉత్పాదకతలో పెరుగుదల ప్రధాన వనరుగా ముందుకొచ్చింది. దిగుమతి చేసుకున్న ఆధునిక యంత్రాలు, అధిక దిగుబడినిచ్చే (హెచ్‌వైవీ) వంగడాలు, వాటికి అనివార్యమైన సాగునీటి వ్యవస్థ, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులపై ఆధారపడి పరాధీన పంటలతో 'హరిత విప్లవాత్మక'(వినాశకర) మార్పులకు ఒడిగట్టారు. ఈ మార్పులకవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్స్ పరిశ్రమలు వర్ధిల్లాయి. ఆ సాగు పద్ధతులు నేడు దేశమంతా వ్యాపించి రైతుల ఉసురు తింటున్నాయి. ఆ మార్పులు చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతుల జీవితాలను కల్లోలభరితం చేశాయి.

నెహ్రూ మిశ్రమ ఆర్థిక వ్యవస్థ విధానంలోని 'బలహీనత'లను తర్వాతి కాలంలో గద్దెనెక్కి 'గరీబీ హఠావో' నినాదాన్ని (1957లో జరిగిన 2వ సార్వత్రిక ఎన్నికలలో కూడు, గూడు, గుడ్డ నినాదాన్ని ఇచ్చారు). చేపట్టి సోషలిజం, సెక్యులరిజం లక్ష్యంగా రాజ్యాంగ సవరణలతో అధికారాన్ని చలాయించిన ఇందిరా కాంగ్రెస్ పాలకులు 1970ల చివర్లో గతాన్ని సమీక్షించి 1980 జులైలో నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించారు. భారీ వ్యాపారానికి ప్రభుత్వ లైసెన్స్‌ల అవసరం తీరిందన్నారు. 1985లో అధికార పగ్గాలందుకున్న ప్రధాని రాజీవ్‌గాంధీ పాలనలో ప్రభుత్వ సంస్కరణలు ఊపందుకున్నాయి. నెహ్రూ పాలనలో ప్రభుత్వ రంగ విస్తరణ అతిగా జరిగిందన్నారు. పారిశ్రామిక లైసెన్స్‌ల విధానాన్ని సరళీకరించారు. ఆధునిక టెక్నాలజీని అరువు తెచ్చారు. ద్రవ్య విధానాలను సంస్కరించారు. బడా వ్యాపారంపై ప్రభుత్వ నియంత్రణలను, ఆంక్షలను తొలగించారు. వ్యవసాయరంగం వెనక్కి నెట్టబడింది.

ఆ తదుపరి ప్రధాని పదవీ చేపట్టిన పీ.వీ. నర్సింహరావు, ఆర్థిక మంత్రిగా అధికార బాధ్యతలు నిర్వహించిన మన్మోహన్ సింగ్‌ల హయాంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణ విధానాలను సంపూర్ణంగా ఆశ్రయించడంతో అది మౌలికమైన మార్పులకు లోనైంది. 1991లో అమలులోకి వచ్చిన 'సరళీకృత ఆర్థిక విధానాల' ఫలితంగా నూతన వ్యవసాయ విధానం రూపుదాల్చింది. అది పూర్తిగా మార్కెట్ ఆధారిత పంటలనే ప్రోత్సహించింది. 1999లో అంటీ ఇన్‌కుంబెన్సీతో కాంగ్రెస్ కూటమి సర్కార్ పడిపోయి ఎన్‌డీఏ కూటమి అధికార పగ్గాలందుకుంది. ఎన్‌డీఏ సైతం అవే విధానాలను కొనసాగించడంతో 1999-2004 మధ్య వ్యవసాయ రంగం తీవ్ర మందగతికి లోనైంది. దానితో రైతుల ఆగ్రహానికి గురైన ఎన్‌డీఏ ఓటమిపాలై 2004లో మళ్లీ కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ అధికారానికి వచ్చింది.

నూతనంగా అధికారానికి వచ్చిన యూపీఏ ఓటమిపాలైన ఎన్‌డీఏ విధానాలనుండి వ్యవసాయరంగంలో సంస్కరణలకు పూనుకోవడమే కాకుండా గ్రామీణ వ్యవస్థలో జీన్‌డ్రెజ్ లాంటి ఆర్థికవేత్తల సలహాలనుసరించి నరేగా(తర్వాత మన్‌రేగా అయింది), ఆహార భద్రతా చట్టాన్ని ప్రవేశపెట్టింది. వ్యవసాయరంగంపై ప్రభుత్వ పెట్టుబడులను పెంచింది. రైతులకు ప్రభుత్వం ఉదారంగా అప్పులు ఇవ్వడం, నిర్మాణ రంగం అభివృద్ధి చెందడంతో శ్రామికులకు కూలీ పనులు దొరికే అవకాశాలు పెరిగి రైతుల కొనుగోలు శక్తి పెరిగింది. వాటికి 2008-09నాటి రైతుల రుణాల మాఫీ మరింత తోడైంది. వాటన్నింటికి ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయోత్పత్తుల ధరలలో చోటుచేసుకున్న పెరుగుదల తోడై వ్యవసాయరంగంలో చెప్పుకోతగిన రైతు అనుకూల మార్పులు వెలుగుచూశాయి. కానీ 'కుక్క తోక వంకర' అన్న చందంగా యూపీఏ-2 కాలంలో పాలకులు రెండవ తరం సంస్కరణల పేరుతో సరళీకృత ఆర్థిక విధానాల అమలును వేగవంతం చేశారు.

ఇక్కడ మనం ఆ సమయంలో దేశంలో వేగంగా విస్తరిస్తోన్న విప్లవోద్యమం (పాలకుల పరిభాషలో వామపక్ష ఉగ్రవాదం)గురించి గుర్తు చేసుకుంటే తప్ప జీన్‌డ్రెజ్ సూచనలు సహ పాలకుల సంస్కరణల పరమార్థం బోధపడదు. అవన్నీ వారు ఎంతో ఉదారంగా చేసేస్తున్నారనే తప్పుడు భ్రమలకు లోనవుతారు.

వలసకాలంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన ముడి సరుకుల కోసం కాఫీ, తేయాకు, రబ్బరు, నీలి, పొగాకు మొదలైన తోటల సాగుకు మన దేశంలో పునాదులు వేస్తే అధికార మార్పిడి తర్వాత వారి కనుసన్నలలో దేశ పాలకులు సరళీకృత ఆర్థిక విధానాల అమలులో భాగంగా రెండవతరం సంస్కరణలలో చేపల పెంపకం (అక్వా కల్చర్) సహ ఉద్యానవనాలు (హర్టికల్చర్), తోటల పెంపకం (ఫ్లోరికల్చర్), సుగంధ ద్రవ్యాలు (ఎరోమెటిక్), ఔషధ మొక్కలు (మెడిసినల్) కొత్తగా రంగ ప్రవేశం చేశాయి. పరిశోధన, మద్దతు ధరలు, టెక్నాలజీ విస్తరణ, మార్కెటింగ్ మున్నగునవి ప్రధాన వ్యవసాయ సంస్కరణలయ్యాయి. యూపీఏ-2 విధానాలతో ఆగ్రహించిన రైతు 'సబ్‌కే సాథ్-సబ్‌కా వికాస్' 'స్వామినాథన్ సిఫారసుల అమలు' లాంటి మోదీ కపట హామీలను నమ్మి16వ లోకసభ ఎన్నికలలో ఆయనకు పట్టం కట్టారు.

మోదీ గద్దెనెక్కిన వెన్వెంటనే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి తన మార్క్‌గా ముందుకు తెచ్చిన 'నీతి ఆయోగ్' పత్రం మూడు వ్యూహాలను సూచించింది. 1. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను ప్రవేశ పెట్టి పంటల వైవిధ్యాన్ని, ఉత్పాదకతను పెంచడం 2. పూర్తిగా వ్యవసాయం మీదనే దృష్టి కేంద్రీకరించకుండా ప్రైవేటు భాగస్వామ్యంతో వ్యావసాయిక వ్యాపారాలను ప్రోత్సహించడం. చిన్న, మధ్య తరహా రైతులు వ్యవసాయ వ్యవస్థాపకులుగా మారడానికి తోడ్పడటం. 3.

గ్రామాల్లో ఆధునిక మౌలిక వసతులు నిర్మించి, వ్యవసాయోత్పత్తులకు అదనపు విలువ జోడించడానికి ఆహార శుద్ధి పరిశ్రమలను విస్తరించడం, తద్వారా వ్యవసాయ ఎగుమతులను భారీగా పెంచడం! 'మోదీ హైతో ముమ్కిన్ హై' అని పారిశ్రామికాధిపతులకు అనేక హామీలిచ్చి సంస్కరణల ద్రష్టగా వారిచే కొనియాడబడిన జెట్లీ హయాంలో వెలువడిన నీతీ ఆయోగ్ పత్రం ఏ బడుగు రైతునుద్ధరిస్తుంది!?

మన దేశ వ్యవసాయ సంక్షోభాలకు దాదాపు వందేళ్ల కాల సుదీర్ఘ చరిత్ర ఉంది. గత వందేళ్లలో వ్యవసాయరంగంలో చోటు చేసుకున్న విపరిణామాలను స్థూలంగానైనా గ్రహించకుండా దానికి సవ్యమైన పరిష్కారమార్గాలను అర్థం చేసుకోలేరు. వలస కాలం నుండి ఇప్పటివరకూ మన దేశ వ్యవసాయరంగంలో జరుగుతూ వస్తున్న ప్రతి మార్పు వెనుక సామ్రాజ్యవాదుల వత్తిళ్లు లేదా ప్రయోజనాలు, వాటికి ప్రతిగా ఉధృతంగా సాగిన ప్రజా ఉద్యమాలున్నాయన్నది నిర్వివాద విషయం. సామ్రాజ్యవాదుల అప్రత్యక్ష పాలనా, నియంత్రణ, దోపిడీలతో దేశం అర్ధవలసగా 1947 అధికార మార్పిడితో అవతారమెత్తింది.

1960లలో సామ్రాజ్యవాదుల ప్రోద్బలంతో చేపట్టిన పరాధీన వ్యవసాయ విధానాలు దేశ వ్యవసాయ రంగంలో నూతన తరహా వినాశకర మార్పులకు శ్రీకారం చుట్టి రైతుల జీవితాలను విశ్వ విపణికి కట్టిపడేశాయి. 1991లో దోపిడీ పాలకులు చేపట్టిన సామ్రాజ్యవాదుల సరళీకృత ఆర్థిక విధానాలు రైతుస్త్రీల 'మంగళసూత్రాలనే' బలి తీసుకుంటూ రైతుల జీవితాలను కబలిస్తున్నాయి. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలం తర్వాతి నుండి క్రమంగా దేశ ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక రంగం ప్రాధాన్యతను సంతరించుకొంది. రెండు రంగాల మధ్య సమతుల్యం దెబ్బతిని సామ్రాజ్యవాదుల, బడా బూర్జువాల ప్రయోజనాలను ఈడేర్చడానికే ఆర్థిక వ్యవస్థ అంకితమైంది. ఇక ఇపుడు మచ్చుకైనా జాతీయ ఛాయలు లేకుండా చేస్తూన్న కపట 'దేశభక్తులు', 'మేకిన్ ఇండియా' అంటూ పేరులోనే స్వదేశం తప్ప వ్యవసాయం సహా అన్ని రంగాలను జాతీయవాదం జపం చేస్తూనే అతి దూకుడుగా విదేశాలకు అప్పగిస్తున్నారు. దేశానికి వెన్నెముకగా నిల్చి, జీడీపీలో సింహభాగాన్ని ఆక్రమించి, మూడింట రెండొంతుల శ్రమ శక్తి ఉపాధికి భరోసాగా నిల్చి తన వికాసం ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాల సమాహిత ప్రగతికి హామీగా నిలుస్తుందన్న వ్యవసాయ రంగాన్ని(పేదల జీవితాలను) 'మోదీహైతో ముమ్కిన్‌హై' అంటూ కార్పోరేట్ వర్గాలకు బలి పెడుతున్నారు. భారత ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంటున్న ప్రతి మార్పు బ్రాహ్మణీయ దీర్ఘదృష్టితో, బనియా(కోమటి)ల తక్షణ వ్యాపార లాభాపేక్షతోనే జరుగుతూ ఘరానా కార్పోరేట్ వర్గాల కబంధ హస్తాల పాలవుతోంది. కానీ, ఆచరణలో మోదీ పాలన రైతుల పాలిట 'ముల్లు తీసి కొర్రు దింపుకున్నట్టు' అయింది.

గత మూడు దశాబ్దాలుగా సాధారణ రైతుల వ్యవసాయం నాశనమవుతూ సంపన్నుల వ్యవసాయం పరవళ్లు తొక్కుతోంది. రోజుకు సగటున 40 మంది యేటా 12,000 అన్నదాతలు ఈ విధానాలకు బలి అవుతున్నారు. నగటున మరో 2,054మంది రోజూ ఊళ్లొదులుతున్నారు. దేశంలో 10-20 కోట్ల మధ్య జనం ఇప్పటికే వలసల పాలయ్యారు. ఇది ఫ్రాన్స్, బెల్జియం, జర్మనీల ఉమ్మడి జనాభాతో సమానం. లక్షల సంఖ్యలో రైతులు ఫలసాయం లేని తమ సంప్రదాయ వ్యవసాయానికి నీళ్లొదులుతున్నారు. గడచిన పదేళ్లలో దేశంలో 40 లక్షల మంది రైతులు సేద్యం నుంచి వైదొలగారంటూ గణాంకాలు చాటుతున్నాయి. తమ సాగు భూములను కార్పోరేట్ వర్గాల నూతన పంటల విధానాలకు తాకట్టు పెడుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో రమన్‌సింగ్ కాలంలో రతన్‌జోత్ (సర్కార్ ఆముద), ఫసల్ చక్రల చేదు అనుభవాలను అక్కడి రైతులు మరువలేరు. ఆర్థిక వృద్ధిని సాధించడానికి వ్యవసాయాన్ని త్యాగం చేయాలని చాలామంది బూర్జువా ఆర్థికవేత్తలు వక్కాణిస్తుంటారు. పాలకులు ఆర్థిక సంస్కరణలకు అనుకూలమైన వాతావరణం నెలకొనడం కోసం వ్యవసాయాన్ని మరింత సంక్షోభం వైపు నెట్టుతున్నారు. రిజర్వుబ్యాంక్ మాజీ గవర్నర్ పదే పదే చెప్పేదేంటంటే, చౌకగా కూలీల అవసరం ఉన్న పట్టణాలకు వ్యవసాయ రంగం నుంచి గణనీయమైన సంఖ్యలో జనాభా తరలిపోవాలి. అదే నిజమైన సంస్కరణ అంటాడతడు. 1996లో ప్రపంచ బ్యాంక్ ఆదేశించినది కూడా అదే. 2015 నాటికి గ్రామీణ ప్రాంతాల నుంచి నలభై కోట్ల భారతీయులు తరలిపోవాలని (వ్యవసాయం వదిలి) ప్రపంచ బ్యాంక్ ఆకాంక్షించింది. ప్రభుత్వాలు ఏవైనా దేశ ఆర్థిక విధానాలను అందుకు అనుగుణంగానే మలుస్తూ అనుసరిస్తున్నాయి. సేద్యాన్ని లాభసాటి వ్యవహారం కాదంటూ, అందుకు పరిష్కారం వ్యవసాయ రంగం నుంచి జనాభాను బయటకు నెట్టడమే అత్యుత్తమమైనదనేదే వారికి శిరోధార్యం. వారిని ఎప్పుడూ అమెరికాలో రైతాంగం అక్కడి జనాభాలో2%అన్నదే వెంటాడుతుంది. ఇదీ నేటి వ్యవసాయ సంక్షోభం.

21శతాబ్దంలో ప్రపంచబ్యాంకు ఆదేశాల నమూనాగా జీడీపీ పెరుగుదల రెండంకెలకు చేరినా లేదా దాని దరిదాపులలో తచ్చాడుతున్నా ఆర్థిక వ్యవస్థ మాత్రం 'ఉపాది రహిత వికాసం' గానే నమోదవుతోంది. రైతులు సాగు భూములకు, ఆదివాసులు అడవులకు దూరమవుతున్నారు. ధనికులు, పేదల మధ్య అంతరం మున్నెన్నడూ లేని స్థాయికి చేరింది. దేశంలోని 70% సంపద పది మంది కుబేరుల వద్దకు చేరింది.

కార్పోరేట్ వర్గాల ప్రయోజనాల కోసం రైతుల భూములను దురాక్రమించడానికి స్వామినాథన్ సిఫారసులనూ గ్రామసభలనూ పక్కనపెడుతూ వివిధ రూపాలలో పాలకులు భూ-సేకరణ చట్టాలను ప్రవేశపెడుతున్నారు. ఇక ఇపుడు నూతనంగా వేల కోట్ల ఖర్చుతో 'టైటిల్ గ్యారంటీ వ్యవస్థ' (భూములకు పట్టాలు)ను మహా ఆర్భాటంగా ముందుకు తెస్తూ మురిపిస్తున్నారు.

భూదాహంతో తల్లడిల్లే మన దేశ రైతులకు భూమి పట్టాలు ప్రాణంతో సమానం. 'టైటిల్ గ్యారంటీ వ్యవస్థ' అమలవడం ద్వారా కార్పోరేట్ వ్యవసాయం, వారి పరిశ్రమల స్థాపనకు అదనపు చిక్కులు ఎదురవకుండా ఉంటుందన్నదే పాలకుల కౌటిల్యం. ఇది పేదరైతుల

మీదా ప్రేమతో చేస్తున్నది ఎంత మాత్రం కాదు. కేసీఆర్ నుండి మోదీ వరకూ నయవంచక నాయకులు తామేది చేయ తలపెట్టినా ముందు దానిని ఓ విప్లవాత్మక మార్పుగా, అశేష ప్రజారాసుల సంక్షేమం కోసం అది అనివార్యమైనదిగా విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్లడంలో వారి చాణక్యనీతికి వారేసాటి.

లోక్‌సభ ఎన్నికలలో గెలిచిన మోదీ 2022నాటికి నయాభారత్ నిర్మాణ్ దిశలో దేశాన్ని అభివృద్ధి చేయాలని పదే పదే సెలవిస్తున్నాడు. జూన్ 15నాడు జరిగిన నీతి ఆయోగ్ ఐదో పాలకమండలి సమావేశంలో పేదరికం, నిరుద్యోగం, కరువు, వరదలు, కాలుష్యం, అవినీతి, హింసకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాటం సాగించాలని ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్ల మధ్య ప్రకటిస్తు వచ్చే ఐదేండ్లలో దేశాన్ని 5 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ. 350లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మోదీ అండ్ కంపెనీ పదే పదే ప్రకటిస్తున్నారు. అదే వరుసన జూన్ 20నాడు పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశిస్తూ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ చేసిన ప్రసంగంలో తన ప్రభుత్వం ముందున్న లక్ష్యాలను ఆయన పేర్కొన్నాడు. ఆయన కూడా నయాభారత్ నిర్మాణ దిశలో దేశ పురోభివృద్ధి సాగుతుందన్నాడు. ఆయన వ్యవసాయ రంగం గురించి ప్రస్తావిస్తూ నీలి విప్లవంపై భరోసాతో రానున్న కొద్ది సంవత్సరాలలో వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయల అభివృద్ధికి రూ. 25 లక్షల కోట్ల పెట్టుబడులను తన ప్రభుత్వం పెట్టనుంది అన్నాడు. సాగునీరు, మార్కెట్ల (అంగడి, అడ్తీ) ఏర్పాటు, రవాణా ఏర్పాట్లు, ఆహార నిల్వల గోదాములు, తోటల పెంపకం, కోళ్లపెంపకం, పాల ఉత్పత్తులకు కోల్డ్ స్టోరేజీల ఏర్పాట్లు చేస్తూ ఆర్థికంగా రైతులను అభివృద్ధి చేయడానికి ఆధునిక వ్యవసాయంలో రైతులకు శిక్షణ ఉంటుందని వివరించాడు. వ్యవసాయంలో అభివృద్ధి రేటు పెంచడానికి ప్రభుత్వం నీలి విప్లవానికి కట్టుబడి ఉంటుందన్నాడు. అంతే కాకుండా తన ప్రభుత్వం భూముల పరిమాణంతో సంబంధం లేకుండా దేశంలోని 14.5కోట్ల సమస్త రైతు కుటుంబాలకు ఏటా 6వేల రూపాయలు అందచేస్తుందనీ ప్రకటిస్తూ 60 యేండ్లు నిండిన రైతులకు నెలకు 3వేల రూపాయల పింఛన్ కూడా అందచేస్తుందనీ హామీ ఇచ్చాడు. నిజానికి ఇవి రైతుల మరణాలకు ముందే ముడుపులు కట్టడం తప్ప మరేం కాదు. లేదంటే 2022 నాటికి పెరుగనున్నదని హామీ ఇచ్చిన రైతు ఆదాయ రెట్టింపు లెక్కలకు ముందస్తు చెల్లింపులైనా అయి ఉ ండాలి. తన ప్రభుత్వం రైతుల పంటలకు కనీస మద్దతు ధరను నిర్ణయిస్తుందని చెపుతూ భూసార పరీక్షల కార్డులు సమకూరుస్తుందని అన్నాడు. పశువులకు ఆధార్‌కార్డులు ఇవ్వడం పాతమాట కావడంతో దానిని ఎత్తుకోనట్టుంది! ఆయన ఉపన్యాసంలో కొసమెరుపు ఆ అభివృద్ధి అంతా దేశ చిన్న, సన్నకారు రైతులను బలిపెడుతూ విదేశీ పెట్టుబడులను సేకరించడం ద్వారనే సాధ్యమని చెప్పకనే చెప్పాడు.

పైన దేశ రాష్ట్రపతి, ప్రధానమంత్రి చెప్పిన తమ ప్రభుత్వాల ప్రకటిత లక్ష్యాలను చూశాం. వారి లక్ష్యాలను నిశితంగా పరిశీలిస్తే దేశంలోని 12.5కోట్ల చిన్న, సన్నకారు రైతులకు అక్కరతీర్చే అంశాల ఊసేలేదు. ఓ.ఈ.సీ.డీ. ప్రకారం 2014-16 మధ్యలో మన దేశ రైతుల ఆదాయాలు 6శాతం పడిపోయాయి. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు దేశంలో 49శాతం అప్పుల్లో కూరుకుపోయారు. గత రెండేండ్లలో రైతులకు సరాసరిన ఆదాయం లేనేలేదు. 2017-18లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఒక్క శాతం మాత్రమే పెరిగాయి. అదే సందర్భంలో పంటల ఉత్పత్తి కారకాల ధరలు మాత్రం 4శాతం పెరిగాయి. ఇక 2018-19లో ఉత్పత్తి కారకాల ధరలు 5శాతం పెరిగాయి. ఇక 2018-19లో ఉత్పత్తి కారకాల ధరలు 5శాతం పెరిగితే వ్యవసాయ ఉత్పత్తుల ధరలలో అసలు పెరుగుదలే లేదు. మన రైతులు ఇప్పటికే మోదీ తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలు పెద్ద నోట్ల రద్దు, జీ.ఎస్.టీ., అమలుతో విలవిలలాడారు. మన పాలకులు అనుసరించిన సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం ఏయేటికాయేడు కునారిల్లుతున్నది. 1990లలో వ్యవసాయ రంగం 2.8%, 2001-10 మధ్య 2.4%, 2010-20 మధ్య 2.1%కు వ్యవసాయరంగ అభివృద్ధి దిగింది. ఇలాంటి పరిస్థితులలో మిన్ను విరిగి మీదపడిన చందంగా భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఆర్థిక మాంద్యంతో పెనుగులాడుతోంది. మరోవైపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2008 నాటి కన్న తీవ్రమైన ఆర్థిక సంక్షోభం పాలుకానున్నదని విశ్లేషకులు భవిష్యవాణి చెపుతున్నారు. ఇలాంటి విధానాలు అనుసరిస్తున్న ఫలితంగానే వ్యవసాయ సంక్షోభం తీవ్రమవుతుంది. సంక్షోభాలను సృష్టిస్తూ "సంక్షోభంలో ఉన్న అవతలి వారిని అణచివేసే అవకాశం వచ్చినప్పుడు ఎప్పుడూ విడిచిపెట్టకూడదు" అన్న బూర్జువా నీతినే రైతాంగం పట్లా పాలకులు అనుసరిస్తున్నారు.

దేశ వ్యాప్తంగా రైతులు గత కొంత కాలంగా తమ సమస్యలపై వీధుల్లోకి వస్తున్నారు. జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేస్తున్నారు. ఆ రైతాంగానికి సమాజంలోని అన్ని సెక్షన్ల ప్రజలు మద్దతును అందిస్తున్నారు. కానీ, రైతాంగ సమస్యలు చేపడుతున్న పార్లమెంటరీ ప్రతిపక్ష పార్టీలేవీ దేశంలోని 86% రైతుల సమస్యలలోకి వెళ్లడం లేదు. మన దేశంలో దళితులు, ఆదివాసులు భూదాహంతో పరితపిస్తున్న శ్రామిక వర్గాలు. పూలే, అంబేద్కర్‌లను కొలుస్తున్న వాళ్లెవరూ ఆయన దారిలో భూ పోరాటాలను చేపట్టడంలేదు. 2011-12నాటికి మన దేశంలో 90% రైతాంగం వద్ద 49.8% సాగు భూములుండగా పై 10% సంపన్నవర్గాల చేతిలో 50.2% సాగు భూమి ఉంది. అంతే కాదు. గ్రామీణ పేద ప్రజలలో 50% వారి చేతులలో కేవలం 0.4% సాగు భూమి ఉంది. మిగితా 50% ప్రజలకు భూమే లేదు. వీరిలో ముస్లిం రైతు సోదరుల పరిస్థితి మరింత దుర్భరంగానే ఉంది. వారు పట్టాలు పుట్టడం నుండి అప్పు పుట్టడంవరకూ అన్నిట్లో వివక్షకే గురవుతున్నారు. ఇలాంటి దేశంలో రైతు సమస్యలపై పోరాడుతున్న అనేక సంస్థల ప్రణాళికలలో దున్నేవారికే భూమి, రైతాంగానికి గిట్టుబాటు ధరలు, వ్యవసాయంపై ఆధారపడిన పరిశ్రమలు మొదలైన కార్యక్రమాల ఊసే ఉండదు. కానీ నిజానికి నేటి భారత రైతు కోరుకుంటున్నది అవే. అవి వ్యవసాయక విప్లవం ద్వారానే సిద్ధిస్తాయి. ★

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంకు నిర్ధేశిత ఆదేశాలను ఎల్‌పిజీ విధానాలను అమలు చేస్తూ సామ్రాజ్యవాదుల, బహుళ జాతి సంస్థలకు, దళారీలుగా వ్యవహరిస్తూ ఇక్కడి ఖనిజ సంపదలను ముడి సరుకులను కారుచౌకగా అప్పజెప్పుతున్నారు. ప్రభుత్వ రంగంలోని సంస్థలను నష్టాల పేరుతో ప్రైవేటీకరిస్తున్నారు.

సేవరంగాలైన విద్య, వైద్యం, సహకార బ్యాంకింగ్‌తో పాటు అన్నింటిని ప్రైవేటుపరం చేయడంతో వారి హక్కులు హరించి వేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలను మూసివేయడం, గురుకుల పాఠశాలల సంఖ్యను సరిపడే విధంగా నిర్మించకపోవడం ఉన్న వాటికి సరిపడా సరైన సౌకర్యాలు విద్యార్థులకు కల్పించకపోవడం చేస్తున్నారు. కేజి టు పీజి మాట ఎత్తకపోవడం, ఉన్న యూనివర్సిటీలను మూసివేసి ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులిస్తూ నిర్మించడం వల్ల విద్య ఖరీదుగా మారి పీడిత ప్రజలకు భారంగా మారి విద్యకు దూరం అవుతున్నారు. కామన్ విద్యా విధానాన్ని అమలు చేయడం లేదు.

ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేట్‌పరం చేసి కార్పోరేట్‌పరం చేసి కార్పోరేట్ ఆసుపత్రులకు పర్మిషన్లు ఇవ్వడంతో పేద ప్రజలు ఖర్చుతో కూడిన వైద్యాన్ని చేయించుకోలేక రోగాల బారినపడి చనిపోతున్నారు. ఈ వైద్యం పేదలకు అందని ద్రాక్షవంటిదే. వ్యవసాయ రంగాన్ని తగ్గించి కార్పోరేట్ ఉత్పత్తి విధానం అవలంభిస్తున్నారు. సామాన్య ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తిని చేయకుండా, వ్యాపార లావాదేవిలకై ఉత్పత్తిని కేంద్రీకరించి ఈ రంగాన్ని కార్పోరేట్ రంగంగా మార్చుతున్నారు. దీనితో చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులు కుదేలైపోతూ ఆత్మహత్యలే శరణ్యంగా మారాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని సమకూర్చి పెడుతూ కార్మికులకు ఉపాధినిస్తూ నడుస్తున్న ఎఫ్‌సిఐ, ఆజాంజాహి మిల్లు , కమలాపురం, నిజాం షుగర్ ఫ్యాక్టరీలను ప్రభుత్వం వారి దళారులకు లాభాలు రావడానికి నష్టాల పేరుతో మూసివేస్తూ, కార్మికులను తొలిగిస్తూ వారిని వీధిన పడవేస్తున్నారు.

ఆర్.టీ.సి ప్రభుత్వపర సంస్థను ప్రైవేటిపరం చేసే ఒప్పందాలతో మూసివేయ చూస్తున్నారు. ఆర్.టీ.సి, కార్మికుల పోరాట ఫలితంగా నిలిపి ఉంచారు. దీన్ని కాపాడుకోవలసిన బాధ్యత కార్మిక వర్గంపై ఉంది. ఐటి బ్యాంకులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలన్నింటిని ప్రైవేట్‌పరం చేసి చివరికి రాష్ట్రాన్ని బహుళ జాతి సంస్థలకు తాకట్టు పెట్టాయి. ఈ ప్రైవేటికణకు వ్యతిరేకంగా యావత్తూ తెలంగాణ ప్రజలంతా మరోసారి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలా ఐక్యంగా పోరాడి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం.

---

**49 పేజీ తరువాయి .....**

వినియోగించుకుని 'ఆత్మనిర్భర్ భారత్' పేరుతో లక్షల కోట్ల రూపాయల స్పెషల్ ప్యాకేజీల పేరుతో దేశ ఆర్థిక వ్యవస్థను మరింతగా సామ్రాజ్యవాద, వారి దళారీ కంపెనీల, భూస్వాముల దోపిడీకి, సూపర్ లాభాలకు మార్గం సుగమం చేస్తున్న పాలక బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు మోదీ ముఠా విధానాలను బహిర్గతం చేయాలి, వాటికి వ్యతిరేకంగా పోరాడాలి. ప్యాకేజీలో అసంఘటిత కార్మికుల, రైతుల, పేద, మధ్యతరగతి ప్రజలను తోడ్పడే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండు చేస్తూ ప్రజలను కదిలించాలి.

దేశంలో కోట్లాది మంది పేద, కూలీ, కార్మిక, వ్యవసాయ కూలీ, రైతుల కోసం తక్షణం సహాయ చర్యలు చేపట్టేందుకు అదనంగా తగినన్ని నిధులను కేటాయించాలి. రైతుల రుణాలు మాఫీ చేయాలి. కొత్త రుణాలు సమకూర్చి రైతులను తక్షణం ఆదుకోవాలి. యావత్తు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు షరతులు లేకుండా రుణాలు అందించి గతంలోని రుణాలపై వడ్డీ రాయితీ ఇవ్వాలి. జీఎస్‌టీని 50 శాతం రద్దు చేయాలి. తునికాకుపై జీఎస్‌టీ పూర్తిగా రద్దుచేయాలి.

5) కొరోనా మహమ్మారి పేరుతో ఉద్యోగుల జీతాలలో కోత పెట్టడాన్ని వ్యతిరేకించాలి. కొరోనా వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందిస్తున్న మెడికల్ సిబ్బందితో పాటు పారిశుధ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల ప్రాణ రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

6) విచారణలో ఉన్న ఖైదీలనందరిని కనీసం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకైనా తక్షణం విడుదల చేయాలి. ప్రజల జీవించే హక్కును గ్యారంటీ చేస్తూ 60 సంవత్సరాల వయసు పైబడిన వారందరినీ జైళ్ల నుండి బేషరతుగా విడుదల చేయాలి. అక్రమ కేసుల్లో జైలు పాలైనవారిని, రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలి.

7) కొరోనా వ్యాప్తి ప్రమాదం రీత్యా అడవులలో పోలీసులు గాలింపు చర్యలను వెంటనే నిలిపివేయాలని ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి. జల్ జంగిల్ జమీన్‌పై అధికారం కోసం పోరాడుతున్న గ్రామసభలన్నీ తమ అనుమతి లేకుండా అడవులలో కూంబింగులు, ప్రజలపై దాడులు చేసే పోలీసులను తరిమికొట్టాలి, ప్రజల ముందు విచారించాలి.

8) కొరోనా మహమ్మారితో ఏర్పడిన విపత్కర పరిస్థితులలో దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, భూస్వాములతో సహా సంపన్నులందరిపై సంపద పన్నును పునరుద్ధరించాలి. కార్పొరేట్లకు ఇచ్చే అన్ని రకాల సబ్సిడీలు, రాయితీలు, పన్ను మినహాయింపులు రద్దుచేయాలి.

9) ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించే పేరుతో కార్మికులను, ఉద్యోగులను రిట్రెంచ్ చేయడాన్ని, వారితో 12 గంటలు పని చేయించడాన్ని అనుమతించకూడదు. కార్మిక చట్టాల రద్దుకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడాలి. ఉపాధి హక్కు కోసం, సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడాలి.

# జడలు విప్పిన హిందూత్వ ఫాసిజం

భారతదేశంలో మోడీ నాయకత్వంలోని బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లీం, దళిత మత మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగాయి. హిందుత్వ శక్తులు ఆర్ఎస్ఎస్ ఎజెండాను బలంగా ముందుకు తెస్తున్నారు. బీజేపి, ఆర్ఎస్ఎస్ నాయకులు హిందుత్వ రాజ్యం గురించి మాట్లాడడం పెరుగుతున్నది. ఉత్తర్ ప్రదేశ్, కశ్మీర్‌లలో ఆజ్యం పోస్తున్న వరస హింసను అనేక రాష్ట్రాలలో రెచ్చగొడుతున్నారు. ఈ కాలంలో 1000కి పైగా మత కలహాల దాడులకు పాల్పడ్డారు. బలవంతంగా హిందూ భాషను రుద్దుతూ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని ప్రోత్సహిస్తున్నారు. క్రైస్తవ, ముస్లీం, దళిత, మహిళల, పీడిత సెక్షన్లను అన్ని రూపాలలో అణచివేస్తున్నారు. హిందుత్వ ఏజెండాకు అనుగుణంగా మైనార్టీలపై బ్రాహ్మణవాద హిందూత్వ ఫాసిజాన్ని అమలు చేస్తూ విద్యను కషాయికరణ గావిస్తూ భగవత్‌గీతను జాతీయగ్రంథంగా ముందుకు తేవడానికి కుట్ర చేస్తున్నారు.

మోడి నాయకత్వంలోని బీజేపి ప్రభుత్వం తన నిరంకుశ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసుకుంటున్నది. నయా భారత్, స్వచ్ఛ భారత్ పేరుతో దేశంలో హిందుత్వ పాసిస్టు రాజ్యాన్ని స్థాపించే లక్ష్యంతో దీర్ఘకాలిక ప్రణాళికతో ముస్లిం, దళిత, మైనార్టీ మతాలు, ఆదివాసులు, పీడిత జాతులు, మహిళలపై ఫాసిస్టు దాడులు కొనసాగిస్తున్నది. తమ పథకంలో భాగంగానే జమ్మూ-కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్స్ 370, 35ఏ లను రద్దు చేసింది. బాబ్రీమసీదు- రామజన్మభూమి వివాద తీర్పును సుప్రీంకోర్టు ద్వారా హిందువులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. పౌరసత్వ సవరణ బిల్లు చట్టాన్ని ఆమోదించింది. ఇలా బిజేపి ప్రభుత్వం తనకున్నా సంఖ్యబలంతో దేశంలో ఏదైనా చేయగలమన్న ధీమాతో పటేల్ ప్రాజెక్టును పూర్తి చేసి రాజకీయ ప్రయోజనం పొందే పనిలో నిమగ్నమైంది.

మావోయిస్టు ఉనికి, దేశ అంతర్గత భద్రతకు, నయా భారత్‌కు, స్వచ్ఛ భారత్‌కు వ్యతిరేకమైనదని డిల్లీ, పూణా మీటింగ్‌లలో అమిత్‌షా, ప్రధాని మోడీలు ప్రకటించారు. మావోయిస్టుల నిర్మూలన లక్ష్యంతో దాడులు కొనసాగిస్తున్నారు. జైశీరామ్, భారత్ మాతాకీజై అనమంటూ మూకదాడులు చేస్తున్నారు. గోరక్షణ పేరుతో, కులం పేరుతో, అవమానించడం, కొట్టి చంపడం, హత్యలు, సజీవ దహనం చేస్తున్నారు. ఆర్బన్ మావోయిస్టుల పేరుతో ప్రజాస్వామికవాదులను జైళ్ళలో బంధిస్తున్నారు. ఇలా దేశంలో రోజురోజుకు హిందూత్వ ఫాసిజం అత్యంత ప్రమాదకరంగా మారుతున్నది.

బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం మహమ్మారిలా దేశమంతా విస్తరించక ముందే అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా పోరాడుతూ బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజాన్ని ఓడిద్దాం. ★

---

**58వ పేజీ తరువాయి .....**

ఒక పద్మ మీద నమోదయి ఉన్న ఎఫ్ఐఆర్‌ను ఈ పద్మ మీద చూపుతున్నాడు. వయస్సు, తల్లిదండ్రుల పేర్లు ఏవీ కుదరవు. కాని అడిగేవాళ్లు ఎవరు?

ఛత్తీస్‌ఘడ్‌లో ప్రాసిక్యూషన్ ఏది చెపితే అదే కోర్టు కూడా వింటుంది అనడానికి ఏడుగురు తెలంగాణ ప్రజాస్వామిక నాయకత్వం అరెస్టు, ఉన్నత న్యాయస్థానం దాకా బెయిల్ నిరాకరణ, మెజిస్ట్రేట్ హడావుడిగా ప్రారంభిస్తున్న నేరవిచారణతో మనకెంతో సన్నిహితంగా అర్థమవుతూనే ఉంది కదా.

మధ్యతరగతి నుంచో, దిగువ మధ్యతరగతి నుంచో కొంత చదువు, కొంత జీవించగలిగే స్థితి, సమాజంలో నలుగురిలో గుర్తింపు, ఒక చిరునామా ఉన్న ఇటువంటి వాళ్ల విషయంలోనే ఇవాళ రాజ్యం ఇంత అమానుషంగా ప్రవర్తిస్తున్నదంటే ఆదివాసులు, ముస్లీంలు, దళితులు, మహిళలు, భూమిహీనులు, ఏ ఆస్తులు లేని వాళ్లు, రెక్కల కష్టం మాత్రమే మిగిలిన వాళ్లు, ఎందరో అభాగ్యులు ఈ దేశంలో ఎన్ని ఎన్‌కౌంటర్లకు గురవుతున్నారో? ఎన్ని అసహజ మరణాలకు గురవుతున్నారో? వేల లక్షల సంఖ్యలో జైళ్లలో ఎన్నాళ్లుగా మగ్గుతున్నారో? మన చుట్టూ వుండే అనుభవాలే మనకు కొంత ఎరుకనైనా కలిగించడం లేదా?

రాస్తున్నంత సేపూ నాభయం సందేహాలు ఏమిటంటే చైతన్య మహిళా సంఘం పది మంది నాయకత్వాన్ని మవోయిస్టులని రుజువు చేయడానికి పోస్టర్లు వేసినట్లుగా ఇప్పుడు వాటికి పద్మ ఫోటో కూడా జోడిస్తారేమోనని!

అంతకన్నా తన కష్టాల నుంచి, నిరీక్షణ నుంచి విముక్తమైన ఆ తల్లి గురించి కాదు, థైరాయిడ్‌తో, అనారోగ్యంతో జైలే చిరునామాగా మారిన పద్మ గురించీ కాదు. ఆ తల్లి వదిలి వెళ్లిన ఆ మానసికంగా ఎదగని మధ్యవయస్కురాలైన కూతురు శేషజీవితానికి ఆలనా, పాలనా ఏమిటి?

తన చైతన్యంతో పద్మ ఒక జీవితాన్ని ఎంచుకుంది. న్యాయమో, అన్యాయమో ఈ దోపిడి వ్యవస్థ వేసే సవాళ్లను, శిక్షలను ఆమె స్వీకరించాలి. స్వీకరిస్తుంది. ఆమె రాజకీయాలను, ఆమె విశ్వాసాలను ప్రేమించే వాళ్లు, గౌరవించే వాళ్లు ఆమెకు అండగా ఉన్నారు. ఉంటారని ఆశిద్దాం.

మరి ఆ తల్లి మరణానికి, ఆ అక్క జీవితానికి ఈ సమాజం బాధ్యత పడవద్దా?!

ఇంతకూ ఆ తల్లి పేరేమిటి?

నాకు తెలుసు, మనకు తెలుసు కనుక నేను పద్మ పేరు రాసాను కాని, జగదల్‌పూర్ జైలులో ఆమెను మావోయిస్టు ఖైదీ నెంబర్ ఫలానా అని చెపితే తప్ప జైలు అధికారులకు తెలియదు. వాళ్లు పిలవరు.

1084 మృతదేహం తల్లి పేరేమిటి?! ★

# ఉపరితల గనులకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం
# సమరశీల పోరాటాల ద్వారా సింగరేణిని రక్షించుకుందాం.

కేంద్రంలో నరేంద్ర మోడి నాయకత్వంలోని బీజేపి ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు కోల్ ఇండియాను ప్రైవేట్‌పరం చేయడానికి సిద్ధపడింది. బహుళజాతి సంస్థలకు కోల్ ఇండియాను అమ్మడంలో భాగంగా 214 బొగ్గు గనులను ప్రైవేటీకరించడానికి ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. కోల్ ఇండియాను ప్రైవేటీకరించడానికి పార్లమెంట్‌లో, రాజ్య సభలో ఆర్డినెన్స్ ఆమోదం పొందకపోయినప్పటికీ ఆఘమేఘాల మీద కార్పోరేట్ శక్తుల మెప్పు కొరకు రాష్ట్రపతితో ఆమోద ముద్ర వేయించుకున్నాడు.

కేంద్రంలో, రాష్ట్రంలో **"నూతన పారిశ్రామిక విధానాలు"** అమలు చేస్తూ పారిశ్రామిక వేత్తలకు అనేక రాయితీలు కల్పిస్తూ, కార్మికుల జీవితాలను మాత్రం అధోగతి పాలు జేస్తున్నారు.

తెలంగాణలో ఓపన్ కాస్టులను రద్దు చేస్తానని అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్ధానాన్ని తుంగలో తొక్కి ఓపన్‌కాస్టు త్రవ్వకాల కొరకు అనుమతులు మంజూరు చేశారు. భారీ యాంత్రాలతో ఓపెన్‌కాస్టులు ఏర్పడుతుండడంతో లక్షలాది కార్మికులు వీదిన పడుతున్నారు. అడవులు, గ్రామాలు, పంట భూములు విధ్వంసం అవుతున్నాయి. తెలంగాణలో ఇప్పటికే మంచిర్యాల జిల్లాలో బెల్లంపల్లి, మందమర్రి, శ్రావణపల్లి, ఇందారం, దుబ్బపల్లె, ఎర్రగుంటపల్లె, శ్రీరాంపూర్, పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని, తాడిచెర్ల, ఫైఇంక్లైన్ భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి పట్టణం ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూర్, ఇల్లెందు, కోయగూడెం, కొత్తగూడెం, రుద్రంపూర్, వెంకటేశ్వర కాలనీ, 7ఇంక్లైన్ ఓపెన్‌కాస్ట్‌లతో అనేక మంది ప్రజలు వీదిన పడ్డారు. ఇవే కాక కొత్తగా 18 ఓపెన్‌కాస్టులకు అనుమతులు ఇచ్చారు.

కార్మికులను తగ్గించడానికి సింగరేణి యాజమాన్యం కుట్రపూరితంగా 190 మస్టర్లు నిండలేదని, మెడికల్ అన్ ఫిట్ అనే పేరుతో అనేక మంది కార్మికులను ఉద్యోగాల నుండి డిస్మిస్ చేసింది. ఆధునిక యంత్రాలను వినియోగిస్తూ 1 లక్ష 20 వేలమంది వున్న సింగరేణి కార్మికులను 60వేలకు కుదించారు. ఓపెన్‌కాస్ట్ బావులకు అనుమతులు ఇస్తూ అండర్ గ్రౌండ్ బావులను మూసివేస్తున్నారు. ఓపెన్‌కాస్ట్‌లతో కార్మికుల సంఖ్య తగ్గిపోవడమే కాకుండా పర్యావరణం కూడా దెబ్బ తింటుంది. ప్రజా వ్యతిరేక ఓపెన్‌కాస్ట్ బావులను రద్దు చేయాలని, అండర్‌గ్రౌండ్ బావులను కొనసాగిస్తూ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ, రిటైరుమెంట్, వాలంటరీ రిటైరుమెంట్ కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఎంప్లాయ్‌మెంట్‌ను పునరుద్ధరించాలని పోరాడుతున్న యువతపై పోలీసులతో దాడులు చేపిస్తూ అణచిపెట్టాలని చూస్తున్నది.

సిరులు కురిపిస్తూ వెలుగులు విరజిమ్ముతూ విశిష్ట లక్షణాలతో తనదైన ముద్ర వేస్తూ విరజిల్లుతున్న సింగరేణిని పాలక వర్గాలు, సింగరేణి యజమాన్యం అధిక లాభాల కోసం అధునాతనమైన యంత్రాలను ప్రవేశపెట్టి ఓపన్‌కాస్టులతో సింగరేణి ప్రాంతాన్ని బొందల గడ్డగా మార్చివేసి కార్మికులను తగ్గించి కార్మిక పిల్లలను నిరుద్యోగులుగా మార్చి పబ్బం గడుపుకుంటున్నారు. పోరాడే యువతపై ఉక్కుపాదం మోపుతున్నారు.

దోపిడి పాలక వర్గాల, సింగరేణి యజమాన్యాల దురాశకు తెలంగాణకు తలమాణికంగా వున్న సింగరేణి కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నది. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది. యావత్తు తెలంగాణ ప్రజలందరూ పోరాడుతున్న సింగరేణి ప్రాంత ప్రజలకు అండగా ఉంటూ దోపిడి పాలక వర్గాల నడ్డివిరిచి సింగరేణి యజమాన్యం మెడలు వంచి సమరశీల పోరాటాల ద్వారా సింగరేణిని కాపాడుకుందాం.

---

**జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా జరుపుకుందాం.**

**అమర వీరులకు జోహార్లు అర్పిస్తూ వారి ఆశయ సాధనలో నడుద్దాం.**

**నూతన ప్రజాస్వామిక విప్లవమే అశేష పీడిత ప్రజల విముక్తికి మార్గమని ఎలుగెత్తి చాటుదాం.**

సిద్ధాంత వ్యాసం

# పార్టీ చేయవలసిన మూడు, చేయకూడని మూడు సూత్రాలు

'మార్క్సిజాన్ని ఆచరించండి, రివిజనిజాన్ని కాదు, ఐక్యం కండి, చీలిపోవద్దు, బహిరంగంగా ఉండండి, కుట్రలు కుహకాలకు పాల్పడవద్దు' అని పార్టీ నిబంధనావళి పేర్కొంది. ఏం చేయాలో ఏం చేయవద్దో అన్న దాని గురించిన మూడు సూత్రాలు, మన పార్టీలో రెండు పంథాలకు సంబంధించి మన గొప్ప నాయకుడు చైర్మన్ మావో చారిత్రక అనుభవ విశేష సంశ్లేషణ. సరైన పంథాకు కానీ సరి కానీ పంథాకు మధ్య తేడా చూసే నియమం ఇందులో ఉంది. పార్టీ సభ్యులు గౌరవించవలసిన మూడు మౌలిక సూత్రాలు ఇవి. పార్టీ సభ్యులలో ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ ఈ మూడు సూత్రాలను దృష్టిలో ఉంచుకోవాలి. పార్టీలో చురుకుగా సరైన పద్ధతిలో రెండు పంథాల మధ్య పోరాటం చేసేందుకు వీటికి కట్టుబడి ఉండాలి.

**మార్క్సిజాన్ని ఆచరించండి, రివిజనిజం కాదు**

చైర్మన్ మావో ఏం చేయాలో ఏం వద్దో అన్న దాని గురించి రూపొందించిన ఈ మూడు సూత్రాలలో అన్నింటికంటే మౌలికమైనది 'మార్క్సిజాన్ని' ఆచరించండి, రివిజనిజం కాదు అన్నదే. మార్క్సిజాన్ని ఆచరించే వ్యక్తి, చైనాలోని, ప్రపంచంలోని అత్యధిక ప్రజల ప్రయోజనాలను మనస్ఫూర్తిగా నెరవేర్చే వ్యక్తి, ఐక్యత కోసం పని చేస్తారు. బహిరంగంగా ఉంటారు. రివిజనిజాన్ని ఆచరించే వ్యక్తులు అల్పసంఖ్యగా ఉన్న దోపిడి వర్గాలకు సేవ చేస్తారు. అనివార్యంగా చీలికల కోసం పని చేస్తారు. కుట్రకు కుహకాలకు పాల్పడతారు.

చైర్మన్ మావో ప్రాతినిధ్యం వహించే మార్క్సిస్టు లెనినిస్టు పంథాకు వివిధ అవకాశవాద పంథాలకు మధ్య మన పార్టీలో యాభై సంవత్సరాలుగా జరిగిన పోరాటాలన్నీ అంతిమ విశ్లేషణలో మార్క్సిజాన్ని ఆచరించాలా లేక రివిజనిజాన్నా అన్న సమస్య గురించే. కార్మికవర్గ విప్లవ భవిష్యత్తు, కార్మికవర్గ రాజకీయ పార్టీ, కార్మికవర్గ నియంతృత్వ రాజ్య లక్ష్యాలకు సంబంధించి ఇది ఒక ముఖ్యమైన ప్రశ్న. అందుకే 'మార్క్సిజాన్ని ఆచరించండి, రివిజనిజాన్ని కాదు' అన్న సూత్రం కార్మికవర్గ రాజకీయ పార్టీ నిర్మాణానికి అవసరం – మనం కట్టుబడి ఉండవలసిన రాజకీయ దృక్పథం ఇందులో ఉంటుంది. మన పార్టీ, రాజ్యం ఎన్నడూ వాటి స్వభావం మార్చుకోవన్న హామీ ఉంటుంది.

మార్క్సిజం, రివిజనిజం రెండూ పరస్పర విరుద్ధ భావాజాల వ్యవస్థలు. మార్క్సిజం కార్మికవర్గ భావాజాల వ్యవస్థ. ప్రపంచాన్ని అర్థం చేసుకుని సరైన పద్ధతిలో మార్చేందుకు సమస్త విప్లవకారుల చేతులలో ఇది ఒక శక్తివంతమైన ఆయుధం. మార్క్సిజంలో కార్మికవర్గం, ఇతర శ్రామిక ప్రజల మౌలిక ప్రయోజనాలు ఉన్నాయి. యావత్తు ప్రపంచ కార్మికవర్గానికీ ఇతర శ్రామిక ప్రజలకూ విముక్తి సాధించే మార్గాన్ని చూపిస్తుంది. బూర్జువా వర్గాన్నీ ఇతర సమస్త దోపిడి వర్గాలనూ కూలదోసేందుకు, అంతిమంగా కమ్యూనిజం సాధన కోసం విరోచితంగా పోరాటం చేయడానికీ మార్గదర్శకంగా ఉంటుంది. రివిజనిజం – లేదా మితవాద అవకాశవాదం – అంతర్జాతీయ బూర్జువా భావాజాల ఆలోచన ధోరణి. చైర్మన్ మావో ఇలా పేర్కొన్నాడు – 'మార్క్సిజం మౌలిక సూత్రాలను వ్యతిరేకించడం, విశ్వజనీన సత్యాన్ని వ్యతిరేకించడం రివిజనిజం' సోషలిజానికీ పెట్టుబడిదారి విధానానికి మధ్యనూ కార్మికవర్గ నియంతృత్వానికీ బూర్జువా వర్గ నియంతృత్వానికీ మధ్య విభేదాలు మాయమయిపోయాయని రివిజనిస్టులు అంటారు. విప్లవ పతాకాన్ని ఎగురవేసి తమ్ము తాము మార్క్సిజం లెనినిజం ముసుగుతో కప్పుకుంటారు. మార్క్సిస్టు మౌలిక సూత్రాల సారాన్ని పీల్చివేస్తారు. ముందుగా బూర్జువా వర్గానికి ఆమోదనీయమైనదాన్ని పెంపొందించి దాని అవసరాలు తీరుస్తారు. రివిజనిస్టులు అప్పుడప్పుడు అవలంబించే కుట్రలే ఇవి. కార్మికవర్గ నియంతృత్వంలో రివిజనిస్టులు మరింత ఘోరంగా ప్రవర్తిస్తారు. మరింత తెలివిగా ముసుగులు వేసుకుంటారు. తప్పుడు పుకార్లు, అభిప్రాయాలు వ్యాపింపచేసి, ప్రజలకూ విప్లవానికీ హాని చేస్తారు.

భౌతికంగా అవకాశవాదులు 'బూర్జువా వర్గంలో ఒక భాగం. దాని ప్రభావాన్ని ప్రచారం చేసేవాళ్లు, కార్మిక ఉద్యమంలో దాని ఏజెంటులు' అని లెనిన్ పేర్కొన్నాడు. అవకాశవాద శక్తులు బూర్జువా వర్గం, అలాగే సామ్రాజ్యవాదం, రివిజనిజం, ప్రతీఘాతుకతా వక్రీకరించిన సాధనాలు. కార్మికవర్గ పార్టీలో వారి ప్రతినిధులు. అంతర్గతంగానూ బయటనూ మన శత్రువులందరికీ కోటను లోపలి నుంచి స్వాధీనం చేసుకోవడం తేలికని తెలుసు. భూస్వాములూ పెట్టుబడిదారులూ తమంతట తాము చేయవలసిన కార్మికవర్గ నియంతృత్వ కూల్చివేతను, విప్లవానికి మోసాన్నీ పార్టీలోకి చొచ్చుకువచ్చిన రివిజనిస్టు శక్తులు చేయడం వారికి తేలిక. పైగా ఇప్పుడు భూస్వాములనూ పెట్టుబడిదారులనూ చాలా తక్కువగా చూస్తున్నారు. సోషలిస్టు దేశంలో పార్టీలోనూ రాజ్యంలోనూ రివిజనిస్టులు అధికారంలోకి రావడంలో విజయవంతం అయితే చరిత్ర వెనక్కి వెళుతుంది. దేశం రంగు మారుతుంది. కార్మికవర్గం, ఇతర శ్రామిక ప్రజలూ మరోసారి వేదనకు గురి అవుతారు. సోవియట్ యూనియన్‌లో లెనిన్ స్థాపించిన మొట్టమొదటి కార్మికవర్గ నియంతృత్వ రాజ్యాన్ని కృశ్చేవ్, బ్రెజ్నేవ్ ముఠా పార్టీలోనూ ప్రభుత్వంలోనూ అధికారం గుంజుకుని రంగం మీదకు వచ్చాక, సోషల్ సామ్రాజ్యవాద దేశంగా మార్చివేసారు. మన దేశంలో కెరీరిస్టులు, కుట్రదారుల, ద్వంద్వ వ్యవహారకర్తలూ (డబుల్ డీలర్స్) పశ్చాత్తాపం లేని పెట్టుబడిదారీ మార్గీయులూ – లీ షావ్ చీ, లిన్ పియావోలు – వాళ్ల పరిస్థితులు వేరుగా వున్నప్పటికీ ఒకే స్వభావం కలిగి ఉన్నారు – అది సైద్ధాంతిక రంగమైనా రాజకీయ రంగాలైనా రోజువారీ జీవితాలైనా పై నుంచి కింది వరకూ బూర్జువీకరణ చెంది ఉన్నాయి. పూర్తిగా కుళ్లిపోయి ఉన్నారు ! చైర్మన్ మావో అలా అన్నాడు – 'రివిజనిజం అధికారంలోకి

రావడం అంటే బూర్జువా వర్గ అధికారం పైకి రావడమే'. ఇది పూర్తిగా నిజం.

రివిజనిజాన్ని కాక మార్క్సిజాన్ని ఆచరించడం – సరైన పంథా, సరి కాని పంథా తేల్చడానికి ఇది ప్రధాన కొలమానం. మార్క్సిజాన్ని ఆచరించడం అంటే కార్మికవర్గ సూత్రాలకు కట్టుబడి ఉండడం. గతితార్కిక చారిత్రక భౌతికవాద ప్రాపంచిక దృక్పథం ప్రకారం సామాజిక అభివృద్ధి భౌతిక నియమాలను గ్రహించడం. సరైన రాజకీయ పంథానూ సూత్రాలను వివరించడం కోసం, విప్లవాన్ని విజయవంతం చేసేందుకు కార్మికవర్గానికీ విశాల ప్రజానీకానికీ నాయకత్వం వహించడం కోసం, ప్రతీ చారిత్రక కాలంలోనూ వర్గాల మధ్య సంబంధాలను శాస్త్రీయంగా విశ్లేషించడం. రివిజనిస్టు ముఖ్యులు దోపిడి వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. భావవాద, పిడివాద ప్రాపంచిక దృక్పథంతో వాళ్లు తప్పుడు పంథాను అమలు చేస్తారు. కార్మికవర్గ విప్లవ ఆశయానికి తూట్లు పొడవాలని చూస్తారు. ఇలా మార్క్సిజాన్ని ఆచరించేవాళ్లూ, రివిజనిజాన్ని ఆచరించేవాళ్లకు పరస్పర విరుద్ధ వర్గ ప్రయోజనాలు, ప్రాపంచిక దృక్పథాలు ఉంటాయి. సహజంగానే ఈ ఇద్దరూ పూర్తిగా భిన్నమైన పంథాలలో ఉంటారు. ఈ పంథాలు విప్లవంలో పూర్తిగా భిన్నమైన ఫలితాలు ఇస్తాయి.

యావత్తు సోషలిజం చారిత్రక కాలానికీ మన పార్టీ కోసం చైర్మన్ మావో ముందుకు తీసుకువచ్చిన మౌలిక పంథాలో ముఖ్యమైన అంశం ఏమంటే, కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేసి, పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించి, సోషలిస్టు విప్లవాన్ని చివరి వరకూ కొనసాగించడం అవసరం. ఈ పంథా కార్మికవర్గ మౌలిక ప్రయోజనాలకూ సమస్త శ్రామిక ప్రజల మౌలిక ప్రయోజనాలకూ ప్రాతినిధ్యం వహిస్తుంది. మనిషి యిష్టాయిష్టాలతో సంబంధం లేని సామాజికాభివృద్ధి నియమాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. మనం పార్టీ మౌలిక పంథాకు కట్టుబడి వుంటే, మన పార్టీనీ రాజ్యాన్నీ నిరంతరం సోషలిస్టు మార్గం దిశగా కదిలించడ సాధ్యం అవుతుంది. ఈ పంథా నుంచి పక్కకు వస్తే, తప్పుడు మార్గం, అంటే పెట్టుబడిదారీ మార్గాన్ని చేపట్టే ప్రమాదం ఉంటుంది. ఈ కారణం వల్లనే సోషలిజం కాలంలో, పార్టీ మౌలిక పంథాను ఎత్తిపడుతున్నామా లేక మారుస్తున్నామా అన్నదే మార్క్సిజానికీ రివిజనిజానికీ తేడా చూసే కొలమానంగా ఉంటుంది. లిన్ పియావో, అతని ముఠా, ఇప్పటికే దేశం నుంచీ కూలదోసి పెట్టుబడిదారులకూ భూస్వాములకూ, అలాగే దేశం వెలుపల సామ్రాజ్యవాదం, రివిజనిజం, ప్రతీఘాతుకతలకు ఏజెంటులు. ఈ ప్రతీఘాతుక వర్గాల ప్రయోజనాలు కోరికలకు ప్రాతినిధ్యం వహిస్తూ వాళ్లు విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టు పంథాను అమలు చేస్తారు. విప్లవ ప్రతీఘాతుక తిరుగుబాటు కుట్ర పన్నారు. పార్టీ, రాజ్యం ఉన్నత స్థాయిలలో అధికారాన్ని గుంజుకుని, పార్టీ మౌలిక పంథానూ రాజకీయ సూత్రాలనూ పూర్తిగా మార్చివేసి, కార్మికవర్గ నియంతృత్వాన్ని కూలదోసి, పెట్టుబడిదారీ పునరుద్ధరణ చేయాలన్నది వారి నేరపూరిత లక్ష్యం. పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటంలో మౌలిక విభేదం ఏమంటే, ఒక పక్షానికి కార్మికవర్గం, మరో పక్షానికి బూర్జువా వర్గం ప్రాతినిధ్యం వహిస్తుంది. ఒక పక్షానికి సోషలిజం కావాలి, మరోదానికి పెట్టుబడిదారీ పునరుద్ధరణ కావాలి. స్థూలంగా చెప్పాలంటే ఒక పక్షం మార్క్సిజాన్ని ఆచరిస్తే, మరొకటి రివిజనిజాన్ని ఆచరిస్తుంది. పార్టీలో పోరాటాలు సమాజంలో వర్గ పోరాటాల ప్రతిబింబమే అని మార్క్సిజం అంటుంది. వర్గ పోరాటం గురించి మార్క్సిస్టు దృష్టి నుంచి వర్గ విశ్లేషణ పద్ధతిని వినియోగించుకుని పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటాన్ని చూడాలి. సమాజంలో వర్గ పోరాటాలు ఉన్నంత వరకూ పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటం ఆగదు. పార్టీలో రివిజనిస్టు శక్తులకు వ్యతిరేకంగా మన పోరాటాన్ని ఎప్పుడైనా వర్గ దృష్టి నుంచే చూడాలి. రివిజనిజాన్ని ఆచరించే తమ నేరపూరిత లక్ష్యాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం, లిన్ పియావో, అతని ముఠా పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటానికి ఉన్న వర్గ స్వభావాన్ని వక్రీకరించడానికి ప్రతీ అవకాశాన్నీ వినియోగించుకున్నారు. 'ఉన్నత కింది స్థాయిల' మధ్య వైరుధ్యాలు అని 'ఈ శక్తులకూ ఆ శక్తులకూ' మధ్య వైరుధ్యాలు అనీ చెప్పారు. పార్టీలో పోరాటాన్ని వ్యక్తిగత అధికార పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేసారు. ఇదంతా పూర్తిగా తప్పు, విషపూరితం.

కార్మికవర్గానికీ బూర్జువా వర్గానికీ మధ్య మార్క్సిజానికీ రివిజనిజానికీ మధ్య పోరాటంలో రాజీ ఉండరాదు. కమ్యూనిస్టులంగా మనం గతితార్కిక భౌతికవాదులం. వర్గాలు ఉన్నచోట వర్గ పోరాటం సామాజికాభివృద్ధికి చోదక శక్తిగా ఉంటుందని నమ్ముతాం. కార్మికవర్గ అభివృద్ధి కూడా అంతర్గత పోరాటాల ద్వారా నడుస్తుందంటాం. అందుకనే మనం వర్గ పోరాటం, రెండు పంథాల మధ్య పోరాటపు భౌతిక ఉనికిని గుర్తించడం మాత్రమే కాక ఆ క్రమం అభివృద్ధిని కూడా అనుసరించాలి. ఈ పోరాటాలు చురుకుగా చేపట్టడం ద్వారా దానికి దిశ కల్పించాలి. వర్గ శత్రువుల మీద చొరవగా దాడి చేయాలి. రివిజనిజాన్ని విమర్శించాలి. బూర్జువా వ్యక్తివాదులు, కెరీరిస్టులు, కుట్రదారులూ పార్టీలో, రాజ్యంలో ఏ స్థాయిలోనూ నాయకత్వంలోకి రాకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. మనం అలుపెరగకుండా, నిరంతరం విప్లవ విమర్శ చేయాలి. రాజకీయ సైద్ధాంతిక, భావాజాల రంగాలలో రివిజనిస్టులు తీసుకువచ్చే తప్పుడు అభిప్రాయాలను చీల్చి చూడాలి. వారి విషపూరిత ప్రభావాన్ని నీరు కార్చాలి. అప్పుడు మన పార్టీ, రాజ్యం నిరంతరం చైర్మన్ మావో విప్లవ పంథాకు అనుగుణంగా ముందుకు సాగుతుంది.

### ఐక్యం కండి, చీలిపోవద్దు

పార్టీ ఐక్యతను పరీక్షించడం కార్మికవర్గ విప్లవ విజయానికి అమూల్యమైన సంపద. చైర్మన్ మావో ఈ విషయంలో రెండు అంశాలను పేర్కొన్నాడు – 'ఒకటి పార్టీలో అంతర్గత ఐక్యత, రెండోది పార్టీ, ప్రజల ఐక్యత. కష్టాలను ఎదుర్కోవడానికి ఈ రెండు అతి విలువయిన ఆయుధాలు. పార్టీ కామ్రేడ్స్ అందరూ వాటిని అలవరచుకోవాలి'. దోపిడీ వర్గాలను నిర్మూలించి, కమ్యూనిజం సాధించడం అనే వారి మహత్తర చారిత్రక కార్యక్రమంలో కార్మికవర్గానికీ

సమస్త శ్రామిక ప్రజలకూ నాయకత్వం వహించడంలో కార్మికవర్గ రాజకీయ పార్టీ సరైన రాజకీయ పంథా మీదనూ అలాగే తనకంటూ ఒక నిర్మాణం మీదనూ ఆధారపడాలి. ఐక్య పార్టీ మాత్రమే విశాల ప్రజానీకాన్ని ఐక్యం చేసి ఒక పెద్ద, శక్తివంతమైన విప్లవ సైన్యాన్ని ఏర్పాటు చేయగలుగుతుంది. పార్టీ లోపలా బయటా తన శత్రువుల మీద విజయం సాధించగలుగుతుంది. విప్లవ పోరాటంలో విజయం సాధించగలుగుతుంది. విప్లవ ఐక్యత లేకుండా విప్లవ విజయం లేదు. విప్లవ ఐక్యతా విప్లవ విజయం ఎల్లప్పుడూ సన్నిహితంగా ముడిపడి వుంటాయి. అందుకనే కార్మికవర్గం దాని రాజకీయ పార్టీ ఎల్లప్పుడూ పార్టీ ఐక్యతను నిరంతరం పటిష్టం చేయడాన్ని విప్లవ విజయానికి నిర్మాణానికి ఒక అవసరమైన పరిస్థితిగా పరిగణిస్తాయి. విప్లవ ఐక్యతను పరీక్షించడం తమ పోరాట నినాదం చేసుకున్నాయి. అంతర్జాతీయ గీతం చెప్పినట్టుగా 'ప్రతీ ఒక్కరూ వారి స్థానంలో వుంటే ఇంటర్నేషనల్ మానవ జాతి అవుతుంది.

పార్టీ ఐక్యతను నిలబెట్టడం అంటే సరైన పంథా అమలుకు హామీ ఇవ్వడమే. చైనా కమ్యూనిస్టు పార్టీ యావత్తు చైనా ప్రజల నాయకత్వ కేంద్రం. పార్టీ ఐక్యంగా ఉంటేనే దానికి ఒకే సిద్ధాంతం, పట్టుదల, కార్యాచరణకు ఒకే ఏక దిశా ఉంటాయి. సరైన రాజకీయ సూత్రాలను పూర్తిగా అమలు చేయగలుగుతాం. విప్లవ పోరాట కఠిన సంవత్సరాల కాలంలో మన పార్టీ చైర్మన్ మావో దూర దృష్టి కలిగి, నాయకత్వంలో తన ఐక్యత మీదనూ, పార్టీ, ప్రజల మధ్య ఐక్యత మీదనూ ఆధారపడి, నూతన ప్రజాస్వామ్య సాధారణ పంథా అమలుకు హామీ ఇవ్వగలిగింది. ముగ్గురు ప్రధాన శత్రువులను ఓడించగలిగింది. కార్మికవర్గ నియంతృత్వ రాజ్యాన్ని నెలకొల్పగలిగింది. విముక్తి తరువాత మన పార్టీ ఇదే రకంగా యావత్తు సోషలిజం చారిత్రక కాలానికీ మౌలిక పంథాను అమలు చేయగలిగింది. అంతర్గత, బయటి వర్గ శత్రువులు పదే పదే చేసిన దాడులను ఓడించింది. సోషలిస్టు విప్లవంలోనూ నిర్మాణంలోనూ పెద్ద విజయాలు సాధించింది.

ఐక్యత కోసం పని చేయడం, లేదా చీలికలు తీసుకురావడం – సరైన పంథాకూ సరి కాని దానికి మధ్య తేడా చూడడానికి ఇదే ముఖ్యమైన కొలమానం. మనం ఐక్యత గురించి మాట్లాడుతున్నామంటే, సూత్రబద్ధమైన ఐక్యత అని అర్థం. చైర్మన్ మావో నేతృత్వంలో ఉన్న పార్టీ కేంద్ర కమిటీ నాయకత్వంలో ఉన్న ఐక్యత. చైర్మన్ మావో విప్లవ పంథా పునాదిగా ఉన్న ఐక్యత. అంటే ఈ ఐక్యత మార్క్సిజం లెనినిజం మావో సెటుంగ్ ఆలోచనా విధానం పునాదిగా ఉన్న ఐక్యత. కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేయడానికి మనం ఐక్యమవుతాం. ఈ సూత్రాలకు దృఢంగా కట్టుబడి ఉండడం ద్వారానే మనం యావత్తు పార్టీ నిజమైన ఐక్యతను తీసుకురాగలుగుతాం. సరైన పంథాను అమలు చేస్తూ ముందుకు సాగుతాం. పార్టీలో అవకాశవాద పంథాల నాయకులు రాజకీయ రంగంలో రివిజనిజాన్ని ఆచరిస్తారు. నిర్మాణ రంగంలో అనేక రకాలుగా చీలికల కోసం పని చేస్తారు. రివిజనిజం చీలికవాదానికి రాజకీయ, సైద్ధాంతిక వనరు. రివిజనిస్టు శక్తులు ఎల్లప్పుడూ చీలికదారులే – పార్టీలో జరిగిన రెండు పంథాల మధ్య పోరాటాలన్నింటిలోనూ ఈ భౌతిక నియమం పూర్తిగా తేటతెల్లమైంది.

ప్రజాస్వామిక విప్లవ యుగంలో చెన్ టు సియూలూ. లో చాంగ్ లుంగ్‌వీ, చాంగ్ కువో టావోలు, వారి అనుయాయులలో కొందరు ప్రత్యర్థి గ్రూపులు ఏర్పాటు చేసారు. ఇతరులు సొంతంగా కేంద్ర కమిటి పెట్టుకున్నారు. వీరంతా పార్టీని విభజించడానికి కుట్ర పన్నారు. చు చిన్ పాయ్, లీ లీ సాన్, వాంగ్ మింగ్ మొదలయిన వారంతా నిర్మాణ రంగంలో ఒంటెత్తు పోకడను ఆచరించారు. కేంద్ర కమిటీకి చైర్మన్ మావో నాయకత్వాన్ని నిరాకరించారు. సరైన పంథాను ఎత్తిపట్టిన కామ్రేడ్స్ మీద దాడి చేసారు. సోషలిస్టు విప్లవ యుగంలో కావో కాంగ్, జావో షు షి పెంగ్ టెహ్ హువాయ్, లీ షావ్ చీలు అధికారాన్ని గుంజుకుని పునరుద్ధరణ తీసుకురావడానికి నిర్మాణ రంగంలో పార్టీ వ్యతిరేక కూటములు నెలకొల్పారు. లేదా బూర్జువా కేంద్రాలుగా తయారయ్యారు. బూర్జువా కెరీరిస్టు, కుట్రాదారుడు అయిన లిన్ పియావో మన పార్టీలో అతి పెద్ద చీలికదారుడు. తన రివిజనిస్టు పంథాను, విప్లవ ప్రతీఘాతుక రాజకీయ సూత్రాలను అమలు చేయడం కోసమూ చైర్మన్ మావో కార్మికవర్గ విప్లవ రాజకీయ సూత్రాలను వ్యతిరేకించడం కోసమూ అతను మరెవ్వరి కంటే, నిర్మాణంలోకి ఉన్మాదులను భర్తీ చేసుకున్నారు. ముఠాలు ఏర్పరిచాడు. విప్లవ ప్రతీఘాతుక శక్తులను ప్రోత్సహించాడు. బూర్జువా కేంద్రాలను నెలకొల్పి చైర్మన్ మావో నేతృత్వంలో ఉన్న కేంద్ర కమిటీని ఎదిరించాడు. మన పార్టీని మన సైన్యాన్ని విప్లవ శ్రేణుల ఐక్యతనూ ధ్వంసం చేయడానికి అతనూ అతని ముఠాదారులూ చేయవలసినదంతా చేసారు. తమ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం ఒక పంథాను పెంపొందించారు. కేడర్‌ను ఎన్నుకోవడంలో విపరీతంగా పక్షపాతంగా ఉన్నారు. 'కొద్దిమందిని రక్షించడం కోసం అత్యధికుల మీద దాడి చేయడం' అనే బూర్జువా ప్రతీఘాతుక పంథాను నిరంతరం అమలు చేసారు. తమకు 'అధికారాన్ని పున:పంపకం చేయాలని ఉంది' అని గగ్గోలు పెట్టారు. 'నాయకత్వ అధికారం కోసం పోరాటం' అన్నారు. అంతిమంగా మన గొప్పనాయకుడైన చైర్మన్ మావోను హత్య చేసి, మరో కేంద్ర కమిటీని నెలకొల్పి, రివిజనిస్టు సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదానికి లొంగి ఉండాలన్న విఫల ఆశతో సాయుధ విప్లవ ప్రతీఘాతుక తిరుగుబాటు చేసారు. బందిపోటు, కుట్రదారుడు, చీలికదారుడూ అయిన లిన్ పియావో యావత్తు పార్టీకి సైన్యానికీ ప్రజలకూ శత్రువు అని ఇది స్పష్టం చేస్తుంది. తన నేరపూరిత కార్యకలాపాలను కప్పిపుచ్చుకోవడం కోసం, విప్లవ ఐక్యతను ధ్వంసం చేయడం కోసం, పార్టీని చీల్చడం కోసం లిన్ పియావో 'మనం అంగీకరించకపోయినా కూడా సహకరించాలి' అన్నాడు. మనం విప్లవ సూత్రాలనూ రివిజనిజం వ్యతిరేక పోరాటాన్నీ పక్కన పెడతామన్న ఆశతో ఈ తప్పుడు భావం పార్టీలోనూ విప్లవ శ్రేణులలోనూ ఐక్యతకు సైద్ధాంతిక పునాదిని నిర్లక్ష్యం చేస్తుంది. ఈ ఐక్యతకు ఉన్న వర్గ సారాన్ని నిరాకరిస్తుంది. మనం దీన్ని పూర్తిగా క్షుణ్ణమైన పద్ధతిలో విమర్శించాలి.

పార్టీ ఐక్యత దానంతటది రాదు. సమాజంలో వర్గాలు, వర్గ పోరాటం ఉన్నంత వరకూ పార్టీలో రెండు పంథాల మధ్యనూ, ఐక్యత కావాలనుకునేవారికీ మధ్యనూ అనివార్యంగా పోరాటం ఉంటుంది. చైర్మన్ మావో ఇలా అన్నాడు – 'ఏ పార్టీకైనా బయట ఇతర పార్టీలు ఉంటాయి. లోపల గ్రూపింగ్‌లు ఉంటాయి. ఇది ఎప్పుడు ఇలాగే ఉంది'. పార్టీని పటిష్టం చేయాలంటే పార్టీ లోపల పోరాటాన్ని సరిగా చేయడం అవసరం. మన పార్టీలో నిర్మాణ పరంగా చేరినా సైద్ధాంతికంగా పూర్తిగా చేరని కామ్రేడ్స్ ఉన్నారు. బూర్జువా, పెటీ బూర్జువా భావాలు నిరంతరం వ్యక్తమవుతూ పార్టీ ఐక్యతకు ఆటంకంగా ఉండడానికి అవకాశం ఇస్తున్నది ఇదే. అంతేకాక, అనేక మంది ద్రోహులు, రహస్య ఏజెంటులు, బూర్జువా కెరీరిస్టులు, కార్మికవర్గేతర శక్తులూ మన పార్టీలోకి చొచ్చుకురావడానికి ఇంకా అనేక అవకాశం ఉంది. ఇటువంటి వ్యక్తులు పార్టీ శ్రేణులలో భూస్వామ్య, పెట్టుబడిదారి వర్గాలకు ఏజెంటులు. పెట్టుబడిదారి పునరుద్ధరణ పథకాన్ని అమలు చేయడం కోసం వాళ్లు ఎల్లప్పుడూ చీలిక కార్యకలాపంలో నిమగ్నమయి ఉంటారు. పార్టీ ఐక్యతను నాశనం చేసేందుకు ప్రత్నిస్తూ ఉంటారు. పార్టీలో ఐక్యతా లేమి వ్యక్తీకరణలు వర్గ పోరాటానికి ఎలా ప్రతిబింబాలో ఇది వివరిస్తుంది. పార్టీ ఐక్యతను పరిరక్షించాలంటే, దాని శ్రేణులను శుద్ధి చేయాలంటే, మనం మార్క్సిజం లెనినిజం సూత్రాల మీద ఆధారపడాలి. పార్టీలో చురుకుగా పోరాటం సాగించాలి.

ఈ పోరాటాన్ని సరైన పద్ధతిలో కొనసాగించాలంటే రెండు రకాల వైరుధ్యాల మధ్య కచ్చితంగా తేడా చూడడం అవసరం. తప్పులు చేసిన కామ్రేడ్స్‌తో వ్యవహరించేటప్పుడు ఐక్యత, విమర్శ, ఐక్యత, 'భవిష్యత్తు తప్పులను నివారించడానికి గత తప్పుల నుంచీ నేర్చుకోండి, రోగిని రక్షించడం కోసం రోగానికి చికిత్స చేయండి' అన్న సూత్రాల ప్రకారం పని చేయాలి. తద్వారా భావాలు స్పష్టం కావడం మాత్రమే కాక కామ్రేడ్స్ మధ్య ఐక్యత కూడా సాధించగలుగుతాం. మన పార్టీలోకి చొచ్చుకువచ్చిన కొద్ది మంది చెడు శక్తుల విషయానికి వస్తే వారిని ఎండగట్టడం తప్పనిసరిగా అవసరం. వారికి వ్యతిరేకంగా నిశ్చయాత్మకంగా పోరాటం చేయాలి. పార్టీ నుంచీ బహిష్కరించాలి. రివిజనిస్టుల చీలిక కార్యకలాపాలకు మనం నిశ్చయాత్మకంగా వ్యతిరేకం. కానీ వారంటే మనం భయపడం. పార్టీని చీల్చాలన్న అవకాశవాద పంథాల నాయకులు చేసిన అనేక ప్రయత్నాలు ఎందుకు విజయవంతం కాలేదు ? ఎందుకూ అంటే, మన గొప్ప నాయకుడు చైర్మన్ మావో, కేంద్ర కమిటీల దూరదృష్టి ఉన్న నాయకత్వం మనకు ఉంది. మనకు మార్క్సిస్టు లెనినిస్టు పంథా ఉంది. అవకాశవాదానికి, రివిజనిజానికీ వ్యతిరేక పోరాటంలో మనం నిలబడ్డాం. పార్టీ హృదయం, ప్రజల హృదయం ఒకే విధంగా కొట్టుకుంటాయి కనుక వాళ్లు విఫలమయ్యారు. పార్టీ సభ్యులందరికీ ఐక్యత కావాలి కాబట్టీ చీలికలను అంగీకరించరు కాబట్టీ వాళ్లు విఫలమయ్యారు. ఇలా అవకాశవాద పంథాల నాయకులు విభజనను ప్రేరేపించాలనుకున్నప్పుడు పూర్తిగా విఫలమయి సిగ్గుమాలిన విధంగా ఆగిపోయారు. ఈ చెత్తను వదిలించుకున్న తరువాత మన పార్టీ మరింత పవిత్రంగా, పటిష్టంగా ఐక్యంగా ఉంది. అవకాశవాదానికీ, రివిజనిజానికీ వ్యతిరేక పోరాటంలో మన పార్టీ పెరిగింది. చీలికతత్వానికి వ్యతిరేకంగా పోరాడడం ద్వారానే దాని ఐక్యత నిర్మాణమయింది.

**బహిరంగంగా ఉండండి, కుట్రలకు కుహకాలకు పాల్పడవద్దు**

ఒక వ్యక్తి బహిరంగంగా ఉంటున్నారా లేక కుట్రలకు కుహకాలకూ పాల్పడుతున్నారా ? ఇది కార్మికవర్గ విప్లవకారులకూ బూర్జువా కెరీరిస్టులకూ మధ్య విభజన రేఖ ఏర్పరుస్తుంది. చైర్మన్ మావో పంథాను వ్యతిరేకించి రివిజనిస్టు పంథాను అమలు చేసేందుకు, పార్టీలోకి చొచ్చుకువచ్చిన బూర్జువా వర్గ ఏజెంటులందరూ అనివార్యంగా చీలికలను ప్రేరేపించడానికి ప్రయత్నిస్తారు. అన్ని రకాల కుట్రలూ కుహకాలూ కొనసాగించడం వారి ఎత్తుగడల పద్ధతులు. కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా మనం చైర్మన్ మావో విప్లవ పంథాకు దృఢంగా కట్టుబడి ఉండాలి. పూర్తిగా విప్లవ ఐక్యతను నిలబెట్టుకోవాలి. ఎల్లప్పుడూ బహిరంగంగా ఉండాలి.

బహిరంగంగా ఉండడం కార్మికవర్గ లక్షణాలు. ఇందులో పార్టీ స్ఫూర్తి ఉంది. మానవత్వ చరిత్రలో కర్మికవర్గం అతి గొప్ప విప్లవ వర్గం. ఈ వర్గం అత్యంత దూరదృష్టి కలిగినది. అతి తక్కువ. దానికి స్వార్ధం ఉండదు. విప్లవంలో అతి రాడికల్. కార్మికవర్గం చరిత్ర అభివృద్ధి చెందుతున్న దిశను వ్యక్తం చేస్తుంది. వర్గ ప్రయోజనాలు పూర్తిగా యావత్తు శ్రామిక ప్రజల ప్రయోజనాలతో కలుస్తాయి. తన ఆశయం న్యాయమైనదనీ అది తప్పనసరిగా అంతిమంగా విజయం సాధిస్తుందని దానికి పూర్తి విశ్వాసం ఉంది. అందుకనే కార్మికవర్గం, దాని పార్టీ ఎల్లప్పుడూ బహిరంగంగా ఉంటాయి. తమ రాజకీయ అభిప్రాయలనూ లక్ష్యాలనూ ఎల్లప్పుడూ బహిరంగంగా ప్రకటిస్తాయి. వందకు పైగా సంవత్సరాల క్రితం మార్క్స్, ఎంగెల్స్‌లు కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలో ఇలా ప్రకటించారు – 'కమ్యూనిస్టులు తమ అభిప్రాయలనూ లక్ష్యాలనూ దాచి పెట్టుకోవాలని అనుకోరు. సమస్త ప్రస్తుత సామాజిక పరిస్థితులనూ బలవంతంగా కూలదోసినప్పుడే తమ ప్రయోజనాలు నెరవేరుతాయని బహిరంగంగా ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవం చూసి పాలక వర్గాలు వణికిపోతాయి. కార్మికవర్గాలకు పోగొట్టుకోవడానికి సంకెళ్లు తప్ప మరేమీ లేదు. వాళ్లు గెలుచుకోవడానికి ఒక ప్రపంచం ఉంది. చైనా కమ్యూనిస్టు పార్టీ ఏడో జాతీయ కాంగ్రెస్‌కు ఇచ్చిన రాజకీయ నివేదికలో చైర్మన్ మావో స్పష్టంగా ఇలా పేర్కొన్నాడు – 'కమ్యూనిస్టులుగా మనం మన రాజకీయ అభిప్రాయలను దాచుకోం. నిస్సందేహంగా, ఖచ్చితంగా, మన భవిష్యత్తు లేదా అత్యధిక కార్యక్రమం చైనాను సోషలిజానికీ ఆ తరువాత కమ్యూనిజానికీ తీసుకెళ్లడం. మన పార్టీ పేరు, మన మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పధం అసమానంగా ఈ భవిష్యత్తు అత్యుత్తమ ఆదర్శాన్ని చూపిస్తున్నాయి. ఇది అసమానంగా ప్రకాశిస్తున్న, అద్భుతమైన భవిష్యత్తు.

బహిరంగంగా ఉండడం – ఇది కార్మికవర్గ పార్టీ మిలిటెంట్ పని శైలి, సరైన పంథాను పూర్తిగా అమలు చేసేందుకు ఒక ముఖ్యమైన

హామీ. చైర్మన్ మావో ఇలా అన్నాడు – 'కార్మికవర్గాన్ని అత్యంత తీవ్రమైన, అత్యంత శక్తివంతమైన ఆయుధం, ఒక తీవ్రమైన, మిలిటెంటు శాస్త్రీయ వైఖరి'. మన పార్టీ ప్రతి ఒక్కరి ప్రయోజనాల కోసం నిర్మించినది. ఇది చైనాలో, ప్రపంచంలో ఉన్న అపారమైన అత్యధిక జనాభాకు సేవ చేస్తున్నది. విశాల ప్రజానీకపు ఉన్నత ప్రయోజనాల కోసమే తప్ప ఇది వ్యక్తిగత ప్రయోజనాల కోసం పని చేయదు. ప్రజలకు మనస్ఫూర్తిగా సేవ చేయడం – కమ్యూనిస్టులమయిన మనకు ఇదే నడిపించే లక్ష్యం. ఈ లక్ష్యం నుంచి మొదలుకొని మన పార్టీ కార్యక్రమం, పంథా, దృష్టికోణం, రాజకీయ సూత్రాలూ నిర్ణయమవుతాయి. అందుకనే దానికి విశాల ప్రజానీకం నుంచీ ఆర్ద్రమైన మద్దతు ఉంది. సత్యం మన వైపు ఉంది. విశాల కార్మిక రైతాంగ ప్రజానీకం మన వైపు ఉన్నారు. చైర్మన్ మావో కార్మికవర్గ విప్లవ రాజకీయ సూత్రాలను అమలు చేసేప్పుడు మనం దృఢమైన స్థానాలు తీసుకోవడానికీ, వారిని సమీకరించడానికీ ప్రజల సేవకు ఉపయోగపడేలా పార్టీ రాజకీయ పంథానూ సూత్రాలనూ గ్రహించి వారిని చైర్మన్ మావో విప్లవ పంథాలో విజయవంతంగా పురోగమింపజేయడానికీ ఇదే దోహదం చేస్తుంది.

ప్రతీ కమ్యూనిస్టూ బహిరంగంగా ఉండడం అనే రాజకీయ లక్షణాన్ని కలిగి ఉండాలి. చైర్మన్ మావో వివరించినట్టుగా – 'కమ్యూనిస్టుకు విశాలమైన ఆలోచన ఉండాలి. దృఢంగా చురుకుగా ఉండాలి. విప్లవ ప్రయోజనాలను తన జీవితంగా చూడాలి. తన వ్యక్తిగత ప్రయోజనాలను విప్లవానికి లోబరచాలి. ఎల్లప్పుడూ అంతటా సూత్రానికి కట్టుబడి ఉండాలి. అన్ని రకాల తప్పుడు భావాలకూ ఆచరణకూ వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేయాలి.....'. పార్టీలో ప్రవేశించిన నాటి నుంచి కమ్యూనిస్టు తన యావత్తు జీవితాన్ని పార్టీ కోసం అంకితం చేయాలి. అందుకనే కమ్యూనిస్టులు రాజకీయంగా బహిరంగంగా ఉండాలి. తమ రాజకీయ అభిప్రాయాలను బహిరంగంగా ప్రకటించాలి. అన్ని రకాల హానికరమైన కార్యకలాపాలకీ తప్పుడు ధోకణులకూ వ్యతిరేకంగా పోరాడాలి. నిర్మాణ రంగంలో వాళ్లు తమ వ్యవహారాలను బహిరంగంగా, పార్టీ సూత్రాలకు అనుగుణంగా చేయాలి. తమ పని శైలిలో బూర్జువా రాజకీయ నాయకులుగా ప్రవర్తించరాదు. కుట్రలకూ కుహకాలకూ పాల్పడరాదు.

కుట్రలూ కుహకాలూ దోపిడి వర్గాల, వారి రాజకీయ పార్టీల లక్షణాలు. దోపిడి వర్గాల ప్రయోజనాలూ విశాల ప్రజానీకపు ప్రయోజనాలూ పరస్పర విరుద్ధం. కార్మిక వర్గాన్నీ యావత్తు శ్రామిక ప్రజానీకాన్నీ దోపిడి చేసి పీడించడమే ఉద్దేశంగా ఉండే దోపిడి వర్గాలు తమ ఈ నిజ ఉద్దేశాలను ప్రకటించే సాహసం చేయరు. తమ వర్గ ప్రయోజనాలను సమస్త మానవాళి ప్రయోజనంగా చెబుతారు. విప్లవ ప్రతీఘాతుక ఆశయం కోసం ప్రతీ రోజూ పని చేస్తూనే ముసుగు కోసం ఎల్లప్పుడూ పెదాల మీద 'దయ, న్యాయం, విలువ', 'స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమానత్వం అన్న పదాలు వల్లిస్తుంటారు. ఈ పదాలతో శ్రామిక ప్రజలను మోసం చేసి దోపిడి వర్గాల నియంతృత్వ స్వభావాన్ని దాచి ఉంచి తమ ప్రతీఘాతుక ఆధిపత్యాన్ని పరిరక్షించుకుంటారు. పార్టీలో దాగి ఉండే అవకాశవాద పంథాల ముఖ్యులు కొద్ది మంది దోపిడి వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. వాళ్లు కార్మికవర్గానికీ శ్రామిక ప్రజానీకానికీ శత్రువులు. తమ ప్రతీఘాతుక రాజకీయ లక్ష్యాలను బహిరంగంగా ప్రకటించలేరు. ఇలా వాళ్లు కుట్రలూ కుహకాల ద్వారానే మనుగడ కొనసాగించగలరు. తమ జిత్తులమారితనాన్నీ, కుట్రలనూ, అధికారాన్ని పెంచుకునే ప్రయత్నాలనూ, తప్పుడు భావాలనూ వ్యాపింపజేయడం ఆపివేస్తే ఒక్క రోజు కూడా కొనసాగలేరు. మన పార్టీ చరిత్రలో ముందుకు వచ్చిన వివిధ అవకాశవాద పంథాల ముఖ్యులు మినహాయింపు లేకుండా కుట్రలలోనూ కుహకాలలోనూ నిపుణులుగా ఉన్నారు. మనకు నచ్చినా నచ్చకపోయినా అటువంటి వ్యక్తులు ఇంకా భౌతికంగా ఉన్నారు. వారి ప్రవర్తన సమస్త అవకాశవాదులూ సమస్త రివిజనిస్టుల లక్షణంగానే ఉంటుంది. వారి ప్రతీఘాతుక వర్గ స్వభావమే దీన్నీ నిర్ణయిస్తుంది.

లిన్ పియావో, అతని పార్టీ వ్యతిరేక ముఠా విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టు పంథాను ఆచరిస్తున్నారు. అన్ని రకాల ద్వంద్వ వ్యవహార విప్లవ ప్రతీఘాతుక ఎత్తుగడలను ఉపయోగించుకొంటున్నారు. రాజకీయ రంగంలో పార్టీనీ సోషలిజాన్నీ సమర్థించినట్టుగా నటిస్తారు. కానీ రహస్యంగా తమ కత్తులు సానబెట్టుకుంటున్నారు. విప్లవ నాయకులనూ, కార్మికవర్గ నియంతృత్వాన్నీ, సోషలిస్టు వ్యవస్థనూ అవమానిస్తున్నారు. ప్రజలను నమ్మించడానికి సైద్ధాంతిక రంగంలో 'ఫలానా దగ్గర అలా చెప్పారు' అంటూ కొద్ది పాటి మార్క్సిస్టు లెనినిస్టు పదజాలాలను చెప్పగలుగుతారు. కానీ వాస్తవంలో వాళ్లు మోసం చేసారు. సరైన దాన్నీ తప్పునూ గందరగళపరిచారు. మార్క్సిజం లెనినిజాన్ని దూషణపూరితంగా మెలికలు తిప్పి వక్రీకరించారు. నిర్మాణ రంగంలో వాళ్లు 'ఐక్యత' కోసం ఆకర్షణీయమైన పిలుపులు ఇచ్చారు. అయితే నిజానికి వాళ్లు చెడు శక్తులను భర్తీ చేసుకున్నారు. తమ ప్రయోజనాల కోసం ముఠాలు ఏర్పరిచారు. బూర్జువా కేంద్రాన్ని నెలకొల్పారు. అంతిమంగా చీలిక కార్యకలాపంలో నిమగ్నులయ్యారు. వారి పని శైలి ఎలా ఉండేదంటే గౌరవించినట్టు నటించడం, వాస్తవంగా వ్యతిరేకించడం. మాట్లాడేది ఒకటి, ఆలోచించేది ఒకటి. అనేక ముఖాలు. బయటపడిన వెంటనే తమ్ము తాము రక్షించుకోవడం కోసం దాడి చేయడం. స్వయం విమర్శ చేసుకుంటున్నట్టు నటించడం, కొద్దిపాటి కన్నీళ్లు కార్చడం, మరోసారి పైకి రావడానికి సరైన అవకాశం కోసం ఎదురు చూస్తూ నీడలో దాక్కుని ఉండడం. క్లుప్తంగా చెప్పాలంటే లిన్ పియావో, అతని చేతిలో ఉన్న కొద్ది మంది ఉన్మాదులూ విప్లవ ప్రతీఘాతుక కుట్రదారుల ముఠాగా ఉన్నారు. 'చేతిలో సూక్తుల పుస్తకం లేకుండా ఎన్నడూ కనిపించే వాళ్లు కాదు. వర్ధిల్లాలి అని అరవకుండా నోళ్లు తెరిచేవారు కాదు. మొహం మీద మంచి మాటలు చెప్పి వెన్నులో పోటు పొడిచేవారు'. వాళ్లు కార్మికవర్గానికీ యావత్తు శ్రామిక ప్రజలకూ అత్యంత తీవ్రమైన శత్రువులు. సాయుధ విప్లవ ప్రతీఘాతుక తిరుగుబాటుకు చేసిన 'ఔట్‌లైన్ ఆఫ్ ప్రాజెక్ట్ 571 అన్న పథకంలో తమ్ము తాము కుట్రదారులుగా విప్లవ ప్రతీఘాతుక బూర్జువా కెరీరిస్టులుగా తేటతెల్లం చేసుకున్నారు. సహజంగానే కుట్రదారులకూ

కెరీరిస్టులకూ ఎదురయిన పరిస్థితే వాళ్లకూ ఎదురయింది. వాళ్ల కథ సిగ్గుమాలిన విధంగా ముగిసిపోయింది. పూర్తిగా తుడిచిపెట్టుకుపోయారు.

**'చేయవలసిన మూడు, చేయకూడని మూడు' కమ్యూనిస్టు పార్టీ సభ్యులు పాటించవలసిన మూడు మౌలిక సూత్రాలు**

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో మనం లీ షావ్ చీ, లిన్ పియావోల నేతృత్వంలో ఉన్న రెండు బూర్జువా కేంద్రాలను కూలదోసాం. అయితే పోరాటం ఆగిపోలేదు. సమాజంలో వర్గ పోరాటం, పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటం ఇంకా సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతుంది. కమ్యూనిస్టులందరూ 'చేయవలసిన మూడు, చేయకూడని మూడు' అన్న సూత్రాలకు కట్టుబడి ఉండాలి. కార్మికవర్గ నియంతృత్వం కింద విప్లవాన్ని కొనసాగించే అగ్రశ్రేణి కార్యకర్తలుగా ఉండడం కోసం అన్ని తప్పుడు పంథాలకూ ధోరణులకూ వ్యతిరేకంగా పోరాటం చేయాలి.

రివిజనిజాన్ని కాక మార్క్సిజాన్ని ఆచరించాలంటే ముందుగా 'చదవాలి, తీవ్రంగా అధ్యయనం చేయాలి. మార్క్సిజం గురించి చక్కని అవగాహన కలిగి ఉండాలి'. ఇలా చేయడం ద్వారా, క్లిష్టమైన పోరాట పరిస్థితులలో సరైన దృక్పథాన్నీ సరైన పంథానూ అనుసరించడం సాధ్యవవుతుంది. చైర్మన్ మావో కార్మికవర్గ విప్లవ పంథాను నిశ్చయాత్మకంగా అమలు చేయాలి. కమ్యూనిస్టులమయిన మనం జాగరుకతతో అధ్యయనం చేసి మార్క్సిజం లెనినిజం మావో సెటుంగ్ ఆలోచనా విధానాన్ని క్షుణ్ణంగా గ్రహించాలి. మూడు గొప్ప విప్లవోద్యమాల ఆచరణలో చురుకుగా పాలు పంచుకోవాలి. చైర్మన్ మావో విప్లవ పంథా స్ఫూర్తినీ సారాన్నీ మరింత గాఢంగా అర్థం చేసుకోవాలి. దాన్ని ఎలా అమలు చేయాలన్న దాని గురించి మన చైతన్య స్థాయిని పెంపొందించుకోవాలి. ఈ రకంగా మాత్రమే మనం నిరంతరం నిజమైన మార్క్సిజాన్నీ బూటకపు దాన్నించి వేరు చేయగలుగుతాం. సరైన పంథానూ తప్పుడు పంథానూ, సరైన భావాలనూ తప్పుడు భావాలనూ గుర్తించగలుగుతాం. ఈ రకంగా మాత్రమే మనం మోసానికి గురి కాకుండా ఉంటాం. బూర్జువా రివిజనిస్టు భావాల హానికరమైన ప్రభావం నుంచి తప్పించుకోగలుగుతాం. కార్మికవర్గ వైఖరిని అవలంబించగలుగుతాం. సోషలిస్టు మార్గంలో నిలబడగలుగుతాం. రివిజనిజాన్ని కాక మార్క్సిజాన్ని ఆచరించగలుగుతాం.

రివిజనిజాన్ని కాక మార్క్సిజాన్ని ఆచరించాలంటే కమ్యూనిస్టు రివిజనిజాన్ని, బూర్జువా ప్రాపంచిక దృక్పథాన్నీ విమర్శించాలి. గొప్ప విప్లవ విమర్శ చేయడం అంటే కార్మికవర్గ భావాలను ఉపయోగించి బూర్జువా భావాలనూ ఓడించడం. మార్క్సిజం లెనినిజం మావో సెటుంగ్ ఆలోచనా విధానాన్ని వినియోగించి రివిజనిజాన్ని విమర్శించడం. సోషలిజం కాలంలో మనం విస్తృత స్థాయిలో ఇటువంటి విమర్శ చేయకపోతే బూర్జువా రివిజనిస్టు భావాలు స్వేచ్ఛగా వ్యాపిస్తూ ప్రజలను విషపూరితం చేస్తాయి. సోషలిజం ఆర్థిక పునాదిని నాశనం చేయడానికీ పార్టీని పాడు చేయడానికీ తద్వారా కార్మికవర్గ నియంతృత్వాన్ని కూలదోయడానికీ ఇది చాలా విషపూరితమైన పాత్ర వహిస్తుంది. సరైన సోషలిస్టు దృక్పథంలో నిలబడాలంటే మనం రివిజనిజాన్నీ బూర్జువా ప్రాపంచిక దృక్పథాన్నీ విమర్శించాలి. వివిధ సాంస్కృతిక రంగాలతో సహ ఉపరితలంలో పోరాటం – విమర్శ – పరివర్తనలను అమలు చేయాలి. నిజమైన విప్లవ విమర్శ చేయాలంటే మనకు దీర్ఘకాలిక యుద్ధం చేయడం గురించిన ఆలోచనను గ్రహించాలి. పార్టీ మౌలిక పంథాను వివరంగా అర్థం చేసుకోవాలి. రివిజనిజాన్ని లోతుగా విమర్శించడం కోసం లీ షావ్ చీ, లిన్ పియావోలు అందించిన ప్రతికూల ఉదాహరణలను వినియోగించుకోవాలి. ఇలా మాత్రమే మనం పోరాట సాధారణ దృక్పథం నుంచీ దూరం కాకుండా ఉంటాం. పంథాలో ఏది భాగమో ఏది కాదో స్పష్టమైన విభజన రేఖ గీసుకోగలుగుతాం. నేటి ప్రపంచంలో రివిజనిజం ఇంకా ప్రధాన ప్రమాధంగా ఉంది. మార్క్సిజాన్ని అధ్యయనం చేయడం రివిజనిజాన్ని విమర్శించడం రెండూ దీర్ఘకాలిక కర్తవ్యాలు. ఇవి రెండూ పార్టీ సైద్ధాంతిక స్థాయిని పెంపొందించడానికి మనకు దోహదం చేస్తాయి.

పార్టీ లోపలా బయటా కమ్యూనిస్టులు పెద్ద సంఖ్యలో ప్రజలను ఐక్యం చేయాలి. వారితో స్వేచ్ఛగా ఉండాలి. కమ్యూనిస్టులమయిన మనం పార్టీలో అన్ని రకాల ప్రశ్నలనూ పరిష్కరించుకునేటప్పుడు, కమ్యూనిస్టు స్ఫూర్తిని ప్రదర్శించాలి. యావత్తు పార్టీనీ దాని ఐక్యతనూ మౌలిక అంశంగా చూడాలి. పార్టీ ప్రయోజనాలను ప్రారంభ అంశంగా చూడాలి. పార్టీ ఐక్యతను సంఘటితం చేయడంలో ఇవి ముఖ్యమైన సూత్రాలు. విప్లవ శ్రేణులలో కమ్యూనిస్టులు ఐక్యతకు నమూనాలుగా నిలవాలి. కేడర్‌లు వేరే ప్రాంతం నుంచీ వచ్చినవారైనా ఆ ప్రాంతం నుంచీ వచ్చిన వారైనా, వాళ్లు సైనిక కేడర్‌లైనా, పాతవాళ్లైనా కొత్తవాళ్లైనా ఎల్లప్పుడూ పార్టీ, ప్రజల ప్రయోజనాలను తమ ప్రారంభ అంశంగా చూడాలి. వాళ్లకు సమగ్రమైన దృష్టి ఉండాలి. ఐక్యతను పటిష్టం చేసుకోవడం కోసం పరస్పరం గౌరవించుకోవాలి. సహాయం చేసుకోవాలి. తప్పులు చేసిన కామ్రేడ్స్‌తో వ్యవహరించేటప్పుడు కేడర్‌లు కచ్చితంగా రెండు రకాల వైరుధ్యాల మధ్య తేడా చూడాలి. కామ్రేడ్స్ తమ తప్పులను గుర్తించి సరిదిద్దుకోవడం కోసం వారికి ఆర్ద్రంగా సహాయం చేయాలి. సమిష్టి పనిలో పాలు పంచుకునే విధంగా వాళ్లను గెలుచుకోవాలి. ఇందుకు పంథాలో ఏదీ భాగంగా ఉంటుందీ, ఏదీ ఉండదన్నది పునాదిగా ఉండాలి. ఈ రకంగా మార్క్సిస్టు లెనినిస్టు సూత్రాల పునాదిగా మనం మన ఆలోచననూ కార్యాచరణనూ ఐక్యం చేయగలుగుతాం. ఐక్యతను పటిష్టం చేయగలుగుతాం. కలిసి పోరాటం చేయగలుగుతాం. స్థూలంగా చెప్పాలంటే కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా మనం ప్రజలతో బహిరంగంగా ఉండాలి. ఎటువంటి పరిస్థితులలోనూ మనల్ని మనం పరిగణించాలి. ఒంటెత్తుపోకడను ప్రదర్శించరాదు. రహస్యంగా ముఠాతత్వ కార్యకలాపాలకు పాల్పడరాదు. పేరు కోసమో లాభం కోసమో ఆలోచించరాదు. మన వ్యక్తిగత ప్రయోజనాల కోసం పని చేయరాదు. లేదా తప్పుడు పద్ధతులలో స్థానం పొందేందుకు

**భారత విప్లవోద్యమానికి నిస్వార్థంగా వీర పుత్రికలను, వీర పుత్రులను అందించిన తల్లిదండ్రులకు విప్లవ వందనాలు. ప్రజల కోసం పోరాడుతున్న తమ బిడ్డలను తనివి తీరా చూసుకుని ముద్దాడి గుండెలకు అద్దుకోవాలని ఎదురు చూసి కనుమూసిన తల్లిదండ్రులకు వినమ్రంగా నివాళ్లు అర్పిద్దాం.**



కా॥ కటకం వెంకటమ్మ

సింగరేణి బొగ్గు గనిలో పని చేస్తూ కార్మిక వాడల్లో జీవిస్తూ కష్టాలు, కన్నీళ్లు బాధలు చవి చూస్తూ కన్న బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుతూ అల్లారు ముద్దుగా పెంచి విద్యాబుద్ధులు నేర్పించి భారత విప్లవోద్యమానికి కార్మికవర్గ పుత్రున్ని అందించిన మాతృమూర్తి కామ్రేడ్ కటకం వెంకటమ్మ (80సం॥) అనారోగ్యంతో బెల్లంపల్లిలోని కన్నాల బస్తీలో కన్ను మూశారు. రెండేళ్ల క్రితం భర్త కా॥ కటకం మల్లయ్య అనారోగ్యంతో మరణించారు.

రాజ్యం విప్లవోద్యమంపై క్రూరమైన నిర్భంధాన్ని ప్రయోగిస్తూ బూటకపు ఎన్‌కౌంటర్ల పేర్లతో హత్యలు చేస్తూ తెల్ల బీభత్సం సృష్టిస్తుంటే తమ కొడుకును చూడడం సాధ్యం కాదని తెలిసిన కన్నా ప్రేమను చంపుకోలేక ప్రజల కొరకు పోరాడుతున్న కొడుకు రూపాన్ని తనవి తీరా చూసి గుండెలకు అద్దుకోవాలని నలభై యేళ్లుగా తల్లిదండ్రులిద్దరు కొడుకు కడసారి చూపు కోసం తుది కంట పరితపించి ఆ కోరిక తీరకుండానే తుది శ్వాస విడిచారు.

నవమాసాలు మోసి జన్మనిచ్చి కంటికి రెప్పలా కాపాడుతూ అల్లారు ముద్దుగా పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు నేర్పించి చేతికి అంది వచ్చిన కన్న బిడ్డలను నిస్వార్థంగా భారత విప్లవోద్యమానికి వీర పుత్రికలను, వీర పుత్రులను అందించిన తల్లిదండ్రులు త్యాగధనులు మహోన్నతులు.

ప్రభుత్వ ఫాసిస్టు నిర్భంధంలో ప్రజల కొరకు పోరాడుతున్న తమ బిడ్డలను కడసారి చూపుకు నోచుకోకుండానే కన్ను మూసిన ఎందరో తల్లిదండ్రులు వారందరికి వినమ్రంగా నివాళ్లు అర్పిద్దాం.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడమంటే విప్లవంలో కడవరకు కొనసాగడమే.

(వెంటనే ప్రచురించలేక పోయినందుకు చింతిస్తున్నాము).

ప్రయత్నించరాదు. అన్ని అంశాలలోనూ చైర్మన్ మావో, కేంద్ర కమిటీల ఆదేశాలను గౌరవించాలి. పార్టీ ఐక్యతను నాశనం చేసే లక్ష్యంతో సాగే అన్ని రకాల కార్యకలాపాలకీ వ్యతిరేకంగా నిశ్చయాత్మకంగా పని చేయాలి.

కమ్యూనిస్టులు నిజాయితీగా స్వేచ్ఛగా బహిరంగంగా ఉండాలి. ఇలా ఉండడం కోసం కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా మనకు దృఢమైన స్థానాలు ఉండాలి. అందరూ చూసే విధంగా మన పతాకాన్ని ఎత్తిపట్టాలి. సూత్రానికి కట్టుబడి ఉండాలి. సాహసంగా పోరాడాలి. ప్రతీ ముఖ్యమైన రాజకీయ సమస్య గురించి స్పష్టంగా అభిప్రాయాలు కలిగి ఉండాలి. ఆమోదం ఉన్నా దాని గురించి స్పష్టమైన వైఖరి ఉండాలి. అర్థం కాకుండానో అనిశ్చితితోనో ఉండరాదు. బహిరంగంగా ఉండడం కోసం మనం వాస్తవాల నుంచి సత్యం రాబట్టే వైఖరిని కలిగి ఉండాలి. మాట్లాడేటప్పుడు కానీ, ఏదైనా సమస్యను పరిష్కరించేటప్పుడు కానీ మనకు కచ్చితమైన శాస్త్రీయమైన వైఖరి ఉండాలి. విషయాలను అతి చేయకూడదు. తక్కువ చేయకూడదు. సరళంగా మాట్లాడాలి. వాస్తవానికి కట్టుబడి ఉండాలి. పనులు నిజాయితీగా చేయాలి. ఒక మాట చెప్పి మరొకటి చేసే, మాటల్లో అంగీకరించి, మనసులో అంగీకరించకుండా ఉండే, తప్పునూ సరైనదాన్నీ గందరగోళపరిచే మోసపూరిత వైఖరి ఉండరాదు. మనం చెప్పే దానికి విరుద్ధంగా వ్యవహరించరాదు. సమావేశంలో సమర్థించిన దాన్ని ఆ తరువాత ఖండించరాదు. గర్వంతో పొంగిపోరాదు. మన ప్రభావాన్ని విస్తరించేందుకు ప్రయత్నించరాదు. తప్పుడు బూర్జువా పని శైలిని కమ్యూనిస్టు పార్టీలోకి తీసుకురారాదు. కమ్యూనిస్టులు కార్మికవర్గ అగ్రగామి. మనం రాజకీయ రంగంలో బహిరంగంగా ఉండాలి. విశాల హృదయంతో, వినమ్రంగా, కష్టపడుతూ, గర్వం లేకుండా విసుగు కలిగించకుండా ఉండాలి. మనని మనం తీవ్రంగా 'ఖండించుకోవాలి'. మనం తప్పులు చేస్తే వాటి నుంచి జాగరుకతతో నేర్చుకోవాలి. వాస్తవంగా వాటిని సరిదిద్దాలి. చికిత్స నివారించడం కోసం మన రోగాన్ని దాచి ఉంచుకోరాదు. తప్పులు దాచుకోరాదు. లేదా విమర్శను నిరాకరించరాదు. విమర్శను నిరాకరించి గొప్పలు చెప్పుకోవడంలో ఆనందం పొందరాదు. మన తప్పులను సమర్థించుకోరాదు. లేదా మరెవరినో తప్పు పట్టరాదు. చైర్మన్ మావో ఇలా అన్నాడు – 'మనం పనులు నిజాయితీగా చేయాలని నేను నమ్ముతున్నాను. నిజాయితీ లేకపోతే ఈ ప్రపంచంలో దేన్ని సాధించడమైనా ఎంత మాత్రం సాధ్యం కాదు'. చైర్మన్ మావో ఈ బోధనను మనం కచ్చితంగా పాటించాలి. నిజాయితీగా మాట్లాడాలి. వ్యవహరించాలి. సూటిగా, స్వేచ్ఛగా నిజాయితీగా ఉండాలి.

'చేయవలసిన మూడు, చేయకూడని మూడు' సూత్రాలు శక్తివంతమైన సైద్ధాంతిక ఆయుధం. రెండు పంథాల మధ్య పోరాటంలో ఇది మనకు మార్గదర్శకం. ఏం జరిగినా కానీ ఈ మూడు సూత్రాలకు సంబంధించి మనం చైర్మన్ మావో బోధనలను అనుసరించాలి. వర్తమానంలోనూ భవిష్యత్తులోనూ మన హృదయాలలో వాటిని నిలిపి ఉంచుకోవాలి. ఈ మూడు సూత్రాలకూ కట్టుబడి ఉండాలి. చురుకుగా సరైన పద్ధతిలో పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటం చేసి సోషలిస్టు విప్లవాన్ని తుదకంటా కొనసాగించాలి.

# రష్యా స్త్రీలు

స్త్రీల జీవితంలో రష్యా విప్లవ తరంగాన్ని సృష్టించింది. బోల్షివిక్ విప్లవానికి ముందు అక్కడ స్త్రీల పట్ల అత్యంత అమానవీయత కొనసాగింది. వాళ్ల పరిస్థితి చాలా శోచనీయంగా వుండేది. రష్యాలోని యార్క్‌టస్క్ ప్రాంతంలో మహిళలను అమ్మే వ్యాపారం కూడా జరిగేది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం నిరాలా అనే కవి 1935లో హిందీలో రాసిన ఒక వ్యాసంలోని ముఖ్యాంశాలను ప్రచురిస్తున్నాం. ఈ వ్యాసం లక్నో నుండి ప్రచురించబడిన 'సుధ' అనే మాసపత్రికలో 1935 జూలైలో ప్రచురించబడింది.

– సంపాదకులు.

"యార్క్‌టస్క్ అనేది రష్యాలోని ఒక ప్రాంతం పేరు. వైశాల్యం రీత్యా ఇది చాలా పెద్ద ప్రాంతం. ఈ ప్రాంతంలోనే మొదట స్త్రీలను అమ్మే దందా జరిగేది. స్త్రీల ధర వాళ్ల వయసు, అందాన్ని బట్టి 30–32 పౌండ్ల గోధుమ పిండి నుండి 30–40 పౌండ్ల వెన్న వరకు ఉంటుండేది. అందగత్తెల్లో కెల్లా అందగత్తెలు ఈ ప్రాంతంలో వేలకు అమ్ముడుపోయేవారు. లేదా తామందించే విలాసాలకు బదులుగా మూల్యాన్ని పొందేవాళ్లు. ఇట్లా అమ్ముడుపోయే స్త్రీలకు వాళ్ల యజమానులపై ఏ హక్కులు వుండేవి కావు. కొనుక్కున్న యజమానులు ఆ స్త్రీలను తమ భార్యలుగా చేసుకొనే వాళ్లూ, వాళ్లతో చాకిరి చేయించుకునే వాళ్లూ, తిండీ–బట్టి ఇచ్చి వాళ్లను పోషించేవాళ్లు. ఆ తర్వాత ఆ కొనుక్కున్న మనిషి ఆ స్త్రీలను ఎప్పుడంటే అప్పుడు తిరిగి అమ్మేసేవాడు. తమ తల్లిదండ్రుల దగ్గర వున్నప్పుడు ఆ అమ్మాయిలకు వాళ్ల జీవితానికి సంబంధించి ఏమీ తెలిసేది కాదు. వాళ్లు ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి అమ్ముడు పోతారో వాళ్లకి తెలియదు. ఎట్లా వాళ్లు తమ తల్లిదండ్రుల ఇంటిని వదిలి వెళ్లాల్సి వస్తుందో తెలియదు. అమ్మాయిల తల్లిదండ్రులు తమ కూతుళ్లు ఎప్పుడు పెద్దవాళ్లయితారోనని ఎదురుచూసేవాళ్లు. వాళ్లకు వయపొచ్చాక సాధ్యమైనంత ఎక్కువ ధరకు అమ్మేయడానికి ప్రయత్నించేవాళ్లు. ఈ అభాగ్య బాలికలకు తమ తల్లిదండ్రుల ఇండ్లల్లో కూడా కాస్తయినా సుఖ, సంతోషాలు దక్కేవి కావు."

రష్యా వివాహ వ్యవస్థ అత్యంత దారుణంగా వుండేది. అమ్మాయిలు తమ తల్లిదండ్రుల చేతుల్లో కీలుబొమ్మల మాదిరిగా వుండేవాళ్లు. పెళ్లి విషయంలో వాళ్లకు ఏ స్వాతంత్ర్యమూ వుండేది కాదు. తండ్రి తన చిత్తానుసారం పైకం తీసుకొని ఎవరితోనంటే వాళ్లతో పెళ్లి చేసేవాడు. ఆ అమ్మాయిలు ఉహు అని కూడా అనలేకపోయేవాళ్లు. తమ వైవాహిక జీవితంలో వాళ్లకు 'భర్తకు అమ్ముడుపోయిన దాసి' వలె పడివుండాల్సి వచ్చేది. వంట చేయడం, నీళ్లు తేవడం, బట్టలుతకడం, బట్టలు కుట్టడం, పిల్లను పోషించడం, పొలాల్లో పని చేయడం–ఇవీ మహిళల రోజువారి కార్యక్రమాలుగా వుండేవి. అన్ని విధాలుగా భర్తను సంతోషపెట్టడం వాళ్ల ఏకైక లక్ష్యంగా వుండేది. చిన్న తప్పిదానికి కూడా పురుషులు వాళ్లను అత్యంత కఠినంగా శిక్షించగలిగేవాళ్లు. మహిళలకు ఎక్కడికి పారిపోయే అవకాశం వుండేది కాదు. ఒకవేళ పారిపోతే పోలీసులు వాళ్లను పట్టుకొని తిరిగి భర్తలకు అప్పగించేవాళ్లు. పురుషులకు వివాహ సంబంధాన్ని తెంచుకొనే సర్వాధికారాలు వుండేవి. చిన్న చిన్న కారణాలకు కూడా వాళ్లు భార్యలను వదిలేయగలిగేవాళ్లు. వ్యతిరేకించడం అనేది పెద్ద మాట, కనీసం ఆమహిళలు కళ్లెత్తి చూసేవాళ్లు కాదు. పితృస్వామ్యం ముందు ఆ మహిళలు తమ సమస్త ఇష్టాలను బలిపెట్టవల్సి వచ్చేది.

ఈ నరకపూరిత దాంపత్య జీవన దురావస్థ మూలంగా సమాజంలో సర్వత్రా వ్యభిచారం పెచ్చరిల్లింది. మహిళలు సమాజం కండ్లు కప్పి తమ 'పాతివ్రత్యాన్ని' నాశనం చేసుకునేవాళ్లు. వ్యభిచారం ద్వారా పుట్టిన పిల్లలు నదులూ, కాలువలూ, చెరువుల వంటి వాటిల్లో విసిరేయబడేవాళ్లు. వేశ్యా గృహాలు కాకుండా మరికొన్ని చోట్ల వుండేవి. అక్కడ యువతులూ, అందమైన బాలికల 'శీలం' అసహ్యకరమైన రీతుల్లో భ్రష్టుపట్టి పోయేది. అటువంటి రహస్య సంకేత స్థలాలు 'లిటిల్ క్యాండిల్ క్లబ్' పేర్లతో ప్రాచుర్యంలో వుండేవి. దుశ్చరిత్ర బయటపడిన స్త్రీని ఇంటి నుండి వెళ్లగొట్టేవాళ్లు. కానీ వ్యభిచార, కామాంధ యువకులకు ఏ శిక్షా వుండేది కాదు.

ఈ కుత్సిత, అత్యాచారపూరిత రష్యా జీవనం ఆఖరికి అంతమైపోయింది. ఇక్కడ ఉధృతంగా జరిగిన బోల్షివిక్ విప్లవం దీనులూ, దళితులను మాత్రమే ఉన్నత స్థితికి తీసుకురాలేదు, అక్కడి స్త్రీలలో కూడా అపూర్వ స్థాయిలో చైతన్యాన్ని మేల్కొల్పింది. నేడు ప్రపంచంలో రష్యా స్త్రీలు తలెత్తుకొనే పరిస్థితిలో వున్నారు. వాళ్ల నరనరాల్లో విద్యుత్ వంటి శక్తి ప్రవహిస్తున్నది. విప్లవం తర్వాత సోవియట్ ప్రభుత్వం ( స్త్రీ–పురుషులకు సమాన అధికారాలను ప్రకటించింది. స్త్రీలలో విద్యను పెంపొందించడం కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరిగాయి. వాళ్లను జాగృతపరచడానికి రష్యాలో పలు రకాల సంస్థలు ఏర్పాటయ్యాయి. అనేక పత్రికలూ, దిన పత్రికలూ స్థాపించబడ్డాయి. స్త్రీల శారీరక, మానసిక, బౌద్ధిక వికాసం కోసం వ్యాయామశాలలూ , క్లబ్‌లూ, గ్రంథాలయాలు ఏర్పాటు చేయబడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇవన్నీ సముచిత రీతిలో ఏర్పాటు చేయబడ్డాయి. కొద్ది రోజుల్లోనే రష్యా స్త్రీల జీవితం నూతనంగా ఉద్భవించిన మొగ్గ వలె వికసించింది. విద్యలను పొందిన స్త్రీలు స్కూళ్లూ, ఆఫీసులూ, కార్ఖానాల్లో పురుషులతో సమానంగా, ఉత్సాహంగా పని చేయడం మొదలుపెట్టారు. వాళ్లు నిర్భయంతో, స్వావలంబనతో వుండడాన్ని ఇష్టపడసాగారు. ప్రతి ఒక్క స్త్రీ పత్రికలు చదవడమూ, రకరకాల కార్యక్రమాల్లో పాల్గొనడమూ, పుస్తకాలయాలకు వెళ్లడం తన కర్తవ్యంగా భావించడం మొదలుపెట్టింది. గ్రామీణ ప్రాంతంలోని స్త్రీల అభివృద్ధి కోసం కూడా అన్ని ప్రయత్నాలు చేయబడ్డాయి. వాళ్లకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించబడ్డాయి. వ్యవసాయ అభివృద్ధి కోసం కృషి విభాగాలు ఏర్పాటు చేయబడ్డాయి. సౌర సమితుల వంటి పాలనా

సంబంధిత పంచాయితీల నుండి వాటికి పూర్తి సహకారం అందించబడింది. ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో కూడా స్త్రీల జీవితమూ, స్త్రీల ఉపాధి వ్యవస్థలో నవీనత చోటుచేసుకుంది. కార్ఖానాల్లో పని చేసే స్త్రీల, బాలికల అభివృద్ధి కోసం చాలా ప్రయత్నాలు జరిగాయి. వాళ్ల కోసం ట్రేడ్ స్కూల్స్ ప్రరంభించారు. వాళ్లకు కార్ఖానా పనిలో ప్రత్యేక శిక్షణ అందించడానికి సముచిత ఏర్పాట్లు చేయబడ్డాయి. ఇప్పుడైతే వాళ్లు కార్ఖానాల్లో పని చేసే సమయంలోని సగం సమయాన్ని ఈ స్కూళ్లలో పని నేర్చుకోవడానికి కేటాయించుకుంటున్నారు. వాళ్లకు ఉపకార వేతనం కూడా లభిస్తుంది. ఇన్నాళ్లూ కూలి చేసుకొని కనాకష్టంగా బతికిన స్త్రీలు ఈ సదుపాయాల మూలంగా ఎక్కువ ప్రయోజనాలు పొందారు.

సోవియట్ ప్రభుత్వం స్త్రీల కుటుంబ జీవితంలోనూ ఒక విప్లవాన్ని తీసుకొచ్చింది. స్త్రీల చాలా విలువైన సమయం పిల్లల పెంపకానికే పోయేది. దాని మూలంగా వాళ్లు తమ సామాజిక, రాజకీయ జీవితాన్ని దృఢంగా, సమున్నతంగా మలుచుకోలేక పోయేవాళ్లు. వాళ్ల అధిక సమయం గృహస్థ చింతలతో గడిచిపోయేది. దేశమూ, సమాజమూ కోసం వాళ్లు ఏమీ చేయలేకపోయేవాళ్లు. ఈ మహా తప్పిదం నుండి దేశాన్ని విముక్తి చేయడానికి సోవియట్ ప్రభుత్వం పిల్లల పోషణ, వాళ్ల చదువూ సంధ్యల బాధ్యతను తన మీద వేసుకుంది. లెనిన్ చెప్పినట్టుగా ఇంటా బయటా రెండు బాధ్యతలూ స్త్రీ, పురుషులిద్దరిపై సమానంగా పడ్డాయి. స్త్రీలు పురుషులతో సమానంగా అధికారాలను పొందారు. ఇప్పుడు రష్యాలోని మూల మూలల్లో సోషలిస్టు సిద్ధాంత ప్రభావం కనబడుతున్నది. సోవియట్ ప్రభుత్వం దేశంలో వసతి గృహాలను ఏర్పాటు చేసింది. వాటిలో దేశంలోని బాలలందరి ఆలనా పాలన చాలా శ్రద్ధగా జరిగేది. ప్రతి స్త్రీ, పురుషుడూ తమకు పిల్లలు కలగగానే ఆ నివాస గృహాలకు పంపేవాళ్లు. అక్కడ పిల్లలందరూ ఆరోగ్యవంతులూ, విద్యావంతులూ, యోగ్యులుగా తయారవుతారు. దీనితో తల్లిదండ్రులు స్వచ్ఛందంగా తమ ఇతర పనులను పట్టించుకోగల్గుతారు. వాళ్లకు తమ పిల్లల ఆలనా పాలనా గురించిన ఎటువంటి చింతా వుండదు. రష్యా నూతన ప్రభుత్వం ఈ పిల్లలను దేశ, సమాజ అంగాలుగా, శాశ్వత సంపదగా భావిస్తుంది. ఈ కారణంగానే రష్యా శక్తి రోజు రోజుకూ పెరుగుతున్నది. ఇప్పుడు పెళ్లి కాకుండా తల్లి అయిన ఏ యువతీ తిరస్కారానికి గురికాదు. ఆమె సంతానం కూడా శిశు గృహాల్లో జాగ్రత్తగా పెరుగుతారు. పెద్దయ్యాక ఆమె సంతానంగానే గుర్తించబడుతారు. ఈ తప్పిదం కారణంగా ఆమెకు జీవితాంతం కష్టాలను భరించే పరిస్థితి వుండదు.

వర్తమాన సోవియట్ ప్రభుత్వం వేశ్యా వృత్తిని అత్యంత నిందనీయమైనదిగా ఖరారు చేసింది. దానికి వ్యతిరేకంగా ప్రభుత్వం అతి పెద్ద ఉద్యమాన్ని కొనసాగిస్తున్నది. సమాజాన్ని ప్రేమించే స్త్రీ-పురుషులందరూ దాన్ని నిర్మూలించడానికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారు. రష్యాలో ఆరోగ్యమూ, సత్ప్రవర్తనను వ్యాప్తి చేయడానికి పెద్ద-పెద్ద సంస్థలు ఏర్పాటయ్యాయి. ఈ సంస్థల్లో భాగంగా 'వేశ్యావృత్తి వ్యతిరేక కేంద్రీయ సమితి' ఏర్పాటయింది. దీని ఫలితంగా ఇప్పుడు రష్యాలో వేశ్యల సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోతున్నది. వేశ్యావృత్తి అనే భావన కూడా మెల్ల మెల్లగా అంతరించిపోతున్నది.

ఈ విధంగా రష్యాలో విద్య, సభ్యత, దేశభక్తి, సత్ప్రవర్తన రోజు రోజుకూ వ్యాపిస్తున్నది. స్త్రీ, పురుషులందరూ ఎటువంటి వివక్ష లేకుండా సామూహికంగా సామాజిక, జాతీయ నియంత్రణలో ఏకాగ్రచిత్తులవుతున్నారు. 'స్త్రీ, పురుషుల జీవితం పరిపూర్ణ స్వతంత్రత, పరిపూర్ణ సహకారిత అనే భావాలతో కలగలిసి పోయింద'నే మౌలిక విషయాన్ని వాళ్లర్థం చేసుకున్నారు. దీని భావమేంటంటే 'స్త్రీ పురుషులు పూలూ, మొక్కల వలె పరస్పరం సంబంధం కల్గినవారు. వాళ్లు పరస్పర స్వతంత్ర భావాల నిర్మల వాయువులో ప్రేమ, గౌరవం అనే వర్షమూ, ఎండలో మాత్రమే అభివృద్ధి చెందుతారు.' అందువల్ల మన భారత స్త్రీల కర్తవ్యమేంటంటే, వాళ్లు కూడా రష్యా స్త్రీల మాదిరిగా అభివృద్ధి చెందాలి. విషపూరిత మూఢ సాంప్రదాయాల బంధనాల నుండి విముక్తి చెంది వాస్తవికత, విద్యల వైపు అప్రతిహతంగా దూసుకుపోవాలి. అందులోనే సమాజ, దేశ శ్రేయస్సు ఇమిడి వుంది. ప్ర

**చరిత్రలో మహత్తర క్రియాశీల యుగాలలో స్టాలిన్ యుగం ఒకటి: బహుశా చరిత్రలో అత్యంత మహత్తరమైన యుగం అది ఈ యుగం రష్యా జీవితాన్నే కాక ప్రపంచ జీవితాన్ని కూడా మార్చి వేసింది..... అది లక్షల మంది వీరులకూ, కొంత మంది రాక్షసులకు జన్మనిచ్చింది. అల్పులు ఇప్పుడు వెనక్కు తిరిగి చూసి అక్కడి నేరాల గురించి మాత్రమే మాట్లాడుతారు...**

**అన్నా లూయిూ స్ట్రాంగ్ (స్టాలిన్ యుగం)**

**ప్రపంచ కార్మిక వర్గ మేడే వర్ధిల్లాలి !**

**ప్రపంచ కార్మికులారా ఏకం కండీ !**

**పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్పా !**

# నాలుగు దశాబ్దాల దండకారణ్య విప్లవోద్యమానికి విప్లవ జేజేలు.

మన దేశంలో 1975-77 మధ్య అత్యవసర పరిస్థితిని విధించి ఇందిరా ఫాసిజం పడగవిప్పి రాజ్య మేలుతున్న సమయంలో భారత విప్లవకారులు 1972 తరువాత ఎక్కడికక్కడే దెబ్బతిన్న ఉద్యమ ప్రాంతాలు సహ దేశ వ్యాప్తంగా విప్లవోద్యమాన్ని తిరిగి బలోపేతం చేసి పురోగమింప చేయడానికి నడుం బిగించారు. వారు ముందుగా నక్సల్బరీ విప్లవోద్యమ వెనుకంజకు గల కారణాలను సమీక్షించారు. ఆ గుణపాఠాలపై ఆధారపడి చేసిన బృహత్ కృషిలో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) ఆంధ్రప్రదేశ్ 'విప్లవానికి బాట' పేరుతో నూతన వ్యూహం-ఎత్తుగడలను రూపొందించుకుంది. అప్పటికే నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాల ప్రభావంతో విప్లవోద్యమం వైపు ఆకర్షితులైన యువతపై ఆధారపడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా అప్పటి ఉత్తర తెలంగాణ జిల్లాలలో వ్యవసాయ విప్లవోద్యమ నిర్మాణకి పునాదులు వేసింది. దేశంలో నానాటికి పెరుగుతున్న ఫాసిస్టు ఇందిరా ఎమర్జెన్సీ వ్యతిరేక పవనాలతో సరిగ్గా అదే సమయానికి కేంద్రం అత్యవసర పరిస్థితిని ఎత్తేయక తప్పలేదు. ఆ అనుకూల పరిస్థితులలో 'విప్లవానికి బాట' అమలుకు దృఢ సంకల్పంతో పార్టీ నాయకత్వం కృషి చేసింది. ఫలితంగా, అనతి కాలంలోనే కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో కరుడు కట్టిన భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా రైతాంగ పోరాటాలు వెల్లువెత్తాయి. ఆ పోరాటాలను నూతన ఎత్తులకు పురోగమింపచేసే కృషిలో భాగంగా 1980లో 'గెరిల్లాజోన్' డాకుమెంటు వెలుగు చూసింది. సీ.పీ.ఐ. (ఎమ్.ఎల్.)లోని కెఎస్ గ్రూపు 'పీపుల్స్‌వార్'గా అవతరించింది.

గెరిల్లాజోన్ డాకుమెంటు అందించిన గైడెన్స్‌లో పార్టీ, తనకు అప్పటికే ఎంతో కొంత పరిచయం ఉన్న సరిహద్దులలోని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల విశాల అటవీ ప్రాంతానికి - దండకారణ్యం - దారులు పరిచి విప్లవోద్యమ విస్తరణకు పూనుకుంది. అవి 1980 జూన్-జూలై మాసాలు! అప్పటి నుండి ప్రస్తుత 2020 జూన్ వరకు గడచిన నాలుగు దశాబ్దాల దండకారణ్య విప్లవోద్యమ కృషిలో అసువులు బాసిన దాదాపు మూడున్నరవేలకు పైగా కామ్రేడ్స్‌కు ముందుగా వినమ్రంగా విప్లవ జోహార్లర్పిదాం. 1980 నవంబర్ 2న మహారాష్ట్ర సరిహద్దు గ్రామం 'ముయ్యబోయినపేట'లో అసువులు బాసిన సింగరేణి కార్మికవర్గ పుత్రుడు కామ్రేడ్ పెద్ద శంకర్ మొదలు 2019 డిసెంబర్ 7న అనారోగ్యంతో అసువులు బాసిన తొలితరం గెరిల్లా, వర్తమాన కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ రావుల శ్రీనివాస్ (రామన్న), 2020 మే మొదటి వారంలో శత్రువుతో సాహసంగా తలపడుతూ తమ ప్రాణాలర్పించిన దండకారణ్య తొలితరం ఉద్యమ ముద్దు బిడ్డ కామ్రేడ్స్ సృజన (జైనీ ఆర్కు)తోపాటు అశోక్, కృష్ణ, సబిత, ప్రమీలాల వరకు ఆ మట్టి తొలుచుకు పుట్టిన ప్రజావీరులందరినీ పేరు పేరున స్మరించుకొని వారి ఆశయాల సాధనకై తుదివరకూ పోరాడుతామని ఈ వేడుకల సందర్భంగా శపథం చేద్దాం. దండకారణ్య ఉద్యమాన్ని ప్రారంభ కష్టాలలో, బాలారిష్టాలలో కాపాడి గట్టిపరిచి ప్రజాపునాది నిర్మాణంలో విప్లవాదర్శాలతో ఎంతో గొప్ప పాత్రను పోషించిన కామ్రేడ్ సత్యంరెడ్డి నుండి మొదలై ఆ ఉద్యమానికి నిన్నటివరకు నాయకత్వం వహించి తీవ్ర అనారోగ్య పరిస్థితులలో శత్రుచేత చిక్కిన కామ్రేడ్స్ నర్మదా (నిర్మలా), కిరన్ (సత్యనారాయణ)ల వరకూ అనేక మంది దండకారణ్యం కోసం అహర్నిశలు కృషి చేసి ప్రమాదకర పరిస్థితులలో జైలు పాలైన వారందరినీ 40 వసంతాల ఉద్యమ వేడుకల సందర్భంగా గుర్తుచేసుకుంటూ వారి విడుదలకై శక్తివంచన లేకుండా కృషి చేద్దాం.

దేశంలోని నేటి ఐదు రాష్ట్రాల కూడలిలోని అడవులలోకి-దండకారణ్యం- దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో నలుబై వసంతాల క్రితం 35మందితో ఏడు గెరిల్లా దళాలు చేరుకున్నాయి. విప్లవోద్యమ ప్రచారం, ప్రజల సంఘటితీకరణ ప్రధాన కర్తవ్యాలుగా చేరిన సాయుధ విప్లవకారులు (గెరిల్లాలు) దోపిడీ పాలకవర్గాల పోలీసుల నుండి ఆత్మరక్షణ చేసుకుంటూనే తొలుత అడవుల సర్వే జరిపారు. ప్రారంభంలో అనేక సమస్యలను-తిండి, భాష, నడక, శత్రువర్గాల దాడులు-అధిగమించి పేద, భూమిలేని ఆదివాసుల అభిమానాన్ని చూరగొన్నారు. సాగు భూముల కోసం అటవీ భూముల స్వాధీనంతో పాటు వెదురు, తునికి ఆకు కొత కూలీ రేట్ల పెంపుదల పోరాటం; ఫారెస్టు, రెవెన్యూ అధికారుల వెట్టి, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సంఘటితమై ప్రజా పోరాటాలు చేపట్టారు. దుష్ట ఆదివాసీ తెగ పెద్దల అక్రమాలకు, ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిలిచారు. తొలినాళ్లలో పోలీసులతో చేరిన శత్రువర్గాలు ప్రజలలో సృష్టించిన భయాందోళనల వాతావరణాన్ని తొలగిస్తూనే గెరిల్లాలు అంకితభావంతో అలుపెరుగని కృషి చేశారు. వారి కృషికి విప్లవాభివందనాలు.

దండకారణ్యం దట్టమైన, విశాల అడవులు, కొండలతో కూడుకొని ఉండడమే కాకుండా అమూల్యమైన అనేక రకాల ప్రకృతి వనరులున్నాయి. దండకారణ్యంలో కోయలు (గోండులు) ప్రధానమైన తెగగా లేదా రూపొందుతున్న జాతిగా ఉన్నారు. కాగా కోందులు, కొండరెడ్లు, మన్నె కోయ, హల్బా, ప్రధాన్, బతరా, గోవారీ మున్నగు పలు ఇతర తెగలూ ఉన్నాయి. దండకారణ్యంలో ఆదివాసీలతో పాటు వివిధ పేర్లతో దళితులు ప్రధానంగా మహర్ (నేతకాని)లు కాపులు (జాడి కాపులంటారు) దాదాపు అంతటా ఉన్నారు. గైరాదివాసీ వ్యాపారులూ ఉన్నారు. వీరికితోడుగా 1970లలో లక్షల సంఖ్యలో శరణార్థులుగా చేరిన బంగ్లాదేశ్‌కు చెందిన 'హిందూ' (అధికశాతం దళితులు) ప్రజలున్నారు.

మన్యం సహ దండకారణ్యమంతా అనాదిగా ప్రజా తిరుగుబాట్లకు పుట్టినిల్లు. బ్రిటిష్‌వారి దోపిడీ దౌర్జన్యాలను, వలసాధిపత్యాన్ని ఎదిరించిన తొలి ప్రజా తిరుగుబాట్లలో బస్తర్ పరాల్‌కోట గేందసింగ్ కొనసాగించిన గెరిల్లా యుద్ధం చరిత్రకు ఎక్కింది. ఆ తరువాతి ఉద్యమాలలో గడ్‌చిరోలీ సద్మెక్ బాబూరావు, బస్తర్ గుండాదూర్, మన్యం అల్లూరి సీతారామరాజు, ఆదిలాబాదు కొంరం భీంల నాయకత్వంలో నడిచినవి నేటికి ఆ వీర ప్రజలకు ప్రేరణాదాయకమే! చరిత్రలో దోపిడీ పాలకవర్గాలు మరుగునపడేసిన వీరయోధుల వారసులుగా మనం పోరాడితీరాలనీ తొలినుండి విప్లవకారులు ఆ ప్రజాయోధుల త్యాగాలను ఎత్తిపడుతున్నారు. దానితో ఇపుడు అనివార్యంగా పాలకవర్గాలు సైతం వారిని ఓవైపు స్తుతిస్తూ మరోవైపు అహింస పాటపాడుతూ వారి వారసులైన ప్రజలను అణచివేస్తున్నారు. నలుబై ఏళ్ల దండకారణ్య విప్లవోద్యమం మట్టి పొరలలో దాగిన చారిత్రికవీరుల త్యాగాలను వెలుగుమయం చేయడంలో కృతకృత్యమైంది.

విప్లవోద్యమ ప్రారంభానికి ముందే పాత బస్తర్ జిల్లాలో ఆగ్నేయంగా ఉన్న బైలాడిల్లా కొండలలో ఇనుప గనుల తవ్వకాలను ఎన్.ఎం.డీ.సీ. జపాన్ వారి కోసం ప్రజలను ఊచకోత కోసి ప్రారంభించింది. గత నలుబై ఏళ్లుగా ఆ తవ్వకాలు కొనసాగుతూ కొండలను నేలమట్టం చేశాయి. ఆ చేదు అనుభవంతో విప్లవపార్టీ నాయకత్వంలో గత నాలుగు దశాబ్దాలుగా విప్లవ ప్రజానీకం తమ జీవితాలను అస్తిత్వాన్ని సవాలు చేసే తవ్వకాలకు వ్యతిరేకంగా జీవన్మరణ పోరాటాలు కొనసాగిస్తున్నారు.

దండకారణ్యం వ్యాపితంగా అన్ని రకాల తెగల ఆదివాసీ పీడిత ప్రజలు విప్లవకారులను ప్రాణంలా చూసుకుంటూ వారి నాయకత్వంలో సంఘటితపడి సమరశీల పోరాటాలలోకి దిగడం దోపిడీ పాలకవర్గాలకు కునుకు పట్టనివ్వలేదు. దానితో మూడు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు పాశవికమైన అణచివేత చర్యలకు దిగాయి. మన్యంలో పదుల సంఖ్యలో ఆదివాసీ ప్రజల పూరిళ్లను మంటలకు ఆహుతి చేశారు. మిగితా రెండు రాష్ట్రాలలో పెద్దెత్తున అరెస్టులు, తప్పుడు కేసులలో ప్రజలను జైలుకు పంపడంతో పాటు విప్లవకారులను బూటకపు ఎదురు కాల్పులలో హత్య చేయడం మొదలైంది. ప్రభుత్వ అటవీశాఖ వారు అత్యంత దౌర్జన్యంగా ప్రజల సాగు భూములను పట్టాలు లేవనే పేరుతో తిరిగి స్వాధీనం చేసుకోసాగారు. స్త్రీ-పురుషులకు సమాన పనిలో అసమాన కూలీ, స్త్రీలపై ఉద్యోగుల లైంగిక దోపిడీ, ప్రభుత్వ ప్రైవేట్ వెట్టి చాకిరీని ఎదిరించిన ప్రజలను లక్ష్యంగా చేసుకొని పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. తొలినాళ్లలో ప్రజలు పోరాడి సాధించుకున్న విజయాలను అన్ని ప్రాంతాలలోని పేపర్ మిల్లుల యాజమాన్యాలు-దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు-భారత రాజ్యంతో కుమ్మక్కై వమ్ము చేయడానికి సిద్ధమయ్యారు. తునికాకు కాంట్రాక్టర్ల నుండి నక్సలైట్లు నిధులు దండుకుంటున్నారనీ మహారాష్ట్రలో ప్రభుత్వం వారిని అడవులలోకి అనుమతించడాన్ని నిలిపివేసింది. ప్రభుత్వ పోలీసు దాడులు ఉన్నత స్థాయిలో సాగుతుండగా ప్రజలు ప్రతిఘటించక తప్పని అనివార్య స్థితి ఆంధ్ర అడవులలో ముందుకు వచ్చింది. విప్లవ గెరిల్లాలు రాజ్య శక్తులను ఎదుర్కోవడమే ప్రధాన కర్తవ్యంగా మారింది. పర్యవసానంగా, 1987 వరకు విశాల దండకారణ్యం ఒక గెరిల్లా జోన్‌గా ఉనికిలోకి వచ్చింది.

విప్లవోద్యమంలో ప్రజలు ఉన్నత స్థాయిలో సంఘటిత పడసాగారు. దండకారణ్య వ్యాపితంగా ప్రజా సంఘాలు ముఖ్యంగా రైతు కూలీలు, మహిళలు రాష్ట్ర స్థాయి నాయకత్వాలను ఎన్నుకొని వాటి మార్గదర్శకత్వంలో పని చేయసాగారు. కరువు వ్యతిరేక పోరాటాలలో కదిలిన ప్రజానీకం నూతన రూపాలలో కరువు దాడులు నిర్వహించారు. ఉద్యమంలో పెరుగుతున్న ప్రజల భాగస్వామ్యం, వారిని అణచడానికి నిరంకుశ ప్రభుత్వాలు చేపడుతున్న హింసాత్మక చర్యలను వెల్లడిస్తూ విశాల పీడిత ప్రజల సంఘీభావాన్ని కూడగట్టుకోవడానికి హిందీలో 'ప్రభాత్' పత్రిక ప్రారంభమైంది.

1983లో ప్రాథమిక సైనిక శిక్షణ పొందిన గెరిల్లాలకు 1987లో ఉన్నత స్థాయిలో సైనిక శిక్షణను ఇవ్వడం మొదలైంది. దండకారణ్య ఉద్యమంపై ఆధారపడి నూతన ప్రాంతాల విస్తరణకు ఉత్తరానికి భండారా, బాలాఘాట్ జిల్లాలకు మార్గాలు తెరచుకున్నాయి. అప్పటివరకు ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ వచ్చిన 'ఫారెస్టు లైజాన్ కమిటీ' స్థానంలో దండకారణ్య పార్టీ మహాసభ జరిగి 'ఫారెస్టు కమిటీ' ఏర్పడింది. దాని నాయకత్వంలో 1987లోనే ఆదిలాబాదు జిల్లాలోని అల్లంపల్లిలో, తూర్పు గోదావరి జిల్లా దారగడ్డలో గెరిల్లాలు తొలి మాటుదాడులకు దిగి పోలీసు బలగాలను మట్టి కరిపించి శత్రు వర్గాలకు ప్రజాయుద్ధాన్ని పరిచయం చేశారు.

దండకారణ్య విప్లవోద్యమం ఉన్నత స్థాయికి ఎదగడంతో ప్రభుత్వ పోలీసు వర్గాలు ద్విముఖ వ్యూహంతో పని చేయ ప్రారంభించాయి. కేంద్రం ఉద్యమ రాష్ట్రాలలోని ఖాకీబలగాలను సైనికంగా సమన్వయించడానికి పూనుకుంది. మహారాష్ట్ర ప్రభుత్వం 1991లో 'స్పెషల్ ఆక్షన్ ప్లాన్'ను చేపట్టి 1992లో స్థానిక యువకులతో 'క్రాక్ కమాండోస్' (సీ)-60 బలగాలను రూపొందించింది. వాళ్లు 1991-94 మధ్య గఢ్‌చిరోలీలో ఎన్నడెరుగని స్థాయిలో ఉద్యమంపై విరుచుకపడ్డారు. యేడాది కాలంలోనే 60మంది విప్లవకారులను ప్రధానంగా విప్లవ ప్రజాసంఘాలలో సంఘటితపడిన ఆదివాసీ యువతను బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చిచంపారు. మధ్యప్రదేశ్‌లోని బస్తర్‌లో 'రాత్‌వాలా' పేరుతో నూతన బలగాలు ఉనికిలోకి వచ్చాయి. అక్కడ ప్రజా ఉద్యమ నాయకుడు చాప లచ్చుమన్నను మాయం చేశారు. అడవుల గాలింపు చర్యల కోసం 'అపరేషన్ మంథన్', 'ఆపరేషన్ దంతెశ్వరీ' తదితర పేర్లతో సైనిక కెంపెయిన్‌లు కొనసాగించడం మొదలైంది. ఆంధ్రప్రదేశ్‌లో అర్ధసైనిక బలగాలు అప్పటికే దిగి అక్కడ స్వైరవిహారం చేయసాగాయి. 1987 వరకు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతూ వచ్చిన శత్రు అణచివేతచర్యలలో 1991నాటికి మొత్తం దండకారణ్య వ్యాపితంగా సారూపత్య సంతరించుకున్నదని కేంద్రకమిటీ అంచనా వేసింది.

ఉద్యమంలో విడిగా సైనిక నిర్మాణాలు ఏర్పర్చుకోవలసిన సమయం ఆసన్నమై 1993లో ప్రత్యేక మిలటరీ దళాలు ఏర్పడగా 1995 నాటికి అవి ప్లాటూన్‌ల స్థాయికి ఎదిగాయి. గ్రామాలలో యువత ప్రజా విలీషియాగా సంఘటితమవడమే కాకుండా సాయుధం కాసాగారు. గ్రామాలలో విప్లవ ప్రజా సంఘాలు సంఘటితం కావడంతో పాటు వాటిలో నుండి చురుకైన, అంకితభావం గలిగిన రాజకీయంగా సచేతనులవుతున్న కార్యకర్తలు ఉన్నత స్థాయిలో ఎక్కడికక్కడే పునాదిస్థాయిలో కార్మికవర్గ అగ్రగామి దళ ప్రాతినిధ్య యునిట్లు (సెల్) సంఘటితం అవుతున్నారు. పటిష్టమవుతూ పెంపొందుతున్న ఉద్యమంలో ఆదివాసీ, గైరాదివాసీ రైతాంగం తిరిగి అటవీ భూముల స్వాధీనానికై తెగించి ముందుకు వచ్చి పంటలు పండించసాగారు. గ్రామాలలో 'సంఘాలదే అధికారం' లేదా 'దున్నే వారికే భూమి, రైతాంగ కమిటీలకే అధికారం' నడుస్తోంది. దుష్ట తెగ పెత్తందార్లలో, భూస్వాములలో ఒక సెక్షన్ (బురద వడ్డె, గోవిందరావులాంటి వాళ్లు) ప్రజల చేతులలో మట్టి గరువగా, మరో సెక్షన్ ఉద్యమం ముందు లొంగిపోయింది. జనజాగరన్ అభియాన్ పేరుతో 1991లో చేపట్టిన విప్లవ ప్రతీఘాతుక తొలి కెంపెయిన్ బస్తర్‌లో దాదాపు మూడు మాసాలలో ఓటమిపాలైంది. గ్రామాలలో ఉన్నతస్థాయిలో ప్రత్యామ్నాయ ప్రజారాజ్యాధికార సంస్థ (నాలుగు వర్గాల రాజ్యాధికార అంగాలు) ఆవశ్యకత ముందుకు వచ్చింది.

దేశవ్యాప్త ఉద్యమ పరిస్థితులను అంచనా వేసిన కేంద్రకమిటీ దండకారణ్య ఉద్యమం ముందు ఉన్నత స్థాయి గెరిల్లా జోన్ నిర్మాణ కర్తవ్యాన్ని ఉంచింది. దండకారణ్య ఉద్యమ భూభాగాన్ని మూడుగా

విభజించి ఆదిలాబాద్ జిల్లాను ఉత్తర తెలంగాణలో, మన్యం ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసి బస్తర్, గఢ్‌చిరోలీలతో కూడిన విశాల అటవీ ప్రాంతాలకు తోడు నూతన విస్తరణ ప్రాంతం బాలాఘాట్‌ను జతచేసి దండకారణ్యంగా 1995లో స్థిరీకరించింది. అప్పటికే దేశంలో నాలుగేళ్లగా 'సరళీకృత ఆర్థిక విధానాలు' (నియో లిబరల్)పేరుతో ప్రారంభమైన సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలతో వ్యవస్థగత మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

విప్లవ ప్రజల ప్రత్యామ్నాయ రాజ్యాధికార సంస్థలు 'గ్రామరాజ్య కమిటీ' పేరుతో ప్రారంభమయ్యాయి. ఉద్యమ ప్రారంభంలో దోపిడీ ప్రభుత్వ పట్టాల కోసం రైతాంగాన్ని సమీకరించి పోరాటాలకు కదలించిన చోట అటవీ భూములు స్వాధీనం చేసుకొని సాగు చేసుకుంటున్న రైతులకు గ్రామరాజ్య కమిటీల ద్వారా భూముల కొలతలు చేపట్టి స్త్రీ–పురుషుల ఉమ్మడి పేర్లతో భూమి పట్టాల పంపిణీ ప్రారంభమైంది. భూముల పట్టాలు మహిళల పేర్లతోనూ ఇస్తూండడంతో మధ్యప్రదేశ్ ప్రభుత్వం కూడా దానినే అనుకరించసాగింది. వ్యవసాయ విప్లవ సంస్కరణలలో భాగంగా అనేక గ్రామాలలో సాగు భూములకు నీటిపారుదల, పశువులకు తాగునీటి వ్యవస్థతోపాటు ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంలో భాగంగా చేపల పెంపకం, తోటల పెంపకం కూడా మొదలైంది. నిన్నటివరకు 'దున్నేవారికే భూమి, రైతాంగ కమిటీలకే అధికారం' నినాదంతో సాగిన ఉద్యమం ఇప్పుడు ఆ భూములను రక్షించుకోవడానికి 'దున్నేవారికే భూమి, గ్రామ రాజ్య కమిటీలకే సర్వాధికారాలు' నినాదాన్ని చేపట్టింది. ఉద్యమంలో పెంపొందుతున్న మహిళల పాత్రను విశాల ప్రజల ముందుకు తీసుకెళ్లడానికి 'పోరుమహిళ' (సంఘర్షరత్ మహిళ) 1996 నాటికి వెలుగు చూసింది.

దేశంలోని పలు ఆదివాసీ ప్రాంతాలలో పటిష్టమవుతూ పెంపొందుతొన్న ప్రజాఉద్యమాన్ని లబ్ధిప్రతిష్ట బుద్ధిజీవులు సహ అనేక మంది అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వం ముందు ఆదివాసీ ప్రాంతాలలో పంచాయితీ వ్యవస్థ విస్తరణపై అనేక మార్పులను సిఫారసు చేసిన నేపథ్యంలో భారత రాజ్యాంగానికి చేసిన 73వ సవరణతో 'పెసా'చట్టం 1996 డిశంబర్24న రూపొందింది. విప్లవోద్యమం కాకుండా భారత రాజ్యాంగం ద్వారానే ప్రజల సమస్యలకు పరిష్కారం అనే భ్రమలతో వారు ఈ కసరత్తుకు దిగారు. ప్రభుత్వ చిరు సంస్కరణలకు భిన్నంగా ఉద్యమ అణచివేతలో భాగంగా బస్తర్‌లో రెండవ విడుత జనజాగరన్ అభియాన్‌ను ప్రారంభించిన్పటికీ విప్లవోద్యమం వర్గ ప్రాతిపదికపై నిర్ధాక్షిణ్యంగా కొద్ది మాసాలలోనే దానిని అణచివేసింది.

ప్రారంభంలో అటవీ ఉద్యమానికి దన్నుగా పరిసర శ్రామిక పట్టణ కేంద్రాలలో ఆర్గనైజేషన్ ప్రారంభించినప్పటికీ వివిధ కారణాలతో అది బలపడలేదు. దేశంలో వివిధ శక్తులను ఆకర్షిస్తున్న శంకర్ గుహ నియోగి నాయకత్వంలో 1997–98 నాటికి బలపడిన 'ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా' లాంటి సంస్కరణవాద కార్మిక సంఘాల నైజాన్ని వెల్లడిచేస్తూ రాజ్యాధికార లక్ష్యంతో శ్రామికులను విప్లవోద్యమంలో సంఘటితం చేయడానికి పార్టీ నడుం బిగించింది. విశాల శ్రామిక కేంద్రంగా ముందుకు వచ్చిన రాయపుర్, దుర్గ్, రాజనందగాం జిల్లాల కార్మిక ప్రాంతాలలో ఆర్గనైజేషన్‌ను పటిష్టం చేసే చర్యలు చోటు చేసుకున్నాయి. మరోవైపు దండకారణ్యంలో దేశంలోని నిజమైన విప్లవకారుల ఐక్యతలో భాగంగా 1997లో సీ.పీ.ఐ. (ఎమ్.ఎల్.) (పీ.డబ్ల్యు.) సీ.పీ.ఐ. (ఎమ్.ఎల్.) (పీ.యూ.)ల విలీనం జరిగింది.

1950లో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన సమయంలో మధ్య ప్రావిన్స్, బేరర్‌లతో కూడిన మధ్యప్రదేశ్ నాగపుర్ రాజధానిగా ఉనికిలోకి వచ్చింది. అప్పటి విధానసభ సభ్యుడైన లాల్‌శ్యాం షాహ్ 1955లో ప్రతిపాదించిన 'గోండ్వానా' బదులు నాలుగునర దశాబ్దాల తరువాత 2000 నవంబర్ 1నాడు 'ప్రత్యేక ఛత్తీస్‌గఢ్' రాష్ట్రం ఏర్పడింది. నూతన రాష్ట్ర నిర్మాణాన్ని ఆహ్వానిస్తూనే బస్తర్ ప్రజలు వేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చి ఈ దేశంలో 6లక్షల జనాభా కలిగిన సిక్కిం ఒక రాష్ట్రం అయినపుడు, 30 లక్షలు పైబడిన జనాభాతోనున్న తమ ఆదివాసీ బహుళ బస్తర్‌ను కూడా ఒక ప్రత్యేక రాష్ట్రంగా గుర్తించాలని నినదించారు. కానీ అపార ప్రాకృతిక వనరులున్న బస్తర్‌ను మినహాయించి ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ నిర్మాణానికి పాలక వర్గాలు ససేమిరా అన్నాయి. ఆదివాసులకు కనీసం స్వయం పాలిత ప్రాంతాలనైనా అవి ఏర్పర్చలేదు. దేశంలోని ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాలలో అమలు చేస్తామని మురిపించిన పెసా అమలు అటకెక్కింది. కానీ మరోవైపు విప్లవోద్యమంలో నిజమైన ప్రజా పాలనా కేంద్రాలుగా గెరిల్లా జోన్‌లలో గెరిల్లా బేసుల నిర్మాణానికి పార్టీ పిలుపునిచ్చింది. వాటి రక్షణ కోసం దేశ విప్లవోద్యమంలో తొలిసారి 2000 డిసెంబర్ 2న పీ.జీ.ఏ.(పీపుల్స్ గెరిల్లా ఆర్మీ) ఏర్పడింది. ఆనాటికి దేశంలోని రాజకీయ పార్టీల పరిస్థితి ఎంత అస్థిరంగా మారిందంటే వాటిలో ఏ ఒక్కటి కూడా గతంలో లాగా కేంద్రంలో ఏకపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పర్చలేక పోతున్నాయి. కేంద్రంలో కూటములతో కూడిన అస్థిర ప్రభుత్వాలు ఏర్పడక తప్పని అనిశ్చిత స్థితులు తలెత్తాయి.

విప్లవ కార్యాచరణలో ప్రతిఘటన సహ కార్యక్రమాలన్నీ కేంపెయిన్‌ల రూపంలోనే చేపట్టాలనే నూతన అవగాహన పెంపొందింది. పీజీఏలోకి పెద్దెతున కేడర్లను భర్తీ కెంపెయిన్‌ల ద్వారా తీసుకోవడం మంచి ఫలితాలను ఇచ్చింది. వందలాది ఆదివాసీ యువత సాయుధమయ్యారు. మన దేశంలో విప్లవం దళితులతో పాటు తక్షణం ఆ వర్గాలకే కావాలి. వారు విప్లవోద్యమంలో పాల్గొని, దోపిడీ వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలతో పోరాడాలంటే వారు సుశిక్షితులు కాకుండా సాధ్యం కాదు. సమాజంలో అప్పటి వరకు వారు కనీస విద్యకు నోచుకోనివారే! భారత రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ విద్య, మాతృభాషలో విద్యా బోధన ఆదివాసుల విషయంలో హుళక్కే అయింది. కాబట్టి వారికి వారి మాతృభాషలో రాజకీయ, పాఠశాల విద్యా బోధన అత్యవసర సమస్యగా ముందుకు వచ్చి పార్టీ 1997లో ఒక ప్రత్యేక కర్రికులం రూపొందించి గోండీలో ప్రారంభించిన విద్యా బోధనకు తోడుగా జనతన సర్కార్ల నిర్మాణం, అభివృద్ధితో పాఠశాల విద్యా విభాగం వికాసం చెందింది. నూతన భర్తీలలో నుండి ఎంపిక చేసిన శక్తుల కోసం మొదట ఆరు మాసాలతో కూడిన 'ప్రాథమిక కమ్యూనిస్టు శిక్షణా పాఠశాల' (బీసీటీఎస్), 2009 వరకు ఉన్నత స్థాయి కేడర్ల రాజకీయ విద్యా బోధనకై కేంద్రకమిటీ నిర్మించిన 'రీపోస్' (రీజియన్ పొలిటికల్ స్కూల్) దండకారణ్య కేడర్లకు చాలా ఉపయోగపడింది.

2000ల తదుపరి గ్రామరాజ్య కమిటీలు మరింత ఉన్నతమైన, విస్పష్టమైన అవగాహనతో విప్లవ ప్రజా కమిటీల రూపంలో ముందుకు

వచ్చాయి. వాటిని స్థానిక ప్రజలు 'జనతన సర్కార్లు'గా పిలుచుకోసాగారు. వాటి రక్షణకు ఉన్నత స్థాయిలో ప్రజామిలీషియా నిర్మాణం పెంపొందింది. గెరిల్లా బేసుల రక్షణకు పీ.ఎల్.జీ.ఏ.లో ప్లటూన్‌ల విస్తరణతో పాటు 2004 జులై నాటికి ఉన్నత స్థాయి నిర్మాణం కంపెనీ ముందుకొచ్చింది. జనతన సర్కార్ నాయకత్వంలో ప్రజలు వివిధ వ్యవసాయ మరియు దాని అనుబంధ పనులలో నాగళ్ల ప్రాతిపదికన సహకారోద్యమానికి పెద్దెత్తున సంఘటితమయ్యారు.

ప్రపంచ ఆర్థిక సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో టాటా, జిందల్, ఎస్సార్ లాంటి అనేక దళారీ నిరంకుశ పెట్టుబడిదారీశక్తులు ఎమ్.ఎన్.సీ.లతో కలసి ప్రాకృతిక వనరులను కొల్లగొట్టుకపోవడానికి నూతన రాష్ట్ర ప్రభుత్వంతో అనేక ఎమ్.ఓ.యూ.లు కుదుర్చుకున్నాయి. గతంలో రెండు విడుతల జనజాగరన్ అభియాన్‌లను ముందుండి నడిపిన కర్కోటకపు ఆదివాసీ భూస్వామి మహేంద్రకర్మ రాష్ట్రంలో పరిశ్రమల శాఖామాత్యుడు అయ్యాడు. ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతంలో అమలు పరచాల్సిన ఆదివాసీ గ్రామసభలను పోలీసుల తుపాకుల నీడలో నిరంకుశ అధికారులు దౌర్జన్యంతో దోపిడీ శక్తుల కోసం కాగితాలపై సృష్టించారు. అయినప్పటికీ వనరుల తరలింపుకు విప్లవోద్యమం వారికి పెను ఆటంకంగా నిల్చి ప్రజల విస్థాపనను అడ్డుకుంది.

2003 నవంబర్‌లో ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ తొలి విధానసభ ఎన్నికలు జరిగి కాషాయ శక్తుల భాజపా గద్దెనెక్కింది. దానికి కొద్ది ముందు కాంగ్రెస్ జోగి సర్కార్ 2003 మార్చ్‌లో దండకారణ్యంలోని బస్తర్‌లో తొలిసారి అర్థసైనిక బలగాలను దింపింది. మరోవైపు దేశంలోని రెండు విప్లవ ప్రవంతులు సమైక్యమై సరండా అడవులలో 'భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)' ఏర్పడింది. రెండు పార్టీల నాయకత్వంలోని ప్రజా సైన్యాలు సమైక్యమై పీ.ఎల్.జీ.ఏ. ఆవిర్భవించింది. ఈ గొప్ప విప్లవకర పరిణామాలతో భారత పాలకవర్గాలు బెంబేలు పడిపోయాయి. నూతనంగా ఆవిర్భవించిన సీ.పీ.ఐ. (మావోయిస్టు) పార్టీని 2005లో దేశ అంతరంగిక భద్రతకు ఏకైక అతి పెద్ద ప్రమాదకర శక్తిగా కేంద్రం ప్రకటించడం, ప్రధాన ఉద్యమ ప్రాంతాలలో ముఖ్యంగా దండకారణ్యంలో 'సల్వాజుడుం' (సామూహిక వేట), ఝార్కండ్‌లో 'సేంద్ర' పేర్లతో 'శ్వేత ఉగ్రవాద దాడి' కెంపెయిన్ దీర్ఘకాల వ్యూహంతో ప్రారంభం కావడం యాధృశ్చికం ఏమీ కాదు. భారత దోపిడీ పాలకవర్గాల నమ్మకబంటు మహేంద్రకర్మ నాయకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు; పోలీసు, అర్థ సైనిక, సైనిక అధికారుల కనుసన్నలలో సల్వాజుడుం పాశవిక దాడులకు పాల్పడుతూ ప్రజలలో భయ భీభత్స వాతావరణాన్ని సృష్టించి ఆదివాసీ సమాజాన్ని నిలువునా చీల్చారు. మూడు ముక్కలైన ఆదివాసీ సమాజంలో మెజార్టీ ప్రజలు విప్లవోద్యమంతో దృఢంగా నిలబడి ఫాసిస్టు సల్వాజుడుం దాడులను అసమాన త్యాగాలతో ఎదుర్కొని 2009నాటికి దానిని ఓడించారు. ఒక సెక్షన్ ప్రజలు తెలంగాణకు తరలివెళ్లగా, మరో సెక్షన్ సల్వాజుడుం నెలకొల్పిన నిర్బంధ శిబిరాలలోకి బలవంతంగా తరలించబడ్డారు. అయితే సల్వాజుడుం ఓటమితో శిబిరాలలోని మెజార్టీ ప్రజలు సంతోషించి విప్లవపార్టీ పిలుపుతో మళ్లీ తమ స్వస్థలాలకు చేరుకున్నారు.

పాలకులూ పోలీసులూ ఆశించిన ఫలితాలు ఇవ్వకుండా సల్వాజుడుం బ్యాక్‌ఫైర్ కావడంతో భారత పాలకవర్గాలు మరింత ఉన్నత స్థాయిలో, విస్తృత పరిధిలో యావత్ దేశవ్యాపిత మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని అప్రకటిత 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'ను మరింత దీర్ఘకాల పథకంతో రూపొందించి 2009 మధ్య నుండి అమలులోకి తెచ్చారు. కానీ శత్రు దాడులను ధీటుగా ఎదుర్కోవడానికి ఇంచుమించు అదే సమయంలో ముందుచూపుతో పీ.ఎల్.జీ.ఏ. సంఘటితీకరణలో భాగంగా కంపెనీలపై ఆధారపడిన గెరిల్లా బటాలియన్ నిర్మాణం జరిగింది. అలాగే అప్పటికే అపూర్వ స్థాయిలో సాగిన సల్వాజుడుం దాడులను ప్రజలు దాదాపు నాలుగేళ్ల యుద్ధం మధ్య యుద్ధాన్ని అభ్యసించిన తీరులో ఎదుర్కొని ఓడించి ఉన్నత స్థాయిలో ఎదురయ్యే దాడులను ఎదుర్కోవడానికి మానసికంగా సంసిద్ధమై ఉన్నారు.

దండకారణ్యంలోని అన్ని డివిజన్‌లలో ఏరియా స్థాయిలో జనతన సర్కార్లు ఏర్పడి మెరుగ్గా పని చేస్తున్న చోట, ప్రజాపునాదిపై ఆధారపడి డివిజన్ స్థాయిలో కూడా అవి ఏర్పడడం ప్రారంభమైంది. 2004లో ఉత్తరాన ఆర్.కే.బీ., (రాజనంద్‌గాంవ్, కాంకేర్, దుర్గ్) దక్షిణాన దర్భా ప్రాంతాలకు విస్తరించిన విప్లవోద్యమం రాష్ట్రంలోని పలు ముఖ్య పట్టణాలకు, శ్రామిక జనాభా కలగిన కేంద్రాలకు చేరువయ్యింది. దండకారణ్యంలో పశ్చిమాన గల గఢ్‌చిరోలీ డివిజన్ ఉద్యమం 2006లో రెండు డివిజన్‌లుగా అభివృద్ధి చెందింది. అయితే, పొరుగున ఉన్న మహారాష్ట్ర విప్లవోద్యమ అవసరాల రీత్యా కేంద్రకమిటీ 2001లో దండకారణ్యంలోని గఢ్‌చిరోలీకి చెందిన కొంత ప్రాంతంతో పాటు బాలాఘాట్ డివిజన్‌ను అందులో భాగం చేసింది. ఆ వరుసనే తూర్పు, మధ్య రీజియన్‌లలోని విశాల గెరిల్లా జోన్‌ల మధ్య అనుసంధానానికి సరండా, దండకారణ్య గెరిల్లాజోన్‌లపై ఆధారపడి 2007 మార్చ్‌లో వ్యూహాత్మక పథకంలో భాగంగా ఒడిశాను కేంద్రం చేసుకొని నూతన విస్తరణకు పునాదులు పడ్డాయి. ఇవన్నీ శతృవు రూపొందించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను శక్తిమంతంగా ఎదుర్కోవడానికి ఎంతగానో దోహదపడినాయి.

తొలినాళ్ల బస్తర్ ఉద్యమం దక్షిణ, పశ్చిమ, ఉత్తర, తూర్పు బస్తర్ డివిజన్‌లతో పాటుగా మాడ్ ప్రాంతం దానికి ఉన్న ప్రత్యేకతల రీత్యా 2000నాటికే ఒక ప్రత్యేక డివిజన్‌గా ఉనికిలోకి వచ్చింది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభించిన కొద్ది మాసాలలోనే 2010 ఏప్రిల్‌లో భారత విప్లవోద్యమ చరిత్రలోనే కాకుండా సీ.పీ.ఎమ్.ఎఫ్. చరిత్రలో సైతం తొలిసారిగా సుక్మాజిల్లా తాడిమెట్ల/ముకురం ఘటనలో 76మంది సీ.ఆర్.పీ. బలగాలు ఒకే సమరంలో మట్టిగరవడం శరాఘతంలా పని చేసింది. ఆ వెంటనే జూన్‌లో కొండగాంవ్ జిల్లా కొంగెరలో దాదాపు 27 మందికిపైగా సీ.ఆర్.పీ. బలగాలను గెరిల్లాలు తుదముట్టించడం దండకారణ్యంలో పెంపొందుతున్న ప్రజా సైనిక గెరిల్లా శక్తుల సామర్థ్యాన్ని తెలియజేసింది.

పై చారిత్రక పరిణామాల నేపథ్యంలో 2011లో జరిగిన దండకారణ్య పార్టీ ప్లీనం 'సైనిక రంగంలో లభిస్తున్న భారీ విజయాలపై ఆధారపడి మిగితా నిర్మాణ కర్తవ్యాలను పరిపూర్తి చేయడంలో పార్టీ వైఫల్యం చెందిందనీ, పర్యవసానంగా ఉద్యమం గడ్డు స్థితికి చేరిందని సమీక్షించింది. శతృవు తన ఓటముల నుండి అనేక గుణపాఠాలను తీసుకొని ఆధునిక సన్నాహాలతో మరిన్ని అదనపు భద్రతా బలగాలను సమకూర్చుకోవడమే కాకుండా ఉద్యమ ప్రాంతాలలో కార్పెట్ సెక్యూరిటీ

అమలుకు వేగంగా పూనుకున్నాడు. ఉద్యమ ప్రాంతాన్ని సెక్టార్‌లుగా విభజించి విప్లవ శక్తులను సమూలంగా నిర్మూలించే రోడ్ మేపు తయారు చేసుకున్నాడు. 2005నుండి ప్రజలపై కొనసాగుతూన్న ఎడతెరిపి లేని దాడులు మరింత తీవ్రమయ్యాయి. పోలీసులు తమ నిరంకుశ అణచివేత చర్యలకు సాధికారత పొందడానికి 'సివిక్ ఆక్షన్ ప్రోగ్రాం' పేరుతో సంస్కరణలను పెద్దెత్తున ప్రోత్సహించారు. వాటితో గ్రామాలలో ఇన్ఫార్మర్స్ నెట్‌వర్క్‌ను విస్తృతం, పటిష్టం చేసుకుంటూ మొబైల్ నెట్‌వర్క్‌ను లోతట్టు అడవి ప్రాంతాలలో సైతం అందుబాటులోకి తెచ్చారు.

ఉద్యమం 2011 చివరినాటికి గడ్డుపరిస్థితికి చేరడంతో, రాజకీయంగా బలహీనమైన, పార్టీ క్రమశిక్షణను పాటించడంలో ఘోరంగా విఫలమైన స్వార్థపర నాయకత్వ శక్తులు ఉద్యమంలో మరిన్ని తప్పులకు ఒడిగట్టి పారిపోయి అంతిమంగా శత్రువు ముందు మోకరిల్లి దండకారణ్య విప్లవోద్యమంపై విషం కక్కసాగారు. మరోవైపు కొన్ని డివిజన్‌లలో ఉద్యమంలోకి నూతన శక్తులు భర్తీ కావడం తాత్కాలికంగా నిలిచిపోయింది, లేదా మందగించింది.

వ్యూహాత్మక ఆత్మ రక్షణ స్థితిలోని విప్లవోద్యమంలో గడ్డు పరిస్థితులు, మందగమనాలు తలెత్తడం అతి సహజం. దీనినే మహోపాధ్యాయులు ఆటు పరిస్థితులుగా నిర్వచించారు. 2011లో దండకారణ్యం గడ్డు పరిస్థితికి చేరగా 2013 నాటికి యావత్ భారతదేశ మావోయిస్టు విప్లవోద్యమం వివిధ రాష్ట్రాలలో వివిధ తేడాలున్నప్పటికీ గడ్డు పరిస్థితులకు చేరింది. విప్లవోద్యమం గడ్డు పరిస్థితులకు చేరడాన్ని పార్టీ గుర్తించడంతో కేడర్లను తీర్చిదిద్దుకోవడానికి బోల్షెవీకరణ కేంపెయిన్‌ను రెండేళ్ల వ్యవధితో చేపట్టి మూడవవంతు శక్తులను ఆ దిశలో సరిదిద్దుకోగలిగింది.

దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో 'విజయం, ఓటమి, అంతిమంగా విజయం' అనే అవగాహనలోని సారాన్ని గ్రహించిన కేడర్లు గెరిల్లా ఎత్తుగడల నియమాలను పాటిస్తూ (రహస్యం, వేగవంతమైన కదలికలు) యుద్ధ చర్యలతో పాటు నిర్మాణ రంగంలో పలు మార్పులను చేపట్టారు. నష్టాలను, పారు బోతుతనాన్ని అరికడుతూ పార్టీ నిర్మాణాలను పటిష్ట పరచుకుంటూ విశాల ప్రజా రాశులలోకి మరింత లోతుగా వెళ్లడానికి 'ఫీల్డ్ స్టడీ' పేరుతో నాయకత్వ కమిటీలకు శిక్షణా కార్యక్రమం మొదలైంది. వీటన్నింటికి తోడుగా పార్టీ నూతన పోరాట రంగాలనూ ఎన్నుకున్నది. చట్టబద్ధ పోరాటాలను చేపట్టింది. విప్లవ పోరాటాల ఫలితంగా దోపిడీ పాలక వర్గాలు ప్రవేశపెట్టిన చట్టాలలోని 'మానవముఖాన్ని' ఎంచుకొని ఆచరణలో ప్రజలను సమీకరించి దాని వికృతత్వాన్ని పార్టీ ఎండగట్టింది. ఉదారవాద మేధావులు ముందుకు తెచ్చిన పెసా గ్రామసభలు 'జల్-జంగల్-జమీన్' నినాదాన్ని ప్రభుత్వాలు ఎలా బుట్టదాఖలా చేస్తున్నాయో చట్టాల బూటకత్వాన్ని ప్రజలకు తేటతెల్లం చేయడానికి పార్టీ జరిపిన కృషిలో నూతన సామాజిక శక్తులు కదిలివచ్చాయి. ఇలాంటి అనేక చర్యలతో ప్రతికూల పరిస్థితులలోని అనుకూలతలను సద్వినియోగం చేసుకుంటూ ఉద్యమాన్ని నిలబెట్టుకోవడం ఆనాటికి ఒక విజయంగానే భావించాలి.

1992 లోనే మహారాష్ట్రలోని గడ్‌చిరోలీలో రూపొందించిన సీ-60లాగా 2013లో ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో డీ.ఆర్.జీ.పేరుతో, రాజనంద్‌గాంవ్‌లో ఈ-30 పేరుతో నూతన ఫోర్సులను దోపిడీ పాలకులు, పోలీసు ఉన్నతాధికారులు ఏర్పర్చారు. ఉద్యమ ప్రాంతాలలో కేంద్ర-రాష్ట్ర బలగాల మధ్య తలెత్తుతున్న తీవ్రవైరుధ్యాలు, నిరాశా నిస్పృహలు, పై అధికారుల వేదింపులు, పనిభారంలాంటి అనేక సమస్యల మూలంగా భద్రతా సిబ్బందిలో తలెత్తుతున్న హత్యలూ, ఆత్మహత్యలూ ఏనాటికానాడు పెరిగిపోతూండడంతో కలవరం చెంది స్థానిక శక్తులతోనే విప్లవోద్యమాన్ని ఎదుర్కోవాలనే దిశలో 'కన్ను నీదే వేలు నీదే'నన్న కుటిల నీతిలో భాగంగా దీర్ఘదృష్టితో వాటిని రంగంలోకి దింపారు.

శత్రువు దీర్ఘకాల పథకంతో చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు గడువు దగ్గర పడుతున్నా కొద్దీ దండకారణ్య విప్లవోద్యమాన్ని అది సమూలంగా నిర్మూలించలేకపోవడంతో, అందులో భాగంగానే నూతన పేర్లతో నిర్దిష్ట లక్ష్యాలతో దూకుడును, తీవ్రతను పోలీసు వర్గాలు పెంచాయి. మిషన్-2016 పేరుతో మొదలైన పోలీసుల దాడులు ప్రధానంగా ప్రగతిశీల, ప్రజాస్వామ్య, ఉదారవాద మేధావులను లక్ష్యంగా చేసుకున్నాయి. సామాజిక కార్యకర్త బేలా భాటియా, స్క్రోల్ పాత్రికేయురాలు మాలినీ సుబ్రహ్మణ్యం, సోనీసోడి, ప్రముఖ గాంధేయవాది హిమాంశుకుమార్ మున్నగువారిని అనేక మందిని లక్ష్యంగా చేసుకొని పోలీసు డీ.ఐ.జీ., ఎస్.ఆర్.పీ. కల్లూరి 'అగ్ని' పేరుతో కొనసాగించిన దాడులు ఖాకీల పైశాచికత్వానికి నిలువుటద్దంలా నిలిచాయి. తక్షణం వాటికి జవాబుగా ప్రజాహిత శక్తులు 'పానీ'ని ముందుకు తెచ్చాయి. కామ్రేడ్ లెనిన్ వందేళ్ల క్రితమే చెప్పినట్టు శత్రువర్గాలే విప్లవం వైపు నూతన మిత్రశక్తులను కూడగడుతాయన్నది ఆచరణలో సల్వాజుడుం వ్యతిరేక కెంపెయిన్ నాటి నుండి అనుభవంలోకి వస్తోంది.

ఆదివాసీ ప్రజలపై సాగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడులను ప్రపంచ ప్రఖ్యాత రచయిత జాన్ మిర్డాల్, బుక్కర్‌ప్రైజ్ విజేత అరుంధతీరాయ్, రాంచందర్ గుహ, నందినీ సుందర్, బీడీశర్మ, బాలగోపాల్ సహా హక్కుల సంఘాల కార్యకర్తలు, దేశ, విదేశీ స్వచ్ఛంద సంస్థలు వివిధ రూపాలలో ఖండించాయి. ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ ఆ దేశంలో నెల రోజుల కెంపెయిన్ చేపట్టి ఓ.జీ.హెచ్.ను ఎండగట్టి భారత ప్రజాయుద్ధానికి తన సంఘీభావాన్ని తెలిపింది. 2011లోనే అంతర్జాతీయంగా వివిధ దేశాల విప్లవ కమ్యూనిస్టు పార్టీలు, శక్తులతో కలసి భారత ప్రజాయుద్ధ సంఘీభావ కమిటీ ఏర్పడింది. 'నూతన విప్లవోద్యమాలకు ఆ పోరాటం విప్లవ వెలుగులను ప్రసరిస్తుంది, వారి పోరాటం మనది, ఎందుకంటే మనమంతా ఒకే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భాగం'అనే అవగాహణతో వారు సంఘీభావోద్యమానికి నడుం బిగించారు.

మరోవైపు దండకారణ్య అడవులలో ప్రజా గెరిల్లాలు శత్రు బలహీనతలను పసిగట్టి సద్వినియోగం చేసుకుంటూ 2014లో కస్నాల్‌పాడ్, 2017లో బుర్కపాల్, కారంపెల్లి లాంటి భారీ మాటుదాడులలో పెద్దెతున పోలీసుకమాండో బలగాలను మట్టికరిపించాయి. యావత్ భారత విప్లవోద్యమంలో భాగంగా దండకారణ్య ఉద్యమాన్ని కాపాడుకోవడానికి దేశంలోని వ్యూహాత్మక ప్రాంతాలలో నూతనంగా యుద్ధక్షేత్రాలను ప్రారంభించడానికి ఎమ్.ఎమ్.సీ. (మధ్యప్రదేశ్ మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్)ల సరిహద్దు ప్రాంతానికి దండకారణ్య బలగాలతో విప్లవోద్యమం విస్తరించింది.

2014లో కేంద్రంలో గద్దెనెక్కిన హిందుత్వ శక్తులు దేశ పాలక, పోలీసు వర్గాలు యేళ్ల తరబడిగా ఎన్ని రకాల వ్యూహాలు, ఎత్తుగడలు చేపడుతున్నప్పటికీ అవి ఏదో ఒక స్థాయిలో వ్యతిరేక ఫలితాలే ఇస్తుండడంతో 2017 మేలో పాత వ్యూహాలను సమీక్షించి నూతన వ్యూహం 'సమాధాన్'ను ఐదేళ్ల కాలవ్యవధితో రూపొందించారు. ఈ వ్యూహం ద్వారా మావోయిస్టు రహిత నవ భారతాన్ని నిర్మించే తమ లక్ష్యాన్ని 2019లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించాడు. అలాగే పట్టణాలలో వివిధ వృత్తులలో, ప్రజల మధ్య ఉంటూ అనేక సామాజిక, రాజకీయ కార్యక్రమాలలో పాలుపంచుకునే లబ్ధప్రతిష్ఠ ఆలోచనాపరులు, కళాకారులు, హక్కుల కార్యకర్తలు, రచయితలు, పాత్రికేయులు, న్యాయవాదులు, మేధావులు తమ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించడాన్ని జీర్ణం చేసుకోలేకపోతూ వారందరినీ 'అర్బన్ నక్సల్స్' లేదా 'హాఫ్ నక్సల్స్' అనే నూతన పదప్రయోగంతో అరెస్టు చేసి వారిపై అనేక తీవ్రమైన ఆరోపణలు చేస్తూ జైలుపాలు చేయడం పెరిగింది.

ఆపరేషన్ సమాధాన్ ప్రకటించాక గెరిల్లాలవైపు నుంచి జరిగిన స్వయంకృత అపరాధాలతో కొన్ని చోట్ల అసాధారణ భారీ నష్టాలను ఉద్యమం ఎదుర్కొన్నప్పటికీ 'సమాధాన్' దాడులను తిప్పికొట్టడంలో ఇర్పనార్, మాహల, జాంబుర్ ఖేడా, మినుపలు నూతన అనుభవాలను ఇచ్చాయి. మరోవైపు నందిగ్రాం మార్గంలో లోహండి గూడా నుండి టాటా ప్లాంట్‌ను ఎత్తివేయించడంలో సఫలీకృతమైన ప్రజలు నూతన రూపాలలో వేల సంఖ్యలో ఏకమై 'పోలీసు క్యాంపులను ఎత్తివేయాలనీ, జల్-జంగల్-జమీన్‌పై తమదే అధికారం' అంటూ వాటి రక్షణకోసం, అమూల్య వనరులను కాపాడుకోవడానికి, విస్తాపనకు వ్యతిరేకంగా చేపడుతున్న ***పత్థల్‌గడీ*** (పెసా) ప్రజాపోరాటాలు పెల్లుబుకుతున్నాయి. అయితే, 1917 మెక్సికో విప్లవం కల్పించిన ***ఎజిడో*** (అడవిపై ఆదివాసీ సమూహాలకు కల్పించిన సామూహిక హక్కు) హక్కులను అక్కడి అధ్యక్షుడు సామ్రాజ్యవాద నియో లిబరల్ విధానాల వకాల్తాదారు సలీనా1991లో ఓ నూతన చట్టం చేసి కబలించిన విషయాన్ని పత్థల్‌గడీ ఆందోళనకారులు గుర్తుంచుకోవాలి. మన దేశంలో కూడా మోదీ ఆ బాటే నడుస్తున్నాడు.

కేంద్రంలో బ్రాహ్మణీయ శక్తులు గద్దెనెక్కిననాటినుండి దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. 2008లో రూపొందిన నూతన అటవీ చట్టాన్ని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన పాలకులు 2019 ఫిబ్రవరిలో భూములకు పట్టాలు లేవనే పేరుతో అడవులనుండి లక్షలాది ఆదివాసులను బేదఖల్ చేయించడానికి సుప్రీంకోర్టుచే ఉత్తర్వులు వెలువరింపచేశారు. దానికి ముందు 2018 మార్చ్‌లో సుప్రీంకోర్టు 'దళిత ఆదివాసీ అత్యాచార నిరోధక చట్టాన్ని' సవరింప చేశారు. కానీ దండకారణ్య ప్రజలు ఈ రెండు సందర్భాలలో తమ వ్యతిరేకతను ప్రకటించారు. 2019 చివర్లో మత ప్రాతిపదికపై రూపొందించిన పౌరసత్వ సవరణ చట్టాన్ని, దాని వెన్నంటి ముందుకు వచ్చిన జాతీయ పౌరసత్వ సూచీ, జాతీయ జనాభా సూచీని దండకారణ్య ఆదివాసులు 'తాము హైందవులం కామంటూ' వ్యతిరేకించారు.

2020 మార్చ్‌నుండి నోవెల్ కొరోనా వైరస్ 'కోవిడ్-19' విజృంభణతో దేశాన్ని పాలకవర్గాలు తీపి కబుర్లతో ప్రజలను గాలికి వదిలి లాక్‌డౌన్‌లతో అతలాకుతలం చేస్తున్నారు. గతంలో అధికోత్పత్తి సంక్షోభాలలో సరుకులను కళ్లముందే నాశనం చేసి కృత్రిమమైన కరువును సృష్టించి ఆర్థిక మాంద్య పరిస్థితులనుండి తాత్కాలికంగా గట్టెక్కె విధానాలను అలవర్చుకున్న దోపిడీ పాలకవర్గాలు నేటి 21వ శతాబ్దంలో అలాంటి ప్రత్యక్ష విధ్వంసకర పద్ధతులు చెల్లవని అతి తెలివితో నెలల తరబడి లాక్‌డౌన్‌లను ప్రకటించి పేద ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్నారు. వైరస్ ప్రాణాంతకమని తీవ్ర భయ వాతావరణాన్ని సృష్టించి భౌతిక దూరం కాకుండా సామాజిక దూరం పేరుతో ప్రజలను వెలివేస్తూ ఎవరి ఇళ్లకు వారిని బందీలు చేస్తూ తమ ఫాసిస్టు చర్యలకు ఎదురు లేకుండా చేసుకుంటున్నారు. ఆర్థిక వ్యవస్థను తిరిగి పట్టాలు ఎక్కించడానికి పీపీపీ పేరుతో లక్షల కోట్ల ప్రజానిధులు ఘరానా కార్పోరేటు వర్గాల కోసం విడుదల చేస్తున్నారు. మరోవైపు పోలీసులు పాలకుల సామాజిక దూరాన్ని అపహస్యం చేస్తూ ప్రజలను కొరోనా గురించి జాగరూకులను చేస్తున్న విప్లవకారుల ఏరివేతకు అడవులలో గాలింపు తాండవం కొనసాగిస్తున్నారు. దండకారణ్య ఉద్యమం పోలీసుల ధోరణిని నిర్ద్వంద్వంగా ఖండించింది. వారి గాలింపు చర్యలకు అడ్డుకట్ట వేయడానికి ప్రతిఘటన చర్యలకు పూనుకొని ప్రజలను విప్లవోన్ముఖులను చేస్తోంది.

దండకారణ్య విప్లవోద్యమంలో కాలిడిన తొలితరం కార్యకర్తలలో తన నవయవ్వన ప్రాయంలోనే భాగమైన రావుల శ్రీనివాస్ (రామన్న) దాదాపు 36 సంవత్సరాల తన విప్లవ పయనంలో సాధారణ గెరిల్లా నుండి దండకారణ్య పార్టీ కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగి 2019 డిసెంబర్ 7వ అనారోగ్యంతో అసువులు బాసాడు. గఢ్‌చిరోలీ ఉద్యమంలో తొలితరం భర్తీలో భాగమై మూడు దశాబ్దాలకు పైగా ఆ ఉద్యమానికి తన సర్వశక్తులను ధారపోసిన అతి సాధారణ ఆదివాసీ మహిళా కామ్రేడ్ సృజన (జైనీ ఆక్కె) ఒక గెరిల్లాగా జీవితాన్ని ప్రారంభించి రీజియన్ స్థాయికి ఎదిగి 2020మే 2నాడు అదే జిల్లా సీన్‌భట్టీలో శత్రువుతో పోరాడుతూ రణరంగంలో వీరమరణం పొందింది. ఆర్‌కేబీ డివిజన్‌లో కామ్రేడ్ రైనుతో సహ నలుగురు కామ్రేడ్స్ పోలీసులతో వీరోచితంగా తలపడుతూ ఒక అధికారిని మట్టుబెట్టి అసువులు బాసారు.

నాలుగు దశాబ్దాల దండకారణ్య విప్లవోద్యమ నేలలో చల్లిన పోరు విత్తనాలు అనేకం మొలకెత్తి, ఏపుగా ఎదిగి, పోరాట ఫలాలను అధికాధికంగా అందిస్తూ యావద్దేశానికి విస్తరింప చేసినవాళ్లలో కొందరు ఈ సందర్భంగా భౌతికంగా మన మధ్య లేరు. ఉద్యమం పట్ల విశ్వాసం సడిలి మడిమ తిప్పిన కొందరు శత్రువుముందు లొంగిపోయారు. నిన్నటి వరకు మనతో కలిసి 'సమాధాన్'ను ఎదిరించిన మన ఉద్యమ సహచరులు (కామ్రేడ్స్ ఇన్ ఆర్మ్స్)కొందరు సమరంలో వీరమరణం పొంది ఇకపై దానిని ఓడించే కర్తవ్యాన్నే కాదు, అలాంటి 'సమాధాన్'లు మరెన్ని ముందుకు వచ్చినా ఈ దేశ విముక్తి మార్గంలో దృఢంగా వాటిని ఎదుర్కొంటూ దుష్ట హిందుత్వశక్తుల 'శ్రేష్ట భారత' స్వప్నాలను చిత్తు చేస్తూ భారత నూతన ప్రజాతంత్ర విప్లవాన్ని జయప్రదం చేసి ప్రపంచ సోషలిస్టు విప్లవానికి బాటలు వేయాలనే సందేశాన్ని తమ రక్త తర్పనం ద్వారా మనకందిస్తున్నారు. ఆ దారిలో నిజాయితీగా, నిర్భయంగా, నిబ్బరంగా, నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనంతో తగిన ఎత్తుగడలు చేపడుతూ ముమ్ముందుకు పోవడానికి నాలుగు దశాబ్దాల వేడుకల సందర్భంగా మరోసారి ప్రతిన బూనుదాం.

# అటవి భూముల నుండి ఆదివాసీలు. పీడిత ప్రజల గెంటివేత

టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు అమ్ముడుపోయి హరితహారం పేరుతో అటవీ ప్రాంతాలలో నిక్షిప్తమై వున్న ఖనిజ సంపదను దోచిపెట్టడానికి జంగల్-బచావో- జంగల్‌బడావో, పర్యావరణాన్ని కాపాడుకుందామంటూ ఫారెస్టు శాఖ, పోలీసులతో సంయుక్తంగా ఆదివాసులపై, పీడిత ప్రజలపై దాడులు కొనసాగిస్తూ దశాబ్దాలుగా ఆదివాసులు సాగుచేసుకుంటున్న అటవీ భూముల నుండి గెంటివేస్తున్నారు.

ఫారెస్టు, పోలీసు అధికారుల దాడులకు వ్యతిరేకంగా ఆదివాసులు, పీడిత ప్రజలు ప్రతిఘటనకు దిగుతున్నారు. దీనితో వందలాది మంది ఆదివాసులపై ఉపా, పీడియాక్టు కింద అరెస్టు చేసి జైళ్ళో బంధిస్తున్నారు. కొన్ని గ్రామాలను కాల్చడం, ధ్వంసం చేశారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అడవుల నుండి గెంటివేయాలని 2019లో సుప్రీంకోర్టు ద్వారా 21 రాష్ట్రాల ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా 40 లక్షల మంది ఆదివాసులు నిర్వాసితులవుతున్నారు. ఈ నేపథ్యంలోనే మోడీ ప్రభుత్వం నూతన అటవీ ముసాయిదా సవరణ చట్టం 2019ని తీసుకవచ్చి ఆదివాసుల హక్కులను కాలరాస్తున్నది. అటవీ భూముల రక్షణ కోసం తెచ్చిన అటవీ హక్కుల చట్టం 2006ను నీరుగార్చారు.

గతంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడుతూ నెత్తురు ధారపోసి భూములను స్వాధీనం చేసుకుని సాగుచేసుకుంటున్న భూములను భూసర్వే పేరుతో ప్రజల భూములను భూస్వాములకు అప్పగించింది. అధికారాన్ని కోల్పోయిన భూస్వాములు తిరిగి గ్రామీణ ప్రాంతాల్లోకి వస్తూ తమ దోపిడీ విధానాలను, ఆధిపత్యాన్ని చలాయిస్తూ ప్రభుత్వ పోరంబోకు, అటవీ భూములను సాగు చేసుకుంటున్న ఆదివాసుల భూములను తిరిగి అక్రమించుకుంటున్నారు. కొత్త భూస్వాములుగా అవతరిస్తూ దోపిడీ విధానాలు అనుసరిస్తున్నారు.

కొంతమంది పారిశ్రామిక వేత్తల, భూస్వాముల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు నెరవేర్చడం కోసం వరంగల్ జిల్లా ఏటూరునాగారం మండలం, కంతనపల్లి గ్రామం వద్ద గోదావరి నదిపై నీటి ప్రాజెక్టును, నిర్మిస్తున్నారు. దీనితో వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మొత్తం 40 గ్రామాలు, సాగు భూములు, ఫారెస్టు భూములు కలిపి మొత్తం 40 వేల ఎకరాలు నీట మునిగి పోతున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని లిఫ్ట్ చేయడానికి తాడ్వాయి మండలం ఊరట్టం వద్ద రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. దీనితో కొత్తూరు, ఊరట్టం, కన్నెపల్లి, కాల్వపల్లి గ్రామాల రైతాంగానికి చెందిన రెండు పంటలు పండిస్తున్న వందలాది ఎకరాలు రిజర్వాయర్లో మునిగి పోతున్నాయి.

ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ వద్ద వన్యప్రాణుల సంరక్షణ పేరుతో కవ్వాల్ టైగర్ ప్రాజెక్టును ఏర్పరుస్తున్నారు. అపారమైన సహజ సంపదను దోచుకపోవడానికి, ముందస్తుగా ఆ గ్రామాలను ఖాళీ చేయించి తమ దోపిడికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చేసుకోవడమే కవ్వాల్ టైగర్ ప్రాజెక్టు ఉద్దేశం. దీనితో 49 ఆదివాసీ గూడాలు 388 హెక్టార్ల సాగు అటవీ భూములు స్థానిక ప్రజలు కోల్పోతున్నారు. అటవీ సహజ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసుల జీవితాలు దుర్భరం కానున్నాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల పరిధిలో 1.99 లక్షల హెక్టార్లలో నల్లమల అడవులు విస్తరించి ఉన్నాయి. ఇక్కడ విలువైన యురేనియం ఖనిజ సంపద వున్నట్లు డిబిర్ సంస్థ కనుగొన్నది. ఈ ఖనిజాన్ని దోచుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదట ఈ ప్రాంతాన్ని టైగర్‌జోన్‌గా ప్రకటించి చెంచు ఆదివాసులను అడవి నుండి ఖాళీ చేయించడం మొదలు పెట్టాయి.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం దేశ సహజ సంపదలను తాకట్టు పెడుతుండడంతో అడవులు, నదులు, గ్రామాలు, సాగు భూములను కబ్జా చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో గనులు, విద్యుత్‌ప్లాంట్లు, సెజ్‌లు, భారీ నీటి ప్రాజెక్టులు, రోడ్లు, తదితర నిర్మాణాలు భారీగా చేపడుతున్నారు. దీనితో దేశవ్యాప్తంగా విస్థాపన సమస్య దినదినం పెరుగుతూనే వుంది. ఫలితంగా జల్-జంగల్-జమీన్-ఆత్మగౌరవం-అధికారాన్ని సర్వం ఆదివాసులు కోల్పోతున్నారు.

భూస్వామ్య అణచివేత, దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా, ఆదివాసులపై పీడిత ప్రజలపై దాడులకు వస్తున్న ఫారెస్టు, పోలీసులపై సాంప్రదాయ ఆయుధాలతో ప్రతిఘటిస్తూ దున్నేవారికే భూమి, రైతాంగ కమిటీలకే అధికారం, జల్, జంగల్, జమీన్ ఇజ్జత్ అధికారం కోసం ఆదివాసులు పీడిత ప్రజలంతా ఐక్యంగా పోరాడాలి. ★

## ప్రజా విముక్తి పాఠకులకు విజ్ఞప్తి

**ప్రజా విముక్తి పత్రికను చదవండి, చదివించండి, చదివి వినిపించండి**

**మీ అమూల్యమైన సలహాలు, సూచనలు రాసి పంపించండి**

**సంపాదక మండలి**

## ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్న సిఎం కేసీఆర్, టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను తాలు పేరుతో నిలువు దోపిడీ చేయడానికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు రైతాంగానికి మద్దతుగా పోరాడండి.

తెలంగాణ దాన్యగారం కానుందని, దేశానికి బువ్వపెట్టే స్థాయికి రాష్ట్రం చేరుకుందని టీఆర్ఎస్ నాయకులు ప్రగల్భాలు పలుకుతూ రాష్ట్రంలో బంగారు పంటలు పండిస్తున్న రైతులను మాత్రం నిలువు దోపిడీ చేస్తున్నారు. కరోనా లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో ప్రతి గింజను కొంటాం అని చెప్పిన సి.ఎమ్ కేసీఆర్ ప్రకటనతో సంతోషపడ్డ అన్నదాతకు దాన్యం కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర అన్యాయాన్ని ఎదుర్కొంటూ కన్నీటి పర్యానికి గురౌతున్నారు. రైతే రాజు,, రైతే దేశానికి వెన్నెముక అంటూ పొగుడుతూ రైతుకు కల్తిమందులు సప్లై చేస్తూ గిట్టుబాటు ధర కల్పించకుండా చేస్తూ బికారిని చేస్తున్నారు. చివరికి అప్పుల ఊబిలోకి నెట్టివేసి రైతన్నలను ఆత్మహత్య లపేరుతో పాలకులు హత్యలు చేస్తున్నారు. కరోనా లాక్‌డౌన్‌తో తీవ్ర ఇబ్బందులకు గురౌవుతున్న రైతాంగాన్ని టీఆర్ఎస్ నాయకులు పౌరసరఫరాల శాఖ అధికారులు, పిఏసిఎ సిబ్బంది, ఐకేపి కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతు సమన్వయ సమితిలు రైస్‌మిల్లర్లతో మిలాఖత్ అయ్యి, తాలు, వ్యర్థాల పేరుతో ఒక క్వింటాకు 10 కిలోల నుండి 14 కిలోల వరకు దోపిడీ చేస్తున్నారు. ఈ పరిస్థితి ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, వరంగల్, ములుగు, రాజన్న, సిరిసిల్ల, జగిత్యాల, ఉమ్మడి వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, జనగాం, నల్లగొండ, మెదక్ ఇలా మొత్తం రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానం కొనసాగుతున్నది. మరోవక్క వడగళ్ళ వానలు రైతాంగానికి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. తాటి పత్రుల, గోనెసంచుల కొరతతో అనేక చోట్ల కొనుగోలు కేంద్రాలలో, కల్లాలలో ఆరబోసిన దాన్యం తడిసి పోయింది. మామిడి, అరటి, బొబ్బాయి, బత్తాయిలు నేలరాలాయి. కూరగాయాలు దెబ్బతిన్నాయి. దీనితో రైతు పరిస్థితి మూల్గేనక్కపై తాటికాయ పడ్డ చందంగా మారిపోయింది. ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 7,500 దాన్య కొనుగోలు కేంద్రాలు ఏర్పాటూ చేస్తామని 5,500 మాత్రమే సెంటర్లు మాత్రమే ఏర్పాటు చేశారు. మార్కెటింగ్ శాఖ కేవలం 1,450 ప్యాడీ క్లీనర్లు మాత్రమే సెంటర్లకు పంపారు. 25 కోట్ల గోనే సంచులు అవసరం ఉంటే 9 కోట్లు గోనెసంచులు మాత్రమే ఉన్నాయి. సిఎం కేసీఆర్ వీటిని తెప్పిస్తామని చెప్పిన ప్రకటన కాగితాలకే పరిమితమై పోయింది. ఇలా రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పంట పండించడం ఒక ఎత్తైతే దాన్ని అమ్ముకోవడం మరింత ఇబ్బందికరంగా మారింది. ఇలా పాలకులు కరోనా పేరుతో రైతులను దెబ్బతీస్తూ ఆరుగాలం శ్రమించి పండించిన దాన్యాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం దళారీగా వ్యవహరిస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నది. పోటోలకు పోజులిచ్చిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, మిల్లర్లు, కొనుగోలు కేంద్రాలు రైతుల పాలిట శాపాలుగా, మారారు.

రైతులు ముందుగానే పంటలు నూర్చి దాన్యాన్ని రోడ్ల, మీద, కల్లాలల్లో ఆరబోయటంతోనే తేమ సమస్య అనేది లేకుండా పోయింది. కాని అనేక కొర్రీలు పెడుతూ రైతులను అరిగోస పెడుతున్నారు. నిబంధనల ప్రకారం గరిష్ఠంగా 17% వరకు తేమా ఉన్న కొనుగోలు చేయాలి. పాలుపట్టని గింజలు, తాలు గింజలు కలిపి 4% ఉన్నా కొనాలి. కాని కొనుగోలు చేయమని పాలకులు, అధికారులు స్పష్టం చేస్తున్నారు. 13,14శాతం ఉ ంటేనే కొంటామంటున్నారు. కాంటా నుంచి మొదలు తరుగు, తాలు రకరకాల పద్ధతులలో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు వందలాది కోట్ల రూపాయాలు దోపిడీకి గురవుతున్నారు.

లాక్‌డౌన్ సందర్భంగా పనులు లేక ఇబ్బందులు పడుతున్న పేదలందరినీ ఆదుకుంటామని కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఆదుకోనే లేదు. పేద ప్రజలు, వలస కార్మికులు, భవన కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చేతిలో డబ్బులు లేక నిత్యావసర సరుకులు కొనుగోలు చేయలేక పోతున్నారు. దీనితో వలసకూలీలు, కాంట్రాక్టు కార్మికులు, రైతులు బిచ్చగాళ్ళుగా మారారు. ఈ కష్ట కాలంలో 50 మంది పెట్టుబడి దారులకు మోడీ ప్రభుత్వం 68,607 కోట్ల రూణాల మాఫీ చేసింది. తప్పా పేదవాళ్ళకు పైసా కూడా ఇవ్వడంలేదు. పేరుకు మాత్రమే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లుగా గారడీ మాటలు చెపుతున్నారు. ప్రతి ఒక్కరి ఆకలి తీరుస్తాం అంటున్న పాలకుల మాటలు ఉ త్తమాటలుగానే మిగిలిపోతున్నాయి. వలస కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడంతోనే వారు రోడ్లపైకి వస్తున్నారు. కరోనా,

లాక్‌డౌన్‌తో మార్కెట్లు మూతపడడంతో మిర్చి, కంది, పసుపు రైతులను దళారీలు మోసం చేస్తూ తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. మిర్చి రైతులకు మద్దతుధర అందడంలేదు. ప్రభుత్వం కొనుగోలు చేసిన కందులకు ఇంకా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. మిర్చి రైతులకు వడ్డీలేని రుణాలు ఇస్తామని ఇవ్వడం లేదు. ఆదివాసీలు సేకరించిన అటవీ ఉత్పత్తులను, తునికాకును కొనుగోలు చేయడంలేదు. వెంటనే కొనుగోలు చేయాలి.

టీఆర్ఎస్ నాయకులు, అధికారులు, ఐకేపి కేంద్రాల సిబ్బంది, రైతు సమన్వయ సమితీ సభ్యులు రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై తాలు, వ్యర్థాల పేరుతో 10 నుండి 14 కిలోలు దోపిడీ చేయడం మానుకోవాలి.

- ప్రభుత్వం ప్రకటించిన మద్ధతుధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలి.

- గోనె సంచులు, తాటిపత్రులు, ప్యాడీ క్లీనర్లు వెంటనే అందించాలి.

అకాల వర్షాలతో తడిసిన దాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి.

- అకాల వర్షంతో నష్టపోయిన మామిడి, అరటి, నిమ్మ, బత్తాయి, బొబ్బాయి, కూరగాయాల రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. బత్తాయి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు నష్టపరిహారం చెలించాలి.

మిర్చి, పసుపు-కంది రైతులకు మద్ధతుధర చెల్లించాలి.

ఆదివాసులు సేకరించిన అటవీ ఉత్పత్తులను తునికాకును వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలి.

లాక్‌డౌన్ కొనసాగుతున్న ఈ కాలంలో సంపన్నులకు పన్నులు విధించి పేదప్రజలకు నిత్యావసర సరుకులు తక్కువ ధరలకు అందించాలి.

- టీఆర్ఎస్ ప్రభుత్వం మావోయిస్టు పార్టీ దళాలను నిర్మూలించడానికి కొనసాగిస్తున్న కూంబింగ్స్‌నువెంటనే ఆపివేయాలి. ★

## మా పార్టీపై ఎస్పీ సునిల్‌దత్ ఆదివాసుల నుండి నిత్యావసర సరుకులు లాక్కుపోతున్నారని చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించండి.

## కరోనా పేరుతో వేలకోట్లు దోసుకుంటున్న పాలకులు. ఆదివాసీ ప్రజలకు నిత్యావసర సరుకుల సప్లై పేరుతో పోలీసు అధికారులు, టీఆర్ఎస్ అధికార పార్టీ నాయకులు దోసుకోవడాన్ని ఖండించండి.

కరోనా-లాక్‌డౌన్ పేరుతో పాలకులు వేల కోట్ల రూపాయలను విరాళాలుగా సేకరిస్తూ 100 రూపాయాలు ఖర్చు చేసి వేయి రూపాయలు ఇచ్చినట్లుగా దొంగ లెక్కలు రాస్తూ వేలకోట్ల రూపాయాలు దోచుకుంటున్నారు. ప్రజలకు, నిత్యావసర సరుకులను సప్లై చేయడానికి పోలీసు అధికారులకు ఫండ్ కేటాయిస్తే వాటిని మింగేస్తూ చిన్న చిన్న వ్యాపారుల నుండి మొదలు పెద్ద వ్యాపారుల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేసి వాటిలో కూడా సగం కాజేసి కొద్ది పాటి సరుకులు కొన్ని ఇటీవలనే కొన్ని ఆదివాసీ గ్రామాలలో ప్రభుత్వం సర్పంచ్‌లు, పోలీసు అధికారులు, ఇతర అధికారుల ద్వారా కుటుంబానికి కిలో ఉల్లి గడ్డలు, ఒక కారం ప్యాకేట్, ఒక పసుపు పాకేట్, పావు కిలో మంచి నూనె పాకేట్, ఆలుగడ్డ- 1 కేజి, 1 కిలోల మైసూరు పప్పు కొద్ధి మంది ఆదివాసులకు మాత్రమే పంపకం చేసి మేము పెద్ద ఎత్తున నిత్యావసర సరుకులను పంపిణి చేశామని గోబెల్స్ ప్రచారం చేసుకుంటున్నారు. పైగా మేము ఆదివాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తే మావోయిస్టులు ఆదివాసుల నుండి నిత్యావసర సరుకులు బలవంతంగా లాక్కుపోతున్నారంటూ దొంగే దొంగ దొంగ అన్న చందంగా భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ సునిల్‌దత్ అరుస్తున్నాడు. బెదిరించే వాళ్ళు మీరే. దోచుకునే దోంగలు మీరే. కాబట్టి ప్రజలు మీపైనే చర్యలు తీసుకుంటారు.

కరోనా, లాక్‌డౌన్‌తో ఆదివాసీలు, పీడిత ప్రజలు తీవ్ర ఇబ్బందులలో ఉంటే టిఆర్ఎస్ ప్రభుత్వం, పోలీసులు మావోయిస్టుల నిర్మూలన పేరుతో ఏజెన్సీ ప్రాంతంలో కూంబింగ్ చేపడుతూ ఆదివాసులను తీవ్ర చిత్రహింసలకు గురిచేస్తూ మావోయిస్టుల పేరుతో అరెస్టులు చేస్తూ జైళ్ళలో పెడుతూ ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయాన్ని కల్గిస్తున్నారు దీన్ని ప్రజాస్వామిక వాదులు, తీవ్రంగా ఖండించాలని కోరుతున్నాము. ★

# హిందూ రాష్ట్ర నిర్మాణ దిశలో ప్రజా వ్యతిరేక పౌరసత్వ చట్టం

దేశంలోని కేంద్ర, అసోం రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన హిందూత్వ విద్వేష విధానాల మూలంగా ఈశాన్య ప్రాంతం ముఖ్యంగా అసోం ఇటీవలి కాలంలో మరోసారి భగ్గుమంది. అసోంలో పెల్లుబుకుతున్న నేటి ప్రజా నిరసన పోరాటాల వెనుక సుదీర్ఘ చరిత్ర వుంది. ఆ మూలల్లోకి వెళ్లకుండా ప్రస్తుత జాతీయ పౌరసత్వ జాబితా (నేషనల్ సిటీజన్‌షిప్ రిజిస్టర్) మీదా తలెత్తుతున్న వివాదాలను సమగ్రంగా అర్థం చేసుకోలేం. పైగా నిప్పుకు సుడిగాలి తోడైన చందంగా బ్రాహ్మణవాద శక్తులు అధికార మదంతో బలంగా ముందుకు తెస్తున్న తమ చిరకాల హిందూ రాష్ట్ర నిర్మాణం వెనుక దాగిన చాణక్య నీతిని, మతాల ప్రాతిపదికపై వారు ముందుకు తెస్తున్న చీలిక వాదాన్ని బట్టబయలు చేయలేం. అసోం ప్రజల న్యాయమైన డిమాండ్లకు పీడిత ప్రజల సమైక్యతా దృష్టి కోణంతో సవ్యమైన పరిష్కారాలను ప్రతిపాదించలేం.

1947కు ముందూ తర్వాత అసోం అనేక పరిణామాలకు లోనైంది. చరిత్రలో అసోం మొదటిసారి 1826లో బ్రిటీష్ వలసవాదుల దురాక్రమణతో వారి స్వాధీనమై బంగాల్ ప్రావిన్స్‌లో భాగమైంది. తమ స్వయం ప్రతిపత్తి కోల్పోయిన అసోం 1905 వరకు అంటే దాదాపు ఎనిమిది దశాబ్దాల కాలం బ్రిటీష్ వారి బంగాల్ ప్రావిన్స్‌లోనే భాగంగా ఉండిపోయింది. కానీ ఆ తర్వాత అసోంను 1905లో బ్రిటీష్ వారు తూర్పు పాకిస్తాన్ లేదా పూర్వ బంగ్లా (వర్తమాన బంగ్లాదేశ్)లో చేర్చారు. బ్రిటీష్ వలసవాదులు చేపట్టిన ఆనాటి మార్పులు వారి ప్రజలను విభజించు-పాలించు సిద్ధాంతంలో భాగంగానే చోటుచేసుకున్నాయన్న యధార్థాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఆ క్రమంలోనే అసోంలో మొదట బంగాల్ వాసులు ఆ తర్వాత తూర్పు పాకిస్తానీయులు పెద్ద సంఖ్యలోనే అపార ప్రాకృతిక వనరులకు, సిరి సంపదలకు నిలయమైన అసోంలోని సారవంతమైన భూములు సంపాదించుకొని స్థిరపడ్డారు. అక్కడ చదువుకున్న వారిని బ్రిటీష్ వారు తీసుకువచ్చి తమకు అవసరమైన ప్రధానంగా గుమస్తా ఉద్యోగాలలో నియమించారు. క్రమంగా, వారితో పాటు రాజస్థాన్ మార్వాడీలు సహ అనేక మంది ఇతర ప్రాంతాల వర్తకులు అక్కడికి చేరి స్థిరపడ్డారు. అలా చేరిన వారిలోనూ అత్యధికులు బంగాలీలేనన్నది వివాదాలకు తావులేని ఒక వాస్తవం. ఫలితంగా అసోం సమాజంలో అస్సామీయులు క్రమ క్రమంగా అన్ని రంగాలలో రెండవ శ్రేణి పౌరుల స్థాయికి అనధికారికంగానే దిగజారక తప్పలేదు. అస్సామీ ప్రజలకు చాలా కాలం వరకు కనీసం వారి మాతృభాషలో విద్యనభ్యసించడం కాకుండా వారిపై రుద్దబడిన బంగ్లాలోనే నేర్చుకోక తప్పలేదు.

తేయాకు పంటకు అసోం చాలా అనువయిన ప్రాంతం. అమూల్యమైన, అపారమైన చమురు సంపద, అటవీ సంపదలకు అది నిలయం. ఆ సంపదను దోచుకోవడానికై తమకవసరమైన ఉద్యోగులను బ్రిటీష్ వారు ఇరుగు పొరుగు రాష్ట్రాల నుండి ప్రధానంగా బంగాల్ నుండి అక్కడికి చేర్చారు. అంతకు మించి అనేక రెట్లు అధికంగా వారికి కావాల్సిన కూలీలను దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల నుండి అక్కడి తేయాకు తోటలలో పని చేయడానికి బ్రిటీష్ వారు వత్తిడీ, దౌర్జన్యంతో పాటు అనేక ఆశలు, భ్రమలు కల్పించి చాలా మంది నిరుపేదలకు తేయాకు తోటలలోకి కూలీలుగా తరలించారు. వారిలో ఆదివాసీల జనాభా గణనీయంగా ఉండింది. అనేక ప్రాంతాల శ్రామిక ప్రజలకు తేయాకు తోటలు ఒక పెద్ద కూడలి కావడంతో వారిలో పరస్పర సంపర్కం ద్వారా సహజంగానే రాజకీయ చైతన్యం పెంపొంది తదనంతర కాలంలో దేశంలోని పలు ఆదివాసీ ప్రాంతాలలో బ్రిటీష్ సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ప్రజ్వరిల్లడానికి దోహదపడింది. ఇక్కడ సారాంశంలో మనం తెలుసుకోవలసిన విషయం ఏమంటే అసోంలో పెల్లుబికిన 1980ల నాటి వలసల వ్యతిరేక ప్రజా ఉద్యమాన్ని బ్రిటీష్ వారి హయాంలోనే తొలి బీజాలు పడ్డాయి.

1947లో దేశ విభజన జరిగిన తర్వాత చెలరేగిన మత కల్లోలాలతో తూర్పు పాకిస్తాన్ (పూర్వ బంగ్లా) నుండి సరిహద్దులోని అసోం చేరిన బంగాళీ 'శరణార్థులు' అధిక సంఖ్యలోనే ఉంటారు. వారికి తోడు తిరిగి 1971లో సామ్రాజ్యవాదుల జోక్యందారీ విధానాలతో చోటుచేసుకున్న భారత, పాక్ యుద్ధం మూలంగా మరో విడత అసోం చేరిన బంగ్లా 'శరణార్థులు' తో అక్కడి వలస జనాభా ఇంకా పెద్ద ఎత్తున పెరిగింది. ఆ యుద్ధాలతో పాటుగా బంగ్లాదేశ్ గ్రామాలలో ఒక పక్క కటిక పేదరికం, మరో పక్క ముస్లిం మత ఛాందసవాదుల దాడులకు గురవుతున్న తూర్పు పాకిస్తానీయులు అనేక మంది అనధికారికంగానే పొరుగున ఉన్న యావత్ ఈశాన్య ప్రాంతం ముఖ్యంగా అసోంతో వారికి గల అనుబంధంతో అక్కడికి అనివార్యంగానే అధిక సంఖ్యలో చేరారు. దేశంలో అసోంతో పాటుగా వారు అధికారిక 'శరణార్థులు'గా, వారి వెన్నంటి అనధికారికంగా పెద్ద ఎత్తున చేరిన ప్రాంతం దండకారణ్యం.

అసోం ప్రజలలో సమస్యలు పెరిగే కొద్దీ అక్కడి జనాభా దామాషాలో వస్తున్న మార్పు అస్సామీయులను చాలా కలవరపెట్టింది. అసోం జనాభాలో 60 శాతానికి లోపు అస్సామీ భాష మాట్లాడే వారుంటే మిగిలిన 40 శాతం ఇతరులే అయ్యారు. ఈ ప్రమాదకర ధోరణి వారిని వలసల వ్యతిరేక ఉద్యమానికి నెట్టింది.

బ్రిటీష్ వారి హయాంలో చాలా వెనుబడిన స్థితిలో ఉన్న అస్సామీయులు 'స్వతంత్ర' భారతంలో ఎంతో బాగుపడుతామని ఊహించుకోవడం సహజమే కాని, 1947 తర్వాతి అసోం స్థితిలో పెద్దగా మార్పు లేదు. అక్కడి తేయాకు, కలప, ముడి చమురు లాంటి విలువైన వనరులను భారత దోపిడి పాలక వర్గాలు దోచుకోవడమే తప్ప అసోం ప్రజల అభివృద్ధి గూర్చి ఎంత మాత్రం శ్రద్ధ వహించలేదు.

అసోంలో 20వ శతాబ్దం చివరి వరకు ఆధునిక పరిశ్రమ ఏ ఒక్కటి కూడా పెంపొందలేదు. రైల్వే నిర్మాణం నామ మాత్రంగా ఉ

ంది. పెట్రోలియం, టీ, కలప పరిశ్రమలు బ్రిటీష్ హయాంలో ఆరంభమయినా వాటికి సంబంధించిన ఆర్థిక వ్యయహారాలన్నింటికీ (అమ్మకం, స్టోరేజీ మొదలైన వాటన్నిటికీ) కొలకత్తా కేంద్రం చేయబడింది. అది అస్సామీయులలో నిరుద్యోగం మరింతగా పెరగడానికి దారి తీసింది.

అసోం ప్రజలలో పెంపొందుతున్న అనమానతలతో చోటుచేసుకుంటున్న అసంతృప్తి అంతా తనకు వ్యతిరేకంగా సంఘటితం కాకుండా తప్పుదారి పట్టించడానికి బ్రిటీష్ వారి ఫక్కీలోనే కేంద్ర ప్రభుత్వం కూడా భాషా, సంస్కృతి వగైరా విషయాలపై, అస్సామీయులకు, అస్సామేతరులలో అధిక సంఖ్యలో ఉన్న బంగాలీలకూ మధ్య వైరుధ్యాలుగా చిత్రిస్తూ వారి మధ్య అనేక గలాటాలు పెంచడానికి పూనుకుంది. అలాంటి కేంద్ర ప్రభుత్వం పన్నాగాలకు బంగాలీ బ్యూరోక్రసీ, వ్యాపారస్తులు, తదితర బంగాలీ జాతీయ దురహంకారులు తగినంతగా ఉప్పందించారు. 1950, 1960, 1968, 1972 సంవత్సరాలలో జరిగిన అసోం ప్రజల న్యాయమైన పోరాటాలకు పోటీగా బంగాలీలను నిలబెట్టడంలో కేంద్ర ప్రభుత్వం చాలా వరకు కృతకృత్యమైంది.

అసోంలో చట్టరహితంగా ఉంటున్న వారిని వెనక్కి పంపించాలనీ మరో విడుత 1979లో ఉద్యమం బద్దలైంది. 'అఖిల అసోం విద్యార్థి సంఘం' (అసు) సమరశీలంగా ఆందోళనకు దిగింది. ఆ ఉద్యమం దాదాపు ఆరేళ్ళు సాగింది. ఆ సమయంలో చాలా మిలిటెంట్‌గానే ప్రజలు కూడా ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. 'అసు' పార్లమెంటరీ ఎన్నికల బహిష్కరణకు పిలుపు ఇవ్వగా దాదాపు అది సంపూర్ణంగానే జయప్రదమైంది. ఆ ఉద్యమంపై రాజ్యం పాశవికంగా అమలు చేసిన హింస, అణచివేత దాడులలో దాదాపు వెయ్యి మంది ప్రజలు అసువులు బాసారు.

'అసు'తో పాటు అసోం గణ పరిషత్, 'యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ అసోం' (ఉల్ఫా) లాంటి సంస్థలు ఉనికిలోకి వచ్చి ఉద్యమానికి నాయకత్వాన్ని అందించాయి. పెటీ బూర్జువా శక్తుల నాయకత్వంలో సాగిన ఆ ఉద్యమం 1985లో కేంద్రంతో తమ డిమాండ్లపై చర్చలకు సిద్ధమై ఆగస్టు 15 నాడు ప్రధాని రాజీవ్‌గాంధీ సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. దానితో ఆ ఒప్పందం 'రాజీవ్‌గాంధీ ఒప్పందం' గానే పిలువబడుతోంది. దాని ప్రకారం 1971 మార్చ్ 23 తర్వాత అసోం చేరిన హిందూ, ముస్లిం ప్రజలను గుర్తించి వారిని వెనక్కి పంపాలనే నిర్ణయం జరిగింది. కానీ అది 2014 వరకూ ఏ రూపంలో అమలులోకి రాలేదు.

అసోం సమస్యకు అసలు మూలం పిడి పిడీలుగా అక్కడ స్థిర పడిన వలసలే కనుక ప్రజా ఉద్యమంతో పాటుగా కొద్ది మంది బుద్ధిజీవులు ఆ సమస్యపై సుప్రీంకోర్టుకు వెళ్లడంతో 1951 నాటి ఎన్ఆర్‌సి జాబితాను అప్‌డేట్ చేసి అసలు అసోం పౌరులు ఎవరో తేల్చామని న్యాయస్థానం ప్రభుత్వాన్ని అది ఆదేశించింది. 1951లో మొదటిసారి అసోంలో 'జాతీయ పౌరసత్వ జాబితా' (ఎన్ఆర్‌సి) తయారైంది. మరోవైపు అసోంలోకి వలస వచ్చిన బంగ్లా దేశీయులందరినీ రాజీవ్ గాంధీ ఒడంబడికలోని ఒప్పందం ప్రాతిపదికనే విదేశీయులుగా గుర్తించాలని 2015లో మోది ప్రభుత్వం సైతం ఆదేశాలు ఇచ్చింది. కానీ, మరుసటి ఏడాది ఇందుకు భిన్నంగా పొరుగు దేశాల నుంచి వలస వచ్చిన హిందువులకు మాత్రమే భారత పౌరసత్వం ఇచ్చేట్టుగా 'జాతీయ పౌరసత్వ (సవరణ) బిల్లు'ను లోక్‌సభలో ప్రతిపాదించడంతో అసోంలో ఆందోళనలు ఆరంభమైనాయి.

2018 జనవరి 1 నాడు అసోం ప్రభుత్వం మొదటి విడుత ఎన్ఆర్‌సి ముసాయిదాను విడుదల చేసింది. అసోంలోని 3.29 కోట్ల జనాభాలో కేవలం 1.9 కోట్లు మాత్రమే చట్టబద్ధంగా అసోం ప్రజలంటూ అందులో పేర్కొన్నారు. దానితో సూచిలో పేర్లు గల్లంతు అయిన ప్రజలు అట్టుడికిపోయారు. ఆ ముసాయిదా లక్షలాది కుటుంబాలలో చిచ్చురేపింది. కేవలం బంగ్లాదేశ్ నుండి వచ్చిన వారినే కాకుండా పిడిపిడీలుగా అసోంలో ఉంటున్న వారి దగ్గర సైతం సరైన అధికారిక ప్రమాణ పత్రాలు లేవంటూ (ఆధార్ కార్డు, రాషన్ కార్డులను పరిగణనలోకి తీసుకకోవడం లేదు) దశాబ్దాల ముందు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి అసోం చేరిన భారత వాసులను కూడా ఆ ముసాయిదా విదేశీయుల కిందే లెక్కించింది. ఆ జాబితాలో విదేశీయుల కింద లెక్కించబడిన వారిలో హిందూ, ముస్లిం సహ ఇతర మతాల వారూ ఉన్నారు. వారంతా అసోంలో 1971కి ముందు నుండే ఉంటున్న వారిగా నిరూపించుకోని పక్షంలో రాజీవ్‌గాంధీ ఒడంబడిక ప్రకారం అసోం నుండి వారు బయటకు వెళ్లాల్సి ఉంటుందనేది స్పష్టమే!

1971 తర్వాత అసోం చేరిన బంగ్లాదేశ్ పేద ముస్లిం ప్రజలను ఇప్పుడు 2019లో అంటే దాదాపు అర్ధ శతాబ్దానికి తిరిగి బంగ్లాదేశ్‌కు వెనక్కి పంపాలనీ భారత ప్రభుత్వం నిర్ణయించినంత మాత్రాన అక్కడ వారిని బంగ్లాదేశ్ ప్రభుత్వం స్వీకరించి, ఆ దేశ పౌరులుగా ఇప్పుడు గుర్తించి వారికి పునరావాసం కల్పించే స్థితే ఉంటే వాళ్లు నిజంగా 'శరణార్థులయ్యేవారే' కాదు. ఈ ఐదు దశాబ్దాల కాలంలో ఇక్కడే జన్మించిన పిడీలను ఇక్కడి పౌరులుగా గుర్తించకపోవడాన్ని నిజానికి భారత రాజ్యాంగమే ఒప్పుకోదు. గత 35 ఏండ్లుగా రాజీవ్ ఒప్పందాన్ని మూలనపడేసిన ఇవాళ లక్షలాది ముస్లిం ప్రజలను మాత్రం వీధుల్లోకి ఈడ్వడం బ్రాహ్మణవాద కుట్ర తప్ప మరేం కాదు. వాళ్లను చొరబాటుదార్లుగా ప్రభుత్వం పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండించాలి. వారిని దేశ బహిష్కృతులను చేయడం కాకుండా దేశ పౌరులుగానే గుర్తించి సమాన హోదా కల్పించాలి. అసోం ప్రజల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికై కేంద్ర ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి.

పై సమస్యతో అసోం అట్టుడికిపోతుండగా కేంద్ర 'పౌరసత్వ సవరణ బిల్లును' లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. దాని ప్రకారం అఫ్ఘనిస్తాన్, పాకిస్తన్, బంగ్లాదేశ్‌లకు చెందిన హిందూ, ఇసాయి, సిక్కు బౌద్ధ, జైన, పార్సీ మతాల వారినే ఈ దేశ పౌరులుగా గుర్తిస్తారు. ముస్లిం ప్రజలను మాత్రం దేశ బహిష్కృతులను చేస్తారు. ఈ బిల్లును

రాజ్యసభలో నెగ్గించుకోవడానికి హిందుత్వ శక్తులు ఉవ్విళ్లూరుతునాయి. 17వ లోక్‌సభ ఎన్నికలలో మెజార్టీతో ఎన్నికైన హిందూత్వ శక్తులకు ఆ బిల్లును చట్టంగా మార్చే రోజు ఎంతో దూరం లేదు. జాయింట్ పార్లమెంటరీ కమిటీలో సగం మంది బీజేపి వారే కనుక, అక్కడ ప్రతిపక్ష హెూదానైనా లేని విపక్షాల వాదనలన్నీ వీగిపోయి ప్రభుత్వం ఆశించిన రీతిలోనే బిల్లు తయారై వచ్చింది. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వలస వచ్చిన ఇస్లామేతర మతాలకు చెందిన వారికి భారత పౌరసత్వాన్ని ఇచ్చే ఈ బిల్లు దేశవ్యాప్తగా వర్తించేదే కావచ్చును కానీ, ఈశాన్యాన్ని, ముఖ్యంగా అసోంను వెన్వెంటనే తీవ్రంగా ప్రభావితం చేయబోతున్నది. 2014 డిసెంబర్ చివరి నాటికి మూడు పొరుగు దేశాల నుంచి మన దేశంలోకి ప్రవేశించిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవులకు మాత్రమే ఆ బిల్లు ప్రకారం భారత పౌరసత్వం దక్కుతుంది. అసోం సమస్యను, రాజీవ్‌గాంధీ ఒప్పందాన్ని పక్కనపెట్టి కొత్తగా మరో చట్ట రూపకల్పనకు కేంద్రం పూనుకోవడాన్ని ఈశాన్య రాష్ట్రాలన్నీ వ్యతిరేకిస్తున్నవి. పైన పేర్కొన్న బిల్లును వ్యతిరేకిస్తూ అసోం సహ అన్ని ఈశాన్య రాష్ట్రాల ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. ప్రస్తుత బిల్లు లేదా రూపొందబోయే రేపటి చట్టంతో కేవలం ముస్లిం ప్రజలను మాత్రమే అసోం నుండి బహిష్కృతులను చేయడం ద్వారా అసోం ప్రజల శతాబ్దాల సమస్య, ఈశాన్య రాష్ట్రాల సుదీర్ఘ వలసల సమస్య వాస్తవంగా నూతన రూపం తీసుకొని ప్రజలల్లో మళ్లీ 1947 నాటి దేశ విభజన తరహాలో మత ప్రాతిపదికన చీలికలు సృష్టించి ఆరని చిచ్చుకు ఆజ్యం పోసినవారవుతారు. అందుకే అసోంలో నూతన బిల్లును వ్యతిరేకిస్తూ తిరిగి ప్రజా ఉద్యమం పెల్లుబుకుతోంది. అన్ని సెక్షన్‌ల ప్రజలు తమ నిరసనను వివిధ రూపాలలో వ్యక్త పరుస్తున్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా అక్కడ జరుగుతున్న ఉద్యమాలకు మద్దతుగా ఈశాన్యంలోని అనేక మంది కవులు, కళాకారులు మోదీ ప్రభుత్వం ఏలుబడిలో పుచ్చుకున్న పురస్కారాలను తిరగ్గొడుతూ నిరసన వ్యక్తం చేశారు. ప్రముఖ అస్సామీ గాయకుడు భూపేన్ హజారికాకు మరణానంతరం భారత ప్రభుత్వం 2019లో ప్రకటించిన భారత రత్న పురస్కారాన్ని ఆయన కుమారుడు తేజ్ హజారికా తీసుకో నిరాకరించిన విషయం తెలిసిందే! బిల్లు ఉపసంహరిస్తేనే భారత రత్నను ఆమోదిస్తానన్న హజారికా కుమారుడు తేజ్ అన్నట్టుగా బిల్లుపై ఈశాన్యంలో రేగిన వ్యతిరేకతను చల్లార్చడానికే హజారికాకు భారత రత్న ప్రకటించి, ఆయన పేరును, ఈశాన్య ప్రజల్లో ఉన్న విశేష గౌరవాన్ని బీజేపి రక్షణ కవచంలాగా వాడుకున్నదన్నది వాస్తవం.

అస్సామీ భూమి పుత్రుల్లో బిల్లు పట్ల వ్యక్తమవుతున్న వ్యతిరేకతను చీల్చడానికి లోక్‌సభ ఎన్నికలకు కొద్ది ముందు అక్కడి ఆరు తెగలకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఆదివాసీ హెూదా ప్రకటించింది. ఇప్పటికే ఎస్టీలుగా ఉన్న వారి సమస్త ప్రయోజనాల పరిరక్షణకు నిర్దిష్టమైన చర్యలు తీసుకోబోతున్నట్టు, 'అటానమస్ కౌన్సిల్' బలోపేతానికి రాజ్యాంగ సవరణ చేయబోతున్నట్టు కూడా దేశీయ వ్యవహారాల మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లోక్‌సభలో ప్రకటించాడు. అస్సామీల భాష, సంస్కృతి ఇత్యాది విషయాల పరిరక్షణకు హమీ పడిన అసోం ఒప్పందంలోని ఆరవ క్లాజ్ అమలు దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు నటిస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని ప్రకటించింది. రెండు దశాబ్దాలుగా 'ప్రశాంతంగా' ఉన్న అసోంలో మళ్లీ జాతి ఆకాంక్షల ఉద్యమ జ్వాలలు రాజుకున్నాయి. దీనికి పూర్తిగా కేంద్రమే బాధ్యత వహించాలి. కేంద్రానికి వ్యతిరేకంగా యావత్ ఈశాన్య ప్రాంత ప్రజలు సమరశీలంగా ముస్లిం సోదరులను కలుపుకొని పోరాడాల్సిన ఆవశ్యకత ఈ రోజు ఎంతగానో ఉంది.

లోక్‌సభ ఎన్నికలకు ముందు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాని మోదీ ఈశాన్య ప్రాంతంలో నిర్వహించిన ఎన్నికల సభలన్నింటిలో జాతీయ పౌరసత్వ అమలు గురించి ఘంటాపథంగా చెబుతూ వచ్చారు. ఎన్నికలలో తిరిగి గతం కన్నా అధిక మెజార్టీలో వారు గెలుపొందారు. ఎన్నికలకు ముందు అసోం ప్రజా ఉద్యమంతో గొంతు కలుపుతూ అసోం గణ పరిషత్ (ఏజీపీ) కేంద్రానికి తన మద్దతును ఉపసంహరించుకుంది. కానీ తీరా ఎన్నికల తేదీలు ప్రకటించాక ఏజీపీ అధికార దాహంతో హిందుత్వ శక్తులకు దాసోహం అంది. మోదీ నూతన మంత్రి వర్గంలో దేశీయాంగ మంత్రిగా అమిత్ షా బాధ్యతలు చేపట్టాడు. ఆయన పదే పదే దేశంలో ఏమూలనున్నా చొరబాటుదారులను ఏరిపారేస్తామంటున్నాడు. అది వారి హిందూ రాష్ట్ర నిర్మాణంలో భాగం. వారి పగటి స్వప్నాలను ఈ దేశ ప్రజలెన్నటికీ నిజం కానివ్వరు. ఆ ప్రజా పోరాటంలో ఈశాన్య ప్రజలు అగ్ర భాగాన నిలవాలి. నిజానికి అసోం ప్రజల అన్ని సమస్యలకు అసలు కారణం కేంద్ర ప్రభుత్వం దోపిడి విధానాలలోనే ఉంది. వాటికి వ్యతిరేకంగా ధృఢంగా పోరాడకుండా, సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా భూస్వామ్య వర్గాల దోపిడిని అంతమొందించకుండా ఈశాన్య జాతుల ప్రజల నిజమైన డిమాండ్లు పరిష్కారం కావు.

**పార్టీ గనుక తన విజయాలతో కొట్టుకొనిపోతే, అహంభావాన్ని పెంపొందించుకొనుట ప్రారంభిస్తే తన పనిలోని లోపాలను గమనించుట మానివేస్తే తన తప్పులను చిత్తశుద్ధితోనూ నిష్కపటంగానూ సరిచేసుకొనకపోతే, కార్మికవర్గ నాయకురాలుగా తన పాత్రను నిర్వహించలేదని కూడా మన పార్టీ చరిత్ర బోధిస్తోంది.**

**లెనిన్**

# అమరులకు అరుణాంజలి

**కామ్రేడ్ సుదీప్ ఉరఫ్ కంచన్ పశ్చిమ బంగ్ రాష్ట్రకమిటీ కార్యదర్శి**

ఆయన పశ్చిమ బెంగాల్‌లో దీర్ఘకాల ప్రజాయుద్ధ సేనానులలో ఒకరు. ఆయనది దిగజారిపోతుండిన ఎగువ మధ్యతరగతి కుటుంబం. ఆయన పశ్చిమ బంగ్‌లో ఆనాటి సీపీఎం ప్రభుత్వ నిరంకుశ విధానాలకు, అణచివేతకు వ్యతిరేకంగా యువజనులను కూడగట్టి పోరాడారు. 1980ల ఆరంభంలో నక్సల్బరీ రాజకీయాలతో ప్రభావితుడయ్యారు. విద్యార్థి రంగం నుంచి విప్లవ రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనతో పాటు మరికొందరు కామ్రేడ్స్ కేఎన్ రాంచంద్రన్ నాయకత్వాన గల సీపీఐ (ఎంఎల్) రెడ్‌ఫ్లాగ్ గ్రూపు మితవాద అవకాశవాద రాజకీయాలను వదలి 1990 దశకం ఆరంభంలో సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్)లో చేరారు. జంగల్‌మహల్ ప్రాంతంలో వ్యవసాయ విప్లవానికి పునాదులు వేసే ప్రక్రియను ఆరంభించడంలో నాయకత్వం వహించారు. 1995-98 మధ్య కూలిరేట్ల పెంపు, అడవిపై అధికారం, సాల్ ఆకుల, తునికాకుల రేటు పెంపుతో పాటు పలు వ్యవసాయ సమస్యలపై ప్రజలను సంఘటితం చేసారు. ఈ ప్రజా పోరాటాల లక్ష్యం రివిజనిస్టు సీపీఎం పాలనలో బలంగా వున్న భూస్వామ్య వ్యవస్థకు, అది పెంచి పోషించిన నూతన తరహా భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయడం. 1998లో మమతా బెనర్జీ నాయకత్వాన గల తృణమూల్ కాంగ్రెస్ బీజేపీతో చేతులు కలిపి కేస్‌పుర్, గొర్బెతా ప్రాంతాలపై ఆధిపత్యం కోసం సీపీఎం నాయకుడు సుశాంత్ ఘోష్ వాహినికి వ్యతిరేకంగా తీవ్రమైన ఘర్షణలకు దిగడంతో ఆ ప్రాంతం నుంచి సీపీఎం వెనక్కు తగ్గింది. దీంతో ఆ ప్రాంతంలో సీపీఎం పక్షాన ఉండిన కార్మికులపై, రైతులపై తృణమూల్, బీజేపీల అత్యాచారాలు తీవ్రతరమయ్యాయి. ఈ అత్యాచారాలకు వ్యతిరేకంగా పీపుల్స్‌వార్ పార్టీ ప్రజలను సంఘటితం చేసి కొనసాగించిన సమరశీల ప్రతిఘటనా పోరాటంతో తృణమూల్-భైరవ వాహిని (తృణమూల్ నాయకత్వాన పనిచేసే అమానుష సాయుధ మిలీషియా), బీజేపీ వెనక్కు తగ్గకతప్పలేదు. గొర్బెతా భూమిపుత్రుడు కామ్రేడ్ సుదీప్, కామ్రేడ్ అసిత్ సర్కార్‌లు దీనికి నాయకత్వం వహించారు. భూమిలేని పేదరైతులలో అధికంగా ఉన్న సీపీఎం కార్యకర్తలు, సభ్యులు పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో సంఘటితం కావడంతో సింఘ్‌భూమ్, బేల్‌పహాడీ, గొర్బెతా, పింగ్‌లాలతో కూడిన విశాల ప్రాంతంలో సాయుధ ప్రజా ఉద్యమం విస్తరించింది. తృణమూల్-బీజేపీలు వెనక్కి తగ్గిన తర్వాత సోషల్ ఫాసిస్టు సీపీఎం తిరిగి సుశాంత్-దీపక్‌ల నాయకత్వంలో ఆ ప్రాంతంలో ప్రవేశించింది. ఆ ప్రాంత ప్రజలకు శత్రువుగా మారింది. చోటో అంగరియా వంటి హత్యాకాండల ద్వారా సుశాంత్-దీపక్ బాహిని భయోత్పాతం సృష్టించింది. సీపీఎం ప్రభుత్వం పీపుల్స్‌వార్ పార్టీ ప్రజాసంఘం కిసాన్-మజ్దూర్ సంగ్రాం సమితిని నిషేధించింది. దీంతో పెద్దెత్తున అరెస్టులు సాగాయి. 2002లో సుదీప్‌ను అరెస్టు చేసారు. 2004లో తిరిగి విడుదలయ్యారు. 2008లో కామ్రేడ్ సుదీప్ ఉరఫ్ కంచన్ ఐక్య పార్టీ సీపీఐ (మావోయిస్టు) పశ్చిమ బంగ్ రాష్ట్రకమిటీ కార్యదర్శిగా ఎంపికయ్యారు.



కామ్రేడ్ సుదీప్ చోంగ్‌దార్

పశ్చిమ బంగ్‌లో పాలకవర్గాల తొత్తు సీపీఎం బుద్ధదేవ్ భట్టాచార్య ప్రభుత్వం రైతుల భూములను బలవంతంగా సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి వ్యతిరేకంగా రైతులు నందిగ్రామ్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో మిలిటెంట్‌గా పోరాడారు. ఇది దేశవ్యాప్తంగా సెజ్‌ల వ్యతిరేక పోరాటంగా ప్రసిద్ధి చెందింది. ఈ పోరాటం ఆ రాష్ట్రంలో కొరకరాని కొయ్యగా మారిన రివిజనిస్టు సీపీఎం ప్రభుత్వ పునాదులను కుదిపివేయడంలో ప్రత్యేక పాత్రను పోషించింది. ఈ పోరాటానికి నాయకుడిగా 'సుకుమార్' పేరుతో కామ్రేడ్ సుదీప్ అందరి అభిమానాన్ని చూరగొన్నారు. నందిగ్రామ్ తర్వాత లాల్‌గఢ్ ప్రజా విజృంభణ ప్రారంభమైంది. లాల్‌గఢ్ ఉద్యమ ప్రముఖ నాయకులలో కామ్రేడ్ సుదీప్ కూడా ఒకరు. 2010 డిసెంబర్ 2న మరో ముగ్గురు రాష్ట్రకమిటీ సభ్యులతో పాటు కోల్‌కతా నగరంలో తిరిగి ఆయన అరెస్టు అయ్యారు. పోలీసు నిర్బంధంలో చెప్పనలవికాని చిత్రహింసలకు గురయ్యారు. ఆయనను అనేక తప్పుడు కేసులలో ఇరికించారు. అనేక జైళ్లు తిప్పారు. ఆయనకు సుదీర్ఘకాలం పాటు బెయిల్ ఇవ్వకుండా అడ్డుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో వున్నప్పటికీ కనీస వైద్య సదుపాయాలు కల్పించలేదు. ఈ విధంగా ముందు సీపీఎం ప్రభుత్వం, తర్వాత తృణమూల్ ప్రభుత్వం ఆయనను ఉద్దేశ్యపూర్వకంగా మృత్యుముఖానికి నెట్టాయి. చివరికి, కామ్రేడ్ సుదీప్ చోంగ్‌దార్ ఫిబ్రవరి 8, 2019న కోల్‌కతా ప్రెసిడెన్సీ జైలులో సెరిబ్రల్ మలేరియాతో, ఫాసిస్టు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అకాల మృత్యువు పాలయ్యారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకొని, వారిని ప్రాణంగా భావించి, వాస్తవిక స్థితిని వాస్తవికంగా విశ్లేషించడంలో దక్షత కలిగిన ఒక సాహసిక విప్లవ కమ్యూనిస్టు ఆర్గనైజర్, భారత కార్మికవర్గ ఉత్తమ పుత్రుడి అమరత్వానికి అశ్రు నయనాలతో వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిద్దాం!

## ట్రైజంక్షన్ ఎస్‌జడ్‌సీ సభ్యుడు కామ్రేడ్ మణివాసగం



కామ్రేడ్ మణివాసగం

పశ్చిమ కనుమల ఎస్‌జడ్‌సీ సభ్యులు కామ్రేడ్ మణివాసగం తమిళనాడుకు చెందినవారు. ఆయన వయస్సు 57 సంవత్సరాలు. విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాలతో ప్రభావితులై అప్పటి సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్)లో చేరారు. ఉపాధ్యాయ ఉద్యమంలో కొంతకాలం పనిచేసి 1980ల చివరిలో స్కూల్ టీచర్ ఉద్యోగం వదిలి పార్టీలో వృత్తి విప్లవకారుడిగా విప్లవోద్యమంలోకి వచ్చారు. 2000 సంవత్సరంలో తమిళనాడు రాష్ట్రకమిటీ సభ్యుడయ్యారు. తమిళనాడు రాష్ట్రకమిటీ నాయకత్వాన అర్బన్ కమిటీ ఏర్పడినప్పటి నుంచి అందులో భాగమై పట్టణోద్యమానికి నాయకత్వం వహించారు. రెండుసార్లు అరెస్టయినప్పటికీ శత్రువు నుంచి పార్టీ రహస్యాలను కాపాడారు. 2 సంవత్సరాల తర్వాత 2012లో జైలు నుండి విడుదలైన వెంటనే అజ్ఞాతవాసంలోకి వచ్చి అటవీ ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణంలో పార్టీకి నాయకత్వం వహించారు. పశ్చిమ కనుమల (కర్నాటక-కేరళ-తమిళనాడు ట్రైజంక్షన్) ప్రాంత ఉద్యమ నిర్మాణంలో తొలి నుండి నాయకత్వ స్థాయిలో పనిచేస్తూ ఎస్‌జడ్‌సీ సభ్యుడిగా నడగని, అట్టపాడి దళాలకు నాయకత్వం వహించారు. ట్రైజంక్షన్ గ్రామీణ ప్రాంతంలోని పట్టణ ఉద్యమ నిర్మాణ కృషిలో భాగమయ్యారు. మధుమేహం వంటి వ్యాధులకు గురైనప్పటికీ ఎల్లప్పుడూ ఆయన చురుకుగానే ఉండేవారు. పార్టీ ఎడ్యుకేషన్ కోసం విప్లవ సాహిత్యాన్ని ఇంగ్లీషులోకి, ఇంగ్లీషు నుండి తమిళంలోకి అనువాదాలు చేయాల్సిన అవసరాన్ని ఒక విప్లవ బాధ్యతగా గుర్తించి మావో రచనలు మొదటి సంపుటితో పాటు అనేక పుస్తకాలను తమిళంలోకి అనువాదం చేసారు. పార్టీ కేడర్లకు అనేక విషయాలపై రాజకీయ తరగతులు నిర్వహించారు. సామ్రాజ్యవాదుల బడితొత్తులయిన ప్రతీఘాతుక బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు బీజేపీ కేంద్ర ప్రభుత్వం తమిళనాడు ఏఐడీఎంకే ప్రభుత్వ ఎస్‌టీఎఫ్ బలగాలు, కేరళ సీపీఎం ప్రభుత్వ థండర్‌బోల్ట్ బలగాలు కలిసి ట్రైజంక్షన్ ప్రాంతంలో కామ్రేడ్స్ మణివాసగంతో పాటు నలుగురు కామ్రేడ్స్‌ను క్రూరంగా హత్య చేసారు. ఆ ప్రాంతంలో ప్రజాయుద్ధానికి పునాదులు వేసి అత్యంత విలువైన అనుభవాలను అందించిన కామ్రేడ్ మణివాసగంకు తలవంచి నివాళి అర్పిద్దాం.

**దున్నే వారికే భూమి నినాదంతో ఉద్యమిద్దాం.**
**జల్-జంగల్-జమీన్-ఇజ్జత్-అధికారంకై పోరుచేద్దాం.**

కామ్రేడ్ సృజన మే 2 నాడు గఢ్‌చిరోలీ జిల్లా ఏటపల్లి తాలూకా సీన్‌భట్టీ అడవిలో చుట్టుముట్టిన సీ-60 కమాండోలతో సాహసంగా పోరాడుతూ అసువులు బాసింది. కామ్రేడ్ సృజన 1988 వేసవిలో గఢ్‌చిరోలీ జిల్లా భామ్రాగఢ్ ప్రాంత విప్లవోద్యమంలో భాగమై గత 33 ఏండ్లుగా భారత నూతన ప్రజాతంత్ర విప్లవ విజయానికై వివిధ స్థాయిలలో బాధ్యతలు నిర్వహిస్తూ 2020 మే 2 నాడు అసువులు బాసింది.



కామ్రేడ్ సృజన

కామ్రేడ్ సృజన చిన్నతనం నుంచి కుటుంబ సభ్యులతో కలసి వ్యవసాయ, కూలీ పనులలో పాల్గొని ఎంతో కష్టపడి పిన్న వయసులోనే శ్రమజీవిగా జీవితానుభావాన్ని గడించింది. గడ్‌చిరోలీ జిల్లా భామ్రాగడ్ తాలూకా గోపనార్ గ్రామంలో ఆర్కే గోత్రంవారి ఇంట్లో దాదాపు 50 సంవత్సరాల క్రితం జన్మించిన ఆమెకు తల్లి తండ్రులు జైనీగా పేరు పెట్టుకున్నారు. ఆమెకు ఒక చెల్లెలు ఒక అన్న ఉన్నారు. ఆమెకు యుక్తవయసు రాగానే తల్లి తండ్రులు మేనరికానికి ఇచ్చి వివాహం చేశారు. కానీ, ఆ వివాహం ఆమెకు ఎంతమాత్రం ఇష్టం లేకపోవడంతో ఆ బంధాన్ని తెంచుకొంది. ఆ సమయానికే ఆ ప్రాంతానికి నూతనంగా విప్లవోద్యమం విస్తరించింది. 1980 జూన్-జులై మాసాలలో గోదావరి నది దాటి సిరొంచ అడవులలోకి, ఆదివాసులలోకి ప్రవేశించిన విప్లవోద్యమం 1984నాటికి భామ్రాగడ్ చేరుకుంది. తొలినాళ్లలో విప్లవోద్యమం అనేక సమస్యలను ఎదుర్కొన్నప్పటికి అది ప్రజా సమస్యలను చేపట్టి ఉద్యమాలలోకి ప్రజలను సమీకరించడంతో విశాల అడవులలోని ఆదివాసులకు ఉద్యమ వార్తలు దావానలంలా చేరుకున్నాయి. పీడిత ప్రజలకు విప్లవోద్యమం అండగా నిలుస్తుందనే విశ్వాసం జిల్లా ప్రజలలో బలంగా నెలకొంది. ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు తోడు మహిళలు అదనంగా పితృస్వామ్య ఆధిపత్యాన్ని భరిస్తున్నారు. ఆ ప్రజల వెనుకబాటుకు ప్రతిబింబంగా కాలంచెల్లిన సంప్రదాయాల సంకెళ్లలో మహిళ దిక్కు తోచని దుస్థితిలో నలిగిపోతున్న రోజులలో విప్లవోద్యమం వారికి పరిచయం కావడంతో వారిలో జీవితం పట్ల కొత్త ఆశలు చిగురించాయి. వారి జీవన సమరానికి నూతన దారులు తెరుచుకున్నాయి.

1988లో విప్లవోద్యమంలో చేరిన జైని మొదట చిన్నక్కగా

పెరిమిళి ప్రాంతంలో మూడేళ్లు పని చేసి 1991లో ఉద్యమ అవసరాల రీత్యా ప్రస్తుత ఉత్తర గఢ్‌చిరోలీలోని టిప్రాగఢ్ ప్రాంతానికి బదిలీ అయింది. దానికి కొద్ది ముందే ఆమె ఉద్యమ సహచరున్ని వివాహమాడింది.

1991-94 మధ్య జిల్లా ఉద్యమం తీవ్రమైన నిర్బంధ పరిస్థితులను ఎదుర్కొన్న కాలం. మహారాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఉద్యమ అణచివేత కోసం 'ప్రత్యేక ప్లాను'ను రూపొందించి, ముమ్మర సంస్కరణలను చేపట్టి మరోవైపు జిల్లాలో సీ-60 పేరుతో నూతన కమాండో బలగాలను ఏర్పర్చింది. ప్రత్యేకించి టిప్రాగఢ్ ప్రాంతంలో పోలీసు దాడులతో పాటు ప్రజా వ్యతిరేక శక్తులు, ఇన్ఫార్మర్లు దళాన్ని మట్టుబెట్టడానికి, అడవిలో నిక్షిప్తం చేసుకున్న పార్టీ నిధుల ఆరా తీయడానికి పెద్దెతున గాలింపులు జరుపుతున్న సమయంలో కామ్రేడ్ సృజన దృఢంగా నిలబడి ప్రజలతో కలిసిపోయి అహర్నిశలు ఉద్యమాన్ని కాపాడు కోవడానికి కృషి చేసింది. తన దళం బాధ్యులు మడిమతిప్పి శత్రు పక్షం వహించి విప్లవకారులను బలహీనపరచడానికి పూనుకున్నపుడు వారి ప్రతీఘాతుక చర్యలను ప్రజలలో బట్టబయలు చేయడంలో చురుగ్గా పాల్గొంది.

ఉద్యమాన్ని ఉన్నత స్థాయికి పురోగమింపచేయడానికి పార్టీ 1995లో నిర్మించిన తొలి ప్లాటూన్‌లో కామ్రేడ్ సృజన సభ్యురాలుగా చేరింది. అందులో మూడేళ్లు పని చేసి సైనిక రంగంలో మంచి అనుభవాన్ని సంపాదించింది. 1998లో ఉద్యమ అవసరాల రీత్యా మాస్‌వర్క్‌కు బదిలీ అయి కసన్‌సూర్‌లో ఏ.సీ. బాధ్యతలు చేపట్టింది. అప్పటినుండి దాదాపు 22 సంవత్సరాలు ఆ ప్రాంతంలోనే ప్రజల మధ్య పని చేసి ఆర్.సీ. స్థాయికి ఎదిగింది. కామ్రేడ్ సృజన 2004లో డివిజనల్ కమిటీలోకి ఎన్నికైంది. ఆ తరువాత 2006లో గఢ్‌చిరోలీ ఉద్యమం రెండు డివిజన్‌లుగా అభివృద్ధి కావడంతో కామ్రేడ్ సృజన ఉత్తర గఢ్‌చిరోలీ డివిజన్‌లో భాగమైంది.

కామ్రేడ్ సృజన 2009లో ఆర్.సీ.ఎమ్.గా ఎన్నికైంది. విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి శత్రువు చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఎదుర్కోవడానికి 2013లో ఏర్పడిన ఏకీకృత కమాండ్‌లో కామ్రేడ్ సృజన భాగమై మాస్‌వర్క్, మిలటరీవర్క్‌లో మంచి అనుభవాన్ని సంపాదించింది. కామ్రేడ్ సృజన పార్టీలోనే చదువు నేర్చుకొని ఆర్.సీ. స్థాయిలో ఉద్యమానికి నాయకత్వాన్ని అందించింది. ఉద్యమం ఎదుర్కొంటున్న అనేక జటిల సమస్యలను పరిష్కరించడంలో తన కమిటీలో చర్చించడమే కాకుండా వివిధ పార్టీ వేదికలపై వాటిని ప్రవేశపెట్టి సమష్టి పరిష్కారాలలో పాలు పంచుకునేది. సమాజంలో పితృస్వామ్యాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించి ఉద్యమ బాటపట్టిన కామ్రేడ్ జైనీ పార్టీలో మహిళా సబ్ కమిటీలో కొంత కాలం పని చేసి పార్టీలోని, ఉద్యమంలోని, సమాజంలోని మహిళల సమస్యలను మావోయిస్టు సిద్ధాంత కోణంలో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ భూస్వామ్య పితృస్వామ్యంపై గట్టిపోరాటం చేసింది.

ఆమె భర్తీ అయిననాటి నుండి మొదలుపెట్టి తొలి ప్లాటూన్‌లో సభ్యురాలు కావడం నుండి చివరివరకు కొనసాగిన తన సుదీర్ఘ విప్లవానుభవంలో దాదాపు 30 ఘటనలలో శత్రువును ఎదుర్కొంది. శత్రువును దెబ్బతీయడానికి రూపొందించుకున్న అనేక మాటుదాడులలో ఆమె చురుగ్గా పాల్గొంది. ఆమె సుదీర్ఘ విప్లవజీవితంలో శత్రు దాడుల నుండి ప్రజల అండతో తృటిలో తప్పుకున్న ఘటనలు అనేకం ఉంటాయి. వివిధ ఘటనలలో శత్రు కాల్పులకు సహచరులు అసువులు బాసినపుడు ఒక చేత్తో కన్నీరు తుడుచుకుంటూ మరోచేత్తో వారి అంత్యక్రియలు జరిపి వారి ఆశయాల సాధనకై తుదివరకూ పోరాడుతామని శపథం చేసి నెరవేర్చిన ధీశాలి ఆమె. కామ్రేడ్ సృజన అంతిమంగా మే 2నాడు జరిగిన ఘటనలో కూడా శత్రువుతో ముఖాముఖి తలపడుతూ తన ప్రాణప్రదమైన కేడర్లను కాపాడుతూ తాను ఆత్మత్యాగం చేసింది. ఆమె పోరాటం, సాహసం, చాకచక్యత ప్రతి గెరిల్లాకు ఆదర్శం.

కామ్రేడ్ సృజన సుదీర్ఘకాలం ఒకే ఏరియాలో బాధ్యతాయుతంగా పని చేయడంతో పాటు స్థానిక ప్రజలతో మమేకమైన తీరు, ఆమె సున్నితమనస్తత్వం, వినయం, ఆదర్శవంతమైన సహచర జీవితం, వీరయోధగా పోరాడుతూ శత్రుదాడిలో కేడర్‌ను కాపాడి ప్రాణత్యాగం చేయడం లాంటి విప్లవ లక్షణాలు గల సృజన అమరత్వం ప్రజలను, కేడర్‌ను దుఖ సాగరంలో ముంచింది.

కామ్రేడ్ సృజన ఉద్యమంలోని అన్ని రంగాలలో మంచి అనుభవాన్ని గడించింది. పార్టీ కేడర్ల, పీ.ఎల్.జీ.ఏ, గెరిల్లాల ప్రజల అపార విశ్వాసాన్ని చూరగొన్న తొలితరం విప్లవకారిణి కామ్రేడ్ సృజనకు తలవంచి విప్లవ జోహార్లర్పిస్తూ ఆమె ఆశయాల పరిపూర్తికై తుదివరకూ పోరాడుదామని శపథం చేద్దాం.

**పిలుపు రంగనాథంకి జోహార్లు**

తూర్పు గోదావరి జిల్లా పుట్టుకొండ గ్రామానికి చెందిన రంగనాథం విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాలతో ప్రభావితం అయ్యాడు. విప్లవ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ పౌరుహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గాల్లో చాలాకాలం పని చేశారు. 'పిలుపు' విప్లవ రాజకీయ పత్రికా నిర్వహణలో భాగమయ్యాడు. అందుకే ఇప్పటికీ ఆయన్ని పరిచయస్తులు 'పిలుపు' రంగనాథంగనే పిలుచుకుంటారు.

శ్రీకాకుళ పోరాట కాలంలోనే విప్లవ రాజకీయ ప్రచారానికి పత్రికా ఆరంభమైంది. పిలుపు పక్ష పత్రిక ఆ తర్వాత విప్లవ రాజకీయ పత్రికలకు ఒరవడిని అందించింది. కా.ఎం.టీ.ఖాన్ పబ్లిషర్‌గా, రంగనాథం సంపాదకుడిగా పిలుపు 1972 ఆగస్టు 1 సంచికతో ప్రారంభమైంది. చారుమజుందార్ మార్గంలో, శ్రీకాకుళ పోరాట స్ఫూర్తితో అప్పటి విప్లవోద్యమ నాయకుడు కా. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో పిలుపు వెలువడి చారిత్రక పాత్ర పోషించింది. విప్లవోద్యమ శిబిరంలో అతి మితవాదాల మధ్య చర్చలు తీవ్రంగా కొనసాగుతున్న సమయంలో నక్సల్బరీ శ్రీకాకుళ సాయుధ పోరాటంలో జరిగిన లోపాలను

గుర్తిస్తూ ప్రజాయుద్ధ పంథాలో వాటిని ముందుకు తీసుకపోవడంలో పిలుపు కీలకంగా పనిచేసింది. గతాన్ని సమీక్షించుకొని పునర్నిర్మాణమవుతున్న విప్లవోద్యమ ప్రచార వేదికగా పని చేసింది.

కామ్రేడ్ రంగనాథం విప్లవోద్యమ వక్తగా, రచయితగా, పత్రికా సంపాదకుడిగా విరసం, పౌరహక్కుల సంఘం నాయకుడిగా తెలుగు ప్రాంతాలన్నీ తిరిగారు. ఎమర్జెన్సీ వరకూ (1975 జూన్ 16 సంచిక) ఈ పత్రిక నడిచింది. సికిందరాబాద్ కుట్రకేసులో పిలుపు పత్రిక బాధ్యులుగా ఎంటి ఖాన్‌ను, రంగనాథంను నిందితులుగా చూపి 1974మే 18న ప్రభుత్వం అరెస్టు చేసింది. 'ప్రభుత్వాన్ని హింసాత్మక పద్ధతుల ద్వారా పడగొట్టాలనే కుట్ర లక్ష్యాలను ప్రచారం చేయడానికి ఈ నిందితుడు సభల్లో మాట్లాడి విద్యార్థులను, నిరుద్యోగ యువకులను, మిలిటెంట్ క్యాడర్‌ను, ప్రజలను ఆయుధాలు తీసుకుని సాయుధ పోరాట కార్యక్రమంలో చేరమని రెచ్చగొట్టాడు" అని సికిందరాబాద్ కుట్రకేసు చార్జిషీట్‌లో ఆరోపించారు. ఈ కేసులో రంగనాథం బెయిల్ మీద విడుదలయ్యారు. ఆ తర్వాత 1975 ఏప్రిల్‌లో ప్రపంచ తెలుగు మహాసభలను బహిష్కరిస్తూ ఎల్ బి స్టేడియం గేటు దగ్గర శ్రీశ్రీతో పాటు ప్రదర్శన జరిపి అరెస్టయ్యారు. జూన్ 25న ఎమర్జెన్సీ విధించగానే మళ్లీ అరెస్టయి ఎమర్జెన్సీ అంతా జైల్లోనే ఉన్నారు. ఆ ఎమర్జెన్సీ ఎత్తేశాక కొద్ది కాలం ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలంగా ఉన్నారు. ఆ తర్వాత నేరుగా ప్రజాసంఘాల్లో లేకపోయినా విప్లవాభిమానంగా జీవించారు. కడ దాకా విప్లవోద్యమ విలువలకు కట్టుబడి ఉన్నారు. రంగనాథం ఫిబ్రవరి 18న సికింద్రాబాదులో స్వగృహంలో వృద్ధాప్యంతో కన్నుమూశాడు. ఆయనకు విప్లవ జోహార్లు.

## జి. అంపయ్యకు జోహార్లు

కరోనా కాలంలో (మే 2020) టిచర్ జి. అంపయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఉమ్మడి పాలమూరు జిల్లా జనాభాలో అధిక శాతం శ్రామిక జనమే. పాలమూరు అనగానే దేశ విదేశాలలో వెంటనే గుర్తుకు వచ్చేది పాలమూరు లేబరు. 'పాలమూర్ లేబర్"నే ప్రధాన అంశంగా ఎంచుకొని 1980వ దశకం ప్రారంభంలో విప్లవ రచయితల సంఘం గద్వాలలో మహ సభలు నిర్వహించింది. అనాడు అంపయ్య విరసం జిల్లా కార్యదర్శి ఆ సభల నుంచే పాలమూరు లేబర్ జాతీయ సమస్యల ఎజెండాలోకి వచ్చింది.

అంధ్ర ప్రాంతానికి పరిమితమయిన ఎపిటిఎఫ్ తెలంగాణలో విస్తరిస్తున్న తొలినాళ్ళలోనే ఆ సంస్థను పాలమూరు జిల్లాలో స్థాపించినాడు. తదుపరి రాష్ట్ర స్థాయిలో ఏర్పడిన పరిణామాల దృష్ట్యా డి.టి.ఎఫ్‌లో చేరి అ సంస్థ రాష్ట్ర (ఉమ్మడి) అధ్యక్షుడిగా ఎన్నికైనాడు. టీచర్స్ సమస్యల మీద అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. గద్వాల జిల్లా ఏర్పాటు కొరకు, కృష్ణానది నీళ్ళలో న్యాయమైన వాటా కోసం "పాలమూరు అధ్యయన వేదిక" జరుపుతున్న సుదీర్ఘ పోరాటంలో అంపయ్యది విడదియరాని చరిత్ర.

1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నాడు. 1996 మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని భావజాల ప్రచారానికి పూనుకున్నాడు. ఈ విధంగా బహుముఖ ఉద్యమకారుడయిన. జి. అంపయ్య కవి, గాయకుడు, రచయిత కూడా. ప్రజా విముక్తి సంపాదక మండలి శ్రద్ధాంజలి ఘటిస్తుంది.

### పొత్తూరి వెంకటేశ్వరరావుకు శ్రద్ధాంజలి

ప్రముఖ పాత్రికేయులు పొత్తూరి వెంకటేశ్వరరావు (86) కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మార్చ్ 5న హైదరాబాద్‌లోని విజయనగర్‌కాలనీలో మరణించారు. పొత్తూరి వెంకటేశ్వరరావు 1934 ఫిబ్రవరి 8న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పొత్తూరులో జన్మించారు. ప్రభుత్వాన్ని, నక్సలైట్లను శాంతి చర్చలకు ఒప్పించడంలో పౌరస్పందన వేదికసభ్యుడిగా కీలకపాత్ర పోషించారు.

ప్రజా జీవితంలో క్రియాశీలంగా ఉన్న పొత్తూరి జీవితం వైవిధ్యంతో కూడుకున్నది. ఆయన ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమర్థకుడు. ప్రజాస్వామికవాది. ఎన్‌కౌంటర్లు లేని సమాజాన్ని ఆకాంక్షించాడు. ప్రభుత్వం నక్సలైట్ల మధ్య చర్చలు జరగాలని, శాంతినెలకొనాలని పౌరస్పందన వేదిక ద్వారా క్రియాశీలంగా కృషి చేసారు. నల్లమలకు వెళ్లి నక్సల్స్ ప్రతినిధులతో కలిసి మాట్లాడిన బృందంలో ఉన్నారు. విప్లవకారుల ఆశయాలపట్ల, వ్యక్తిత్వాల పట్ల గౌరవం, నమ్మక ఉన్న వ్యక్తి. ఇటీవల అర్బన్‌నక్సల్స్ పేరిట జరుగుతున్న అరెస్టులను, ఫాసిస్టు నిర్బంధాన్ని ఖండించారు. శాంతి చర్చల విఫలం కావడానికి ప్రభుత్వమే కారణమని నిజాయితీగా మాట్లాడేవారు.

2013 నుండి మల్టిపుల్ మైలోమా అనే బ్లడ్‌క్యాన్సర్ కారణంగా దీర్ఘకాలం తీవ్రమైన అనారోగ్యంతో ఉండి 2020 మార్చ్ 5న తుదిశ్వాస విడిచారు. విప్లవ మిత్రులు పొత్తూరి వెంకటేశ్వరావు గారికి క్రాంతి సంపాదక మండలి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తుంది.

ఈ మధ్య కాలంలో కొత్త ఢిల్లీలో సీఆర్‌పీపీ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ రహమాన్ గిలానీ, చెన్నైలో సీపీడీఆర్ కార్యకర్త సుకుమార్, తెలంగాణలో రైతు ఉద్యమ నాయకుడు కాశపోగుల ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందారు. వీరికి క్రాంతి సంపాదక మండలి శ్రద్ధాంజలి ఘటిస్తుంది.

### కా॥ కోటె అభిలాష్‌కు విప్లవ జోహార్లు

మహారాష్ట్ర, గడిచిరోలి జిల్లాలోని ఏటపల్లి తాలుక యలదుడవి గ్రామం వద్ద 2020 జూలై 3వ తేదీన శుక్రవారం సాయంత్రం సి60 పోలీసులు జరిపిన కాల్పుల్లో కా॥ కోటె అభిలాష్ అమరుడయ్యాడు. అయన అమరత్వం అక్కడి ఉద్యమానికి తీవ్ర నష్టాన్ని కలిగించింది.

అమరత్వం చెందే నాటికి పెరిమిళి ఏరియా కమిటీ మెంబర్‌గా, ఎల్.ఒ.ఎస్ బాధ్యుడుగా కొనసాగుతున్నాడు. సోమా, శంకర్ పేర్లతో అక్కడి స్థానిక ప్రజలకు సుపరిచితుడు. 14 సంవత్సరాలుగా అదే ప్రాంతంలో పని చేస్తూ ప్రజల మన్ననలు పొందాడు. ఆదివాసులతో చనువుగా వుంటూ వారి యాస బాషలను నేర్చుకొని వాళ్ళలో ఒకడయ్యాడు. వారి కష్టాల్లో, బాధలో పాలుపంచుకున్నాడు. కా॥ అభిలాష్ ప్రజలల్లో అచంచల విశ్వాసం సంపాదించుకున్నాడు. ఇంతగా ప్రజలలో మమేకమై ఆదరాభిమానం చూరగొన్న కా॥ కోటె అభిలాష్‌ది ములుగు జిల్లా గోవిందారావు పేట మండలం ప్రాజెక్ట నాగారం గ్రామం. వాస్తవానికి కా॥ అభిలాష్ తల్లిదండ్రులు కా॥ భారతి, కా॥ కోటె హన్మయ్య సాయుధ దళంలో కొనసాగుతున్న క్రమంలోనే 1989లో జన్మించాడు. 1989లోనే తన తండ్రి అమరుడయ్యాడు. అప్పటి ఉమ్మడి వరంగల్ జిల్లా, తాడ్వాయి మండలం, కాల్వపల్లి-నార్లాపూర్ గ్రామాల మధ్య పోలీసులపై దళం మాటుకాసి దాడి చేయగా 4 గురు పోలీసులు చచ్చారు. ఇదే దాడిలో శత్రువు తూటా తలకు తగిలి కా॥ కోటె హన్మన్న వీరమరణం పొందాడు. ప్రస్తుతం తల్లి విప్లవోద్యమంలోనే కొనసాగుతుంది.


కామ్రేడ్ అభిలాష్

గెరిల్లా యుద్ధంలో పిల్లలను పెంచడం, పోషించడం సాధ్యం కాని అననుకూల పరిస్థితులలో దగ్గర బంధువులకు దత్తత ఇచ్చారు. విప్లవోద్యమంలో జన్మించినప్పటికీ 14 సంవత్సరాలు మధ్య తరగతి స్థాయి కుటుంబ పోషణలో పెరిగి పెద్దవాడయ్యాడు. అదిలాబాద్ జిల్లా ఊట్నూర్ ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5 వరకు, 6 నుండి 10వరకు పసర ములుగు జిల్లా జెడ్‌పిఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించాడు. తన తండ్రి కూడా ఇదే స్కూల్‌లో చదువుతూ విప్లవ రాజకీయ కార్యక్రమాలలో క్రీయాశీలంగా పాల్గొన్నాడు. కా॥కోటే హన్మన్న విప్లవ రాజకీయాలే కా॥ అభిలాష్‌ను ప్రభావితం చేసి మరింత ముందుకు నడిపించాయి. తండ్రి ఆశయాల బాటలోనే ఎప్పటికీ ప్రయాణించాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు. హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సమయంలోనే రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) సభ్యత్వం పొంది రెండు సంవత్సరాలు రాడికల్ విద్యార్థి సంఘం రాజకీయ, నిర్మాణ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నాడు. 2004లో అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వుండగా, సి.పి.ఐ. (మావోయిస్టు)తో కొనసాగించిన చర్చల కాలంలో వెసులు బాటును ఉపయోగించుకొని అనేక మంది విద్యార్థులను సంఘటితం చేస్తూ నిర్మాణ పటిష్టతకు కృషి చేశాడు. శాస్త్రీయ విద్యా విధానంకై పాటు పడుతూ విద్య వసతుల కోసం జరిగిన పోరాటాలలో పాల్గొన్నాడు. ఈ క్రమంలో విద్యార్థులతో పరిచయం పెంచుకొని దళానికి కలుపుతూ వారిని ఉత్సాహపరిచేవాడు. రాజకీయ ప్రచారంలో భాగంగా శత్రువు కళ్ళు గప్పి పోస్టర్లు, బ్యానర్లు వేసేవాడు.

తనను పెంచి పెద్ద చేసిన వాళ్ళు విప్లవానికి దూరంగా వుంచాలనుకున్నప్పటికి, చిన్న నాటి నుండి తల్లి దండ్రుల జీవిత గాథలు వింటూ పెరగడం , విప్లవోద్యమ ప్రాంతాలలో జీవిస్తూ రాజకీయ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనడం, మూలంగా పూర్తికాలం విప్లవకారున్ని కావాలనే తన దృఢసంకల్పానికి అవేవి అడ్డు పడలేదు. 14వ యేటనే తన విప్లవ ప్రస్థానం మొదలయ్యింది. 2003 నుండి 2005 వరకు రాడికల్ విద్యార్థి సంఘంలో పని చేస్తూ, 16 సంవత్సరాల వయస్సులోనే పూర్తికాలం విప్లవ కారుడయ్యాడు. 2005 చివరిలో దళంలో చేరి 2007 వరకు తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యాడు. 2008లో పార్టీ పిలుపు మేరకు దండకారణ్యం చేరుకున్నాడు. దండకారణ్యం బదిలీ అయిననాటి నుండి అమరత్వం చెందే వరకు దక్షిణ గడిచిరోలి డివిజన్‌లోనే పని చేశాడు. 18 వసంతాలు అవిరామంగా ప్రజా యుద్ధంలో ప్రయాణించాడు. అనేక ఒడిదొడుకులను, కష్టనష్టాలను ఎదుర్కొన్నాడు. దక్షిణ గడిచిరోలి విప్లవోద్యమం శత్రువు పాశవిక దాడుల మూలంగా తీవ్ర నష్టాలకు గురైంది. కసన్‌సూర్ ఘటన కోలుకోలేని నష్టాన్ని కలిగించింది. 40 మందికి పైగా కామ్రేడ్స్ అమరులు అయ్యారు. ఇందులో తన సహచరి కా॥ లలిత కూడా అమరురాలు అయ్యింది.

కసన్‌సూర్ ఘటన అనంతరం గడిచిరోలి విప్లవోద్యమాన్ని పునర్ నిర్మించే కృషిలో అనేక చిన్న చిన్న నష్టాలు జరుగుతూనే వచ్చాయి. అయినప్పటికీ ధైర్యాన్ని కోల్పోలేదు. తన కృషిని సడలించలేదు. విప్లవంపై విశ్వాసం కోల్పోలేదు. సహచరుల త్యాగాలు కా॥ అభిలాష్‌లో మరింత సంకల్పాన్ని, వర్గ కసిని ఇనుమడింప చేశాయి. దీనితో తన వంతు ఉన్నత బాధ్యతలను తన భుజస్కందాలపై మోశాడు. పరిమిళి ఏరియా ఉద్యమాన్ని నిర్మిస్తూ తుదిశ్వాస విడిచాడు. భూస్వామ్య, దళారి నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాద దోపిడీ వర్గాలను కూలదోసి ప్రజా రాజ్యాధికారాన్ని నెలకొల్పే సాయుధ మార్గంలో తుది శ్వాస వరకు ప్రయాణించి ఉన్నత ఆశయాన్ని మరింత పటిష్ట పరిచాడు.

కా॥ అభిలాష్ దోపిడీ లేని సమాజాన్ని కలలు కన్నాడు. అందరికి సమానత్వం కలగాలి అనుకొన్నాడు. దోపిడీ సమాజానికి పునాదులైన భూస్వామ్య, దళారీ నిరంకుశ, సామ్రాజ్యవాదులను నిర్మూలించి నూతన సమాజాన్ని నెలకొల్పాలనుకున్నాడు. దీర్ఘకాలిక సాయుధ పోరాటం ద్వారానే సాధ్యమని నమ్మాడు. నూతన ప్రజాస్వామ్య విప్లవం కోసం యవ్వనాన్ని పణంగా పెట్టి తన రక్తాన్ని చిందించాడు. కా॥ అభిలాష్ అంకితభావం, సంకల్పం, శౌర్యం మనందరికీ ఆదర్శం కావాలి. తను కలలు కన్న ఆశయాన్ని విజయ తీరాలకు తీసుకెళ్దామని శపథం చేద్దాం.

మన అమరులు తమ తుదిశ్వాస వరకు ఎత్తిపట్టిన సమున్నత ఆశయం, నెలకొల్పిన గొప్ప ఆదర్శాలు, ఉన్నత కమ్యూనిస్టు విలువలు, త్యాగ సాంప్రదాయాలు, సాహసం, దృఢసంకల్పం, శత్రువు పట్ల కసి, ప్రజల పట్ల, కేడర్ల పట్ల ప్రదర్శించిన ప్రేమాభిమానాలు, వారి సాదాసీదా జీవనశైలి, కష్టాలకు వెనుదీయని ధీరోదాత్తత నుంచి మనమంతా నేర్చుకుందాం. వారు కలలు గన్న దోపిడీ, పీడనలు లేని నూతన సమాజం కోసం చివరి ఊపిరి వరకు పోరాడుతామని శపథం చేద్దాం.

# కొరోనా మహమ్మారి సామ్రాజ్యవాదుల సృష్టి! సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించడం ద్వారానే కరోనా లాంటి మహమ్మారులన్నింటినీ అరికట్టగలం!

గత ఆరుమాసాలుగా కొరోనా మహమ్మారి ప్రపంచాన్ని గజగజలాడిస్తోంది. సామ్రాజ్యవాద వ్యవస్థ కారణంగా పుట్టి పెరిగి, చైనాలోని ఉహాన్‌లో బయటపడిన ఈ వైరస్‌ను 'సార్స్-2'గా, 'చైనీస్ కొరోనా'గా, 'నావెల్ కొరోనా వైరస్'గా, 2019 డిసెంబర్‌లో ఈ వైరస్ ప్రబలింది కనుక కొరోనా వైరస్ డిసీజ్(CoViD)-2019, సంక్షిప్తంగా కోవిడ్-19గా, అని పిలుస్తున్నారు. చైనా దేశంలోని లీ వెన్‌లియాంగ్ పేరు గల 34 యేళ్ళ వయస్సు గల ఒక వైద్యుడు డిసెంబరు నెలలోనే తాను పరీక్షించిన ఏడుగురు రోగుల్లో 'సార్స్' తరహా అస్వస్థత లక్షణాలు కనిపించాయనీ, తాను నిర్వహించిన పరీక్షల్లో అది 'కరోనా వైరస్'గా తేలిందని సామాజిక మాధ్యమాలలో ప్రకటించాడు. ప్రపంచ గుర్తింపు కలిగిన మెడికల్ జర్నల్ (వైద్య శాస్త్ర పత్రిక) 'లాన్సెట్' ఇది రసాయనశాలలలో తయారవ్వదనీ, జన్యు నిర్మాణం పరివర్తన రూపంతో రూపొందిందని చెప్పింది. తొలుత పరీక్షించిన 43 మందిలో 13మంది చైనా బయటివారేనని తేల్చింది. దానితో చైనా తమ దేశంలో నాలుగేళ్ల క్రితం జరిగిన ఒలింపిక్ క్రీడల సమయంలో ఆ వైరస్ ప్రవేశించిందనే వాదనను ముందుకు తెస్తున్నది. ఇలా రకరకాల వార్తలు వెలువడుతున్నవి.

ప్రపంచంలోని మూడవ అతిపెద్ద పందుల తయారీ శుద్ధి కర్మాగారం అమెరికాకు చెందిన 'స్మిత్ ఫీల్డ్ ఫుడ్ కంపెనీ'కి చెందిన ఒక విభాగం ఉహాన్‌లోనే ఉంది. ఇంకా ఇతర అనేక సామ్రాజ్యవాద దేశాలకు చెందిన పెద్ద కంపెనీల విభాగాలు కూడా అక్కడ ఉన్నాయి. పరిశ్రమలలో కుళ్లిన మాంసాన్ని సైతం ప్రాసిసెంగ్ చేస్తున్నారు. ఆంటి బయటిక్ మందులను, హార్మోన్లను జెనెటిక్ ఇంజనీరింగ్ పద్ధతిలో ఉపయోగించి పందులను అసహజమైన రీతిలో ఉత్పత్తి చేస్తున్నారు. ఈ కృత్రిమ పశుగణ ఉత్పత్తి పరిశ్రమ తీవ్రమైన వ్యాధులకు కారణమయ్యే వైరస్‌లను పెంచి పోషిస్తున్నాయి. పచ్చి మాంసాన్ని ప్రపంచమంతా విక్రయించే మెక్‌డోనాల్డ్, కే.ఎఫ్.సీ., స్మిత్ ఫీల్డ్, బేయర్ మొదలగు విశ్వవ్యాపిత సామ్రాజ్యవాద ఫుడ్ కంపెనీలు ఈ వైరస్‌లను విస్తరింపచేయడంలో, మృత్యు వ్యాపారంలో ముందున్నాయి. ఈ వైరస్ ఒక క్రమంలో జన్యు నిర్మాణ పరివర్తనతోనూ, సార్స్-1 వైరస్ లాగే గుడ్లు, చెప్పులు మున్నగు సరుకులలాగే పరిశ్రమలలో భారీ సంఖ్యలో ఉత్పత్తి అయ్యే పందుల నుండీ కొరోనా పుట్టి విస్తరిస్తున్నదనీ, ఇది రసాయనశాలల్లో తయారు చేసింది కాదనీ ఇప్పటికైతే పలువురు ప్రముఖ శాస్త్రజ్ఞులు సెలవిస్తున్నారు.

భూమండలంపై జంతువుల నుండి అనేక రకాల వైరస్‌లు ఉద్భవించడం అతి సహజం. కానీ, కొరోనాలా మనుషులకు సోకేవి మాత్రం చాలా అరుదుగానే ఉంటాయి. గతంలో ఇబోలా, జికా, ఎమ్.ఈ.ఆర్.ఎస్., సార్స్, ప్లేగు, ఎల్లో ఫివర్, ఇన్‌ఫ్లూయెంజా, స్వైన్‌ఫ్లూ (హెచ్1ఎన్1) మొదలైనవి మానవ సమాజాన్ని సోకి పెద్దెత్తున మరణాలకు కారణమైన వైరస్‌లుగా వ్యాప్తిలోకి వచ్చాయి. 2011-2018 మధ్య 172 దేశాలలో 1,483 విస్తృతమైన అంటువ్యాధులు ప్రబలినట్టు 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' పేర్కొంది.

స్వైన్‌ఫ్లూను 'మెక్సికన్ ఫ్లూ'గా కూడా వ్యవహరించారు. ఆ వైరస్ పందుల నుండే పుట్టి ప్రపంచంలో అనేక దేశాలకు విస్తరించి లక్షల సంఖ్యలో ప్రజలను అంతమొందించింది. ఇబోలా వైరస్ కూడా ఆఫ్రికాలో తాండవమాడింది. మానవ సమాజాన్ని సోకిన ఈ వైరస్‌లన్నింటినీ సామ్రాజ్యవాదులే ఏదో రూపంలో ఈ భూమండలంపై సృష్టించారు. వారు తమ సూపర్ లాభాల కోసం పర్యావరణాన్ని విధ్వంసం చేసి, దాన్ని వినాశనపు అంచులలోకి నెట్టి, ప్రకృతి సమతుల్యతను దెబ్బతీసే ప్రకృతి వ్యతిరేక, కృత్రిమ ఉత్పత్తి విధానాలను విచ్చలవిడిగా విస్తరింపజేయడమే ఇందుకు మూలకారణం. ప్రస్తుత కొరోనా పుట్టుకకూ వ్యాప్తికీ చైనా, అమెరికాలు నువ్వంటే నువ్వంటూ పరస్పరం నిందించుకుంటున్నాయి. అమెరికా రెండడుగులు ముందే ఉండి చైనాతో అన్ని రకాల సంబంధాలను తెగతెంపులు చేసుకుంటానని బెదిరించింది.

విజ్ఞానం వికాసం చెందని 14వ శతాబ్దంలో ప్రబలిన ప్లేగు వ్యాధితో మూడవవంతు యూరప్ ప్రజలు మృత్యు కౌగిట్లోకి చేరుకున్నారు. ఆ తరువాత బ్రిటిష్ ఇండియాలో ప్లేగు వ్యాధితో లక్షలాది మంది మరణించారు. అలాగే 1976లో బయటపడిన 50 శాతం మరణాల రేటు కలిగిన 'ఇబోలా'కు సంతృప్తికరమైన వాక్సిన్ నేటికీ తయారుకాలేదు. ప్రధానంగా లైంగిక సంబంధాలతో అంటుకునే 'హెచ్ఐవీ' (ఏయిడ్స్-అక్వైర్డ్ ఇమ్యూన్ డెఫిషెన్సీ సిండ్రోం) గత 40 సంవత్సరాలుగా ప్రపంచాన్ని కుదిపేస్తున్నప్పటికీ మూడున్నర కోట్లమంది దాని మూలంగా మృత్యువాత పడినప్పటికీ దానికి వాక్సిన్ తయారు చేయలేకపోయారు. 2003లో చైనాలో గబ్బిలాల ద్వారా మనుషులకు సోకి 26 దేశాలకు విస్తరించిన 'సార్స్'-1, 2012లో అరబిక్ ఒంటెల ద్వారా మనుషులకు సోకి 27 దేశాలకు వ్యాపించిన 'మార్స్' వ్యాధులు నియంత్రణలో ఉండడంతో వ్యాక్సిన్‌ల తయారీ ప్రసక్తే లేకుండా పోయింది. ఇవి రెండూ కొరోనా కుటుంబానికి చెందిన ఒక రకమైన కొరోనా వైరస్‌లే! పక్షుల రెట్టల ద్వారా మనుషులకు సోకినట్టు 1997లో హాంగ్‌కాంగ్‌లో బయటపడి ఆఫ్రికా, ఆసియా, యూరప్ దేశాలను కుదిపివేసిన 'ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా' (హెచ్5ఎన్1)కు వ్యాక్సిన్ తయారవనేలేదు.

ఇలా సామ్రాజ్యవాద వ్యవస్థ సృష్టి అయిన పలు రకాల వైరస్‌లు ప్రపంచవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి, అవేవీ ఇప్పటికీ పూర్తిగా మాసిపోలేదు. అవి పేరుకు లేకుండా మాసిపోతే వారి సూపర్ లాభాలు దెబ్బతింటాయి కాబట్టి ప్రజాహితం కోరి వాటి సమూల నిర్మూలనకు వారు చిత్తశుద్ధితో ఎన్నటికీ పూనుకోరు. వారు కోరుకునే వ్యాక్సిన్‌లు రోగ నియంత్రణకే తప్ప రోగ నిర్మూలనకు ఉద్దేశించినవి కావు. ఫలితంగా, వాటన్నిటితో కలసే మానవ సమాజం సహజీవనం చేస్తోన్నట్టే ఇకపై కోవిడ్-19తో చేయాల్సి ఉంటుందని

సామ్రాజ్యవాదులు సెలవిస్తున్నారు. సామ్రాజ్యవాదులకు తొత్తులైన మన దేశ పాలకులు కూడా ఆ సహజీవన పాటకు కోరస్ ఇస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దీనికి వాక్సిన్ రూపొందించామని జూన్ 7నాడు డంబాలు పలికితే, ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర సేవల డైరెక్టర్ మైకేల్ రెయాన్ 'కొరోనాతో సహజీవనం చేయాల్సిందే' నని వాక్సిన్ ఎక్కడా రూపొందలేదని అదే రోజు స్పష్టంచేశాడు. మన దేశ వైద్య అధికారులు మాత్రం 2020 సెప్టెంబర్ వరకు కొరోనా తగ్గవచ్చని ప్రజలను మభ్యపెట్టజూస్తున్నారు.

మన దేశంలో యేటా మామూలు మలేరియాతో రెండు లక్షలు, అతిసార వ్యాధితో ఐదు లక్షలు, క్షయ వ్యాధితో నాలుగు లక్షలు, పౌష్టికాహార లోపంతో ఐదు లక్షల మంది అకాల మరణాల పాలవుతున్నారు. ఇందులో పిల్లలు అధికంగా మరణిస్తున్నారు. వీటిని నివారించలేకపోతున్న మన దేశ పాలకులు కొరోనా నివారణకు చప్పట్లు కొట్టించడమో, గంటలు మోగించడమో, దీపాలు వెలిగించడమో తప్ప వాక్సిన్‌ను సృష్టిస్తారనుకోలేం. ప్రపంచంలో, దేశంలో మందులతో నయంకాని, తగిన మందులే లేని జబ్బులు అనేకం ఉన్నాయి. లాభాలు దండుకోవడం తప్ప మరేదీ చేయని అంతులేని దురాశాపరులయిన సామ్రాజ్యవాదులు స్వాభావికంగానే అందుకు పూనుకోరు.

కోవిడ్-19 అతి సాధారణ లక్షణాలతో జ్వరం, మామూలు దగ్గుతో పాటు ఊపిరితిత్తులకు చేరితే శ్వాస తీసుకోవడం సమస్యగా మారి నిమోనియా లక్షణాలతో బయట పడుతుంది. ప్రతి ఐదుగురిలో నలుగురికి సాధారణ ఫ్లూ లక్షణాలే ఉంటాయి. ప్రతి ఏడుగురిలో ఒకరు అసుపత్రిలో చేరాల్సి రావచ్చుంటున్నారు. దీని ఇంకుబేషన్ కాలం 14 రోజుల నుండి 24 రోజులుగా గుర్తించారు. అధిక రక్తపోటు, మధుమేహం, కేన్సర్‌లాంటి వ్యాధులతో దీర్ఘకాలంగా బాధపడుతున్న వారి విషయంలో, వృద్ధులలో మరణాల రేటు ఎక్కువగా ఉంది.

అభివృద్ధి సాధించిన దేశాలుగా, గొప్ప సంపన్న వ్యవస్థలుగా జబ్బలు చరుచుకునే సామ్రాజ్యవాద దేశాలలో కొరోనా మహమ్మారి వ్యాపించడంతో రోగ ప్రమాదం తీవ్రంగా వుండి, మరణాల రేటు అధికంగా ఉంది. ఈ దేశాలలో వృద్ధులు పెద్దసంఖ్యలో మరణించారు. స్పెయిన్‌లో పాలకులు 60 సంవత్సరాలు పైబడినవారికి ఐసీయూలు అవసరం లేదంటున్నారు, అన్నీ వ్యాపారంతోనే ముడిపడి కొరోనాను అరికట్టడంలో ఘోరంగా విఫలమైన అమెరికాలో వృద్ధులు యువకులకోసం చికిత్సను త్యాగం చేయాలని పాలకులు నీతి వచనాలు ఉద్బోధిస్తున్నారు. బ్రిటన్‌లోనూ పాలకులు ఏకంగా వృద్ధుల చావునే అతి కర్కశంగా కోరుకుంటున్నారు.

మన దేశంలో జనవరి 12నాడు కేరళలో కొరోనా వైరస్ మొదటి పాజిటివ్‌కేసు వెలుగులోకి వచ్చింది. రెండు మాసాల పిదప మార్చ్ 13నాడు మొదటి మరణం సంభవించింది. ఆ తరువాత మరో 10 రోజులకు మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొద్దు నిద్ర నుండి మేల్కొని మార్చ్ 22నాడు మహా అట్టహాసంగా 'జనతా కర్ఫ్యూ'ను విధించి మరుసటి రోజు నుండి చైనా తదితర విదేశాలను అనుకరిస్తూ ఎలాంటి తయారీలు లేని అత్యంత ఆక్షేపణీయమైన 21 రోజుల తొలి లాక్‌డౌన్‌కు మార్చ్ 24న తెరలేపాడు. అప్పటి నుండి వరుసగా మూడు విడుతల లాక్‌డౌన్ దాదాపు 70 రోజులు ఎలాంటి వెసులుబాటు లేకుండా విధిస్తూ దౌర్జన్యపూరితంగా అమలు జరిపాడు. ఆపై ఇక లాక్‌డౌన్‌లలో సడలింపులు మొదలుపెట్టారు. దేశాన్ని మూడు రకాల ప్రాంతాలుగా విభజించి (ఎరుపు, నారింజ, ఆకుపచ్చ) కొరోనా ప్రమాద తీవ్రత అత్యధికంగా ఉన్న ఎరుపు రంగు ప్రాంతాలకు అంటే కొరోనా సోకి అత్యధిక జనాభాతో కిక్కిరిసిన మహా నగరాలకు (కంటేయిన్‌మెంట్ జోన్లు) చాలావరకు లాక్‌డౌన్ నిబంధనలు వర్తింపచేస్తున్నారు. మిగితా ప్రాంతాలకు క్రమంగా సడలింపులు పెంచుతూ పోతున్నారు. దేవాలయాల వ్యాపారం దెబ్బతినకుండా చూసుకోవడానికి కొరోనాలో తన భక్తులను ఆదుకోలేని భగవంతుడి దర్శనానికి సైతం సడలింపులతో కూడిన అనుమతులు ప్రకటిస్తున్నారు. లేకపోతే దేశ పరిస్థితులు పూర్తిగా తమ అదుపుతప్పి పసలేని మోదీ ఉపన్యాసాలు పనిచేయక విస్ఫోటనం చెందక తప్పదని పాలకులు గ్రహించారు.

నిజానికి ఈ వ్యాధి వెలుగులోకి వచ్చాక తొలుత లక్ష మందికి సోకడానికి 67 రోజులు తీసుకోగా, తరువాత 11 రోజులలోనే రెండు లక్షలకు, ఆ పిదప నాలుగు రోజులలోనే మూడు లక్షలకు వ్యాధి గ్రస్తుల సంఖ్య వేగంగా పెరిగిందనీ విశ్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి. కానీ తమ కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలకు పుష్కలంగా అవకాశం చిక్కినా అత్యంత బాధ్యతారహితంగా, నిమ్మకు నీరెత్తినట్టు ఎందుకున్నాయో మాత్రం మోదీ పెదవి విప్పడం లేదు. ఆరేళ్లుగా ఆయన దుష్టపాలనను అనుభవిస్తున్న మన దేశ ప్రజలకు ఆయన సొల్లువాగుడులో బ్రాహ్మణవాద కపట చాతుర్యం తప్ప మరేదీ లేదు. ఫాసిస్టులందిరి లాగే ఆయనదంతా గోబెల్స్ నీతేనని తేలిపోయింది. జూలై 15/2020 నాటికి ప్రపంచంలో వ్యాధిగ్రస్తుల సంఖ్య 1 ఒక కోటి 32 దాటగా మరణాల సంఖ్య 5,లక్షల 90 వేల మరణాలు దాటింది. మన దేశంలో వ్యాధి సోకినవారి సంఖ్య అతి వేగంగా విజృంభిస్తూ వ్యాధిగ్రస్తుల సంఖ్య 9 లక్షలకు దాటగా, మృత్యువు కబళించిన వారి సంఖ్య 25 వేలు దాటింది. గత కొద్ది రోజులుగా సగటున రోజుకు 25 వేలకు పైగా రోగుల సంఖ్య పెరుగుతోంది. దీంతో మన దేశంలో మార్చిలో లాక్‌డౌన్ విధించే నాటికి 0.1 శాతం కూడా లేని మరణాల రేటు జూన్ నెల మధ్య నాటికి మూడు శాతం దాటింది. ప్రపంచంలో కొరోనా బాధితులలో 80 శాతం అమెరికాలోనే ఉన్నారు. వ్యాధిగ్రస్తుల సంఖ్య 35 లక్షలు దాటి మరణాల సంఖ్య 1 లక్ష 50 వేలు దాటింది. రెండోవ స్థానంలో వున్న బ్రెజిల్‌లో వ్యాధిగ్రస్తుల సంఖ్య 19 లక్షలు దాటగా మరణాల సంఖ్య 75 వేలు దాటింది. అదే నంబర్‌వన్ కొరోనా పీడిత దేశంగా నమోదు కాగా మన దేశం మూడోవ స్థానానికి పరుగు తీసింది. దేశంలో మహారాష్ట్ర వ్యాధిగ్రస్తుల సంఖ్యలోనూ, మరణాలలోనూ అగ్రస్థానంలో ఉంది. తెలంగాణలో వ్యాధిగ్రస్తుల సంఖ్య 35 వేలు దాటిపోయి ఐదో స్థానాన్ని ఆక్రమించింది.

ఈ వ్యాధిని నివారించడంలో ఇప్పటివరకు భౌతిక దూరాన్ని పాటించడమే అత్యంత మెరుగైన విధానమని, మాస్కులు ధరించడం, శుభ్రతను పాటించడం లాంటి నియమాలు పాటించడం ద్వారా చాలా వరకు వ్యాధి వ్యాప్తిని ఆపగలుగుతామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ మన దేశంలో గ్రామ పంచాయితీల నుండి కేంద్ర ప్రభుత్వం వరకు కనీసం పరిశుభ్రమైన మాస్కులను కొరోనా రోగులకే అందించలేకపోతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలందరికీ ఉచితంగా ఎలా సమకూర్చగలవు? నిజానికి ప్రభుత్వాలేవీ వ్యాధి సోకే అవకాశం ఉన్న ప్రాంతాలను తక్షణం గుర్తించి ఎక్కడికక్కడే ప్రజలను

జాగరూకులను చేయలేదు. విదేశాల నుండే ఈ వ్యాధి వ్యాపించే అవకాశాలున్నాయనే విషయం అర్థమైనప్పటికీ సకాలంలో దానిని అరికట్టే చర్యలకు కనీసంగానైనా ఉపక్రమించలేదు. అవినీతికి ఆలవాలమైన మన దేశంలో మాస్కులు సైతం నల్లబజార్‌మయమైపోయాయి. దానితో మోదీ తనకు భుజం మీది పంచో, జేబు రుమాలో నోరు, ముక్కు కప్పుకోవడానికి సరిపోతుందనీ తన ఫోటోతో సహ ట్వీట్ చేసి చేతులు దులుపుకున్నాడు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేతినిండా సమయం దొరికినప్పటికీ సకాలంలో తగిన వసతులతో క్వారంటైన్ కేంద్రాలను ఏర్పర్చలేదు. కనీసం ఐసోలేషన్ బెడ్స్, టెస్టింగ్ కిట్స్, ఐ.సీ.యూ. బెడ్స్, వెంటిలేటర్స్ కూడా సమకూర్చలేదు. హైడ్రాక్సీ క్లోరోక్విన్ మాత్రలను సరిపడా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందివ్వలేదు. వాటిని మనదేశ వ్యాధిగ్రస్తుల కోసం నిలువ చేస్తామని చెప్పిన మోదీ, విశ్వాసఘాతుకత్వానికి పాల్పడి, ట్రంప్ ఆదేశాలపై అమెరికాకు ఆ మాత్రలను ఎగుమతి చేసి తన సామ్రాజ్యవాద దాస్యాన్ని చాటుకున్నాడు. వ్యాధి నిరోధక చర్యలు చేపట్టాల్సిన సమయంలో ట్రంప్‌కు మహా ఆర్భాటంగా అతిధ్యం ఇవ్వడం, ప్రతిపక్ష పార్టీల నేతృత్వంలో వున్న రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడం (మధ్యప్రదేశ్), మావోయిస్టుల ఏరివేత, ముస్లింల అణచివేతచర్యలలో తలమునకలై ఉన్నాడు.

కొందరు ప్రబుద్ధులు కొరోనా వ్యాధికి ధనిక, పేద భేదాలు లేవని ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారు. నిజానికి వర్గస్పృహ మచ్చుకైనా కానరాని వారి చూపులకు మరణించినవారి వర్గము, వర్ణము, ప్రాంతము వంటి వాస్తవికతలు గోచరించవు. అమెరికాలో 80 శాతం కోవిడ్-19 వ్యాధిగ్రస్తులలో 70 శాతం మంది నల్లజాతి అమెరికా ఆఫ్రికన్‌లు, ఇస్పానిక్‌లు (మెక్సికో నుండి వలస వెళ్లిన పేదలు) ఉన్నారనే వాస్తవాన్ని వారెలా దాచిపెట్టగలరు? మన దేశంలోనూ ఎంతటి వివక్ష కొనసాగుతుందో ముంబాయిలో 600 ఎకరాలలో విస్తరించి పది లక్షలకు పైబడిన పేదజనంతో కిక్కిరిసి ఉండే 'స్లమ్' ఏరియా దారవీ కానీ, వొర్లీ, కుర్లా 'మురికి' వాడలలో మరణం అంచుల్లో విలవిలలాడుతోన్న కొరోనా బాధితుల దుస్థితి కానీ 'అఫ్లీ ముంబాయి' సంజు శిండే రాసిన రిపోర్టును చదివితే బోధపడుతుంది. కనీస వసతులులేని, శుభ్రతకు నోచుకోని క్వారంటైన్ కేంద్రాలు మన దేశవ్యాప్తంగా ప్రతీ రాష్ట్రంలోనూ కోకొల్లలు.

కొరోనా వ్యాధికి 'సామాజిక దూరం పాటించడమే' మార్గమని ప్రచారం చేస్తున్నప్పటికీ, మన దేశంలో పల్లె పల్లెన వెలివాడలకు కొదువలేని కర్మభూమిలో 'సామాజిక దూరం' మరింత వివక్షతో కూడినది. మనిషి మనిషికీ మధ్య రెండు గజాల 'భౌతిక దూరం' పాటించాలనే ఆరోగ్య సూత్ర పదబంధం ఈ వెలివాడలను అపహాస్యం చేస్తున్నది. ఇలాంటి దుర్మార్గమైన కులవివక్షతో కుళ్లిపోయిన మన దేశంలో కనీస వైద్య సౌకర్యాలు లేకుండా మగ్గుతున్న పేదలకు ఎలాంటి కొరోనా నివారణ సౌకర్యాలు దొరుకుతాయి? కొరోనా విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టులలో కొందరు ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్) వేయగా వాటిపై స్పందిస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం పేదలకు తిండి, నీళ్లు, సానిటైజర్లు సమకూర్చాలనీ ఆదేశించినప్పటికీ ఏ ప్రభుత్వాల చెవికెక్కలేదు. మన దేశ జైళ్లలో వాటి కెపాసిటీని మించి అనేక రెట్లు మందల్లా మనుషులను కుక్కడం ఎరిగిన సుప్రీంకోర్టు విచారణలో ఉన్న ఖైదీలను కొరోనా వ్యాధి వ్యాప్తి ప్రమాద తీవ్రత రీత్యా విడుదల చేయాలని ఆదేశించగా, ఉత్తరప్రదేశ్‌లో హిందుత్వ ఫాసిస్టు యోగీ సర్కార్ అదనంగా వందలాది మంది కొత్త ఖైదీలతో జైళ్లను మరింత నింపడం ద్వారా ఆ ఆదేశాలను బుట్టదాఖలా చేసింది.

కొరోనా ప్రమాద తీవ్రతను అంచనా కట్టడంలో కేంద్రంతో సహా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. ప్రమాదాన్ని గ్రహించిన తర్వాత హఠాత్తుగా 21 రోజుల లాక్‌డౌన్ ప్రకటించాయి. దేశ ప్రజల ఆహార అవసరాలను తీర్చడానికి, వలస కార్మికులను వారి వారి స్వస్థలాలకు చేర్చడానికి తగిన ముందస్తు ఏర్పాట్లు చేయలేదు. మన దేశంలో వలస శ్రామికుల సంఖ్య సుమారు 15 కోట్లు ఉంటుంది. వారితో పాటు దేశంలోని శ్రామికశక్తిలో దాదాపు 90 శాతం అసంఘటిత రంగంలోనే ఉన్నారు. వారి సంఖ్య మరెన్నో కోట్లు ఉంటుంది. వీరంతా ఈ లాక్‌డౌన్ ఫలితంగా కనీవినీ ఎరగని రీతిలో కష్టాల పాలయ్యారు. ఉపాధిలేక పూర్తిగా అభద్రతకు గురయ్యారు. తమ స్వస్థలాలకు వందలు, వేల మైళ్ల దూర ప్రాంతాల్లో పనులు చేసి పొట్ట గడుపుకునే వలస శ్రామికులకు లాక్‌డౌన్‌లతో ఎలాంటి పనులు లేకుండా పోయాయి. వెనక్కి వెళ్దామంటే ప్రయాణపు సౌకర్యాలు నిలిచిపోయాయి. కరువుతో నకనకలాడే లక్షలాది మంది పరిస్థితులలో పొట్టచేత పట్టుకొని ముల్లె మూట సర్దుకొని పిల్లా పాపలతో స్వస్థలాలకు అనివార్యంగా కాలినడకన బయలుదేరిన వారి కష్టాలు కొరోనా మహమ్మారి మృత్యు భయానికన్నా మించినవి. కొన్ని చోట్ల అతి కొద్దిమంది వలస శ్రామికులకే ప్రభుత్వాలు ఐదు కిలోల బియ్యం విదిలించి వారి మానాన వారిని వదిలేసాయి. వారి ప్రయాణంలో రోడ్లపై గల గ్రామాల ప్రజలు దయతలచి వారికి బుక్కెడు అన్నం పెట్టిన చోట పొట్ట నింపుకొని కాళ్లు బొబ్బలెక్కే ఎండలో నడక సాగించిన వారి కష్టాలు చెప్పనలవికానివి. ఉదాహరణకు, ఛత్తీస్‌గఢ్ బీజాపుర్‌కు చెందిన ఒక బాలిక జమిలి మద్కం తెలంగాణలోని ఖమ్మం గ్రామీణ ప్రాంతం నుండి తన స్వగ్రామానానికి 250 కి.మీ. దూరం నడవలేక మూడవరోజు మే 18న మృతి చెందింది. ఇలాంటి హృదయ విదారక ఘటనలు గడచిన మూడు మాసాలలో దేశంలో లెక్కలేనన్ని చోటు చేసుకున్నాయి. కానీ మన పాలకులు మహా ఆర్భాటంగా శ్రామిక ప్రత్యేక రైళ్ల ద్వారా కేవలం కొన్ని లక్షల మందిని మాత్రమే పలు క్వారంటైన్ గేట్ల గుండా తరలించారు. విమానాలను, నౌకలను రంగంలోకి దించామంటున్నారు. కానీ వీటిలో ప్రయాణించడానికి కనీసం చార్జీలు లేని లక్షలాది-కోట్లాది మంది పేద వలస శ్రామికుల స్థితి మరింత దుర్భరమైంది.

వలస కూలీలు తమ ప్రయాణంలో ఎన్నో కష్టాలు పడి ఎట్టకేలకు గ్రామాలకు చేరుకుంటే వారిని గ్రామాలలోకి రానివ్వని చేదు అనుభవాలు ఎన్నో చోట్ల వారికి ఎదురయ్యాయి. వారు కొరోనా వాహకులనే భయంతో పల్లె జనాలు వారిని దూరంగా వుంచేవారు. పల్లెల్లో ఎలాంటి వైద్య పరీక్షల కేంద్రాలు లేక, కనీస భోజన సదుపాయాలు కొరవడి వారు పలు కష్టాలు ఎదుర్కొన్నారు. చాలా చోట్ల వలస కార్మికులను కాంట్రాక్టర్లు అసలు వదలడానికే సిద్ధపడలేదు. వాళ్లకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించలేదు. వాళ్లు స్వగ్రామాలకు వెళ్లిపోతే మళ్లీ తమ పనులకు శ్రామికులు అందుబాటులో ఉండరనీ అనేక వత్తిళ్లు తీసుకొచ్చి వారిని అడ్డుకున్నారు. అయినప్పటికీ ఎలాగోలా వారి బంధనాలను ఛేదించుకొని బయటపడి, రోడ్లెక్కినవారిపై పోలీసులు

144 సెక్షన్‌ను ఉల్లంఘిస్తున్నారంటూ లాఠీలు దులపరించడం, దుర్భాషలాడడం, నిర్బంధంగా క్వారంటైన్ కేంద్రాలకు పంపడం మొదలైనవి వారిని మరింత దుర్భర స్థితికి నెట్టాయి.

మోదీ తగిన తయారీలు లేకుండా చేసేవన్నీ ఆకస్మిక ప్రకటనలే! గతంలో పెద్దనోట్ల రద్దు సందర్భంగా మించిన కష్టనష్టాలను ప్రస్తుతం కోవిడ్-19 సందర్భంగా పేద, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కున్నారు. దాదాపు వరుసగా 70 రోజులు కొనసాగిన ఆకస్మిక లాక్‌డౌన్‌లతో దేశ ఆర్థిక వ్యవస్థంతా స్థంభించిపోయి లక్షల సంఖ్యలో చిన్న ఉ త్పత్తిదారులు దివాలాతీసారు. రైతాంగం వారి వ్యవసాయోత్పత్తులను, అనుబంధ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించలేకపోవడంతో కోలుకోలేనంతగా నష్టపోయారు. పరిశ్రమలు మూతపడి లక్షల-కోట్ల సంఖ్యలో కార్మికులు రోడ్ల మీదకు వచ్చారు. ఉద్యోగస్థుల, కార్మికుల జీతాలలో, పెన్షన్ ఫండ్లలో కోతలు విధించారు. పండ్లు, కూరగాయాలు, మాంసం వ్యాపారంతో సహా ప్రజల దైనందిన జీవితాలతో ముడిపడిన అనేక వ్యాపారాలు పూర్తిగా మూతపడి లక్షలాది చిన్న వ్యాపారులు జీవికను కోల్పోయారు. లాక్‌డౌన్‌లతో భారత ఆర్థిక వ్యవస్థకు రోజుకు 60 వేల కోట్ల రూపాయలు ఆర్థిక నష్టం వాటిల్లిందని కొందరు విశ్లేషకుల అంచనా.

ఈ సంక్షోభ పరిష్కారానికి మోదీ ప్రభుత్వం విదిలించిన తొలి ఆర్థిక ప్యాకేజీ 1.75 లక్షల కోట్లలో దేశంలోని కోట్లాది పేద ప్రజల వాటా ఎంత అనేది తెలీదు. నిజానికి అది వారి కనీసం గంజినీళ్లకైనా తోడ్పడింది లేదు. దేశ గోదాములలో మురిగిపోతున్న కోట్ల టన్నుల ధాన్యం ఏ ఒక్క పేద కడుపును నింపలేదు. 2020-21 బడ్జెట్‌లో సంపన్నులకు మినహాయించిన 5 లక్షల కోట్ల కార్పొరేట్ పన్నును గమనిస్తే కొరోనా ఆర్థిక ప్యాకేజీ ప్రధానంగా ఎవరిని ఆదుకుంటుందో తెలిసిపోతుంది! తిరిగి మే నెల మధ్యలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వార్షిక బడ్జెట్ కేటాయింపులను తారుమారు చేసి, ప్రణాళికా వ్యయాన్ని గణనీయంగా కుదించి ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన 20 లక్షల కోట్ల రూపాయల 'భారీ ఆర్థిక ప్యాకేజీ' వాస్తవంగా ప్రభుత్వ పీ.పీ.పీ. (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానాల ద్వారా కార్పొరేట్లు, సంపన్న వర్గాల ప్రయోజనాలు నెరవేర్చేదే తప్ప లాక్‌డౌన్‌లతో జీవికను కోల్పోయినవారిని, దెబ్బతిన్న చిన్న, మధ్యతరహా ఉత్పత్తిదారులను ఆదుకోవడానికి కానేకావు. మోదీ ప్రభుత్వం తన ఆరేళ్ల పాలనలో అంతర్జాతీయ విపణిలో వరుసగా పెట్రోల్, ఆయిల్, గ్యాస్ లాంటి ఇంధన ధరలు తగ్గినా పన్నుల రూపంలో వినియోగదారుల నుండి 20 లక్షల కోట్లు దండుకుంది. అదంతా పూర్తిగా ప్రజల సొమ్మే! వాటినైనా ఇప్పుడైనా ప్రజాసంక్షేమం కోసం ఖర్చు చేయకుండా మోదీ అండ్ కంపెనీ సంపన్నుల జేబులు నింపుతున్నది. 1930ల మహా మాంద్యం సమయంలో ఉనికిలోకి వచ్చిన 'క్రియేటివ్ డిస్ట్రక్షన్'ను వర్తమాన లాక్‌డౌన్‌లు గుర్తు చేస్తున్నాయి. ప్రతీ పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద సంక్షోభం సందర్భంగా జరిగినట్లే ముంచెత్తుతున్న నేటి సంక్షోభ సమయంలో అమెరికాలో ప్రకటించిన లాక్‌డౌన్‌ల వెనుక ఆర్థిక తిమింగళాలు బిల్ గేట్స్, రాక్‌ఫెల్లర్, సొరోస్ లాంటి కంపెనీలున్నాయని అక్కడి విశ్లేషకులు చెబుతున్నారు.

ముందే గొంతు లోతు సంక్షోభంలో కూరుకుపోయిన ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించలేక, యేటేటా దేశ జీడీపీ అభివృద్ధి రేటు పడిపోతుంటే, గత 45 యేండ్లలో ఎన్నడూలేని స్థాయికి నిరుద్యోగం పెరిగిపోయి పాలకుల ప్రయోగాలన్నీ విఫలమవుతున్న సమయంలో కొరోనా ప్రత్యక్షమైంది. ఇక ఇపుడు తమ గత వైఫల్యాలన్నింటినీ దాని మీదికి నెడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించడానికి అంటూ విడుదల చేసిన 20 లక్షల కోట్ల రూపాయలను 'ఆత్మనిర్భర్ భారత్' పేరుతో ఖర్చు చేస్తామని మోదీ ఊదరగొడుతున్నాడు. నిజానికి కొరోనా సాకుతో ఆ డబ్బంతా విడుదలచేసింది సామ్రాజ్యవాదుల, కార్పొరేట్ వర్గాల, భూస్వాముల, సంపన్నుల ప్రయోజనాలను నెరవేర్చడానికే! కానీ ఆయన తన ప్రచార బ్రిగేడ్ ద్వారా 'ఆరోగ్య సేతు' ఆప్ డౌన్లోడ్ చేసుకోవాలనీ, భయపడవద్దనీ, "స్వీయ రక్షితే రక్షితః" అనీ, అపోహలు ప్రసారం చేయకూడదనీ, ఆరోగ్య భారతాన్ని నిర్మించాలనీ చేంతాడంతా హితోపదేశాలు చేయిస్తున్నాడు. ఇవన్నీ కొరోనా నివారణ ప్రజల వ్యక్తిగతబాధ్యతగా వారి నెత్తిన రుద్దే ముందస్తు పథకంలో భాగమే. దేశంలోని సామ్రాజ్యవాదుల, దళారీ కార్పొరేట్ ప్రచార-ప్రసార సాధనాలు మోదీకి వంత పాడుతూ అవి భారీగా తమ వ్యాపార ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నాయి. దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలన్నింటినీ ప్రభుత్వాలు రద్దు చేసాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల ప్రభుత్వాలు కొరోనా పేరు చెప్పి మూడేళ్లు అన్ని కార్మిక చట్టాలను నిరంకుశంగా సస్పెండ్ చేసాయి. ప్రపంచ కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పనిహక్కును మన దేశ పాలకులు ప్రభుత్వరంగ సంఘటిత రంగ పరిశ్రమల్లో సైతం నామమాత్రంగానే అమలు చేస్తున్నారు. ప్రస్తుతం కొరోనా నెపంతో రాజస్థాన్, గుజరాత్, పంజాబ్, ఒడిశా, అస్సాం, హిమాచల్ ప్రదేశ్‌లలో కార్మికులు రోజుకు 12 గంటలు పని చేయాలనీ నిర్బంధిస్తున్నారు. ఈ విధానం దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తున్నారు. ఇక ప్రైవేట్‌రంగంలోని సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదారుల కంపెనీలకైతే ఏ చట్టాలూ ఎన్నడూ వర్తించింది లేదు.

సామ్రాజ్యవాదులు తాము సంక్షోభాన్ని ఎదుర్కొన్న ప్రతీ సందర్భంలో ఆ విపత్తు నుండి గట్టెక్కి కోటానుకోట్ల శ్రామిక ప్రజానీకాన్ని, పీడిత జాతులను మరింతగా కొల్లగొట్టడానికి భారీ మానవ హననానికి పూనుకుంటారనీ ప్రపంచ చరిత్ర పదే పదే చాటిచెబుతుంది. రెండవ ప్రపంచ యుద్ధం చిట్టచివరిలో ప్రపంచంలో అణుబాంబులను తయారు చేసి మొట్టమొదటిసారిగా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకీ నగరాలపై ప్రయోగించి లక్షలాది మందిని పొట్టన పెట్టుకుంది అమెరికా సామ్రాజ్యవాదులే! వాళ్లే వియత్నాం ప్రజా యుద్ధంలో విషపూరిత వాయువులు 'ఎజంట్ ఆరెంజ్', 'నేపాం బాంబు'లను పెద్దెత్తున ప్రయోగించి లక్షలాది మంది ప్రజలను చంపారు. వాటిని ఐక్యరాజ్యసమితి నిషేధించినప్పటికీ ఆ తరువాత తమ తొత్తు సైన్యాలచే అవసరమైనపుడల్లా అనేక దేశాలపై రసాయినిక ఆయుధాలు గుమ్మరిస్తూ లెక్కలేనంత మంది ప్రజల ప్రాణాలు తీస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థే యుద్ధ ఆర్థిక వ్యవస్థ అనేది జగమెరిగిన సత్యం. అది యుద్ధాలు లేకుండా మనజాలదు. అది ప్రపంచ వినాశనానికి, యుద్ధోన్మాదానికి దారితీస్తున్నది. వారు తమ దురాశాపూరితమైన లాభాల కోసం, ప్రపంచాధిపత్యం కోసం కొరోనా లాంటి వైరస్‌లను, జైవిక ఆయుధాలు సృష్టించరనలేం. ఈ సామూహిక నరహంతకులకు తమ ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగించే చరిత్ర ఉంది.

డ్యూపాంట్, మోన్శాంటో, డౌ కెమికల్స్, బేయర్ మున్నగు అమెరికా

సామ్రాజ్యవాద యుద్ధ పరిశ్రమలు గతంలో రసాయినిక ఆయుధాలను తయారు చేసేవి. ఇపుడు అవి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కూడా తయారు చేస్తూ వివిధ దేశాల్లో రైతాంగ జీవితాలను బలిగొంటున్నాయి. విపరీతమైన రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం వలన 'హరిత విప్లవ' పంజాబ్‌లో టీబీ, క్యాన్సర్ వ్యాధులు ప్రబలి భటిండా–బికనేర్‌ల మధ్య 'క్యాన్సర్ ఎక్స్‌ప్రెస్' నడుస్తోంది. ప్రపంచవ్యాపితంగా ఇలాంటివి అనేకం సామ్రాజ్యవాదులు సృష్టించారు.

ఉత్పత్తిలో పోటీ, అరాచకం పెట్టుబడిదారీవ్యవస్థ స్వతఃసిద్ధ లక్షణాలు. పెట్టుబడిదారీ విధానంతోనే వెన్నంటి సంక్షోభాలు పుట్టాయి. మొదట పీరియాడికల్‌గా ఎదురైన అధికోత్పత్తి సంక్షోభాలు తర్వాత శాశ్విత సంక్షోభాలుగా మారాయి. అధికోత్పత్తి సంక్షోభాలను పరిష్కరించుకోవడానికి పెట్టుబడిదారులు మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో తమ ఉత్పత్తులను తగులపెట్టి లేదా సముద్రం పాలు చేసి గోదాములు ఖాళీ చేసేవారు. తర్వాత క్రమంగా మళ్లీ ఉత్పత్తి క్రమం పట్టాల మీదికి ఎక్కేది. సంక్షోభం నుండి బయటపడడానికి ఈ ప్రత్యక్ష విధ్వంసకర విధానాలకు క్రమంగా వారు స్వస్తి చెప్పారు. రెండవ ప్రపంచ యుద్ధ తదనంతరకాలంలో తమ అధికోత్పత్తులను వదిలించుకోవడానికి అర్ధవలస, నయావలస దేశాలలో ఒకవైపు వివిధ రూపాలలో యుద్ధాలకు తలపడుతూనే, మరోవైపు అప్పులు, గ్రాంట్లు, సహాయం పేరుతో తమ అధికోత్పత్తులను ఆ దేశాలలో గుమ్మరిస్తున్నారు. ఆ దేశాల మూలుగులను పీలుస్తున్నారు. కానీ ప్రజల చైతన్యం పెరుగుతున్న క్రమంలో వారి విధ్వంసకర, నయా దోపిడీ రూపాల గుట్టు బట్టబయలవుతూ ప్రజా ప్రతిఘటన తీవ్రమవుతున్న పరిస్థితులలో కొరోనా ప్రత్యక్షమైంది. ప్రస్తుతం వారు కరోనా పేరుతో ప్రపంచవ్యాప్తంగా లాక్‌డౌన్లు విధించి తమ అధికోత్పత్తి సంక్షోభ సమస్యను పరిష్కరించబూనుకున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన రూపాలను అత్యంత మోసపూరితంగా ముందుకు తేవడం వారికి వెన్నతో పెట్టిన విద్యే.

గత కొద్ది సంవత్సరాలుగా అనేక మంది ఆర్థిక విశ్లేషకులు 2008ని మించిన మహా సంక్షోభం ఎదురుకానున్నదనే భవిష్యవాణి చేస్తున్న నేపథ్యంలో కొరోనా మహావిపత్తు ప్రపంచాన్ని కమ్మేయడం, 'సృజనాత్మక విధ్వంసాన్ని' కోరుకున్న సామ్రాజ్యవాద ఆర్థిక తిమింగళాల మూలంగా నేడు లాక్‌డౌన్లతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడం, కోట్లాది శ్రమజీవులు కష్టాలపాలు కావడం, నిరాశ్రయులు కావడం మన కళ్ల ముందే జరుగుతోంది. ప్రపంచంలోని 150 దేశాలు సంపూర్ణ లాక్‌డౌన్‌లను, మరో 70 దేశాలు నిర్దాక్షిణ్యంగా పాక్షిక లాక్‌డౌన్‌లను ప్రకటించి అధికోత్పత్తి సరుకుల భారాన్ని వదిలించుకున్నాయి. గతంలో మరో రూపంలో ఇలాంటి ప్రక్రియలను చేపట్టడం ద్వారానే ద్రవ్య పెట్టుబడి సాంద్రీకరణ, కేంద్రీకరణ చోటు చేసుకుంది. లక్షలాది చిన్న, మధ్యరకం ఉత్పత్తిదారులు నాశనమై ఉత్పత్తి రంగంలో భారీ, అతి భారీ పరిశ్రమలు బలిసిపోయాయి. ఇదే వారి క్రియేటివ్ డిస్ట్రక్షన్. ప్రపంచ వ్యాపితంగా వున్న మహా కుబేరులతో, దేశాల అధ్యక్షులు, ప్రధానులు, ఇతర శక్తివంతమైన మూడువేల మందితో యేటా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే 'ప్రపంచ ఆర్థిక వేదిక' (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) 2021 జనవరిలో రూపొందించిన ఎజండా వెలుగులో 'నాల్గవ పారిశ్రామిక విప్లవం' బాగా ప్రచారంలోకి వస్తున్నది. దానికి క్రియేటివ్ డిస్ట్రక్షన్ కావాలి. సామ్రాజ్యవాద, వారి దళారీ ప్రభుత్వాలు వర్తమాన లాక్‌డౌన్‌లు ఈ క్రియేటివ్ డిస్ట్రక్షన్‌లో భాగమే. లాక్‌డౌన్లు ఇప్పటికే కోటానుకోట్ల నిరుద్యోగులతో, పాక్షిక ఉద్యోగులతో కూడిన చవక–అతిచవక విశాల కార్మిక సేనను సృష్టించాయి.

యావత్ ప్రపంచం కొరోనాతో అతలాకుతలం అవుతుంటే, సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలు ఇస్లాం ఫోబియాతో, మావోయిస్టు భూతంతో తలపడుతున్నాయి. అమెరికావ్యాప్తంగా కొరోనా మహమ్మారి ముసుగులో దాడి చేస్తున్న సామ్రాజ్యవాద ఫాసిజాన్ని ఎదుర్కోవడానికి, ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌కు వ్యతిరేకంగా, నల్లజాతి ప్రజలపై అమలవుతున్న వర్ణ వివక్ష, అణచివేత, హత్యలకు వ్యతిరేకంగా అమెరికా ప్రజలు పెద్దెత్తున ఆందోళనలకు దిగారు. అనేక దేశాలలో కూడా ఆందోళనలు బద్దలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాలోని 150 నగరాలలో సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీ అయిన సోరోస్ అండ్ కంపెనీ దొమ్మీలను సృష్టించి మిలటరీ లాక్‌డౌన్‌కు తెరలేపింది. జనాలను నియంత్రించే పేరుతో, అంతరంగిక భద్రత సాకుతో ట్రంప్ సైన్యాన్ని దించడాన్ని అనేక రాష్ట్రాల గవర్నర్లు, విశ్రాంత (రిటైర్డ్) సైనిక జనరల్స్ వ్యతిరేకించడం అనేది అక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. నల్లజాతి పౌరుడైన జార్జ్ ఫ్లోయిడ్‌ను జూన్ మొదటివారంలో పోలీసులు హత్య చేయడాన్ని ఖండిస్తూ, న్యాయాన్ని కోరుతూ అమెరికాలోని అనేక నగరాలలో పెద్దెత్తున ప్రజా ప్రదర్శనలు జరిగాయి. వారికి సమర్థనగా లండన్, పారిస్, కోపెన్‌హెగెన్, ఆక్లాండ్, సిడ్నీ తదితర యూరప్ దేశాలలోని వేలాది–లక్షలాది మంది, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ప్రజలు వర్ణవివక్షకు వ్యతిరేకంగా అది ఏ దేశంలోనున్నా సహించకూడదని ముందుకువచ్చారు. కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో లాంటి వాళ్లు తమ దేశంలో నిరసన ర్యాలీలో పాల్గొనక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది.

మన దేశంలో 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక వ్యతిరేక నూతన లేబర్ కోడ్‌లను చట్టబద్ధం చేసి రాజ్యాంగంలో చొప్పించిన అనతికాలంలోనే కొరోనా ముందుకు వచ్చింది. నాలుగు లేబర్‌కోడ్‌లు మినహాయించి నామమాత్రంగా మిగిలిన కార్మిక చట్టాలను సహితం ఇపుడు కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు సస్పెండ్ చేయడాన్ని, నిర్వీర్యం చేయడాన్ని, రిట్రెంచ్‌మెంట్లను, 12 గంటల పనిదినాన్ని, వెట్టిచాకిరి పని పరిస్థితులను వ్యతిరేకిస్తూ, వలస, అసంఘటిత కార్మికుల సమస్యలపై మే 22న 'మజ్దూర్ అధికార్ సంఘర్ష్ అభియాన్' (మాసా) దేశవ్యాప్త నిరసన దినం పాటించింది. పెద్ద సంఖ్యలో కార్మికులు కొరోనా పట్ల తగిన జాగ్రత్తలు పాటిస్తూనే రోడ్లమీదికి వచ్చారు. మరోవైపు ప్రజాస్వామిక మేధావులు ఆనంద్ తేల్‌తుంబ్డే, గౌతం నవలఖాల అరెస్టులను లండన్ మానవ హక్కుల సంఘంతో సహా 150 హక్కుల సంఘాలు, ఐదు వేల మందికి పైగా ప్రముఖ మేధావులు, ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించడం దేశంలో ముంచుకు వస్తున్న ఫాసిస్టు వ్యతిరేక ధిక్కార స్వరాలకు ఉదాహరణలు. యేదాదికి పైగా అక్రమ కేసులలో కటకటాల వెనుక మగ్గుతున్న వరవరరావు, రోనావిల్సన్, సుధా భరద్వాజ్, సోమాసేన్, సుధీర్ దావ్‌లే, సురిందర్ గాడ్లింగ్ లాంటి పలువురు కవుల, అడ్వకేట్ల, మేధావుల, ప్రజాస్వామికవాదుల, సామాజిక రాజకీయ కార్యకర్తల విడుదల కోసం అనేక ప్రజాస్వామిక సంస్థలు, మేధావులు ప్రజాసంఘాలతో కలిసి 'నిర్బంధ వ్యతిరేక కమిటీ' ఏర్పడడం దేశ ప్రజలలో పెరుగుతున్న

ప్రజాస్వామ్య ఆకాంక్షలను తెలియచేస్తోంది. ఫాసిస్టు నిర్బంధమే కాదు, కొరోనా మహమ్మారి సైతం ప్రజాపోరాటాలను ఆపలేదని ఇవన్నీ వెల్లడిస్తున్నాయి.

అగస్టు 5 నుండి మన దేశంలో జమ్మూ-కశ్మీర్ సైనిక-పోలీసు ఫాసిస్టు లాక్‌డౌన్‌లోనే ఉంది. వర్తమాన లాక్‌డౌన్‌తో అక్కడి ప్రజల జీవితాలు మరింత దుర్భరం అయ్యాయి. కశ్మీర్‌కు అందించాల్సిన మాస్క్‌లు, టెస్టింగ్ కిట్‌లు సైతం జమ్మూకు చేరవేసి తమ హైందవ దురహంకారాన్ని మోదీ నేతృత్వంలో కేంద్ర పాలకులు చాటుకున్నారు. ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన పాత్రికేయులు పీర్‌జాదా హాసిన్‌ను అరెస్టు చేశారు. ముస్లింలను రెండవ శ్రేణి పౌరులుగా చూడడం, మహిళలను మెడికల్ కేర్ నుండి వంచించడాన్ని ప్రశ్నించిన మాస్రత్ జహరా, ముస్తాక్ గవాయి, గోవార్ గిలానీలను 'ఉపా' కింద జైల్లో బంధించారు. కొరోనా మహమ్మారి కాలం అనే ఇంగితజ్ఞానమైనా లేకుండా హిందుత్వ శక్తులు ఈ విధంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నాయి. ఢిల్లీ నిజాముద్దీన్‌లో ముస్లిం సముదాయానికి చెందినవారు 'తబ్లిగ్ జమాత్' ప్రార్థనా సమావేశాలను జరుపుకోవడం ద్వారానే కొరోనా మహమ్మారి వ్యాపించిందని అంటూ సంఘ్ ఐ.టీ. సెల్ కొరోనా విజృంభణకు మతం రంగు పులిమి, దేశంలో హిందూ మతదురహంకారాన్ని రెచ్చగొట్టజూసింది. కొరోనా కాలంలో సైతం హిందూ ఫాసిస్టులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాలలో ముస్లింలపై దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి.

ఇప్పటి వరకు హిందుత్వ 'గోరక్షకులు' గోమాంసం సాకుతో మూక హత్యలకు (మాబ్ లించింగ్) దిగితే, ఇక ఇపుడు వారికి మరో కొత్త ఆయుధం దొరికింది. ముస్లింలను కొరోనా వాహకులంటూ ముస్లిం, క్రైస్తవ ప్రజలను లించింగ్ చేయడం మొదలైంది. మల్కన్‌గిరి (ఒడిశా) జిల్లాలో ముదిలిపాడ తాలూకాలో జూన్ 4న ఖేందుగూడాకు చెందిన సోమారు మడ్కాం అనే ఏడవ తరగతి చదువుతున్న 14 సంవత్సరాల యువకున్ని హిందూ మతోన్మాదులు కొట్టి చంపడం ఇందుకు ఒక ఉదాహరణ. ఝార్ఖండ్‌లో మే నెలలో 'ఘర్ వాపసీ' ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి.

హిందుత్వ శక్తుల 'హిందూ రాజ్య' నిర్మాణ లక్ష్యంతో ఎక్కుపెట్టిన 'నవ భారత్' నినాద కుట్రను బహిర్గతపరుస్తున్న శక్తులను టార్గెట్ చేసి వేదింపులకు గురి చేయడంలో భాగంగా నిన్నటి వరకు సీ.ఏ.ఏ.ను వ్యతిరేకించిన శాహీన్‌బాగ్ ముస్లిం ప్రజలను కొరోనా కాలంలో సైతం తీవ్ర వేదింపులకు గురి చేస్తున్నారు. "గుజరాత్ ఫైల్స్" పుస్తకం ద్వారా మోదీ-షాల నేరమయ జీవితాలను, హంతక క్రీడలను వెలుగులోకి తెచ్చిన ప్రముఖ పాత్రికేయులు రాణా ఆయుబ్ 'సామాజిక దూరం పాటించడం విలాసం' అని వ్యాఖ్యానించినందుకు కోర్టు ద్వారా మందలింపజేసారు. 'ఇంక్‌లాబ్ మజ్దూర్ కేంద్ర' సంపాదకుడు కైలాస్ భట్‌ను అరెస్టు చేసారు. కొరోనా ముసుగులో పాలకుల దౌర్జన్యాలను, దాడులను ప్రశ్నించిన సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌తో సహా నైనితాల్ విద్యార్థి నాయకులు మహేశ్‌ను, జే.ఎన్.యు. పీ.హెచ్.డీ. విద్యార్థి షర్జీల్ హిమామ్‌ను కోర్టులు వదలిపెట్టలేదు. కొరోనా మహమ్మారిని నియంత్రించే పేరుతో హిందుత్వ ఫాసిస్టు శక్తులు ముస్లింలపై దాడులు కొనసాగించడమే కాకుండా, వారి భద్రతా బలగాలు కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ల పేరుతో జనవరి నుంచి ఇప్పటి వరకు 100 మందికి పైగా ఉద్యమకారులను, ప్రజలను కాల్చిచంపారు. కొరోనాను రావణుడిని తరిమినట్టు తరమాలనీ హిందుత్వ శక్తులు ప్రేలాపనలు చేస్తున్నాయి.

'మావోయిస్టుల నిర్మూలన' పేరుతో విప్లవోద్యమం కొనసాగుతున్న విశాల గ్రామీణ ప్రాంతాలలో, పట్టణాలలో వేలాది పారామిలటరీ అదనపు బలగాలను మోహరించి కార్పెట్ సెక్యూరిటీ క్యాంపులు నెలకొల్పుతూ నిరంతరం గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు. ప్రజలను, విప్లవకారులను అరెస్టు చేస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లలో జనవరి నుంచి మే వరకు దాదాపు 30 మంది ప్రజలను, విప్లవకారులను హత్య చేసారు. మావోయిస్టుల అణచివేతకు కొరోనా అడ్డంకాదని కరుడుగట్టిన ఫాసిస్టు పాలకులు, వారి కిరాయి బలగాల అధికారులు ప్రకటిస్తూనే ఉన్నారు. పోలీసులు తమ పాలకుల, పై అధికారుల ఆదేశాలపై అడవులలో కూంబింగులు సాగిస్తూ స్వయంగా కొరోనా వ్యాధికి గురవుతున్నారు, ఆదివాసులలో కొరోనా వ్యాప్తికి పాల్పడుతున్నారు. ఇది ఇలా ఉండగా, మహారాష్ట్ర డిప్యూటీ చీఫ్ మినిష్టర్ అజిత్‌పవార్ మినప సమరంలో గెరిల్లాల విజయంపై వ్యాఖ్యానిస్తూ మావోయిస్టులకు కొరోనా చింతే లేదన్నాడు. 'దొంగే దొంగ, దొంగ అని అరవడం' అంటే ఇదే.

## ప్రియమైన కామ్రేడ్స్!

ప్రపంచాన్ని ప్రమాదకర వైరస్‌లు సోకినా, మహమ్మారీలు ముంచెత్తినా, సంక్షోభాలు బద్దలైనా, 'అభివృద్ధి' గాలిబుడగలు పేలిపోయినా పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద వ్యవస్థ గానీ, వెనుకబడిన దేశాలలోని అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలు గానీ వాటికవే నాశనం కావు, నూతన సోషలిస్టు, ప్రజాస్వామిక వ్యవస్థలు నెలకొనవు. గత రెండు శతాబ్దాలుగా ఈ సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థను తుదముట్టించే ప్రపంచ కార్మికవర్గం ముందుకు అవకాశాలు తరచుగా వస్తూనే ఉన్నాయి. ఇలాంటి సంక్షోభిత విప్లవకర పరిస్థితులను సద్వినియోగం చేసుకోవడం ద్వారానే పారిస్ కమ్యూన్, రష్యా, చైనా, పలు తూర్పు యూరప్ దేశాలు, క్యూబా, వియత్నాం, కంపూచియాల విప్లవకర సంఘటిత కార్మికవర్గం, విశాల పీడిత ప్రజానీకం, వారి అగ్రగామి సంస్థలైన కమ్యూనిస్టు పార్టీలు అక్కడి విప్లవోద్యమాలను సఫలీకృతం చేసాయి. మరెన్నో దేశాలలో మహత్తర విప్లవోద్యమాలు నిర్మాణమయ్యాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ గత రెండు శతాబ్దాలుగా ప్రపంచ పీడిత ప్రజలను తరచుగా తీవ్రమైన సంక్షోభాలకు, మృత్యుముఖానికి నెట్టగా, కార్మికవర్గ నాయకత్వంలో పై దేశాలలో స్థాపించబడిన సోషలిస్టు, నూతన ప్రజాస్వామిక వ్యవస్థలు మునుపెన్నడూ లేనివిధంగా అన్ని రంగాలలో పీడిత ప్రజల సంక్షేమానికి అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పలు అద్భుతాలను సృష్టించాయి. ఆ సోషలిస్టు దేశాలు ప్రజల ప్రయోజనాలనే సర్వస్వంగా భావించడం వల్ల వైద్యరంగంలో ప్రపంచంలోనే మున్నెన్నడెరగని అద్భుతాలు సాధించిన చరిత్రనెవ్వరూ తుడిచిపెట్టలేరు. ఇందుకు భిన్నంగా సామ్రాజ్యవాదం అంటేనే దోపిడీ, పీడన, అణచివేత, వేదన, ప్రకృతి-పర్యావరణ వినాశనం, ప్రతీఘాతుకత, యుద్ధం. ఇవే నేడు ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం సృష్టించే సంక్షోభాలకు, యుద్ధాలకు కారణం. సామ్రాజ్యవాద వ్యవస్థలో శ్రామికవర్గాలకు నిజమైన ప్రజాస్వామ్యం, అభివృద్ధి, సంపద, శాంతి, ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణ అసాధ్యం. దీనికి ఏకైక ప్రత్యామ్నాయం

సోషలిజం-కమ్యూనిజం మాత్రమే. ప్రజల, దేశ సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా పని చేయగలిగే నిజమైన ప్రజాతంత్ర, సామ్యవాద వ్యవస్థ నిర్మాణం ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారానే సాధ్యం. పై సోషలిస్టు దేశాలలో రివిజనిస్టుల ద్రోహం ఫలితంగా అక్కడ తిరిగి నూతన తరహా బూర్జువావర్గం అధికారంలోకి వచ్చినప్పటికీ ఆ మహత్తర (పాజిటివ్, నెగెటివ్) అనుభవాలన్నింటి నేర్చుకొని ప్రపంచవ్యాప్తంగా మావోయిస్టు వ్యూహం-ఎత్తుగడలతో తిరిగి ఎక్కడికక్కడ సృజనాత్మకంగా ప్రజలను సుసంఘటితపరచి విప్లవాలు విజయవంతం చేయడానికి వర్తమాన పరిస్థితులు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. కొరోనా మహమ్మారికి భయపడకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు రోడ్ల మీదికి రావడం ఇలాంటి విప్లవకర పరిస్థితినే తెలియజేస్తున్నది. మన దేశంలో వలస కార్మికులతో పాటు వివిధ పీడిత వర్గాల ప్రజలు సాగిస్తున్న పోరాటాలు కూడా ఇలాంటి విప్లవ పరిస్థితినే సూచిస్తున్నది. ఇలాంటి అనుకూల పరిస్థితుల్లో మనం ఈ కింది తక్షణ కర్తవ్యాలను చేపట్టాలి:

1) కరోనా లాంటి మహమ్మారులు సామ్రాజ్యవాద వ్యవస్థ సృష్టే. మనం సామ్రాజ్యవాదుల, వారి దళారీ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక, ప్రకృతి వ్యతిరేక, పర్యావరణ వ్యతిరేక విధ్వంసకర విధానాలను ఎండగట్టాలి. వాటికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా పోరాడుతున్న శక్తులతో భుజం-భుజం కలిపి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విశాల ఐక్య సంఘటన వేదికల ద్వారా పోరాటాలను తీవ్రతరం చేయాలి.

   సామ్రాజ్యవాద వ్యవస్థను ఈ భూమండలం నుంచి నిర్మూలించి ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో ప్రపంచ కార్మికవర్గ నాయకత్వంలో పీడిత జాతులను, ప్రజలను సమీకరించి-సంఘటితం చేసి వర్గ పోరాటాలను, జాతి విముక్తి పోరాటాలను, ప్రజాయుద్ధాలను తీవ్రతరం చేయాలి. ప్రజా సర్వతోముఖాభివృద్ధికి హామీనిచ్చే నూతన ప్రజాస్వామిక, సోషలిస్టు వ్యవస్థలే సామ్రాజ్యవాదానికి నిజమైన ప్రత్యామ్నాయమని చాటిచెప్పాలి. అనేక సామ్రాజ్యవాద దేశాలలో అత్యధికంగా కరోనా మహమ్మారికి బలవుతున్న పీడిత వర్గ, పీడిత వర్ణ, పీడిత జాతి ప్రజలంతా ఏకమై వర్ణ వివక్షకు, జాతి వివక్షకు వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న ప్రజా నిరసనలను ఆ దేశాలలోని కార్మికవర్గం సోషలిస్టు విప్లవంతో జోడించి నడపాలి.

   మన దేశంలో సామ్రాజ్యవాదానికి దాస్యం చేస్తున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను కూలదోసి అన్ని పీడిత వర్గాల, సెక్షన్ల, పీడిత జాతుల హక్కులకు, ప్రజల సంక్షేమానికి హామీ నిచ్చే నూతన ప్రజాస్వామిక వ్యవస్థను, తదనంతరం సోషలిజం-కమ్యూనిజం స్థాపించే లక్ష్యంతో కార్మికవర్గం నాయకత్వంలో కార్మిక-కర్షక మైత్రి పునాదిగా పీడిత వర్గాలను, పీడిత సెక్షన్లను, పీడిత జాతులను తమ డిమాండ్లపై సంఘటితం చేసి పోరాడాలి. దళారీ నిరంకుశ బూర్జువా భూస్వామ్య పాలకవర్గాలు అమలు చేస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల దుష్ప్రభావాల పట్ల ప్రజల ఆగ్రహాన్ని పక్కదారి పట్టించడానికి పరమ విద్వేషపూరితమైన జాతీయోన్మాదాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి హిందుత్వ శక్తుల కుట్రలను బహిర్గతపరచాలి. 'హిందూరాజ్య స్థాపన' లక్ష్యంతో 'నయా భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' నినాదాల్ని ఎత్తుకొని 'ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్' అంటూ వివిధ జాతుల, తెగల, భాషల, మతాల, సంస్కృతుల వైవిధ్యాన్ని రూపుమాపే హిందుత్వ శక్తుల కుట్రలను బహిర్గతపరచాలి. కొరోనా లాంటి మహమ్మారికి మతం రంగు పులుమడాన్ని ఖండిస్తూ మైనార్టీలను వేదించే హిందుత్వ ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా లౌకిక శక్తులతో కలిసి పోరాడాలి. కొరోనా పేరుతో లించింగ్‌లకు పాల్పడే దుష్ట హిందుత్వ గుండావాహినిలను పసిగట్టి కఠినంగా శిక్షించాలి. మన దేశంలో దశాబ్దాలుగా తమ జాతుల స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడుతున్న వారితో, తెగల స్వయం ప్రతిపత్తి కోసం సాగుతున్న పోరాటాలతో భుజం-భుజం కలిపి పోరాడాలి. అమూల్యమైన ప్రకృతి వనరులను కారుచౌకగా సామ్రాజ్యవాదులకు, వారి దళారీ పెట్టుబడిదారులకు అప్పచెబుతున్న పాలక మోదీ ముఠా 'మేక్ ఇన్ ఇండియా' విధానాలను గట్టిగా ప్రతిఘటించాలి. బలవంతంగా ప్రజలను నిర్వాసితం చేయడాన్ని దృఢంగా అడ్డుకోవాలి. బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా ముందుకు వస్తున్న దేశభక్త, లౌకిక, ప్రజాస్వామిక, విప్లవ, జాతివిముక్తి శక్తులన్నింటిని కలుపుకొని సమస్త ప్రజా పోరాటాలకు కార్మికవర్గం అగ్రభాగాన నిలిచి నాయకత్వాన్ని అందించాలి. దీర్ఘకాల ప్రజాయుద్ధంతో ఈ పోరాటాలను సమన్వయించాలి.

2) పెద్ద మొత్తంలో పదే పదే కరోనా పరీక్షలు నిర్వహించి పాజిటివ్ ఫలితం వచ్చినవారికి ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, దేశంలోని ప్రైవేట్ ఆసుపత్రులన్ని ప్రజలకు ఉచితంగా కరోనా పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలందించాలి. కరోనాను అరికట్టే మందులను, వ్యాక్సిన్‌ను వీలయినంత త్వరగా తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కొరోనా విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజా అభిప్రాయాలపై, ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల అభిప్రాయాలపై ఆధారపడి చర్యలు చేపట్టాలని, భావ ప్రకటనా స్వేచ్ఛను, పత్రిక స్వేచ్ఛను కల్పించాలని డిమాండ్ చేయాలి.

3) లాక్‌డౌన్ కారణంగా వీధుల పాలైన కార్మిక, కర్షక, మధ్యతరగతి ప్రజల ఆకలి తీర్చడానికి తక్షణం ప్రభుత్వ గిడ్డంగులలో కోట్ల టన్నులలో నిల్వ ఉన్న ఆహార ధాన్యాలతో పాటు ఉచితంగా ఆహారాన్ని అందించాలనీ, సరుకుల అక్రమ నిల్వదార్లపై, నల్ల బజారు వ్యాపారులపై (బ్లాక్ మార్కెటీర్స్)పై చర్యలు తీసుకోవాలనీ, ప్రజలకు నిత్యావసర సరుకులు అందించాలనే డిమాండ్లతో, శ్రమజీవులందరికి యేడాది పొడవునా 'మన్‌రేగా' పనులు కల్పించాలనే డిమాండ్‌తో శ్రామిక ప్రజలను, తక్షణం ఉపాధి కల్పించాలనే డిమాండ్‌తో నిరుద్యోగ యువతను సమీకరిస్తూ మిలిటంటు పోరాటాలను నిర్మించాలి

4) కొరోనా మహమ్మారి కారణంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభాన్ని

**మిగతా 14 పేజీ తరువాయి.**

# తెలంగాణలో నిర్బంధం-సమాధాన్ దాడి

భారత దోపిడీ పాలక వర్గాలు 2022 నాటికి దేశంలో విప్లవోద్యమాన్ని నిర్మూలించేందుకు వ్యూహాత్మక సమాధాన్ దాడిని ఈ సంవత్సర కాలంలో తీవ్రతరం చేశారు. అందులో భాగంగానే తెలంగాణలో కూడా పాశవిక అణిచివేతకు పూనుకుంటున్నారు. కమ్యూనికేషన్ ఇంటలీజెన్సీ పెంచుకుంటూ బలోపేతం చేసుకుంటున్నారు. తెలంగాణలో విప్లవోద్యమం పునర్ నిర్మాణం కాకుండా అడ్డుకోవడానికి వేలాది శత్రువు సాయుధ బలగాలను మోహరించి దళాలను, నాయకత్వాన్ని దెబ్బకొట్టడానికి సమాచార ఆధారిత దాడులతో పాటు పెద్ద పెద్ద ఆపరేషన్స్ చేపడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్, భూపాలపల్లి, అసిపాబాద్, మంచిర్యాల జిల్లాల్లో శత్రువు నిరంతరం కూంబింగ్స్ చేపట్టడం మూలంగా దళాలపై ఏడు దాడులు తప్పాయి. తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్త అభియాన్స్ చేపడుతూ కౌంటర్ గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేస్తున్నారు. దళాల సమాచారం కోసం నిరంతర నిఘా పెడుతున్నాడు. ప్రతి గ్రామం నుండి రోజువారి సమాచారం సేకరించడం వచ్చి వెళ్తున్న వ్యక్తుల గురించి ఆరాతీయడం చేస్తున్నారు. కార్డెన్ సెర్చ్ పేరుతో గ్రామాల చుట్టివేత, ఇండ్ల సోదాలు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. ఎలాంటి కేసులు లేకుండానే ప్రజలను సంతకాల పేరుతో పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారు. వర్గ సంఘాల నిర్మాణాలను దెబ్బతీయడానికి కార్యకర్తలను అరెస్టులు, చేయడం అక్రమ కేసులు పెట్టి జైళ్ళలో పెడుతున్నారు. కొద్ది మందిని అరెస్టు అయిన కోర్టులో హాజరు పరచకుండా రోజుల తరబడి పోలీస్ స్టేషన్స్‌లలో వుంచుతున్నారు. ఈ మధ్య కాలంలో 50 మందికి పైగా అక్రమంగా అరెస్టు చేశారు.

తెలంగాణ ప్రజా ఫ్రంట్, చైతన్య మహిళ సమైక్య, తెలంగాణ విద్యార్థి వేదిక, డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్, రైతు సంఘం, విరసం వంటి పలు ప్రజా సంఘాల నాయకులను అరెస్టులు చేసి జైళ్ళో పెట్టారు. వీరితో పాటు ఇంకా అనేక మందిపై ఉపా చట్టాన్ని మోపారు. ఇప్పటికి ఇంకా 15 మందికి పైగా జైళ్ళలో మగ్గుతున్నారు. వారికి బెయిల్స్ రాకుండా ఇతర రాష్ట్రా ల కేసులను ఎన్ఐఎ కేసులను మోపుతున్నారు. కనీసం విచారణ కూడా చేపట్టడం లేదు. మరో పక్క నయాన భయానా ప్రజలను విప్లవోద్యమం నుండి దూరం చేయడానికి అభివృద్ధి నిరోధక సంస్కరణలు చేపడుతున్నారు. కౌన్సిలింగ్‌లు చేపట్టడం, శత్రువు పార్టీపై రాజకీయ, సైద్ధాంతిక దుష్ప్రచారం చేయడం, ఆర్థిక వనరులను అడ్డుకోవడం చేస్తున్నాడు. శత్రువు వ్యూహాత్మక సమాధాన్ దాడిలో భాగంగానే పార్టీపై, ప్రజలపై నిరంతరం భౌతిక, మానసిక యుద్ధాన్ని కొనసాగిస్తున్నాడు.

రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు చేపట్టి మరింత నియంతృత్వంగా మారింది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పీడిత వర్గాల, సెక్షన్ల కార్మిక, కర్షక, పెటి బూర్జువా, దళితుల, మహిళల, ఆదివాసుల, మత మైనార్టీలను పాశవికంగా అణచివేస్తున్నది. పీడిత వర్గ ప్రజలకు నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీని నిర్మూలించే పథకంతో తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తున్నది. ప్రజలు చేపట్టే ప్రతి పోరాటాల్లో మావోయిస్టులు వున్నారని అసత్య ప్రకటనలు చేస్తూ పోరాటాలను అణచివేస్తున్నారు. ప్రజా వ్యతిరేక విధానాల మూలంగా 12 సం॥రాలుగా కొనసాగిస్తున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో పాటు రాష్ట్ర ఆర్థిక సంక్షోభం కూడా తీవ్రమైంది. ఆటోమేషన్స్ పెరిగి నిరుద్యోగం అంతకంతకు పెరుగుతూనే వుంది. ఫలితంగా దొంగతనాలు, దోపిడీలు, సైబర్ నేరాలు విపరీతంగా పెరిగాయి. ఉపాధి అవకాశాలు తగ్గాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా వ్యవసాయ రంగం సంక్షోభానికి గురై దివాళ తీస్తుంది. ఫలితంగా వ్యవసాయ రైతులు వలస కూలీలుగా మారుతున్నారు.

ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటీకరించడంతో కార్మికులు రోడ్డున పడుతున్నారు. వలస, అసంఘటిత కార్మికులు పెద్ద సంఖ్యలో పెరిగిపోతున్నారు. డీజిల్, పెట్రోల్ నిత్యం పెరుగుతూ వుండడంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సామాన్యుడిపై భారం పడుతుంది. చేతి వృత్తులు పూర్తిగా దెబ్బతిని పోతున్నాయి. అవినీతి అనేది సాధారణ ప్రజలను పీల్చుకతింటుంది. సామాజిక సమస్యలు అపరిష్కృతంగా పేరుకపోయి ప్రజల్లో ఒకింత అసంతృప్తి, ఆక్రోశం తీవ్ర తరమవుతుండడంతో ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాట్లు ముందుకొస్తున్నాయి. యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా, ఆర్‌టీసి, విద్య, సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా, విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ప్రజా తిరుగుబాట్లు చెలరేగాయి. ఈ తిరుగుబాట్లను పరిష్కరించే పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడంతో నిరంకుశ పాలకులు ఉద్యమాలపై అణచివేత ఆయుధాన్ని ప్రయోగిస్తున్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు చేపట్టినప్పుడు దానిని అడ్డుకుంటారనే అనుమానంతో ప్రజా సంఘాల నాయకత్వాన్ని ముందస్తుగా పెద్ద ఎత్తున బలగాలను మోహరించి, గృహ నిర్బంధం, అరెస్టులకు

పూనుకుంటున్నారు. కోవిడ్-19 మహమ్మారి ప్రపంచ దేశాలన్నింటినీ కలవర పెడుతున్నా అరెస్టులు, దాడులు ఏ మాత్రం ఆపడం లేదు.

మహబూబ్‌నగర్ జిల్లాలో యూరేనియం తవ్వకాలలో భాగంగా నాలుగులైన్ల రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేపడుతుండగా యూరేనియం వ్యతిరేక ప్రజా సంఘాల నాయకత్వాన్ని, కొద్ది మంది ప్రజా ప్రతినిధులను ముందస్తుగానే గృహ నిర్బంధం, అరెస్టులు చేశారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసీలను అడవుల నుండి గెంటి వేయడానికి వందలాది సాయుధ బలగాలు గ్రామాలను దిగ్బంధించి 6వ విడత హరితహారం కార్యక్రమం కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ అక్కడక్కడ తమ భూములను దక్కించుకోవడానికి రైతులు మిలిటెంట్ పోరాటాలు కొనసాగిస్తున్నారు. ప్రజా పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న ప్రజా సంఘాలను, ప్రభుత్వాలను ప్రశ్నించే అసమ్మతి స్వరాలను మావోయిస్టులతో సంబధాలు కలిగి వున్నారని ఆరోపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ విద్యార్థి సంఘం, చైతన్య మహిళా సమక్య, సివిల్ లిబర్టీ కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పోలిటికల్ ప్రిజనర్స్ (సిఆర్‌పిపి), డెమొక్రటిక్ స్టూడెంట్ యూనియాన్, తెలంగాణ విద్యార్థి వేదిక, తెలంగాణ యువజన సంఘం, తెలంగాణ ప్రజాఫ్రంట్, పౌరహక్కుల సంఘం, కుల నిర్మూలన సంఘం వంటి చట్టబద్ధ ప్రజా సంఘాలపై చట్ట విరుద్ధంగా పోలీసులే నిషేధం విధించారు.

వాస్తవానికి కోర్టు ద్వారా ఎలాంటి విచారణ చేపట్టకుండా నిషేధించడం చెల్లదు. చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం 1967 చట్టాన్ని 2004, 2008, 2013, 2019 సవరణలు చేశారు. ఆ చట్టంలోనే 3,4,5,6 సెక్షన్లు పరిశీలిస్తే నిషేధం విధించే పద్ధతి, అధికార గెజిట్ ప్రకటనలు, పూర్తి కారణాలు, వివరాలు ప్రకటించడం గురించి అందులో పొందు పరిచాయి. ట్రెబ్యునల్‌లో ఇరుపక్షాల వాదనలు విని తీర్పు ప్రకటించిన తర్వాతే అమల్లోకి రావాలని చట్టం చెబుతుంది. 2005లో విప్లవ రచయితల సంఘంతో పాటు మరికొన్ని సంఘాలపై నిషేధం చెల్లదని జస్టీస్ టిఎల్ఎన్ రెడ్డి నేతృత్వంలో ముగ్గురు నాయమూర్తులతో కూడిన ట్రెబ్యునల్ విచారణ జరిపి అన్ని పక్షాల వాదనలు విన్న తరువాత తీర్పు చెప్పింది. దీంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విరసంపై నిషేధం ఎత్తివేస్తూ జీవో జారి చేసింది. సంఘం పెట్టుకోవడం రాజ్యాంగం కల్పించిన హక్కు. పాలకుల విధానాలు ప్రజా వ్యతిరేకమైనప్పుడు నిరసన తెలిపే హక్కును ఆర్టికల్ 19 కింద పొందు పర్చారు. కాని చట్టాలు చేసిన ప్రభుత్వాలే కనీసం వాటిని గౌరవించడం లేదు. సరి కదా వాటికి తూట్లు పొడుస్తుంటారు. ఇది దోపిడీ పాలకుల నిరంకుశత్వానికి నిదర్శనం.

టీఆర్ఎస్ ప్రభుత్వం భిన్న స్వరాలను వినడం భరించలేక పోతుంది. భావప్రకటన స్వేచ్ఛను అప్రజాస్వామిక పద్ధతిలో అణచివేస్తుంది. ప్రజా సంఘాల పేరుతో విద్యార్థులను, యువతను ఆకర్షిస్తూ మావోయిజం వైపు మళ్ళిస్తున్నారనే అపవాదు రుద్దుతున్నారు. సాధారణ ప్రజలను అక్రమంగా అరెస్టులు చేస్తూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. దళాలకు జిలిటిన్ స్టిక్స్, విప్లవ సాహిత్యం, డబ్బులు తీసుకెళ్తు పట్టుబడినట్లు విధ్వంసం, హత్యల వంటి నేరాలు అక్రమంగా మోపుతూ ఊపా చట్టాన్ని ప్రయోగిస్తున్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాశవిక విప్లవ ప్రతిఘాతుక యుద్ధాన్ని ఓడించడం విప్లవ శక్తుల ప్రజల తక్షణ కర్తవ్యం. ప్రజా విముక్తికై దేశవ్యాప్తంగా అనేక మంది విప్లవ వీరులు వీరవనితలు ప్రజలు శత్రువు వ్యూహాత్మక సమాధాన్ దాడిని ఎదుర్కొంటూ తమ ప్రాణాలను ధారపోశారు. అమరుల త్యాగాల స్ఫూర్తిగా ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పడానికి ప్రజా యుద్ధంలో, గెరిల్లా యుద్ధంలో సమైక్యంగా, క్రియాశీలంగా పాల్గొని అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ సమాధాన్ దాడిని ఓడించాలి.

ప్రజల పేదరికం, నిరుద్యోగం ఆసరా చేసుకొని శత్రువు అమలు పరుస్తున్న అభివృద్ధి నిరోధక సంస్కరణలకు లొంగిపోయి శత్రువు పక్షం చేరకుండా వాడి మోసపూరిత ఎత్తుగడలను లోతుగా అధ్యయనం చేస్తూ మానసిక యుద్ధాన్ని ఓడించాలి. గ్రామాలలో విస్తరిస్తున్న శత్రువు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను నిరంతరం పరిశీలిస్తూ నిర్మూలించడం ద్వారా శత్రువు కౌంటర్ గెరిల్లా యుద్ధాన్ని ఓడించగలుగుతాము. ★

# మలేరియా (Malaria)

**డాక్టర్ సలహా**

దోమలున్న వాతావరణంలో జీవించటం మనిషికి చాలా దుర్భరంగా ఉంటుంది. పల్లెల నుంచి పట్టణాల దాకా ఈ రోజుల్లో ఎక్కడ చూసినా దోమలు కనిపిస్తున్నాయి. దోమలున్న ఇంట్లో మనిషి ఒక్క రాత్రి కూడా హాయిగా ప్రశాంతంగా కంటినిండా కునుకు తీయలేడు. ప్రజా ఆరోగ్యానికి దోమలు ఛాలెంజిగా పరిణమించాయంటే అతిశయోక్తి కాదు.

దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్లో ప్రబలమైనది మలేరియా ! గత కొన్ని దశాబ్దాలుగా దోమల్ని నిర్మూలించడానికీ తద్వారా మలేరియా వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అన్నీ ఇన్నీ కావు. కాని చిత్తశుద్ధి లోపించటంవల్లో లేక మరెందువల్లో గాని అవి అంతగా సఫలం కావటం లేదు.

మలేరియా Anapheles అనే ఒక ప్రత్యేక తరహా దోమ మూలంగా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు మురికి నీళ్ళలోనూ చెత్త చెదారంలోనూ వృద్ధి చెందటమే కాకుండా నిలవ ఉన్న పరిశుభ్రమైన నీటి మీద కూడా కాపురం చేస్తుంటాయి.

Plasmodium అనబడే సూక్ష్మక్రిమి మూలంగా మలేరియా వ్యాధి వస్తుంది. ఈ సూక్ష్మక్రిమి ఆడ దోమ లాలాజలం గ్రంధులలో నివాసం ఏర్పరచుకుంటుంది. మనిషిని ఆడదోమ కుట్టినప్పుడు దాని లాలాజలం ద్వారా ఈ క్రిమి అతడి చర్మంలోకి ప్రవేశించి అక్కడి నుంచి అతడి రక్తంలోకి ప్రవేశిస్తుంది.

Plasmodium అనబడే ఈ సూక్ష్మ క్రిములు మొదట మనిషి కాలేయం (Liver)లో ప్రవేశించి అక్కడ వృద్ధి చెందటం ప్రారంభిస్తాయి. కాలేయంలో అసంఖ్యాకంగా వృద్ధి చెందాక అక్కడి నుంచి తిరిగి అతడి రక్త ప్రవాహంలోకి ప్రవేశించి అక్కడి ఎర్ర రక్తకణాలను నాశనం చేయటం ప్రారంభిస్తాయి.

మలేరియా క్రిమి కాలేయంలో వున్న దశలో మలేరియా తాలూకు లక్షణాలేమి మనిషిలో కనిపించవు కాని కాలేయం నుంచి రక్త ప్రవవాహంలోకి ప్రవేశించి ఎర్ర రక్త కణాలను నాశనం చేయటం మొదలెట్టాక మాత్రం విపరీతమైన జ్వరం, చలి మొదలవుతాయి.

మలేరియాతో బాధపడుతున్న వ్యక్తిని ఆడదోమ కుట్టి రక్తం పీల్చుకుని ఆ తర్వాత అది మరో ఆరోగ్యవంతుడిని కుట్టిందంటే అతడికి కూడా మలేరియా అంటుకుంటుంది. ఈ రకంగా ఆడదోమలు మలేరియా వ్యాప్తికి దోహదం చేస్తుంటాయి.

లక్షణాలు

- మలేరియా క్రిమి కాలేయం నుంచి రక్తంలోకి ప్రవేశించాక అక్కడి ఎర్ర రక్తకణాలు చిట్లటం మొదలవుతాయి. సరిగ్గా ఆ సమయంలో అతడిలో 103 - 104 డిగ్రీల ఫారెన్ హీట్ జ్వరంతో వణుకుడు మొదలవుతుంది. పేషెంట్‌కు విపరీతంగా తలనొప్పి వుండవచ్చు. వెన్నునొప్పి వుండవచ్చు. వాంతులు మొదలవ్వవచ్చు.

- శరీరం లోపలి నుంచి వచ్చే చలిని తట్టుకోలేక పేషెంట్ దుప్పటి మీద దుప్పటిని కప్పుకోవాలనుకుంటాడు. జ్వరం గరిష్ఠ స్థాయికి చేరుకున్నాక మాత్రమే అతడిలో చలి తగ్గిపోతుంది.

- చలి తగ్గిన కొన్ని గంటల తర్వాత టెంపరేచర్ మళ్ళీ సాధారణ స్థితికి వచ్చేసి చెమటలు పట్టడం మొదలవుతాయి. నీరసంగా బలహీనంగా ఫీలవుతాడు.

- జ్వరం తగ్గిన ఒకటి నుంచి మూడు రోజుల దాకా అతను మామూలుగానే తిరుగుతాడు. ఆ తర్వాత మళ్ళీ చలి, జ్వరం అటాక్ చేస్తాయి.

- మలేరియా ఉన్న ముఖ్య లక్షణం ఏమిటంటే రోజు విడిచి రోజు లేక రెండు రోజులకొకసారి జ్వరము, చలి మొదలవ్వటం ! **కాలేయం నుంచి రక్త ప్రవాహంలోకి మలేరియా క్రిములు ప్రవేశిస్తున్నప్పుడల్లా జ్వరం, చలి మొదలౌతాయి.**

**రక్త హీనత**

- మలేరియా జ్వరం మాటిమాటికీ వస్తోంటే ఆ మనిషిలో ఎర్ర రక్తకణాలు బాగా క్షీణించి అతడు రక్త హీనత (Anaemia)కి గురవుతాడు. తీవ్రమైన కేసులలో అతడిలోని కాలేయం, Spleen వాపు చెందుతాయి.

**నిర్ధారణ**

- సాధారణంగా మలేరియాకి సంబంధించిన లక్షణాలైన చలి, జ్వరం వస్తున్నప్పుడు డాక్టర్లు పెద్దగా టెస్టుల్ని చేయించరు. తమ అనుభవం ఆధారంగా ట్రీట్ చేయడానికి పూనుకుంటారు. ఏకొద్దిగానన్నా సందేహం వుంటే రక్త పరీక్ష చేయించి దానిని నివృత్తి చేసుకుంటారు.

**మెదడుకు మలేరియా**

- Plasmodium Falciparum అనబడే ఒక రకమైన మలేరియా క్రిమి మూలంగా మలేరియా మనిషి మెదడుకు కూడా సోకుతుంది. ఈ రకమైన మలేరియా వచ్చినప్పుడు మనిషి మెదడులోని సూక్ష్మ రక్తనాళాలు పూడుకుపోయి అతడికి ఫిట్స్ రావటం, ఒకో సమయాన మరణం కూడా సంభవించే అవకాశం వుంది.

- ఈ రకమైన మలేరియా Cerebral Malaria అని అంటారు. ఈ వ్యాధి సమయంలో ఎర్ర రక్త కణాలకు విపరీతంగా నష్టం సంభవించి కిడ్నీలో అవలక్షణం ఏర్పడి జ్వరంతో పాటు అతడి మూత్రం బాగా ముదురు రంగులో వెలువడుతుంది. Black Water Faver అనే ఈ స్థితిలో మృత్యువు సంభవించటం తేలిక.

### క్వినైన్ – క్లోరోక్విన్

మలేరియాని ట్రీట్ చేయటం కోసం చాలాకాలం నుంచి వాడుతున్న మందు క్వినైన్ (Quinine) తర్వాత తర్వాత అనేక కొత్త మందులు అభివృద్ధి చెందాయి.

– క్లోరోక్విన్ కంటే క్వినైన్‌లో సైడ్ ఎఫెక్ట్స్ అధికంగా ఉండడం వల్ల క్రమేపి క్వినైన్ వాడకం తగ్గిపోయి క్లోరోక్విన్ వాడకం పెరిగింది. అయితే ఈ మధ్య సెరెబ్రల్ మలేరియా క్లోరోక్విన్‌కి లొంగకపోతుండడంతో క్వినైన్ ప్రాముఖ్యత మళ్ళీ పెరగనారంభించింది. ముఖ్యంగా సెరెబ్రల్ మలేరియా ట్రీట్‌మెంట్ విషయంలో –

– క్వినైన్ మూలంగా వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ ఏమిటంటే:

- తెమలటం
- కళ్లు మసకలు కమ్మటం
- చెవుల్లో హోరు
- తలనొప్పి

– క్వినైన్ మాత్రల్ని ఎక్కువ డోసులో వేసుకుంటే అది గుండె మీద చెడు ప్రభావాన్ని చూపే ప్రమాదం కూడా వుంది.

– చేతి వేలి నుండి ఒకటి రెండు రక్తం బొట్లను తీసి గాజు పలక మీదకు అద్ది అందులోని ఎర్ర రక్తకణాలలో మలేరియా క్రిములేమైనా వున్నాయేమోనని పరీక్ష చేస్తారు.

ట్రీట్‌మెంట్

మలేరియా జ్వరాన్ని ట్రీట్ చేయటంలో మూడు దశలుంటాయి.

మొదటిది – చలి, జ్వరాన్ని తగ్గించటం.

రెండోది – చలి, జ్వరం తిరిగి రాకుండా చూడటం.

మూడోది – మలేరియా క్రిముల్ని పూర్తిగా శరీరం నుంచి తొలగించటం.

చాలాకాలం నుంచి మలేరియా జ్వరానికి క్వినైన్ టాబ్లెట్లను వాడుతూ వస్తున్నారు. ఈ రోజుల్లో ఇంకా కొన్ని కొత్త మందులు కూడా వున్నాయి. ఈ కొత్త మందులకి సైడ్ ఎఫెక్ట్స్ తక్కువ.

మలేరియాకి వాడే మందులు:

Chliroquine

Amodiaquine (Camaqin)

– ఆయా డాక్టర్లు తమ అభీష్టానుసారంగా ఈ మందుల్ని ప్రిస్క్రైబ్ చేస్తుంటారు. వాటి డోసేజ్ విచిత్రంగా వుంటుంది.

0 మొదటి రోజు సింగిల్ డోస్ కింద 4 టాబ్లెట్లను ఒకేసారి వేసుకొమ్మంటారు.

0 ఆరు గంటల తర్వాత మరో రెండు టాబ్లెట్లను వేసుకోవాలి. తర్వాతి మూడు రోజులూ ఉదయాన ఒక టాబ్లెట్, సాయంత్రాన ఒక టాబ్లెట్ వేసుకోవాలి.

– మొత్తం 12 టాబ్లెట్‌లతో కోర్సు పూర్తవుతుంది.

### మలేరియా జాగ్రత్తలు

మలేరియా అంటూ సోకకుండా వుండాలంటే మూడు రకాల జాగ్రత్తలను తీసుకోవాలి.

1. దోమల మందును స్ప్రే చేయటం ద్వారా పరిసరాలలోని దోమల్ని నాశనం చేయటం.

2. దోమలు నిలువు వుండే ప్రదేశాలలో స్ప్రే చేయటం ద్వారా వాటి గుడ్డును నాశనం చేయటం.

3. దోమలు కుట్టకుండా చేసుకోవటం.

– ఈ రోజుల్లో మార్కెట్లో రకరకాల దోమల మందులు లభిస్తున్నాయి. ఈ మందుల్ని స్ప్రే చేయటం ద్వారా ఒక్క దోమల్ని మాత్రమే కాకుండా ఇంట్లో వుండే మిగతా ఎగిరే కీటకాల్ని కూడా నాశనం చేయవచ్చు.

మలేరియాతో పోరాడటం అంటే దోమలు పెట్టే గుడ్లను (Larvae) ని నశింపజేయటం ద్వారా దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవటం ఇందుకోసం:

– ఇంట్లో వుండే ఫ్లవర్ పాట్స్‌లో నీళ్ళను రెండు మూడు రోజులకు మించి నిలువ ఉంచకూడదు. ఎప్పటికప్పుడు ఈ నీటిని మారుస్తుండాలి. నిలవుండే నీటిలో దోమలు గుడ్లు పెడుతుంటాయి.

– ఇంట్లో వుండే నీటిపాత్రల మీద మూతల్ని గట్టిగా బిగించి వుంచాలి. ప్రతి రెండు మూడు రోజులకొకసారి ఆ నీటిని మారుస్తుండాలి.

– నీళ్ళు పట్టబోయే ప్రతిసారీ నీళ్ళ డ్రమ్ములు లేక పాత్రల్ని శభ్రంగా తొలిపి, కడిగి శుభ్రం చేయాలి.

– మిద్దెల మీద వుండే వాటర్ టాంకులు Wrought Iron లేక Mild Steel వయి వుండటం మంచిది. పై మూతలు ఎప్పుడు గట్టిగా బిగించి వుండాలి. వీటిని తరుచుగా శుభ్రం చేస్తుండాలి.

– ఇంట్లో లేక కంపౌండ్‌లోని ఫౌంటెన్‌లు పని చేయనప్పుడు వాటిని పూర్తిగా శుభ్రపరిచి పొడిగా వుంచాలి.

– ముఖ్యంగా వర్ష కాలంలో నీళ్ళను అసలు నిలువ వుంచకూడదు. రెండు మూడు రోజులకొకసారి మారుస్తుండాలి.

ఇది పెద్ద వాళ్ళకు.

– చిన్న పిల్లలకు వాళ్ళ బరువును బట్టి క్లోరోక్విన్ సిరప్ డోస్‌ని నిర్ణయిస్తుంటారు.

– క్లోరోక్విన్ మూలంగా వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ ఏమిటంటే తమలటం, వాంతులు అధికంగా వుండటం.

– ఈ కారణం వల్ల ఈ టాబ్లెట్లను ఎల్లప్పుడుగానీ కడుపు నిండుగా వున్నప్పుడే వేసుకోవాలి. ఖాళీ కడుపుతో వేసుకోకూడదు.

– క్లోరోక్విన్ మూలంగా రక్త ప్రవాహంలోని మలేరియా క్రిములయితే నశిస్తాయి గాని, కాలేయంలో వుండే క్రిములు మాత్రం ఇంకా అలాగే జీవించి వుంటాయి. కొంత కాలం తర్వాత ఇవి మళ్ళీ

రక్త ప్రవాహంలోకి ప్రవేశించి జ్వరాన్ని మళ్ళీ తెప్పిస్తాయి. ఈ కారణం వల్లే కోర్సు పూర్తయ్యాక కూడా వారానికి రెండు టాబ్లెట్‌లు చొప్పున క్లోరోక్విన్ టాబ్లెట్‌లను కొన్ని వారాలపాటు వాడమంటారు డాక్టర్లు. అప్పటికి గాని కాలేయంలోని క్రిములు పూర్తిగా నశించవు.

– కాలేయంలో తిష్ట వేసుకున్న మలేరియా క్రిముల్ని పూర్తిగా నిర్మూలించడం అంత తేలికైన విషయం కాదు. ఇందుకు సమర్థవంతంగా పని చేసేది Primaquine అనే మందు.

Primaquine కాలేయంలోని క్రిములనయితే సమర్థవంతంగా నిర్మూలించ గలుగుతుంది గాని దాని మూలంగా కొన్ని విష ఫలితాలు కలిగే ప్రమాదం కూడా లేకపోలేదు. అందువల్ల దీనిని ఎప్పుడు డాక్టరు పర్యవేక్షణలో మాత్రమే వాడాలి. కొన్ని సందర్భాలలో ఈ మందు ఎర్ర రక్తకణాలను నాశనం చేసి కామెర్ల వ్యాధికి కూడా కారణభూతమవుతుంది.

గర్భిణీ స్త్రీలకు

– గర్భిణీ స్త్రీకి మలేరియా జ్వరం వస్తే మూడోనెల దాటాక మాత్రమే Chloroquine Quinine టాబ్లెట్‌లను సురక్షితంగా వాడవచ్చు. మూడు నెలల లోపలే వీటిని వాడితే అబార్షన్ అయే ప్రమాదం వుంది.

**మలేరియాకి మందు క్లోరోక్విన్**

వర్షకాలంలో చాలా ప్రదేశాలలో మలేరియా రావటం సర్వసాధారణం. ఒక రకమైన మలేరియా (Falciparum Cerebral Malaria) వచ్చినప్పుడు సకాలంలో వైద్యం జరగకపోతే ప్రాణానికే ముప్పు వాటిల్లుతుంది. దురదృష్టవశాత్తూ ఈ సెరిబ్రల్ మలేరియా రోజు రోజుకూ పెరుగుతున్నట్లు, మనుషుల ప్రాణాల్ని తీస్తున్నట్లూ తరచుగా పత్రికలలో వార్తలు కనిపిస్తున్నాయి.

– మలేరియాని ట్రీట్ చేయటానికి అనేక మందులు లభిస్తున్నాయి. వాటిలో క్లోరోక్విన్ (Chloroquine) ఒకటి.

క్లోరోక్విన్ ఈ క్రింది బ్రాండ్ నేమ్‌లలో లభిస్తుంది.

- Resochin - Quinross
- Lariago - Enquin
- Nivaquine - Melubuin - వగైరాలు.

**ఉపయోగాలు:**

– క్లోరోక్విన్ అన్నిరకాల మలేరియాలకీ ఉపయోగిస్తుంది. మలేరియాని తగ్గించటానికి, ముందు జాగ్రత్త చర్యగా కూడా.

– మరి కొన్ని మందుల కాంబినేషన్‌లో క్లోరోక్విన్ Rheumatoid Arthritis కి కూడా ఉపయోగపడుతుంది.

క్లోరోక్విన్‌తో అనేక చర్మ సంబంధ అవలక్షణాలను కూడా నయం చేయవచ్చు. ఉదాహరణకు కుష్టువ్యాధిలో రియాక్షన్స్ విషయంలో.

– ఇది Systemic Lupus Etethematosis (SLE)కి కూడా ఎఫెక్టివ్‌గా పని చేస్తుంది.

– లివరుకు సంబంధించిన అమీబియాసిస్ Amoebic Liver Abscess లాంటి వ్యాధులకు కూడా వేరే మందుల కాంబినేషన్‌తో కలిసి క్లోరోక్విన్ పని చేస్తుంది.

**డోస్**

– క్లోరోక్విన్ టాబ్లెట్‌లు, సిరప్‌లు, ఇంజక్షన్‌ల రూపంలో కూడా లభిస్తుంది.

– ఒక టాబ్లెట్‌లో 250మి.గ్రాముల క్లోరోక్విన్ ఫాస్ఫేట్ ఉంటుంది.

– మిగతా రోగాల్లోలా కాకుండా మలేరియా 12 టాబ్లెట్‌ల విచిత్రమైన కోర్సు ఉంటుంది. ఈ కోర్సులో సర్వసాధారణంగా మొదటి విడత 4 టాబ్లెట్‌లను, తర్వాత అదే రోజు 6 గంటల తర్వాత రెండు టాబ్లెట్‌ల చొప్పునా, తర్వాత మూడు రోజుల పాటు రోజుకో రెండు టాబ్లెట్‌ల చొప్పున వాడాలి. ఈ కోర్సు మొత్తం అయ్యేసరికి మలేరియా అదుపులోకి వచ్చేస్తుంది.

– ఆ తర్వాత మళ్ళీ మలేరియా రాకుండా ఉండటం కోసం, ముఖ్యంగా మలేరియా ప్రదేశాల్లో ప్రయాణించే వాళ్ళకు, వారానికి ఒకసారి రెండు టాబ్లెట్‌ల చొప్పున 4–6 వారాల పాటు వాడాల్సి ఉంటుంది.

– మలేరియా టాబ్లెట్‌లు చాలా చేదుగా ఉంటాయి. కాని ఈ రోజుల్లో కొన్ని రకాల టాబ్లెట్‌లు తీపి కోటింగ్‌తో వస్తున్నాయి, పిల్లలు కూడా తినేట్లు.

**సైడ్ ఎఫెక్ట్స్**

– క్లోరోక్విన్ సర్వసాధరణంగా కనిపించే సైడ్ ఎఫెక్ట్ తెమలటం, వాంతులు కావటం. ఈ టాబ్లెట్స్‌ని వేసుకున్న అయిదు నిముషాలలోపు పేషెంట్ వాంతి చేసుకుంటే కొంతసేపు ఆగి పేషెంట్‌కు తినటానికి ఏమన్నా ఇచ్చి మళ్ళీ డోస్ సరిపడా టాబ్లెట్‌లను ఇవ్వాలి.

– పేషెంట్ వాంతి చేసుకోవటం మాటిమాటికి జరుగుతోంటే క్లోరోక్విన్ ఇంజక్షన్‌లను ఇవ్వాల్సి ఉంటుంది. మిగతా సైడ్ ఎఫెక్ట్స్ – తలనొప్పి, పొత్తి కడుపులో పోట్లు, చూపు మసక కమ్మటం, స్కిన్ రాష్ మొదలైనవి. కొందరు పేషెంట్లకు విరోచనాలు కూడా కావచ్చు.

– ఈ చెప్పిన సైడ్ ఎఫెక్ట్స్ భరించగలిగే స్థితిలోనే ఉన్నప్పుడు ట్రీట్‌మెంట్‌ని కంటిన్యూ చేయటమే మంచిది. మరీ భరించరానంత Severe గా ఉన్నప్పుడు క్లోరోక్విన్ మానేసి డాక్టరు పర్యావేక్షణలో వేరే మలేరియా మందుల్ని వాడాలి.

**జాగ్రత్తలు**

– క్లోరోక్విన్ దీర్ఘకాలం పాటు వాడితే కళ్ళకు ప్రమాదం వాటిల్లవచ్చు. కళ్ళ తాలూకు Optic Disc డామేజ్ కావచ్చు. దృష్టి మాంద్యం వున్నవాళ్ళు క్లోరోక్విన్‌ని వాడకూడదు.

– క్లోరోక్విన్ మూలంగా అరుదైన సందర్భాలలో సోరియాసిస్ (Psoriasis) అనబడే చర్మ వ్యాధి ప్రకోపించే అవకాశం వుంది.

– G6PD అనబడే ఎంజైమ్ లోపం ఉన్న వాళ్ళు క్లోరోక్విన్ వాడకూడదు. అలాంటివి వాడితే వాళ్ళలోని ఎర్ర రక్తకణాలు నశించుతాయి. అదృష్టవశాత్తు ఈ లోపం వున్నవాళ్ళు మలేరియా నిరోధక శక్తిని కలిగివుంటారు.

– గర్భిణీ స్త్రీలు క్లోరోక్విన్‌ని వాడకూడదు. వాడితే వాళ్ళ కడుపులో పాపాయి చూపు దెబ్బతినే ప్రమాదం వుంది.

క్లోరోక్విన్ ఇంజెక్షన్‌ని చిన్న పిల్లలకు ఇవ్వకూడదు. అది వాళ్ళలో 'లోబీపి' తెప్పిస్తుంది. ప్ర

## కార్మికుల భారీ ర్యాలీ.

కరీంనగర్‌లో ఒడ్డిస్ట్రిక్ట్ గ్రానైట్ క్వారీ అసోసియేషన్ మూడు రోజుల బందును నిర్వహించారు. కరీంనగర్ డిస్ట్రిక్ గ్రానైట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ శివారులోని పద్మనగర్ నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు నల్లరిబ్బన్లు ధరించి పాదయాత్రగా తరలినారు. ఇది కరీంనగర్ డిస్ట్రిక్ గ్రానైట్ అసోసియేషన్‌కు మద్దతునిస్తూ ప్రజాస్వామికవాదులు, ప్రజలు పాల్గొన్నారు.

కరీంనగర్ ఎంపీ సంజయ్ కుమార్ గ్రానైట్ పరిశ్రమను మాఫియా అనటం చాలా భాధాకరమని పరిశ్రమ కార్మికులు, యాజమానులు ఆరోపించారు. లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తూ, ప్రభుత్వానికి కోట్లాది రూపాయలను చెల్లిస్తూ వస్తున్న గ్రానైట్ పరిశ్రమ మాఫియా అంటూ సంభోధించటము సరైనది కాదని పరిశ్రమను దెబ్బతీసే ప్రయత్నమేనని వెంటనే ఎంపీ సంజయ్ కుమార్ గ్రానైట్ క్వారీ కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

## కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

నల్లబెల్లి మండలంలో చెక్కలపల్లి, బుచ్చిరెడ్డిపల్లి, కన్నారావుపేటకు చెందిన రైతులు తమ భూములకు పట్టాలివ్వాలని, రెవెన్యూ అధికారులు పట్టా పుస్తకాలు ఇవ్వకుండా చాలా ఇబ్బందులు పెడుతున్నారు. తమ భూములకు పట్టాలు ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయం ముందు 100 మంది పైగా రైతులు ధర్నా చేశారు. 1400 ఎకరాల భూమిలో 200 ఎకరాలను చెక్కలపల్లి, కన్నారావుపేట, బుచ్చిరెడ్డిపల్లి మూడు గ్రామాలకు చెందిన కొంత మంది రైతులకు పట్టాలు చేశారు. మిగతా 100 ఎకరాలకు సంబంధించిన వ్యవసాయ భూమిని ఏపూరి మల్లారెడ్డి, సాయిరెడ్డి అనే వ్యక్తులు పట్టా పాసు పుస్తకాలు రాకుండా అడ్డుపడుతూ, ఆ భూమిని వీరు స్వాధీనం చేసుకోవాలని కుట్ర చేస్తున్నారు.

ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు, కలెక్టర్‌కు తెలిపిన స్పందించటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 ఎకరాల భూమి పట్టాకోసం అడిగితే కోర్టు, కేసులు ఉన్నాయంటూ ఇతరేతర కారణాలు చెబుతూ సమస్యను నిర్లక్ష్యం చేస్తూ, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదంటూ అధికార్ల నిర్లక్ష్యంకు వ్యతిరేకంగా రైతులు ధర్నా నిర్వహించారు.

## టీఎస్‌టీపీపీ కార్మికుల ధర్నా

తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ)లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాల కోసం టీఎస్‌టీపీపీ ఎదుట ధర్నా నిర్వహించారు. జీఓ ప్రకారం రోజుకు అన్‌స్కిల్డ్ కార్మికులకు 390 రూ॥ సెమిస్కిల్డ్‌కు 450 స్కిల్డ్ కార్మికులకు 551 చెల్లించాల్సి ఉండగా, కానీ ఇక్కడి అధికారులు మాత్రము అన్‌స్కిల్డ్ కార్మికులకు 250 సెమిస్కిల్డ్ కార్మికులకు 300, స్కిల్డ్ కార్మికులకు 400 మాత్రమే చెల్లిస్తూ టీఎస్‌టీపిపి కార్మికులను అధికార్లు దోచుకుంటున్నారు. అంతేకాక చట్ట ప్రకారం 8 గంటల పని చేయాల్సి వుండగా 12 గంటలు చేయించుకుంటూ కార్మికుల శ్రమను దోపిడి చేస్తున్నారు. టీఎస్‌టీపీపీలో మొత్తం 2 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. టీఎస్‌టీపీపీలో ఇతర రాష్ట్రాల నుండి ఛత్తీస్‌గఢ్, బిహార్, ఝార్ఖండ్, హర్యాన తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు వెయ్యిమంది దాకా ఉన్నారు.

అధికారులు చేస్తున్న శ్రమ దోపిడికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, చట్ట ప్రకారం సరైన వేతనాలు చెల్లించాలని డిమాండ్స్ చేస్తూ, టీఎస్‌టీపీపీ ముందు ధర్నా నిర్వహించారు. దీనితో టీఎస్‌టీపీపీహెచ్‌ఆర్ అధికారి వారి డిమాండ్స్ ఒప్పుకోవటం జరిగింది.

## కలక్టరేట్ వద్ద ఆదివాసుల ధర్నా

ఆదివాసుల సమస్యలను పరిష్కరించాలని మరియు జీఓ నెంబర్ 3ను యథావిధిగా కొనసాగించాలని 1/70,పేసా చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా ఆదివాసుల బ్రతుకులు మారడం లేదని మండిపడ్డారు. లంబాడాలకు జారీ చేసిన ఎల్‌ఎస్టీ ధృవీకరణ పత్రాలను రద్దు చేయాలని, ఆదివాసులకే అటవీ హక్కుల పత్రాలు ఇవ్వాలని, అటవీ భూముల్లో కందకాల త్రవ్వకం పనులు వెంటనే నిలిపివేయాలని, జీఓనెంబర్ 3ను నోటిఫైడ్ ఏజెన్సీ ప్రాంతంలో పకడ్బందీగా అమలు చేయాలని, ఏజెన్సీల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో కుమురం భీం విగ్రహానికి, అంబేద్కర్, జెగ్‌జీవన్ రావుల విగ్రహాలకు పూలమాలలు వేసి సిరికొండ రోడ్డు మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళ్ళి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేసి మా సమస్యలను పరిష్కరించకుండా మా హక్కులను కాలారాచి వేస్తే భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## పోడుకోసం ఆదివాసీల ఆందోళన

ఆదివాసీలు సాగు చేసుకొంటున్న పోడు భూములకు 2006 అటవీ హక్కు చట్టం ప్రకారం పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులందరికీ అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలని అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు.

## టీపీఎస్ ధర్నా

దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్రమైన అసహనం వ్యక్తమవుతోంది. పాలక ప్రభుత్వాలు సమస్యలను తీర్చకపోవడంతో ప్రజల్లో ఆగ్రహ జ్వాలలు రేగుతున్నాయి. వీటిని పాలక ప్రభుత్వాలు సహించక ప్రజలపై ప్రభుత్వాల తీరును వ్యతిరేకిస్తున్న శక్తులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. ఈ నిర్బంధాలకు వ్యతిరేకంగా జరిగిన ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**అడుక్కుంటే హక్కులు రావు**
**పోరాడితేనే సాధించుకుంటాము.**

## పునరావాసం కల్పించాలని అధికార్లకు వినతి పత్రం అందజేసిన ఓసీపి నిర్వాసితులు

సింగరేణి యాజమాన్యం ఓసన్‌కాస్టు నిర్వాసితులకు ఏడేండ్లు గడిచిన నష్ట పరిహారం, పునరావసం కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తుంది. దీనితో శ్రీరాంపూర్ ఏరియాలోని సంగాపూర్ గ్రామ ప్రజలు అధికార్లకు వినతి పత్రం అందజేశారు. సింగరేణి యాజమాన్యం ఓపన్‌కాస్టు కోసం భూములు, ఇండ్లు తీసుకొని ఏడు సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదంటూ వాగ్వివాదానికి దిగారు. భూములు కోల్పోయిన వారికి ఆర్ అండ్ ఆర్ సైట్‌లలో పట్టాలు ఇస్తామని ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఎలాంటి వసతులు కల్పించలేదు. నీటా సమస్య, డ్రైనేజ్ సమస్య అలాగే ఉన్నాయి. ఓసీపి దుమ్ముతో రోగాలు వస్తున్నాయి. ఇళ్లు కట్టుకుందామంటే ప్లాట్లు ఇవ్వడం లేదు. వెంటనే మా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## వలస కార్మికుల నిరసన

పెద్దపల్లిలోని ఎఫ్‌సీఐ, ఎన్‌టిపీసీలో పని చేస్తున్న 5 వేల మంది వలస కార్మికులు రోడ్డుపై బైటాయించి నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ సడలిస్తూ వలస కూలీలను స్వస్థలాలకు పంపించాలని ప్రకటించడంతో ఎఫ్‌సీఐ, ఎన్‌టిపీసీలో పని చేస్తున్న 5 వేల మంది వలస కార్మికులు తమను కూడా మా స్వస్థలాలకు పంపించాలని నిరసనకు దిగినారు. దీనితో అధికారులు వలస కార్మికులతో చర్చించి రెండు రోజుల్లో మీ స్వస్థలాలకు పంపిస్తామని హామి ఇవ్వడంతో వలస కూలీలు నిరసన విరమించారు. ప్ర

## మేక్ ఇన్ ఇండియా కాదు టాట్ ఇన్ భారత్

మేక్ ఇన్ ఇండియా అంటున్నావు
నీకు తెలియదేమో
పురాతన కాలంలో అభివృద్ధి చెందుతున్న ఇండియాని
నాశనం చేసింది
నీవు నమ్ముతున్న గురువులు, వారి ఏజెంట్లే !!
నీవు చెపుతున్న ఇండియా
భారత ప్రజలకు సామ్రాజ్యవాదులకు
బానిసలుగా మార్చాలని
రోజు కూలీ కొరకు వాడీ గల్లీల్లో తిరగాలని
వాడికి పని ముట్లుగా – పని మనుషులుగా మారాలని

మేము చెప్తున్నామ్ నవ భారత్ నిర్మాణ్
సర్వజనులు సుఖ సంతోషాలతో వుండాలని
దోపిడీ పీడనలు లేని వర్గాలు లేని సమాజం కావాలని
ప్రపంచ పటం నుండే సామ్రాజ్యవాదాన్ని
అంతం చేసే కార్మిక రాజ్యం కావాలని !

నీవు చెప్తున్న ఇండియా
దోపిడీ పీడనలు నిరంతరం వుండాలని
రంగుల ఆధారంగా వర్ధించే
సమాజం వుండాలని
రామ రాజ్యం పేరుతో
పోరాడే ప్రజలను, జాతులను నిర్మూలించాలని
తరతరాల భౌతికవాదాన్ని
బద్దలు కొట్టాలని
భావవాదం అజేయమని
మనుధర్మమే మాధర్మమని
కాదన్న వారిని కాటికి పంపాలని
కసాయి రాజ్యం ఏలాలని

మేము కోరేది
వర్గాలు లేని దోపిడీ పీడనలు లేని
నవ సమాజం
సుఖ సంతోషాలతో విరసిల్లే
నవ భారత్
శ్రమ జీవుల నాయకత్వంలో
ప్రజారాజ్యం నిర్మించాలని

పిడికెడు మంది కోసం
నీ ఆరాటం
నీ సర్కస్ పీట్లు
కోట్లాది ప్రజల ఆశలు ఆశయాలను
మసి చేయాలనుకుంటున్నావు
కానీ....

కోట్లాది ప్రజలు కన్నెర్రజేస్తుంద్రు
నీ మేక్ ఇన్ ఇండియా
టాట్ ఇన్ ఇండియాను
మనువాదపు మాయాజాలం
మాడి మసవుతాయి
తస్మాత్ జాగ్రత్త....!!!

**కార్మిక పుత్రుడు**

# ఒక తల్లి

పద్మ తల్లి చనిపోయింది. ఏప్రిల్ 29 ఉదయం బాత్‌రూంలోకి వెళ్లి పడిపోయింది. ఏమైందో తెలియదు. మెదడులో నరాలు చిట్లి చనిపోయినట్లు ఆ తరువాత వైద్యుడు చెప్పాడు. అప్పటికామె వారం రోజులుగా నలతగా ఉన్నదని, ఇంక తన పని అయిపోయిందని అంటూ ఉండేదని ఆమె కూతుళ్లు చెప్పారు. పెద్ద కూతురు బాత్‌రూం నుంచి బయటికి తెచ్చి పని మీద వెళ్లి వచ్చి చాయ్ ఇచ్చే వరకే చాయ్ నోట్లోకి వెళ్లలేదు. నాలుక బయటికి వచ్చింది.

నలభై ఏళ్లు ఏడుగురు సంతానానికి సేవలు చేసి ఎవరితో చేయించుకోకుండా వెళ్లిపోయింది. యాభై ఏళ్ల నుంచి మానసికంగా ఎదగని కూతురును దగ్గర పెట్టుకొని ఆమె కోసమే ఒక గది, తనదైన ఒక సంసారం ఏర్పాటు చేసుకొని హైదరాబాద్‌లో ఎక్కడో మారుమూలలో ఉంటున్నది. ఆ కూతురును చంటిపాపలా చూసుకుంటున్నది. నిజానికి ఆమెను చంటిపాపలా చూసుకునే మానసిక వయసు.



పద్మ కోసం ఆమె పదేళ్ల నిరీక్షణ ముగిసింది. బహుశా శనివారం ఏప్రిల్ 29 నుంచే ఆమె మట్టిపొరల్లో శాశ్వతంగా నిద్రపోయింది. ఈ పదేళ్లు ఎప్పుడూ కంటి మీద కునుకు లేకుండా ఆ కూతురు కోసం నిరీక్షణ.

జీవితంతో నలభై ఏళ్ల పోరు కూడా ముగిసింది. ముగ్గురు ఆడపిల్లలు, నలుగురు మగ పిల్లలు కలిగాక చివరి పాప పుట్టిన ఏడాదికి భర్త చనిపోయాడు. అప్పటికీ రెక్కల కష్టం మీద బతికిన వాళ్లే. రెండే రెక్కలు మిగిలాయి. అందులోను రెండు ఆడరెక్కలకు పనుల విషయంలో పరిమితులుంటాయి. అప్పడాలు చేసి, అప్పాలు చేసి ఇంటింటికి తిరిగి అమ్మి పొట్టపోసుకున్నది. తన ఒక్కర్తి పొట్ట మాత్రమే కాదు. ఎనిమిది మందివి. ఆ ఊళ్లో ఉపాధ్యాయులు ఆమె స్వాభిమానాన్ని చూసి ఆమె దగ్గరే తిను భండారాలు కొనేవాళ్లు. పిల్లలకు చదువు ఈడు వచ్చాక వాళ్లే సహాయం చేసారు. ముఖ్యంగా పెద్దవానికి విద్యాబుద్ధులు వచ్చాయి. కాని వాళ్లకు రెక్కలొచ్చాయి. వాళ్లంతా ఎగిరి హైదరాబాద్ వచ్చారు.

హైదరాబాద్‌లో 1990 ఆరంభంలో ఆమె మూడో కూతురు పద్మకు విప్లవ రాజకీయాలు అబ్బాయి. చైతన్య మహిళా సంఘంలో తొలి నాయకత్వంలో ఆమె ఉన్నారు. వాళ్లు హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రతి పోరాటంలో ఆమె ఉన్నది. ఎంతో మెత్తటి స్వభావం. ఎంతో కలివిడి స్వభావం. పద్మ తల్లి చనిపోయిందని తెలిసి పద్మ స్నేహితులు హైదరాబాద్‌లో అన్ని మూలల నుంచి వచ్చి అక్కడ ఆమె ముందు వాలారు. కొందరు చూసుకోగలిగారు. కొందరు చూసుకోలేకపోయారు. వాళ్లందరిలో ఆమె పద్మను చూసుకుంటున్నది. ఆ విషయం వాళ్లకు తెలుసు. అంతకన్నా వాళ్లు పద్మను తీసుకొచ్చి ఆమెను చూపలేరు. వాళ్లలో పట్టణాలు, ఊళ్లు, రాష్ట్రాలు దాటి, వాగులు, వంకలు దాటి, అన్నింటికంటే మించి పారా మిలటరీ క్యాంపులు దాటి జైలులో పద్మను చూసివచ్చి తమ కళ్లలో పద్మను చూపిన వాళ్లు ఉన్నారు. ఆమె ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఎప్పుడో ఐదారేళ్ల కింద తాను వెళ్లి వచ్చి చూసిన ఆమె కళ్లల్లో తన సహచరిని చూసుకున్న వాళ్లు ఉన్నారు.

రెండు రోజుల క్రితమే ఏప్రిల్ 27న పద్మ తల్లి ఫోన్ చేసింది. “పద్మను ఈరోజు కోర్టుకు తీసుకువచ్చారట. ఆమె లాయర్ ఫోన్ చేసి పద్మ విడుదలవుతుంది, ఎవరినైన పంపించి తీసుకువెళ్లండి” అని. తన చిన్న కూతురు, మనుమడు వెళ్తారని, ఎక్కడైనా తల తాకట్టు పెట్టయినా కారు ఏర్పాటు చేస్తానని, వెంట ఎవరయిన లాయర్ వెళ్తారా అని అడిగింది. మాకు ఆశ్చర్యం అయింది.

మాకు ఎవరికి తెలియని సమాచారం. ఇంకా రెండు కేసులున్నాయి. ఒక కేసులో వాదనలు ముగిసి మే 15న తీర్పు ఉంది. మరో కేసు ట్రయల్‌కు ఎంత సమయం పడుతుందో తెలియదు. కాకపోతే కొన్నాళ్లుగా జడ్జ్ బంధువులు వచ్చి బెయిల్ పెట్టి, జమనాత్ పెట్టి బంధువులే తీసుకుపోతే బెయిల్ ఇస్తానని అంటున్నాడట. కొన్నేళ్ల క్రితం తల్లి తప్ప బంధువులు ఎవరూ ఆమెను చూడ్డానికి రాలేదని అతనికి తెలుసు. ఇటీవల కాలంలోనైతే ఆమె లాయర్లు కూడా ఆమెను చాలా అరుదుగా కలుస్తున్నారు.

అయితే ఇది కేవలం ఆమె కోరిక. హలూసినేషన్స్ అంటారే అటువంటివి. పైగా వారం రోజులుగా నలతగా ఉంటున్నదని అంటున్నారు కదా, అటువంటి పైత్య స్థితిలో ఒక పలవరింత, ఒక కలవరింత. పద్మ రాదు, రాలేదు. ఆ తల్లి ఇంకా ఎదురు చూడలేక వెళ్లిపోయింది.

ఇది ఒక పద్మ విషయం కాదు. ఇది ఒక పద్మ తల్లి విషయం కాదు. దేశ వ్యాప్తంగా వున్న జైళ్లల్లో వేల, లక్షల సంఖ్యలో ఉన్న రాజకీయ ఖైదీల స్థితి. ముఖ్యంగా మహిళా ఖైదీల, ఆదివాసి ఖైదీల స్థితి. మాకు తెలిసిన పద్మలో, ఆమె తల్లిలో వీళ్లందరి గురించి ఊహించుకోలవసిందే తప్ప ఇది ఒక ప్రత్యేకమైన సమస్య కాదు.

ఈ పదేళ్లలో పద్మ రెండుసార్లు విడుదలైంది. పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్ నగరంలో విడుదలై తీసుకువెళ్లడానికి వచ్చిన న్యాయవాది అసహాయంగా చూస్తుండగానే మళ్లీ పోలీసుల కిడ్నాప్‌కు గురైంది.

ఆ తరువాత మరో హై సెక్యూరిటీ జైలు జగదల్‌పూర్‌కు

పంపబడింది. అక్కడ సుదీర్ఘ కాలపు విచారణ తరువాత కేసులన్నీ కొట్టేసి విడుదలవుతాననుకున్న రోజు. తెలంగాణ నుంచి ఇద్దరు న్యాయవాదులు వెళ్లారు. అక్కడ న్యాయవాదులు ఉన్నారు. కోర్టులో కేసు కొట్టేసి, విడుదల ఉత్తర్వులు ఇచ్చి అందుకోసం జైలుకు తిరిగి తీసుకువెళ్లే సమయానికి మరో రెండు కొత్త కేసుల్లో రెండు వారెంట్లు. ఆమె లోపలికి. కోర్టులో నోరు నొచ్చేలా వాదించిన న్యాయవాదులు అసహాయంగా బయటికి. ఈ తంతు నడుస్తూనే ఉంది. ఇది పద్మ విషయంలోనే కాదు. ఇది గోపన్నగా పిలుచుకునే నల్గొండకు చెందిన సత్తిరెడ్డి విషయంలోనూ జరిగింది.

ఈ ఇద్దరికన్నా దారుణమైంది నల్లా భిక్షపతి నిర్బంధం. ఈయన పదేళ్లుగా జార్ఖండ్‌లోని ,చైబాసా జైలులో మగ్గుతున్నాడు. ఎన్నో కేసులు. ఆయన, ఆయన సహచరి లక్ష్మి జార్ఖండ్‌లోనే ఎంతో కాలంగా విప్లవోద్యమంలో పని చేస్తున్నారు. ఆమె ప్రసవానికి ఆస్పత్రిలో చేరినప్పుడు భిక్షపతి చూడడానికి వెళ్లి అరెస్టయ్యాడు. ఆమెనూ అరెస్టు చేశారు. కొన్నాళ్ల తర్వాత ఆమెను విడుదల చేశారు. ఇంక జార్ఖండ్‌లో వుంటే బతకడమే కష్టమని హైదరాబాద్ వచ్చి ఆమె కష్టం చేసుకుని బతుకుతున్నది. భర్తను చూడడానికి వెళ్లినా అరెస్టు చేస్తారని ఒకటి రెండు ప్రయత్నాల్లో అర్థమైపోయింది. అక్కడ ఒక్కొక్క కేసే కొట్టేయబడుతున్నది, విడుదలవుతున్నాడు. మళ్లీ అరెస్టవుతున్నాడు. అరెస్టయ్యాక చేసిన అన్ని నేరారోపణలు అబద్ధం అని రుజువయ్యాయి.

ఇంక అరెస్టు కేసు ఒక్కటే మిగిలింది. ఆస్పత్రిలో ప్రసవించిన భార్యను చూడడానికి వెళ్లాడని, ఆస్పత్రి వాళ్లు చెపుతారు కదా, కనుక అరెస్టు సందర్భంగా ఒక దాడి చేసో, ఒక హత్య చేసో, ఒక ఆయుధంతోటో దొరకలేదు. కనుక విడుదలవుతాడని అందరూ ఆశించారు. అది జరగలేదు. ఏప్రిల్ 28న హజారీబాగ్ సెషన్స్ కోర్టు ఆయనకు యావజ్జీవ శిక్ష విధించింది. నలభై ఐదేళ్ల వయసు జి.ఎన్. సాయిబాబ కన్నా బహుశా ఐదేళ్లు చిన్న హేమ్ మిశ్రా వంటి యువ విద్యార్థి, భిక్షపతి వంటి వాళ్లు జీవితమంతా జైళ్లలోనే గడపాలి. నల్లా భిక్షపతి తెలంగాణ వరంగల్ జిల్లా తాటికాయల గ్రామం నుంచి చాలా చిన్న వయసులోనే విప్లవోద్యమంలోకి వచ్చిన మాదిగ యువకుడు. చిన్నతనంలోనే ఈ కుటుంబం వచ్చి అల్వాల్‌లో కష్టం చేసుకుని బతుకుతున్నారు. ఆ కుటుంబం నుంచే విద్యావంతులైన వాళ్లలో భిక్షపతి విప్లవ మార్గాన్ని ఎంచుకున్నాడు. సోదరుడు నల్లా రాధాకృష్ణ దళిత ఉద్యమంలో పనిచేస్తున్నాడు.

ఇవి మనకు తెలిసిన పేర్లు. ఈ తెలిసిన చీకటిలోని మసక వెలుగు నుంచి తెలియని గాఢాంధకారాన్ని పోల్చుకోవాలి. పోల్చుకొని ఏం ప్రయోజనం? ఆ చీకట్లను తొలగించగలగాలి. చీకట్లు తొలుగుతాయి. కాని ఇది ప్రకృతి నియమ సూత్రాల వలె ఒక నిర్దిష్ట కాలంలో వాటంతట అవి జరిగేవి కావు. మనం ఎన్నో చేతులు వేసి ఆ చీకట్లను పారదోలాలి.

ఇంతకూ ఈ పద్మ ఎవరు? నక్సల్బరీ రైతాంగ పోరాటం ప్రారంభమైన కాలం నుంచి పద్మ అనే పేరు వింటూనే ఉన్నాం. అది ఇవాళ ఒక సర్వనామం అయిపోయింది. ఆ పేరుతోటే విప్లవోద్యమంలోకి వెళ్లి అజ్ఞాతంలో వేరే పేర్లు పెట్టుకున్న వాళ్లున్నారు. విప్లవోద్యమంలోకి 80ల ఆరంభంలో వచ్చి లింగమూర్తితో పాటు రాయలసీమ ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణం చేసిన పద్మ ఆమె పేరు అమరత్వం తరువాత అజ్ఞాతంలోకి వెళ్లిన ఎందరో మహిళలు పెట్టుకున్నారు. కనుక మనకు తల్లిదండ్రులు పేరు ఇచ్చిన పద్మలు, విప్లవం కన్నతల్లి ఇచ్చిన పద్మలు ఉన్నారు.

ఈ పద్మ తల్లి పెట్టిన పేరు. ఆమె ఎక్కువ కాలం బహిరంగ ప్రజా ఉద్యమాల్లోనే పనిచేసింది. హైదరాబాద్‌లో బస్తీల్లో గానీ, విద్యార్థుల్లో గానీ, హాస్టల్స్‌లో గానీ ఆమె మహిళల్లో పనిచేసిన మేర తలలో నాలుకగా పనిచేసింది. తన మెత్తటి నవ్వుతో మృదువైన మాటలతో ఎందరి స్నేహాలనో పొందింది. ఎందరికో సేవలు చేసింది.

చంద్రబాబు నాయుడు 1995 ఆగస్టులో అధికారానికి వచ్చి సబ్సిడీలు రద్దు చేసినప్పుడు, సారా నిషేధం ఎత్తివేసినప్పుడు అన్ని ప్రజా సంఘాలకు నాయకత్వం వహించి పోరాడింది చైతన్యా మహిళా సంఘమే. 2000లో వరదలు వచ్చినప్పుడు బస్తీల్లో ప్రజలకు సహకరించింది చైతన్యా మహిళా సంఘమే. 1994 డిసెంబర్ నుంచి 1995 మార్చ్ వరకు జైలులో ఉన్న నక్సలైట్ ఖైదీల, జీవిత ఖైదీల విడుదల కోసం చేసిన పోరాటానికి బయట వెల్లువెత్తిన సంఘీభావంలో చైతన్య మహిళా కెరటం కూడా ఉన్నది.

1999 సెప్టెంబర్‌లో ఈ జైలు పోరాటానికి నాయకత్వం వహించిన రాజకీయ ఖైదీ మోడెం బాలకృష్ణ విడుదలయ్యాడు. బహుశా 2000లో పద్మ బాలకృష్ణ సహచర్యాన్ని ఎంచుకోవడమే ఆమె చేసిన పెద్ద నేరం అయింది. ఆ సహచర్యంలో ఆమె కొద్ది రోజులైనా గడిపిందో తెలియదు. అప్పటికామె విశాఖపట్నం మహిళా ఉద్యమంలో పనిచేస్తున్నది.

పదేళ్ల క్రితం భిలాయిలో ఒక సహచరితో పాటు ఆమె ఒక ఇంటి నుంచి బయటికి వెళ్ళింది. తనను ఎందుకో విశాఖపట్నం నుంచే ఎపిఎస్ఐబి వాళ్లు వెంటాడుతున్నట్టు ఆమెకు అనుమానంగా ఉన్నది. ఆ ఉదయం మరింత స్పష్టమైంది. వెనుక తరుముతున్నట్లుగా వాళ్లు వస్తున్నారు. నయం, ఇంకా అప్పటికి పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లు ఉన్నాయి. ఆమె బూత్‌లోకి దూకింది. ఆమె ప్రెసెన్స్ ఆఫ్ మైండ్ పనిచేసింది. ఆ బూత్ అద్దాల తలుపులు వేసుకుని అక్కడ నుంచే పియూసిఎల్ ఉపాధ్యక్షుడు రాజు సాయెల్‌కు, మీడియాకు ఫోన్‌లు చేసింది. అక్కడ్నించే తనకు తెలిసిన నంబర్లందరికీ, ఆంధ్రప్రదేశ్‌లో హక్కుల సంఘాల నాయకులకూ ఫోన్‌లు చేస్తూ ఉన్నది. కొన్ని మీడియా ఛానెల్స్ చేరుకునే దాకా ఆమె ఆ బూత్ నుంచి బయటికి రాలేదు. అట్లా ఆమె తన ప్రాణాలు కాపాడుకున్నది. పోలీసులకు ఆ కక్ష ఉన్నది.

ఇంతకూ ఈ పద్మ పదేళ్లుగా ఎదుర్కొంటున్న కేసులు తన మీదివి కావు. ఆమె రాయ్‌పూర్ జైలు నుంచి విడుదలైనప్పుడు మిగిలిన కేసులు చూసినప్పుడు అర్థమైంది ఏమిటంటే ఈమే మొదటి అరెస్టు కన్నా ఎంతో ముందే అదిలాబాద్ అడవుల్లో ఎన్‌కౌంటర్‌లో అమరురాలైన

**(మిగతా 15వ పేజీలో.....)**



**ఉపాధి కూలీలు**



పర్యావరణాన్ని నాశనం చేస్తున్న గనుల త్రవ్వకాలు





నోటీసులివ్వకుండానే ఇండ్లను కూల్చివేస్తున్న జీహెచ్ఎమ్‌సి అధికారులు



**ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతి ఒప్పదంపై సంతకాలు చేస్తున్న అమెరికా తాలీబాన్ ప్రతినిధులు**



పరీక్షలు రాయడానికి వెళుతున్న విద్యార్థినులు



ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న 10వ తరగతి విద్యార్థులు



ఎన్ఆర్సీకి వ్యతిరేకంగా గళమెత్తిన ముస్లీంలు




ప్రపంచాన్నే గడగడలాడిస్తున్న కరోణ వైరస్



అకాల వర్షాలతో తడిసిన ధాన్యం



మూడు రాజధానులను వ్యతిరేకిస్తూ గుంటూరు రైతుల ధర్నా



కరోణ బాధితులకు వైద్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్స్



కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులను గృహ నిర్బంధంలో బంధించిన మోడీ ప్రభుత్వం